# మన కిసాన్ వెంకటసుబ్బయ్య

## గొట్టిపాటి వెంకటసుబ్బయ్య ఆచార్య రంగా

## తొలిపలుకు

" మనమింతవరకు పల్లీయుల సంగతి పరికించనే లేదు. భోననానికై మనం వారిపై ఆధారపడియుండికూడ, ఇంతవరకు మనమే ఆశ్రయదాతలమని వారు ఆశ్రితులనీ అనుకున్నాం ! వారి అవసరాలను మనం ఆలోచించనేలేదు. " బాపూ

గాంధీమహాత్ముడు, భారతదేశంలో ప్రప్రథమంగా పుట్టిన రైతాంగ రాజకీయవేత్త, ఆయన గ్రామీణుల చిత్తిపృత్తులను గమనించి వారి కష్ట నివారణకై పాటుపడ్డాడు.

ఆయన మకుటంలేని మానవలోక చక్రవర్తి. పతితమై, పదదళితమైన ప్రాచీన భారతభూమిని మరల ఒకసారి జ్యోతిగావెలోర్చి ప్రపంచానికి ఎత్తి చూపించాడు. ఆయన యుగపురుషుడు.

ఆయన సమకాలికులుగా పుట్టడం ఒక అదృష్టం.

అటువంటి మహాపురుషుని, మొట్టమొదట నమ్మినవాడు, ఆయన్ను యదార్థంగా తెలుసుకున్నవాడు, లోకానికి తెలిపినవాడు, ఆయనకు ప్రియశిష్యుడైన మహాదేవ దేశాయి ఒక్కడే.

ఆయన న్యావాదియయ్యు, ఆవృత్తిని వదిలి ఆయన సేవలో అందరికంటే ముందే (1916) చేరాడు. అప్పటికి గాంధీజీకి పెద్ద పేరు ప్రసిద్ధులు లేవు. అందువల్ల ఆయన శిష్యుడైతే తనకు పేరువస్తుందని దేశాయి అనుకోలేదు. ఆయన సేవజేస్తే దేశానికి సేవచేసినట్లే అనుకున్నాడు. ఆయన గొప్పదనాన్ని ప్రథమంగా గుర్తించింది మహదేవ దేశాయే.

గాంధీజీ ఎక్కడకువెళితే ఆయన అక్కడకు వేళ్ళేవాడు. ఆయనకు కార్యదర్శిగా పనిజేశాడు. కేవలం ఆయన కార్యదర్శేకాడు, అన్నిపనులు చేసేవాడు. వంటజేసేవాడు, గుడ్డలుతికేవాడు, మూటలు మోసేవాడు, ఒకపనిచేసి ఒకపని చేయకుండా వుండలేడు. ఆయనకన్ని విధాలా బాసటయైనిలిచి ఆత్మార్పణ మొనర్చిన సేవావ్రతుడు మహదేవ దేశాయి.

చిన్న పెద్దా అనే భేదం లేక, అందర్ని ఆదరించి ప్రేమించే గుణమే గాంధీజీ పరివారంలో ఆయన్ని గొప్పవాణ్ణిగా చేసింది.

బాపూకు బాధ కల్గకుండా ఆలోచించి చాలామట్టుకు సమాధానాలు చెప్పేవాడు. అమూల్యమైన ఆయనకాలాన్ని ఇతరులు అనవసరంగా హరించకుండా చూచేవాడు.

గొప్పగొప్ప శిష్యులను ఆయనకు సమకూర్చింది దేశాయే, గాంధీజికి మంచిమంచి స్నేహితులను చేర్చింది ఆయనే.

మహాత్మునికి భ్యాకారుడై, లోకానికి గాంధితత్త్వం తెలిపింది దేశాయియే. ఆయన మహాత్ముని బహిఃప్రాణం.

గురువుకంటే ముందు పోవాలనేవాంఛ ఆయనకుండేది. ఆప్రకారమే, ఆయన యరవాడ జైలులో 15-8-1942 సంవత్సరములో కాలం చేశాడు. గాంధీజీ బొటబొట కన్నీరు గార్చాడు. కన్నీరు గార్చుటయే గాదు. మహదేశభాయికి తనకు గల సంబంధం భౌతికమైనది మాత్రమే కాదని, అది హిందూదాంపత్య సంబంధమువంటిదనీ మరణంతో అది విచ్ఛిన్నమయ్యేది కాదని. అని అన్నాడు.

గాంధీజీ, దేశాయిలకు గల సంబంధమువంటి సంబంధమే ఆచార్యరంగా, కిసాన్ వెంకటసుబ్బయ్యల సంబంధం. మన వెంకటసుబ్బయ్య అనేక వ్యాసాలను రంగాగారిని గురించి వ్రాసి రంగాగారి గొప్పతనాన్ని లోకానికి ప్రకటించాడు. ఆయన తలపెట్టిన సేవాకార్యక్రమాలను విసుగు విరామం లేకుండా నలువదియేండ్లు కొనసాగించాడు. ఆయనన్ను కొలిచాడు, సేవించాడు, సర్వకార్యాలుచేశాడు.

గాంధీజీ తరువాత ఆచార్యరంగా పూజనీయుడని ఈనాటి రాజకీయతరంలో స్వార్థంతోనిండిన ప్రపంచంలో కొందరి దృష్టి అంత, ఆలోచించక పోవచ్చును, అవకాశమున్నప్పటికి ఉన్నత పదవులాశించపక. గ్రామీణ ప్రజాసేవయే పరమావధిగానెంచి, తాను నమ్మిన వారు ఎంత తనకు తన ఉద్యమానికి ద్రోహం చేసినప్పటికీ, పట్టువిడక కష్టజీవులకు ప్రత్యేక పార్టీ ఉండాలనే దీక్షతో కృషిచేస్తూ. గాంధీ మహాత్ముని ఆదర్శములు విడువక ఆడంబరరహితంగా, అమలుజరుపుతున్నాడు మన ఆచార్యుడు. ఆయన ఆడంబరరహితంగా

సామానన్య రైతుబిడ్డగా, ఆ పోలంలో నివాసమేర్పరచుకొని ఎల్లప్పుడు ప్రజాసేవయే ప్రధానంగా ఎంచుచూ, తనతో నున్న బీద రైతాంగయువకులను ప్రోత్సహించుచూ. ఆదర్శంగా జీవితం గడుపుతున్నాడు. "

మానవులను అర్థం చేసుకోవటం కష్టం, " శాశ్వతంగా అజ్ఞానంలో వుండాలంటే ఒకటేమార్గం - నీ అభిప్రాయమే సరియైనదని నమ్మటం, నీకున్న జ్ఞానంతోనే సంతృప్తి చెందటం, కాని తోటిమానవుని అర్థం చేసుకోవడమే జ్ఞానం."

మనదేశంలో ఏ ఆంగ్లేయుడో చెపితే తప్ప, స్వంతగా ఆలోచించటం, మానవునికి విలువకట్టటం చాలాతక్కువ; లేదనే చెప్పాల్సి వస్తుందేమో!

వేమన్న గొప్పతనాన్ని గురించి పాశ్చాత్యులు గుర్తించిన తరువాతనే వారిని మనం అనుకరించసాగాము.

రవీంద్రుని ఇంగ్లీషు " గీతాంజలి " అనువాదానికి నోబెల్ బహుమతి వచ్చింతరువాతనే అయన్నభినందించడానికి, కలకత్తా నుండి వంగాప్రముఖులు బోల్పూరు శాంతినికేతనానికి, దండలు పుచ్చుకువెళ్ళారు అప్పుడంటాడు ఆయన " బెంగాలీభాషలో ఇన్ని యేండ్లుగా ప్రజలు నా గ్రంధాలు చదవడంలేదా ? ఇప్పుడు క్రొత్తగా ఒరిగిందేమేటి ? యూరపులో గుర్తించిన మీదటగాని నా కవితకు విలువలేదా ?

వెంకటసుబ్బయ్యగారు రంగాగారికీ భారతీదేవికీ వ్రాసిన ఉత్తరాలు చదువుతూవుంటే, వారియెడ తనకుగల అభిప్రాయం స్పష్టమవుతుంది. ఒకమనిషి సరియైన అభిప్రాయం తెలుసుకోవాలంటే ప్రయివేటుసంభాషణ, ఉత్తరాలు ఆధారం, ఆ ఉత్తరాలలో ఆయనంటాడు " రంగాగారికి ఒకపత్రిక లేకపోతే ఎలా? వాహినీప్రెస్‌ను మూడుసార్లుపెట్టి అమ్మాం-1967 నుంచి నేను వాహిని పని చూస్తున్నాను. దానికి 20 వేలు అప్పుఅయింది. " అని ఇలా అనటమేగాకుండా తాను ఆసుపత్రిలో వుండికూడా, వాహిని నడపవలసిందే అంటాడు ఇంతేకాదు. " రంగాగారూ! మీరు లచ్చన్నగారి కారులో హైదరాబాదు వెళ్ళండి " అని ఆయన ఎక్కడి కష్టపడతాడో అని కంగారుతో హితోక్తులు చెపుతాడు. ఆ ఉత్తరాలు చదువుతూవుంటే ( అవి ఇందులో వున్నవి.) ఆయన హృదయం తెలుస్తుంది.

మనలో స్వార్థప్రవృత్తి పెరిగింది. వెంకటసుబ్బయ్యగారి వంటి సేవావ్రతుల గుర్తించగల్గినవారెంతమంది వున్నారు. " తన్ను తాను హృదయపూర్వకంగా అర్పించుకున్నాడు రైతాంగం కొరకా ? వారి సేవలోని విలువ మనకు అందని సేవాస్వరూపమే వెంకటసుబ్బయ్య. అదిక్రమంగా పెరిగి పూర్తైనది. నేనుకూడా తనలాటి తపస్సునే, చేస్తున్నానని, వెంకటసుబ్బయ్య విశ్వసించాడు. అలాగే నలభై సంవత్సరాలు ఆశిధారా వ్రతంగా నన్ను అనుసరిస్తూ, బలపరుస్తూ, దిద్దుతూ వచ్చాడు. అటువంటి వెంకటసుబ్బయ్య జీవితాన్ని పద్యాలతో, గేయాల్తో పసందుగా వ్రాసేవారు రావాలి అంటారు రంగాగారు.

ఇంతేకాదు ఆచార్యరంగా ఈ రచయితకు వ్రాసిన 31-07-71 ఉత్తరం గమనింపదగినది.

" శ్రీపండిత వెంకటసుబ్బయ్య వందనములు, మీకార్డుచేరినది. మనరైతు వెంకటసుబ్బయ్యగారి జీవితచరిత్ర మీరే వ్రాస్తారు. మీరు వ్రాస్తే బావుంటుంది; వివరాలన్నీ లక్షణంగా వివరించగలరనే విశ్వాసంతో.

" వారి జీవిత ధోరణిలో, కొన్ని ధోరణులను గురించి నేనూ వారు కలసి జరిపిన సేవాకార్యములనాధారంగా, నాకేట్లు వారు సహాయపడిరో, సలహాలిచ్చిరో, వారి తోడ్పాటుతో ఏయే వర్గాల ప్రజలనెట్లెట్లు సేవించుటకు నాకు అవకాశం కలిగినదో ఉదహరించదలచితిని.

వ్రాయబూనేసరికి, మీరన్నట్లే, వారి జీవితకథయే నా జీవితకథగా, ఇటునుండి అటుగా, అవినాభావంగా స్ఫురించడం తప్పనిసరియైనది. యదార్ధానికి సూటిగా, నిండుగా వున్నట్లే వ్రాయతలిచాను. గనుక, నాగురించిన గాథ తప్పనిసరియైనది.

" ఎనెన్నో గంభీర సమస్యలు గడ్డుసమయాలు నన్నెదుర్కొనుచున్నప్పుడు, అనుభవజ్ఞుడై, నన్నన్నింటా నిండుగా యెరింగి, నేను తలపెట్టుకున్న ఉద్యమాలు కార్యక్రమాల ధోరణిని నిండుగా తెలిసిన వారైన వెంకటసుబ్బయ్యగారు తెలుపుచుండే ఆలోచనలు, సలహాలు హెచ్చరికలు, నాకెంతో వుపయోగ పడుచుండెడివి.

అంతర్జాతీయ వ్యవహారాలా, దేశీయ రాజకీయాలా, కాంగ్రెసు పెద్దలతో మంతనాలా, వివిధపార్టీలతో సంప్రదింపులా, స్వతంత్రపార్టీ యోధుల పరస్పర మంచిచెడ్డలా, ఆంధ్ర వ్యవవహారములలో

కలుగుచుండు సమస్యలా, మేముకలుసుకుంటున్నప్పుడు, ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుకున్నప్పుడల్లా, వారి ఆలోచనలు కోరుచుందును, మనందరం చేరుకొని భూస్వాములమై, పెంచుకొనివస్తూ, తీర్చిదిద్దుకొన్న ఈ రైతాంగ స్వంతఉద్యోగుల, గిరిజన, హరిజన బడుగుజాతల ఉద్యమాలకు మనం అతిదగ్గరలో వున్నాం గనుక, ఎన్నికల తారుమారులలో ఎందరెందరో, ఎట్లెట్లో వ్యవహరిస్తూ, గెల్పుఓటముల మనపై ప్రసరింపజేసిరి గనుక, మనం, గ్రామం,జిల్లా, రాష్ట్ర, దేశ, అంతర్జాతీయంగా పెంచుకువచ్చిన ఈ ఉద్యమాలు, వాటినాయకులు, వారిలో ప్రథమ వర్గమందుండిన శ్రీ వెంకటసుబ్బయ్యలాంటివారిని, ఈతరం వారు తగినట్టుగా గుర్తించక పోవచ్చు. ఐతే, నేను, మీరు మాత్రము వారికి తగిన పరిధిలో, వారిని నిల్పుకొని, వ్రాయుట మంచిదనుకొని ఆ విధంగా కన్పడే పర్వనాల్టిగా , మన రైతును ఈనాటి, మున్ముందు రాబోయే, తరాల వారికి కన్పించునట్లు చేయాలనే ఆలోచనతో, నిజస్వరూప లక్షణాలను ఆశయాల దృక్కోణమునుండి తెల్ప ప్రయత్నించితిని.

ఎంతవరకు జయం పొందితినో తెలియదు. ఇంకెంతో వ్రాయలని వుందిగాని, మీరు ముఖ్యమైనన జీవితచరిత్ర భాగాలను వ్రాస్తారు దానికి తోడుగా మాత్రం వుండునట్లు వ్రాయాలని నేని నాల్గు ప్రకరణలు వ్రాశాను. అచ్చులో 100 లేక 150 పుటలగునేమో !

" ఫోటోలు మీరు, మనవారు సంపాదించాలి. నిడుబ్రోలు ఉద్యమం నిమిత్తమై వచ్చినది 30-09-33 అని నా డైరీద్వారా తెలిసినది.

"వారీ కేసు బందురులో 24-2-33 వాయిదా పడితే నేనప్పుడు వారి తరపున సాక్ష్యమివ్వటానికి బందరుకు వెళ్ళితినినట.

" వ్యవసాయ కూలీలు, కమతందార్లకు 22-10-33న కావలసిన ప్రోగ్రాం గుడివాడలో తయారుచేసితిమి

మీకు భగవానుడు ఆరోగ్యం ప్రసాదించాలని నాప్రార్థన.

నే నెప్పుడో వారిని గురించి, మీ యిద్దరి గురించి, వ్రాసిన వ్యాసాలను గూడా చేర్చుకొనండి.

ప్రేమ

రంగ

ఈ విధంగా నేను రంగాగారు, కలసి మా శక్తికొలది ప్రయత్నించి ఈ చరిత్ర పూర్తిగావించాము.

నా రచనా భాగం శరీరమైతే, రంగాగారిది ఆత్మ.

ఈ గ్రంథ ముద్రణకై రంగాగారి ద్వారా, నా ద్వారా కొందరుమిత్రులు సహాయపడినందుకు కృతజ్ఞతలు తెలుపుచున్నాము.

ఈ రచనలో నన్ను హెచ్చురిస్తూ అనేక విధముల తోడ్పడినందుకు చిరంజీవి జీ. వెంకటస్బుయ్యాను స్మరిస్తున్నాను.

ఈ రచనకు " నా జీవననౌక " వెంకటసుబ్బయ్యగారి మిత్రులైన, పరుచూరి రాఘవయ్యగారు మరికొందరు తోడ్పడినందులకు కృతజ్ఞతాభావాలందిస్తున్నాము.

జీవితచరిత్ర పెక్కుమంది సాయపడితే ఒకరిద్వారా వచ్చేదిగాని, మరొకటిగాదు.

ఈ రచనలో, నాకు అనేక విధముల తోడ్పిడి ప్రెస్ కాపీ వ్రాసిన మిత్రుడు వెంకట్రామయ్యగారికి కృతజ్ఞడను.

" పౌరుష జ్ఞానకీర్తులంబఅగెనేని
వానిసంపద యొకపూట యైనంజాలు,
నుదుర పోషణమాత్ర మీ యుర్విమదం
గాకి చిరకాల మున్ననే కార్యమగును ! "

ఘంటసాల — గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

10-10-1971

# విషయ సూచిక


| | |
|---|---|
| 1. పరిచయం | 6 |
| 2. ఘంటసాల | 7 |
| 3. తాత - తండ్రులు | 8 |


అంకితం

మా అందరకు విద్యార్థిదశలో మార్గదర్శియుడగు
గొర్రెపాటి వెంకటేశ్వర్లు అన్నయ్య దివ్వస్మృతికి....

## పరిచయం

" ఈ భూమిమీద, ఏ మానవుడైనా తల ఎత్తుకొని తిరుగుట కధికార మున్నయెడల అతడు రైతు. రైతే ధనమునకు మూల పురుషుడు, ఉత్పత్తిదారుడు, ధాన్యలక్ష్మికి పీఠం, తదితరులందరు వానిని ఆశ్రయించుకొని బ్రతుకు పరాన్నభుక్కులు."

---- సర్దార్ పటేల్.

వెంకటసుబ్బయ్యగారు రైతు నాయకుడుగా విఖ్యాతుడు. గత 40 సంవత్సరాలనుండి రైతాంగసేవలో అధిక కృషిచేసిన సంగతి సర్వజన విదితము. జమీందారీ వ్యతిరేక ఉద్యమం నాటినుండి ఆయన ఎన్నో రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించి వారి శ్రేయానికి పోరాడారు.

ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కారా గృహమును కరిగిని స్వాతంత్రయోధుడు.

ఆయన రాష్ట్రరైతు కాంగ్రెసు అధ్యక్షుడుగా, కృష్ణాజిల్లా బోర్డు ఉపాధ్యక్షుడుగా, ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ ప్రధమాధ్యక్షుడుగా, ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళనాధ్యక్షుడగా ప్రజాసేవా రంగంలో ప్రధానపాత్ర వహించెను.

ఇటీవల ఆంధ్రరైతాంగాన్ని తీవ్రంగా కలవరపరిచిన ఆదనపు భూమిశిస్తు చట్టానికి వ్యతిరేకంగా సాగిన సత్యాగ్రహసమరంలో నాయకత్వం వహించి, రైతాంగ శక్తిని ద్విగుణీకృతం చేసేను.

త్యాగమే లక్ష్యంగా సేవయే పరమావధిగా జీవితాన్ని రైతు లోకానికి అంకితం చేసుకొన్న ఉత్తమ నాయకుడు.

ఆచార్యరంగాగారిని ఆయన గురువుగా యెంచుకొని ఆయనకు అండగా, కుడిభుజంగా నిలిచాడు. లచ్చన్నగారు లక్ష్మణుడైతే ఈయన హనుమంతుడు. ఎందురు మారినా రంగాగారిని వీడని వీరులు వీరిద్దరు.

ఇరిగేషన్‌లోను, డ్రెయినేజ్‌లోను రైతులకు సంబంధించిన యితర విషయములలోను ఆయన చేయనిది ఏమున్నది ?

వేయేల ? మన కర్షకోద్యమ నిర్మాత ఆచార్యరంగాగారు యిలా అంటున్నారు.

" అందరూ శాసన సభలు, మంత్రిమండలి, జిల్లా బోర్డుపై పెత్తనాలకేగాక, కాంగ్రెసు సంఘాల పెత్తనముల కొరకే పట్టుదల వహించుచున్న ఈ దినాలలో, స్వంత ధనము, శ్రమ, శ్రద్ధ అంతయు నెంతగానో వినియోగించున్నారు, విసుగు విరామము లేకుండా రైతు గొర్రెపాటి. రైతు కాంగ్రెసు అధ్యక్షులై ఆంధ్రదేశమంతటా అందిన ప్రజాసేవకు లందరిచే, వివిధ సమితుల నిర్మిచుకొంటూ నిల్పుకొంటూ ఈ సేవా విధానమం దెంత బాధకలదో, ఆశాభంగములు, కల్గుచున్నవో, ఆయనకే ఎరుక అన్నిటికీ ఓర్చుకొంటున్నారు. తమ నిర్మాణ కార్యక్రమాన్ని అభివృద్ధి మార్గాన సాగించుచున్నారు

ఆహార సమస్య నెరుర్కొనుటకై " ఆహార సలహా సంఘాల " నిర్మాణమందెంతో కృషిచేసిరి. రైతాంగానికి న్యాయమగు ధాన్యపు ధరల సంపాదించుటకై కష్టించుచునేయున్నారు. ఆ సందర్భములో ఉత్పత్తిదారుల సభలను నడుపుచున్నారు.

రైతాంగ ప్రజలకు పాటపద్యములు అవసరము. రైతాంగోద్యమమునకు రాజకీయాశములు కలవు. వాటిని ప్రజాసామాన్యమునకు సులభముగా అందజేయుటకు గీతము లెంతేని యుక్తము. కనుకనే "రైతు భజనావవళి" నినూతన లక్షణాలతో ప్రకటించియున్నారు రైతు గొర్రెపాటి

వారి యందు మూర్తీభవించియున్న పట్టుదల, కార్యశూరత, సేవాపరతంత్రత ఆదర్శప్రాయమైనవి. ఇంతటి మాంధాత రైతు ఉద్యమానికి దొరికినందుకు భారత రైతాంగము అదృష్టవంతులు.

## ఘంటసాల

ఘంటసాల 'కంటకశైల' శబ్దమునుండి వచ్చింది. బుద్ధుని గుర్రంపేరు కంటకం. దాని పేరున యిక్కడ ఒక స్థూపము కట్టబడింది. పూర్వకాలములో మన ఆంధ్ర దేశమంతా బుద్ధ భగవానునకు అడుగులకు మడుగులిడింది. నాడు బౌద్ధమత వ్యాప్తికి ఏర్పడిన ముఖ్య ప్రచార కేంద్రములలో యిది ఒకటి. ఇప్పటికి కానవచ్చే బుద్ధ భగవానుని స్థూపములు, బౌద్ధ శిల్పములు, అమరావతి, జగ్గయ్యపేట, మొదలగు బౌద్ధ స్థూపములతో కల సామీప్యత యీ విషయము విశదపరచుచున్నది.

ఐరోపా ఖండముతో మనకు క్రీస్తుకు పూర్వంనుండి వర్తక వ్యాపారములుండేవి. ఆ వ్యాపారమంతా నౌకల ద్వారానే. ఈజిప్టు భూగోళ శాస్త్రజ్ఞుడు టోలమీ ఈ కంటకశైల కృష్ణానది ముఖ ద్వారమునగల ఓడరేవు అని, వాణిజ్య కేంద్రమని పేర్కొనెను. ఈయన క్రీస్తు శకము రెండవ శతాబ్దమునాడు. ఈ రేవు నుండి ఇటలీ మొదలగు పాశ్చాత్య దేశములకు సన్నని నూలువస్త్రములు, వజ్రములు మొదలగునవి విరివిగా ఎగుమతి అగుచుండెడివి. ఆనాటి వ్యాపారము ఎంత గొప్పదన, రోమను నాణెములే మన దేశమున బాహాటముగా చెలామణి అగుచుండెడివి. నేటికీ ఈ గ్రామములోని పాటిదిబ్బలను త్రవ్వునప్పుడుదొరికే బంగారు నాణెములే మన దేశమున బాహాటముగా చెలామణి అగుచుండెడివి. నేటికీ ఈ గ్రామములోని పాటిదిబ్బలను త్రవ్వునప్పుడు బంగారు నాణెములు ఈ గ్రామప్రజలు మోహరీలు అంటారు. ఈ కంటకశైల బందరు కంటే చాలా పూరాతనమైన గ్రామము. బందరు అనే దాని ప్రాచీన నామమే దాని వునికిని తెలియజేయుచున్నది. ఆనాడు బందరులేదు. బందరు సమీపమునవున్న గూడూరు వున్నది ఈ రెండు రేవులనుండే అధిక వ్యాపారము జరుగుంచుండెనని చెప్పుటకు అనేక ఆధారములు కలవు.

ప్రాచీన కాలమునుండి బౌద్ధ భిక్షువులు, బ్రాహ్మణమత ప్రచారకులు తమ మత వ్యాప్తికై యీ రేవులనుండే జావా సుమత్రా, బోర్నియో మొదలగు ప్రాగ్దేశముల కరిగిరి. ఆంధ్రదేశ పట్టణ నామములు కూడ ఆ ప్రాంతమున వుండుట యిందుకు ప్రబల నిదర్శనము సయాం, కంబోడియా దేశములలో యిప్పటికి మన శాలివాహన శకమే వుండుట మరియొక నిదర్శనము. ఈ నాగరికత అంతా కంటకశైల, గూడూరు రేవులనుండే వ్యాప్తిగాంచెనని సుప్రసిద్ధఫ్రెంచిచరిత్రకారుడగు డూబ్రెల్ తన " డక్కన్ పూర్వచరిత్ర" లో పొందుపరచెను.

నాగార్జునకొండ, అమరావతి, పెదవేగి మొదలగు పూర్వ ప్రసిద్ధ ప్రాంతములలో దొరికిన శాసనములు ఈ కంకటశైల ప్రసిద్ధి, ప్రశంసతో నిండియున్నది. బౌద్ధమత వ్యాప్తికిది ప్రసిద్ధిమాట వలనే దీనికంతకు కారణము ఈ బౌద్ధమత కాలములోనేకాదు, చాళుక్య యుగములో కూడ దీనికి ప్రసిద్ధి కలదు. ఈ ఘంటసాలకు " చోళపాండ్యపుర " మను నామాంతర ముండెడిది.

13 వ శతాబ్దము వరకు ఓడరేవుగ నుండిన ఘంటసాల వడీ ముఖద్వారము మారుటవలన ఆ రేవు పోయినందున ఆ పట్టణ ప్రాముఖ్యము క్రమముగా తగ్గి క్షీణించి యుండెను. శిథిలమైన అనేక దేవాలయ కట్టడములు, శివలింగములు, నందులు, ఇతర విగ్రహములు యిందుకు నిదర్శనము.

ఈ గ్రాముములో వున్న ఆలయములలో పురాతమైనది జలధీశ్వర ఆలయము, అది ఎప్పుడు నిర్మింపబడెనో తెలియదుకాని దానిలోగల శాసన శిలాఫలకమును బట్ట అది తొమ్మిదవ శతాబ్దమునకు పూర్వమే నిర్మింపబడినట్టు తెలియగలదు. దానిలోని ప్రథమ శాసనము విష్ణువర్ధన మహారాజు రెండువేల బ్రాహ్మణులకు గృహదానము చేసినట్లు గలదు. ఇది వైశ్యుల అష్టాదశ ముఖ్యపట్టణములలో ఒకటి. యీ గ్రామమునందలి వైశ్యులు అనేక దేవాలయములకు దానధర్మములు చేసినట్లు శాసనము గలదు.

నేటి ఘంటసాలకు షుమారు పదివేల జనాభా గలదు. దివితాలూకాలో పెద్ద గ్రామములలో ఒకటి. ప్రథమ ఆంధ్ర రాజధానియైన శ్రీకాకుళం నదీప్రాత మైనందున తత్ సమీపముననే వెలసిన శ్రీకాకుళం ఆంధ్రభోజుడగు శ్రీకృష్ణదేవరాయులు వేంచేసినట్లు కనబడు అనేక శిలా శాసనములు కలిగి ప్రసిద్ధ క్షేత్రము, ఈ గ్రామమునకు ఏడుమైళ్ళ దూరములలో కలదు. సుప్రసిద్ధ మధుర భక్తుడగు మొవ్వ గోపాల పదకర్తయగు

క్షేత్రయ్య ఆరాధించిన వేణుగోపాల స్వామి వెలసిన మొవ్వ గ్రామము దీనికి అయిదుమైళ్ళలో అలరారుచున్నది. నాట్యాచారుడైన సిద్ధేంద్రయోగి నడయాడిన కళాక్షేత్రము భాగవతుల కూచిపూడి ఎనిమిది మైళ్ళలో గలదు.

ఈ గ్రామమును పరికించిన పెద్దలు ప్రాచీన కాలముననే ప్రణాళిక ననుసరించి కట్టబడినట్లు గమనిస్తారు. గ్రామ మధ్యనవున్న జలధీశ్వరాలయము ముందు విశాలమైన ఖాళీస్థలముండి ఈనాటికి దేవుని వుత్సవాలకు, సభలు, సభావేశములకు వుపయోగపడుచున్నది. ఇది నలుచదరమైన గ్రామము, మధ్య రెండు వీధులు మిక్కిలి వెడల్పు గలిగి పొడవైనవి. నలువైపులా గల వీధులు మిక్కిలి వెడల్పు గలిగి పొడవైనవి. నలువైపులా గల వీధులు విశాలమైవుంటూ చక్కటి భవంతులతో కన్నుల పండుగగా కనబడును. ఈ గ్రామ విశిష్టత ప్రతి యింటికి చక్కని ప్రవహరి, దాని నానుకొనివున్న అరుగులు వచ్చెడివారిని ఆహ్వానించునట్లు కనబడును. ఈ గ్రామ శోభ అధికముగా సంక్రాంతి సమయమున చూడదగినది. ప్రతి యిల్లు ఆనాడు అధికముగా అలుకు ముగ్గులతో అందచందాలతో అలరారుచుండెను.

అనేక ప్రాచీన పట్టణాలు నేడు నామరూపములు లేకుండాపోయినవి. ఘంటసాల గ్రామము అలాగాక నాటినుండి నేటివరకు చరిత్రప్రసిద్ధమై వున్నది. జమీందారీ యుగమున జమీందారుతో తమ హక్కులకొరకు పోరాడి విజయము గాంచినది.

గాంధీ యుగమున కాంగ్రెసుకు పెట్టని కోటగావుండి ఓట్లు యివ్వరాదనే సందర్భములో ఒక్క ఓటుకూడ వేయకుండా ఖాళీ పెట్టెలను పంపి కడు ప్రసిద్ధి గాంచినది.

ఇటువంటి ప్రసిద్ధ గ్రామమున మన రైతువద్ద గొట్టిపాటి బ్రహ్మయ్య, కిసాను వెంకట సుబ్బయ్య జన్మించి ఈ గ్రామ ప్రతిష్ఠను పెంచిరి.

## తాత, తండ్రులు

అసలు గొర్రెపాటి వారిది కైకలూరు తాలూకా కానుకొలను. అక్కడనుండి గురవయ్య అనే మూలపురుషుడు ఘంటసాల వచ్చెను 250 సంవత్సరముల క్రితం. ఆయనకు నలుగురు కుమారులు.

నాలుగవ కుమారుడు వెంకట్రామయ్య సంతతివాడే మన కిసాన్ వెంకట సుబ్బయ్య. ఈ వెంకట్రామయ్యకు సుబ్బయ్య అనే కుమారుడు కలిగెను. ఆయన కుమారుడే బాపయ్య. ఈ బాపయ్య గారి తండ్రి ఈయన బాల్యములోనే గతించుటచేత ఈయన తల్లి రంగమ్మ పెద్దవారు లేనందున తన తమ్ముడు వేమూరి సుబ్బయ్యను వ్యవసాయము చేయించగలందులకు తీసికొని వచ్చింది. బాపయ్య పెద్దవాడయినప్పటికి తన తమ్ముని తన యింట్లోనే నిలుపుకొన్నది.

ఆ కాలములో టపా బళ్లమీదే అంశులగా వెళ్ళేది. ఈ కంట్రాక్టును బాపయ్యగారు తీసికొన్నారు. తద్వారా కొంత సొమ్మును సంపాదించాడు. అప్పట్లో ఈ ప్రాంతమంతా మెరకసేద్యమే. కైకలూరు తాలూకా పల్లివాడలో అప్పటికే కొంత భూమి పల్లపుసాగు అవుట వలన కొంత ధాన్యము తెచ్చి యిక్కడ అమ్ముతూ వుండేవాడు. ఈయన కొన్ని కొట్లుకూడ కట్టించాడు ధాన్యము నిలపోయుటకు. ఆ ప్రాంతములో బాప్యగారు అప్పలుకూడ పెడుతూ వుండేవాడు. అందువల్ల ఈయనకు వారు సహాయ సంపతులు చేస్తూవుండేవారు. పల్లివాడలోని జట్టావారి కుటుంబముతో ఈయనకు స్నేహమైనది.

వేమూరి సుబ్బయ్యగారికి పుల్లయ్య అనే కుమారుడు కల్గాడు. బాపయ్యగారికి బ్రహ్మన్న జన్మించాడు. వారిద్దరు కలిసివుండుట వలన పుల్లయ్య, బ్రహ్మన్నగార్ల కుటుంబమనే ప్రసిద్ధి కలిగింది. వీరిద్దరు మేనత్త, మేనమామ బిడ్డలు. వీరు సిరిసంపద గల మోతుబరి రైతులు. అప్పట్లో కమ్మవారిలో కెల్ల ధనవంతులు. బ్రహ్మన్నగారు తన మేనల్లుడైన పుల్లయ్యగారికి సమానవాటా పంచిపెట్టాడు. వారిద్దరు చెరో 70 యెకరములు పంచుకొన్నారు. తండ్రి అనంతరము కూడ బ్రహ్మన్నగారు ధాన్యము వ్యాపారము చేస్తూవుండేవాడు ఆయనది కృష్ణవర్ణమే. ఆకాలములో ధనవంతుల చామపువ్వు కడియము ధరించేవారు. ఆయనకూ వుండేది. ఆయన గ్రామ వ్యవహారములలో జక్యము కలిగించుకొనక తన వ్యవహారము తాను చూచుకొనేవాడు.

అప్పట్లో పెద్దరైతు లందరికి గుర్రములు వుండేవి. ఈయన పల్లివాడ గుర్రముమీదనే వెళ్ళేవాడు.

అక్కడకు తరచుగా వెళ్ళుచూ వుండుటచేత తన గుర్రం మేతకు కొంత భూమిని కొనెనే. గొర్రెపాటి వారి చెలికలు అని దానికి పేరు. పల్లివాడలో బ్రహ్మన్నగారు ఒక చెరువుకూడ త్రవ్వించాడు.

బ్రహ్మన్నగారు గొప్ప దాతగా ఖ్యాతి గాంచాడు. పిపుపాటి పుట్టంభట్టు అనే ఆయనకు తన చేనుమధ్య రెండు యెకరములు దానము చేశాడు. ఈ పుట్టంభట్టు బ్రహ్మన్నగారికి గుమస్తా, పౌరోహితుడు కూడ, వేమూరి పట్టాభిరామయ్యగారికి ఈయన అల్లుడు అయినందున వారి విశ్వేశ్వరాలయమునకు కొంత భూదానముకూడ చేశాడు. ఆ దేవాలయము శిథిలమైనందున దానిని తిరిగి కట్టేటప్పుడు ఆ దేవాలయపు పనికిగాను ఒక జత ఎడ్లను పురమాయించాడు. ఆయన ఒక మామిడితోట, తాళ్ళతోట కూడ వేయించాడు. విశ్వేశ్వరాలయపుతోటలో బజారువైపున ఒక సత్రముకూడ కట్టించాడు విశ్వేశ్వరాలయము దగ్గరగావున్న రామాలయము ఈయనే కట్టించాడు.

బ్రహ్మన్నగారికి వెంకయ్య, అప్పయ్య, వెంకటరత్నం, వెంకట్రామయ్య అను నలుగురు కుమారులు. పెద్దవారిద్దరు నీలమేఘశ్యామ వర్ణముగల దీర్ఘకాయులు. మంచిబలశౌరులు. చిన్న వారిద్దరు చామనచాయగలిగి వుండేవారు. వీరందరు ప్రజోపకారమైన పనులు నిర్వర్తించినవారే. వీరు తలా 18 యకరములు పంచుకొన్నారు.

వెంకయ్యగారు వున్నతాకారము కలిగిన గంభీరమూర్తి. అయన ఆ కుటుంబంలోనే పెద్దగాదు అన్న విధలా ఆయన పెద్దగానే గణింపబడ్డాడు. ఘంటసాల గ్రామ పెత్తనదారులలో గొర్రెపాటి సరసన్నగారి వెంకయ్య, వేమూరి రామన్నగారి కుమారుడు వెంకయ్య మొదలగు పెత్తనదారులలో ఆయన వయస్సులోనే గాక అన్నిటా పెద్దే, జ్ఞాన జ్యేష్ఠుడు ఆయన. ఒక నిర్ణయానికి వచ్చిన పిమ్మట ఎవరు ఎన్ని చెప్పినా బ్రహ్మ చెప్పినా మారేవాడు కాదు. లాభనష్టాలనను గణనచేసేవాడు కాదు.

ఆధ్యాత్మిక చింతన గలిగి కొంత వైరాగ్యాన్ని పెంచుకొన్నాడు, కొంతకాలము సన్యాసుల వెంట బైరాగుల వెంట తిరిగాడు. తరువాత ప్రయోజనము లేదని గ్రహించాడు. అచలయోగమందు ఆయనకు అభిమానము అధికము తత్వజ్ఞాన గ్రంధములను అధికముగా పఠిస్తూ వుండేవాడు. వేమనయోగి పద్యాలన్ని ఆయనకు కంఠస్తం.

రావి కర్రలతో అప్పటికప్పుడు బండిమాదిరిగా చేసి, రక్తపు గుడ్డలతో పంబలవాడు దానిలో కూర్చుని పందిపిల్లను ఒకదాన్ని ఆ బండికి గుచ్చి పంబలవాళ్ళు కథ చెప్పతూ కొర్లంక అనే దేవతనను కొలిచేవారు ఈ గ్రామస్తులు. ఇది హింసాయుత కార్యమని జీవకారుణ్యం గలిగిన ఈ వెంకయ్యగారు దీన్ని మాన్పించటం ప్రశంసనీయం.

వార్తాపత్రికలను చదువుతూవుండేవాడు. ఆ కాలపు పెద్దలలో జాతీయాభిమానము అధికముగా కలవాడు. ఆయనను పెత్తనదారు అనుట అనుచితము. పెత్తనదారుల పెత్తనం పోగొట్టాలనే ప్రజాస్వామ్యవాది. ఆయన ఒకరిని స్తుతించటం మరొకరికి లొంగటం, ఒకరిని కృంగదీయటం ఇష్టములేని సర్వసోదర భావవము గలవాడు. కాంగ్రెసు సంస్థయందు గొప్పభక్తి తత్పరత హెచ్చు.

1918 ప్రథమప్రపంచసంగ్రామము కాలములో దివితాలూకా తాశీలుదారు హుమయూన్‌సాహెబ్ గారు యుద్ధ చందాలకొరకు ఘంటసాల రాగా “ మా గ్రామస్తులు కడు బీదవారు చందాలు యివ్వలేరని ” ఖచ్చితముగా చెప్పిన మహామహుడు. “ నేను యిల్లిల్లుతిరిగి వసూలు చేస్తానని ” ఆ తాశీలుదారు అనగా “ గ్రామ పెద్దలను కాదని మీరు వసూలు చేయగలరా ” అని నిర్భయముగా చెప్పిన ధైర్యశాలి. అక్కడనే తనవద్దనున్న పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుతో తాశీలుదారు ఏకాంతముగా మాట్లాడాడు. బహుశా ఆయనను అరెస్టు చేయమని అంటే ఆ ఇన్‌స్పెక్టరు మనం చందాలకు వచ్చాము యిటు వంటి సందర్భములో అదిమంచి పద్ధతి కాదని సలహాయిచ్చి వుండవచ్చును. అంతటవారు సంభాషణమార్చి మరియొకసారి వస్తామని వెళ్ళి పోయారు.

1923 లో కాకినాడ కాంగ్రెసుకు గ్రామ కాంగ్రెసు యువకులతో యీ పెద్దాయన వెళ్ళాడు.

గ్రామ పంచాయితీ బోర్డులో ఆయన సభ్యుడుగా వుండి చేసిన సేవ కొనియాడదగినది. గ్రామవీధులలో మట్టి కొట్టుకుపోకుండా అడ్డకట్టలు వేయించాడు. బజారులలోను పెద్ద దేవాలయముముందు మట్టి

తొలించుటకు ఆయనే కారకుడు. అప్పుడు నల్ల మట్టి తోలుట వలన ఆ బురద బాధకు కొందరు ఆయనను దూషించినా ఏమి అనుకొనేవాడు కాదు. ఆయనను ఇంజనీరు అనేవారు కొందరు. ఆవిధముగా బజారులలో మట్టి కొట్టుకు పోకుండానేగాక వీధులను మెరకచేసి శాశ్వత ప్రయోజనము కలుగజేసాడు.

గ్రామ సంఘానికి కొంత కాలము అధ్యక్షుడుగా వుండి పెత్తనదారుల దగ్గరవున్న సొమ్మంతా వసూలుచేసి గ్రామ సావిడి కట్టించాడు. దానిలో కొంతకాలము బాలికా పాఠశాల వుంచటం తరువాత అది మారుమూల నున్నదని దానిని అమ్మి జలధీశ్వరాలయము ముందు డాబా కట్టించటం జరిగింది.

ఆయన కారుణ్య స్వభావానికి ఒక సంగతి తెలయజేస్తాను. శ్మశానములో పుట్టలు వగైరా తీసివేస్తే మేతబాగా పడుతుందని గొట్టిపాటి బ్రహ్మయ్యగారు సలహాయివ్వగా అంతట ఆయన "రైతులంతా చేలలో పుట్టలుతీసివేసి జీవకోటికి అండదండలు లేకుండా చేస్తున్నారు. ఇక్కడకూడ వాటిని బ్రతక నియ్యకపోతే ఎట్లా " అన్నాడు ఆ దయావరుడు. గౌతమబుద్ధుని కరుణ, మహాత్ముని అహింసా ఆయనలో మూర్తీభవించాయి.

1921 లో మహాత్ముని అసహాయోద్యమము యీ గ్రామములో అధికముగా ఆచరణలోనికి వచ్చింది అనచరులు కోర్టుబహిష్కారం చేసుకొనుటకు ఒక ప్రణాళిక ఏర్పాటుఅయినది. ఈ పద్ధతి బహుకాలం సాగింది. ఈ కార్య భారమంతా ఆయన అధ్యక్షత క్రింది జరిగింది. ఈ కేసుల సంధర్భంలో ఒక్కొక్కప్పుడు కొంత డబ్బు డిపాజిట్ తీసుకోవలసివచ్చేది. దానిని ఆయన భద్రంగా సీలుచేసి తన వద్దనే ఉంచేవాడు.

ఈ గ్రామ పంచాయితీ బాగా పనిచేయుట వలన పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్పయ్యనాయుడు గారు 1923లో చల్లపల్లి క్యాంప్‌కి ఈ పంచాయితీ అధ్యక్షకార్యదర్శులగు ఈ వెంకయ్య గొట్టిపాటి బ్రహ్మయ్య గార్లను రప్పించుకొని మీరు క్రిమినల్ కేసులు రాకుండా చూస్తున్నారట , ఈ పంచాయితీ కోర్టుఎక్కడ, ఏమిటి అని ప్రశ్నించగా మా వ్యహారాలన్ని చెట్లక్రిందనే సివిల్లో, క్రిమినల్లో మా తగాదాలు మేము పరిష్కారం చేసుకుటున్నాం. ఇది తప్పా ! అని వారు చెప్పగా విని వారిని పంపివేసెను.

ఘంటసాల గ్రామం చాలా పెద్దది ఊరు వెలుపల తప్పితే మధ్య మంచినీరు లేదు. మంచినీళ్ళు తెచ్చుకోవటం ఒక పూట పని అందువల్ల గ్రామం మధ్యనున్న దక్షిణ నూతిలో మంచినీళ్ళు పడునేమోనని పంచాయితీ బోర్డు ద్వారా పంపింగ్ సెట్టు తెప్పించి బ్రహ్మాండమైన ప్రయత్నం చేసారు. కాని మంచినీళ్ళు పడలేదు. తరువాత మూడు మైళ్ళలోనున్న పంటకాలువ నుండి మంచినీళ్ళు బోదులద్వారా చెరువులు నింపాలని ప్రయత్నంచేసారు. తగు ద్రవ్యం వనకూడనందున ఆ కార్యము సాగలేదు. నీస్వార్థముతో గ్రామం కొరకు పాటుపడిన గ్రామోపకారి.

ప్రధమ గోటక సంఘానికి ఈయనే అధ్యక్షుడు. ఈయన ఆ విచారణాసమయమందు తెల్లని లాగు, చొక్కా, ధరించేవాడు అనేవారు. ఈ గ్రామ శ్రేయోభిలాషి 1933లో పరమపదించటం గ్రామానికి ఎంతో నష్టం .

ఈయన జ్యేష్ఠ కుమారుడు వెంకటేశ్వర్లు 1890లో జన్మించాడు. ఘంటసాలలో చదువుముంగించిన తరువాత బందరు నోబెల్ హైస్కూల్లో ప్రవేశించారు. బ్రహ్మసమాజ గదులలో ఉండేవారు. వందేమాతం ఉద్యమం ప్రభావం, ముట్నూరి కృష్ణారావుగారి ఉపదేశంతో ఉత్తేజితుడై 1910లో సాంఘిక , రాజకీయ కార్యక్రమాలలో పాల్గొన్న దేశాభిమాని.

ఈయనకు మహాపురుషుల జీవితచరిత్రలు చదవటం ఇష్టం. ఎంత క్రొత్తవారితోనైనా చిటికలో స్నేహం చేసుకొనే స్వభావం కలవాడు. గ్రామంలో పార్టీలు లేకుండా ఐకమత్యంతో ఉండేటట్లు కృషిచేసేవారు. నిష్కపటి , నిర్మోహమాటి.

మంచి విద్యాభిమాని. ఘంటసాల నుండి మాత్రమేకాక ఇతర గ్రామాల నుండి కూడా అనేక యువకులను ప్రోత్సహించి ఆంగ్లబాషాపఠానానికై బందరు తీసుకొనివచ్చి వారందరకూ సంరక్షకుడిగా ఉండి వారి ఆరోగ్య విద్యావిషయాలను శ్రద్ధగా చూసేవాడు. విద్యార్థుల భోజనవసతికై , కానూరు వెంకటాచలపతయ్య గారి సహాయంతో కమ్మ హాస్టలు కూడా ఏర్పాటుచేసారు. తన సంరక్షణలో ఉన్నవారికి మంచి నడవడి ,

సంఘసేవ, దేశసేవ కలుగజేసిన యువజన నాయకుడు. ఘంటసాల గ్రామంలోని విద్యార్థులంతా దాదాపు 20 మంది ఆయన చెప్పుచేతలలో ఉండేవారు.

ఘంటసాలలో రామ్మోహన గ్రంథాలయం స్థాపించిది కూడా ఆయనే. అటు విద్యార్థులందరూ దాని అభివృద్ధికి పాటుపడ్డారు. ఈ గ్రంథాలయం ద్వారా వయోజనవిద్య ప్రచారం కొంత జరిగింది. దీని ప్రభావంతోనే సాహిత్యసేవ, దేశసేవ చేయాలనే అభిలాష కలిగింది.

వెంకటేశ్వర్లు గారి నాయకత్వంలో 1916లో గుడివాడలో జరిగిన కృష్ణమండలి సభకు గొట్టిపాటి బ్రహ్మయ్య, ఈ రచయిత మొదలగు వారు వాలంటీరులుగా వెళ్ళి వివిధ కార్యక్రమాలలో పాల్గొని , కార్యనిర్వహకుల ప్రశంసలు పొందటం జరిగింది.

బందరులోని కమ్మ విద్యార్థి గ్రంథాలయ నిర్మాతలలో ఒకరు. ఆయన బందరులో ఎఫ్.ఎ.లో ఉత్తీర్ణుడు కాలేక నాగపూర్ వెళ్ళి అక్కడ విషజర్వం వలన 38-8-1916 లో అకాల మరణం పొందుట తీరని నష్టం కలిగింది.

కానూరి వెంకటాచలపతయ్య గారు కృష్ణపత్రికలో " ఆదర్శవంతమైన ఒక విద్యార్థి అస్తమయం " అన్న శీర్షికతో ఆయనను గురించి వ్రాసాడు. వెంకటేశ్వర్లుగారి ద్వారానే కానూరి వెంకటాచలపతయ్య గారి వంటి రైతు నాయకులతోను, ముట్నూరి కృష్ణారావు గారి వంటి దేశనాయకులతోను మాకందరుకు పరిచయ భాగ్యం కలిగింది.

మన కిసాన్ వెంకటసుబ్బయ్య ఆయన పెదతండ్రి కుమారుని సన్నిది సహచర్యంలోనే విద్యాభ్యాసం సాగించాడు.

బ్రహ్మన్నగారి రెండోకుమారుడు అయ్యప్ప గారు మంచి ఆర్జనపరుడుగా ప్రసిద్ధి. గొప్ప వ్యవహారదక్షుడు. గ్రామంలో బంధుమిత్రులు గృహనిర్మాణం చేయదలచివస్తే ప్లాను వేసినది లగాయతు ఆ యిల్లు పూర్తిఅయ్యేవరకు తన సొంత పనిగా భావించి అక్కడే మకాం పెట్టి పూర్తిచేయించేవాడు. ఆయన వ్యవసాయంచేయక కౌలుకి ఇచ్చేవారు. అందుచేత ఈ పనులన్నీ చేయుటకు అవకాశం అధికంగా ఉండేది. దానికి చాలా కాలం ఆయన ట్రస్టీ . దోనేపూడి సుబ్రహ్మణం గారితో కలిసి కొంతకాలం ఖాయిదా వ్యాపారం కూడా చేసాడు. వెంకటేశ్వర్లుగారి పేర ఒక సత్రం కూడా కట్టించాడు.

శ్రీ జలధీశ్వరాలయం ముందున్న మేడను, బాలిక పాఠశాలకు ఉపయోగంగా శ్రద్ధాగా దగ్గర ఉండి బాగుచేయించి వాసారా తీయించి మెట్లు కట్టించాడు.

గ్రామదేవతయగు పెన్నేరమ్మ గుడికూడా బాగుచేయించాడు. ఈ రెండు కార్యాలు గ్రామ ఉమ్మడి ధనంతోనే జరిగినా ఆ కాలంలో శ్రద్ధగా చేయిచడం స్తవనీయం కదా.

బ్రహ్మన్న గారి మూడోవ కుమారుడు వెంకటరత్నం గారు . అందమైన వాడు, బంగారు మురుగులు వేళ్ళకు ఉంగరాలు వెండి గొలుసుతో మొల్లో తాళంచేతులు కిర్రు చెప్పులు ఆల్పేకా కోటు, తలగుడ్డ ఈయన అలంకారములు. ఈయన వ్యవసాయం చేసేవాడు కాదు. అయిన అనేక చోట్ల పోలాలు కొని అమ్మాడు , మంచి ఉదారుడు. వేలాది సంపాదించాడు ఖర్చు పెట్టాడు. విధ్యాభిమాని . గ్రామంలోని పాఠశాలలో బాగా చదువుకున్న విద్యార్థులకు బహుమతులు ఇస్తుండేవాడు. బందరులో ఇంగ్లీషు చదువుకునే యీ గ్రామ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉండేవాడు. 1920లో ఈ గ్రామంలో జరిగిన తాలూకా సభకు ఆర్థికంగా సహాయంచేసి ఉత్సాహ ప్రోత్సాహములు ఇచ్చి ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా ఖ్యాతిగాంచాడు.

బ్రహ్మన్నగారి నాలుగో కుమారుడు వెంకటరామయ్యగారు , ఈయన తన అన్న వెంకటరత్నంగారు కలిసి చాలా కాలం జాయింటుగానే ఉండిరి. మంచి వ్యవసాయికుడు. గ్రామంలో చాలా శ్రమపడి వార్ధక్యంలో చందాలు వేయించి జలధీశ్వరస్వామి ధ్వజస్తంభమునకు ఇత్తడి రేకు వేయించాడు. గ్రామ మద్యన పాడైపోతున్న పేన్నేరమ్మ గుడిన సిమెంటు చేయించి చక్కగా బాగుచేయించాడు.

ఈ గ్రామంలో గాంధీ హైస్కూల్ భవనం గ్రామత్యా కాంట్రాక్టు తీసుకొని బాగా కట్టించడం జరిగింది. ఈ సందర్భంలో వెంకటరామయ్య గారు నిత్యము వచ్చి కూలీల చేత పనిచేయించేవారు.

ఈ నలుగురు అన్నదమ్ములు ప్రజాహితైక కార్యాభిలాషులు. వీరు ముగ్గురు తమ అన్నగారగు వెంకయ్యగారియందు ఆదరాభిమానాలు కలిగి సంచరించి చరితార్థులైనారు.

## జననము - విద్యాభ్యాసము

అప్పయ్యగారికి వేమూరి చలమన్నగారు తన కుమార్తై రుక్మిణమ్మను యిచ్చి పరిణయము చేశారు. ఆయన గొప్ప ఆజాను బాహువే గాక అప్పట్లో ఘంటయ్యగారి తెగలో పలుకుబడిగల వ్యక్తి. గొర్రెపాటివారిలో బాలకృష్ణమ్మ, ఆయన తమ్ముడు రామస్వామి యిరుపార్టీలకు నాయుకులు. ఈయనది మూడవ పార్టీ. అప్పయ్యగారి తల్లి రంగమ్మగారు కూడ వారింటిలోనే వుండేది. ఈ దంపతులిద్దరు సుఖసంతోషములతో కాపురంచేస్తూ వుండగా 15-6-1903 తారీఖున వీరికి ఒక మగశిశువు కలిగాడు. ఈ గ్రామములో సుబ్రహ్మణ్యేశ్వరుడు వుండుటచేత ఈ పిల్లవానికి వెంకటసుబ్బయ్య అనే నామకరణము చేయబడింది. గొర్రెపాటివారి యిష్ట దైవము సుబ్రహ్మణ్యేశ్వరస్వామి. ఈ పేరు గలవారు గొర్రెపాటి వారిలో చాలమంది వున్నారు. ఈ పిల్లవానికి ఒకటిన్నర సంవత్సర ప్రాయముననే తల్లి పరలోకయాత్ర చేసింది. విద్యాభ్యాసము వయస్సు వచ్చేవరకు ఘంటసాలలోనే తాతముత్తవల యింటివద్దనే ఈ కుర్రవాడు పెరిగాడు. అమ్మమ్మ రత్తమ్మ తల్లిలేని పిల్లవాడిని చాల గారాబంగా పెంచి పోషించింది.

తరువాత తండ్రి విద్యాభ్యాసము చేయించదలచి తన యింటికి రప్పించాడు. అప్పుడు ఈయన పినతండ్రి వెంకట్రామయ్యగారు వీరు ఒక యింటిలోనే వేరు వేరుగా వుండుటవల్ల పినతల్లి లక్ష్మమ్మగారు బావకొడుకును అతి ప్రేమతో పెంచింది. చిన్నతనములో విద్యయందు అభిమానము వుండేదికాదు ఈయనకు. తల్లిలేని పిల్లవాడని ఉపేక్షించేవారు అందరు. ఒకసారి గుర్రం ఎక్కి పడ్డాడు. చేతికి దెబ్బ తగిలింది. ఎంత తోమినా సరిగా వచ్చిందికాదు చెయ్యి. అందుకే ఎడమ చేతితో భోజనము చేసేవాడు. బడికి కూడ సరిగా వెళ్ళేవాడు కాదు. బడికి వెళుతున్నానని చెప్పి పూళ్ళవెంబట తిరిగేవాడు. ఒకనాడు స్కూలుకు వెళ్ళమనగా పారిపోయాడు. అయ్యో, తల్లిలేని బిడ్డ ఎమయ్యాడో అని తండ్రి పిల్లవానిని వెదుటకు నలుప్రక్కలకు మనుష్యులను పంపాడు. ఘంటసాలకు రెండుమైళ్ళ దూరములో వున్న దాలిపర్రులో బొందలపాటి వెంకయ్యగారి యింట్లో వుండా తీసికొని వచ్చారు. కుర్రవాడు దొరికినందుకు అప్పయ్యగారు ఎంతో ఆనందించారు.

ఆయన మొట్టమొదటి విద్యాభ్యాసం చేసినది ఘంటసాల నరసయ్య వీధిబడి పంతులు దగ్గర. ఈ గ్రామములో ప్రాచీనమైన వీధిబడులలో యిది ఒకటి. ఈయన తండ్రి పేర్రాజు కూడ వీధి బడిపంతులే.

అటు తరువాత బోర్డు బాలుర పాఠశాలకు పంపారు. అప్పట్లో గొర్తి నారాయణమూర్తిగారు హెడ్‌మాష్టరు. ఆయన మంచి ఉపాధ్యాయుడు. ఆయన వచ్చిన తరువాతనే ఆ పాఠశాల అభివృద్ధిగాంచింది. ఆయనతో పాటు మిగిలిన ఉపాధ్యాయులుకూడ సక్రమముగా పనిచేయునట్లు చూస్తూ వుండేవాడు. గొట్టిపాటి బ్రహ్మయ్య, ఈ రచయిత వేమూరి సీతారామయ్య ఆయన కాలములో సర్టిఫికెట్టు పొందినవారే. మన వెంకటసుబ్బయ్య మూడవక్లాసు వరకు యిక్కడే చదివాడు.

తన అన్నగారి కుమారుడు బందరులో విద్యాభ్యాసము చేస్తున్నందున తన కుమారుని కూడా ఆ మాదిరిగా చదివించగోరి, కొవ్వలి సుబ్బారావు అనే ఒక ఉపాధ్యాయుని నియమించాడు. ఆయన వద్ద తన తమ్ముని కుమారుడు బ్రహ్మయ్య, వేమూరి రత్నయ్య గారి కుమారుడు సుబ్బయ్య, ఈయన తమ్ముని కుమారుడు వెంకటసుబ్బారావు యిక్కడే చదివారు. ఇలా చదివిన తరువాత 1915 లో బందరు నోబుల్ హైస్కూలులో ఈ నలుగురిని ఫస్టు ఫారములో ప్రవేశింపజేసారు. వీరందరు వెంకటేశ్వర్లుగారు అదుపు ఆజ్ఞలలోనే వుంటూ ఆయన పెట్టించిన హాస్టలులోనే వుండేవారు. వెంకటేశ్వర్లు గారు అనంతరము అప్పయ్యగారు తన కుమారుని గొట్టిపాటి బ్రహ్మయ్యగారికి అప్పచెప్పాడు. 1917 లో బ్రహ్మయ్యగారు కూడ అనారోగ్యమువలన విద్యాభ్యాసం మానినందున మన వెంకట సుబ్బయ్య థర్డ్ ఫారముతోనే చదువు ముగించాడు.

అప్పట్లో ఘంటసాలలో జాతీయోద్యమము బాగా సాగుతున్నందున జాతీయభాషయగు హిందీచదవాలని యువకులకు వుత్సాహము కలిగింది. అందువల్ల మొక్కపాటి సుందరామయ్యగారు అనే హిందీ ఉపాధ్యాయుని రప్పించారు. ఈయన వద్ద యీయన మేనమామ వేమూరి సీతారామయ్య, ఈ రచయిత మరి కొందరు కలిసి హిందీ చదివారు.

## వ్యవసాయం

"రైతు చెమటోడ్చి సేద్యం చేసిననాడే దేశం నిలుస్తుంది. అట్టి మా కర్షక లోకాన్ని కాలరాయడం మేమెన్నటికిని సహించం."

--- రంగాజీ.

భారతదేశం వ్యవసాయక దేశం. అయినప్పటికీ ఆయా ప్రాంతాలలో రైతులను గురించి తెలసుకోవటం అవసరం పంజాబు ప్రాంతం అయిదు నదులు కలది. అందు నా సుక్షేత్రమైన భూమి. అందుచేతనో, స్వభావం చేతనో పంజాబు రైతు యావద్భారతంలోను చేప్పుకోదగ్గవాడు. అటు తరువాత మన తెలుగు రైతు అతడు పాదం పెట్టేచాలు, ఊసరక్షేత్రాలు సుక్షేత్రాలుగా మారుతాయి. ఇక మంచి పొలముంటే బంగారమే పండించగలడు. సేద్యం చేయడంలో అతని నేర్పరత్వము ఈనాటిదే కాదు. తరతరాలుగా దానిలో అతను దిట్ట. తంజావూరు వెళ్ళండి, కోయంబత్తూరు చూడండి. ఇంకా దక్షిణానికి ఎక్కడికయినా వెళ్ళండి. ఎక్కడ నల్ల రేగడిభూమి ఉంటే అతను అక్కడున్నాడు. విజయనగర సామ్రాజ్య కాలంలో ఆప్రాంతాలకు వెళ్ళి అక్కడ స్థిరపడినవారే ఈ రైతు కుటుంబాలవారు. ఆనాడు వారు సైనికులుగా వెళ్ళారు. తరువాత రైతులయ్యారు.

అప్పుడేకాదు ఇప్పుడుకూడ ఎక్కడ చూచినా మన తెలుగు రైతే. ఒరిస్సాలో జపాను వారితో పోటిపడి పండిస్తున్న దెవరు ? వీరే ! మధ్యప్రదేశ్ వెళ్ళండి. ప్రస్తుతం మహారాష్ట్రంలో అంతర్భాగాలుగా ఉన్న కాంప్టీ, రాంకేట్ మొదలగు పరిసరాలను పరికించండి. ఇక్కడ కన్పించేది వారే.

ఈ దూర ప్రాంతాలకు వెళ్ళి గొప్పగా వ్యవసాయం చేస్తున్నారు. వారు ఈ ప్రాంతాలకు వలస వెళ్ళడంవల్ల అక్కడ రైతులు వ్యవసాయపు పద్ధతులను వీరినుండి నేర్చుకోగలుగుతున్నారు. మైసూరు రాష్ట్రంలోను అంతే. తెలంగాణంలోను అంతే. ఆంధ్రదేశంలో నల్లరేగడ భూములకు నిలయమైన కృష్ణా, గుంటూరు, గోదావరి ప్రాంతాలలో కమ్మవారు అధికంగా ఉన్నారు. వీరే వ్యవసాయనికై వలన వెళ్ళేవారిలో అధికంగా ప్రసిద్ధులు.

మన హిందూ దేశంలో కొన్ని ప్రాంతాలు కొన్ని పంటలకు ప్రసిద్ధి చెందినవి. పంజాబు గోధుమకు, బెంగాల్ జనపనారకు మహారాష్ట్రము ప్రత్తికి, మన ఆంధ్రదేశము వరికి .

ఇక వెంకట సుబ్బయ్యగారిని గురించి. ఆయన తండ్రి పంచుకున్నది 17 ఎకరములు. సంపాదించిన 7, 8 ఎకరాలు. ఇదంతా బహుకాలం నుండే కట్టుబడికి ఇవ్వడంవల్ల నిస్సారమైంది. అందుచేత కర్షక వర్గమున పుట్టిన ఈయన స్వంత సేద్యము చేయుట ఉచితమనే ఎంచాడు. అంతేకాదు కర్షక వృత్తి కేవలం ఒక వృత్తికాదు. అదొక జీవన విధానం . 'Agriculture is not a mere profession but a way of living ' అని ఏనాడో గ్రహించాడు. అందుచేత లాభనష్టాలు ఆయన పాటించలేదు.

తన 22 ఎకరాలలో బోళ్ళపాడు భూమి 5 ఎకరములు మాత్రమే పల్లపు సేద్యము. మిగతా 17 ఎకరములు మెట్ట. అందువలన రెండు జతల ఎడ్లుంటెగాని తమ సేద్యము సాగదని తలచి ఎడ్లను పాడి పశువులను మొదలగు వాటిని కొన్నాడు.

1923 నుండి ఆయన స్వయంగా మేడిపట్టి దున్నిన రైతు. ఆయన కొండ్రవేస్తే సూటిగా వుండేది. మొక్కజొన్న బోదులువేసినా, మిరపబోదులు వేసినా ఆయనే స్వయంగా వేసేవారు. అంతే కాక ఆయన మంచి బలాఢ్యులు. ఇద్దరు ఎత్తగలిగిన మోపు తాను ఒక వైపున వుండి ఎత్తుకొని సునాయసంగా మోసేవాడు. ఒక్క చేత్తో బండి బోల్లా లేపేవాడు. బండి వెళ్తూంటే దాని ఆకు పట్టుకొని పూటి కట్టినట్లుగ తిరగకుండా ఫర్లాంగువరకు పోనిచ్చేవాడు. ఇట్లా వ్యవసాయంలో అన్నిట ఆయన దిట్ట.

సాధారణ రైతులవలె నీరుకావి ధోవతులనే కట్టేవాడు. ఒక్క బనియను తొడిగేవాడు. గ్రామంలో చర్మకారుడు కుట్టిన చెప్పులనే తొడిగేవాడు. చేతిలో ముల్లుగర్ర ఎప్పుడూ ఉండేది. ఆయన అచ్చంగా తెలుగు రైతు. అందుచేతనే ఆయన జీవిత పర్యంతరము తెలుగు రైతుగానే సంచరించాడు. ఆయన భాషలో, భావంలో, వ్రాతలో, ప్రవర్తనలో అన్నిటా రైతే.

ఆంధ్రదేశంలో ఎందరు రైతులులేరు ! వారందరు రైతులా ! వారికి రైతు దృక్పధములేదు. మన మాజీముఖ్య మంత్రి రామస్వామి రెడ్డియార్ రైతే. మన సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మొదలయినవారు కర్షక కుటుంబములో నుండి వచ్చిన మంత్రులే. కాని వారిది రైతు హృదయం కాదు. ఒక్క మునిస్వామి నాయుడు కర్షక మంత్రి. అందుచేతనే ఆయన ' టోల్ గేట్ ' లను తీసేశాడు. ఈనాందారి, జమీందారి రైతు బిల్లులను ప్రవేశపెట్టాడు. అందుచేతనే బొబ్బిలి మంత్రి ఆయనను పడగొట్టాడు.

గాంధీ టోపీ గవర్నని ప్రఖ్యాతి గాంచిన రైతుబిడ్డ, ఈడ్పుగంటి రాఘవేంద్రరావు మంత్రిగా ఉన్నప్పుడు భారతదేశంలో మొదట ఆయనే ఋణ పరిష్కార చట్టాన్ని చేశాడు.

ప్రజానాయకుడు ప్రకాశం రైతుకాక పోయినా రైతు అభిమాని. అందుచేతనే ఆయన రైతులకు బోనస్ ఇచ్చాడు. జమీందారీ విధాన రద్దు బిల్లును ప్రవేశపెట్టాడు.

వెంకట సుబ్బయ్య గొడ్లకాపరి వేమూరి చన్నయ్య అనే ఒక కుర్రాడుండేవాడు. అతను కాకిని, గ్రద్దను వాలనిచ్చేవాడుకాదు. పిల్లికి బిచ్చం పెట్టనిచ్చేవాడు కాదు. అతను పాలు తీసుకువచ్చేవాడు. అతను చూస్తూండగా సరస్వతమ్మ ఎవరికయినా కాసిని పాలు పోసిందంటే ఆరాత్రి దూడలను కుడిపేవాడు. పాలేవి చన్నయ్యా అంటే నేను పితుక్కువచ్చిన పాలు మీరు వారికి వీరికి పోసేకంటే దూడలు తాగితేనే మెరుగు అనేవాడు. అందుచేత అతనుచూస్తూండగా ఎవరకు పోసేవారు కాదు. ఇంతేకాదు ఎవరు వెంకటసుబ్బయ్యగారింటికి వచ్చినా ఆరాత్రి అతనుపస్తే. ఇటువంటివాళ్ళు కొంతమంది ఈ లోకంలో ఉంటారు. మా ఇంటికి వస్తావు మాకేమి తెస్తావు. మీ ఇంటికి వస్తాం నీవేమి పెడ్తావు అనేవారు కొందరు. మరి కొందరు తాము తినేకంటె ఇతరులకు పెట్టి సంతోషిస్తారు. ఈ ధోరణిలోనిదే యశోదమ్మగారు. ఆమె చెల్లెలే మన సరస్వతమ్మ. అన్నిటా అక్క పోలికే.

ఆయన నాగలి దున్నే మద్దాలి తాతయ్య అనే హరిజనుడు మంచి పాలేరు. వెంకట సుబ్బయ్య రాజకీయాలలో ప్రవేశించిన తరువాత ఆ పాలేరే పనులు చేయించడం. నూర్పించడం, అతనే సర్వాధికారి. అతనిమీద ఈయన వచ్చినప్పుడు అనేక ఫిర్యాదులు చేసేవారు. అవన్నీ విని ఈయనిలా అనేవాడు : " మా పాలేరు అప్పులు తీర్చాడా ? అప్పులు పెట్టాడా ? పెంకుటిల్లు కట్టాడా ? ఏమి బాగుపడ్డాడు " అని ఎదురు ప్రశ్నలు వేసేవాడు.

ఈ మాదిరిగానే పట్టాభి సీతారామయ్యగారు నాగేశ్వరరావు పంతులుగారితో " మీ క్యాషియరు లక్ష్మయ్య డాబా కట్టిన సంగతి తమకు తెలుసా " అన్నాడు. అందుకు పంతులుగారు " నాకు తెలుసు నాకిచ్చినట్టే ఆయనకు భగవంతుడిచ్చాడు " అనేవాడు.

తాను చూచుకోనప్పుడు ఎవరినో ఎవరిని నమ్మాలి. అలా నమ్మకపోతే జరగదు. అలా నమ్మిన వారిలో పంతులుగారు, వెంకటసుబ్బయ్య ఒకే శ్రేణికి వస్తారు.

వెంకట సుబ్బయ్య మంచి విశ్వాసి. ఆయన ఈ పాలేరునే కాదు. ఆయన దృష్టిలో అందరును విశ్వసించడమే. ఆ పాలేరు 20 ఏళ్ళకు పైగా ఈయన పని పాటలలో ఉన్నాడు. వెంకటసుబ్బయ్య గారి భార్య సరస్వతమ్మగారు అతను వచ్చి ఇంత కూలి అయిందంటె ఇచ్చేది. ఆమె మామ అప్పయ్యగారికి కూడ అతనియందు మంచి విశ్వాసము. హరిజన వాడలో మాటమీద మాటవచ్చి ఆ పాలేరును కొట్టగా అతనిని వెనకేసుకొని ఛార్జి యివ్వక, అతనిని తమ ఇంట్లో ఉంచుకొని పోషించి త్వరగానయంచేశాడు. అది ఆ పాలేరుకు వారికి ఉన్న సంబంధము అతనిని బిడ్డలాగా చూచారు. అతనూ అలాగే విశ్వాసముతో ప్రవర్తించాడు.

ఆయన పశువులను బాగా పోషించేవాడు, తానులేనప్పుడు కూడ బాగా దానా అది వేయమని చెప్పేవాడు. గొడ్డు, బిడ్డ అన్నారు. ఆయన జీవితమంతా నీతి, నిజాయితీ, విశ్వాసమూ ముప్పిరిగొన్నవి. ఆయన పశువుల చావిడి నానుకొని ' బోడిలింగం గుంట ' అనే పోరంబోక ఉన్నది ఆయన ఆ సాముదాయక భూమి ఒక్క అంగుళం కూడ ఆక్రమించలేదు. ఆయన చావిడికి ఇటు, అటువారు ఆక్రమించారు. మనదేశంలో ధర్మపన్నాలు చెప్పేవారు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. ఆచరించేవారు మాత్రము అరుదు. అందుచేతనే అన్నారు " There is a long road between doing and saying " గాంధీ టోపీ పెట్టుకొని రెండు చేతులా సంపాదిస్తూ ఇతరులకు టోపీ పెట్టేవారిని ఎంతమందిని చూడడంలేదు. గాంధీటోపీ పెట్టడంకూడ కొంతమందికి ఈ కారణాలవల్ల కష్టంగానేఉంది.

" 'ఎంచిన ఎరువేది' అంటే యజమాని పాదం " అన్న సంగతి ఆయన ఎరుగనిది కాదు. అయినప్పటకి తాను వ్యవసాయకుడుగా బాగుపడేకంటె వ్యవసాయకులను బాగుపర్చాలని ఆయన తహతహ.

ఆయన కుమారుడు కుటుంబరావు వ్యవసాయంలో ప్రవేశించుటకు ముందు ఆయన పినతండ్రి కుమారుడు వెంకటరత్నం కూడ కొంతకాలం అజమాయిషీ చేస్తూండేవాడు. ఆయన మీద చాడీలే. ఆయన పెడచెవిని పెట్టేవాడు.

ఆయన పాలేరంటాడు. " మా దొర దేశాలమ్మట తిరిగి 10 ఎకరాల భూమిని పాడుచేసుకున్నాడండి"

## కాంగ్రెసులో

గాంధీగారు ప్రవేశింపక పూర్వం కాంగ్రెసు కేవలం విద్యావంతుల క్రిస్టమస్ వేడుకగా వుండేది. గాంధీ మహాత్ముడు ప్రవేశించిన తరువాత దాని స్వరూప స్వభావములే మారిపోయినాయి. కాంగ్రెసు ఉద్యమం పల్లెపల్లెకు వ్యాపించింది. ఘంటసాలకూడ కాంగ్రెసు కదనరంగమునకు క్షేత్రమైంది. గొట్టిపాటి బ్రహ్మయ్య, వేమూరి సీతారామయ్య, యీ రచయిత ఆనాటి కృష్ణాజిల్లా సంఘ సభ్యులు, ఘంటసాలలోను, చుట్టుపట్ల గ్రామములలోను కాంగ్రెసు కార్యకర్తల కార్యక్రమము కాంగ్రెసు ముస్లింలీగు ప్రణాళికపై సంతకం చేయించటం ద్వారా ప్రారంభమైంది. దీనిలో వీరు ప్రముఖపాత్ర వహించారు. 1920 ఓట్లనిరాకరణోద్యమము ప్రాంభమైంది. అప్పుడు ఈ గ్రామములోని గ్రామాధికారులు కూడ ఓటు చేయకుండ ఖాళీ పెట్టెలను పంపారు.

మన వెంకట సుబ్బయ్య తన 20 వ యేట అనగా 1923 లో కాంగ్రెసులో ప్రవేశించాడు. మద్రాసులో 1927 లో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరైనాడు.

గాంధీ మహాత్ముడు ఖద్దరు నిధికై ఆంధ్రదేశములో 1929 ఏప్రియల్ లో సంచారముసాగించాడు. ఘంటసాలకు 1929 ఏప్రియల్ 20 తేదీన 11 గంటలకు చేరాడు మహాత్ముడు. ఆ కారులో కొండా వెంకటప్పయ్య, అప్పటి తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బ్రహ్మయ్య, పట్టాభిసీతారామయ్య మొదలగు వారు వున్నారు. ఘంటసాల గ్రామునకు ఆనుకొనియున్న విశాలమైన ధర్మ గోటకములో సభ జరిగింది. ఘంటసాల, చిలకలపూడి, రుద్రవరం, దేవరకోట, దాలిపర్రు, లంకపల్లి, కోసూరు గ్రామాదుల నుండి తిరునాళ్ళకు వచ్చినట్లు బండ్లు కట్టుకొని కొందరు, నడచి మరికొందరు మహాత్ముని దర్శన భాగ్యము పొందాలని వేలాది జనులు వచ్చారు.

అదివరకే బాగా ఆలోచించి అక్కడచేరిన జన సందోహమును నిలబడకుండ నిశ్శబ్దముగా కూర్చునేటట్లుగా, వారిని అదుపులో వుంచుటకుగాను, ఖద్దరు దుస్తులతో, గాంధీ టోపీలతో చేతిలో కాంగ్రెసు జెండాలతో ఆరితేరిన శతాధిక స్వచ్ఛంద సేవకులు అంతటా తామైక్రమశిక్షణతో నేత్రపర్వముగా నిలబడి యుండిరి.

కారు రావటానికీ పోవటానికీ, వాసాలుపాతి, వీధులు తీర్చినట్లు కట్టి, ప్రజలు కదలకుండ మెదలకుండ వాలెంటీర్లు కాపలా కాస్తున్నారు.

సభ ముందు భాగమున దాదాపు వందమంది స్త్రీలు రాట్నములను వడకుచుండిరి. ఈ దృశ్యమంతా గాంచి మహాత్ముడు ముగ్ధుడైనాడు.

ప్రప్రథమములో రెపరెపలాడే కాంగ్రెసు జెండాలను చేబూని క్రమశిక్షణతో నిలిచి నిరీక్షించుచున్న వాలంటీర్లను చూడగానే ఆనందం పట్టలేక బ్రహ్మయ్యగారితో "Is this your national army " “ ఇది మీ జాతీయ సేనా ” అన్నారు గాంధీజీ.

అనంతరము రాట్నచక్రములు కమ్మని ధ్వనితో కన్నుల పండుగగా వుండుట చూచి ఆనందించారు.

మహాత్ముడు కారును జన సమూహము మధ్యకు పోనీయమన్నారు. వారు ఖద్దరు ఆవశ్యకతను గూర్చి హిందీలో ముచ్చటించగా దానిని పట్టాభిగారు తెలుగులో చెప్పారు.

మహాత్ముని ఖద్దరు నిధికి కానుకగా ఘంటసాలలో ఇంటింట అరకల వెంట, బాడిదల వెంట వసూలుచేసి అయిదువందల ఒక్క రూపాయి అర్పించారు ఆయనకు. అక్కడకు వచ్చిన గ్రామాలవారు కూడ యధాశక్తిని సమర్పించారు కొందరు.

మహాత్ముడు ఆభరణములను యివ్వవలసినదని కోరగా పిల్లికి బిచ్చము పెట్టని వారుకూడ ఆభరణములను అర్పించటం ఆశ్చర్యము వేసింది అందరకు.

కొందరు స్త్రీలు బంగారు గాజులిస్తే, కొందరు ముసలమ్మలు “ గోట్ల ” నిచ్చారు. మరి కొందరు చేతి ఉంగరాలను యిచ్చి తాము ధన్యతగాంచినట్లుగా భావించారు. మన కిసాన్ వెంకటసుబ్బయ్య భార్య సరస్వతమ్మ తన వంటి ఆభరణములను యిచ్చింది.

బ్రహ్మయ్యగారు గాంధీగారితో వుండగా యీ కార్యక్రమమంతా ఇంత జయప్రదముగా నడిపింది మన కిసాన్ వెంకటసుబ్బయ్యగారే. వాలంటీర్లకు కెప్టెన్‌గా వుండి గాంధీజీ ప్రశంసలనందుకున్నారు.

## కృష్ణాజిల్లా సహకార సభ

1930 ఫిబ్రవరి ఒకటవ తేదీన ఘంటసాలలో కృష్ణాజిల్లా సహకారసభ జరిగింది. ఈ సభకు ఆహ్వానసంఘాధ్యక్షులు బ్రహ్మయ్యగారు. నరసింహ దేవర సత్యనారాయణగారు అధ్యక్షత వహించారు. వివిధ ప్రాంతముల నుండి అనేకమంది ప్రతినిధులు, ప్రేక్షకులు ఆరుదెంచారు.

ఆ సభకు మనవెంకటసుబ్బయ్య వాలంటీరు కెప్టెన్‌గా వుండీ సభన విజయవంతముగా జరిపించి ప్రశంసలను గాంచారు.

## నల్ల జండాల కేసు

1929 వ సంవత్సరాంతమున కాన్పూరులో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతను కాంగ్రెసు స్వాతంత్ర్య తీర్మానము ఆమోదించబడింది. 1930 జనవరి 26 వ తేదిన సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవముగా నిర్ణయింపబడుటచేత దేశమంతటా ఆ రోజున సభలుచేసి సంపూర్ణ స్వరాజ్యతీర్మానము చదువబడినది. ప్రజల వుత్సాహ పరంపరలు దేశమంతటా యీ వుత్సవంద్వారా వ్యక్తమైంది.

దీనితో బ్రిటీషు ప్రభుత్వ బడాయి బట్టబయలు అయింది. లోకవంచనకొరకు గవర్నరు “ స్టాన్‌లే ” వందిమాగధుల స్వాగతపత్రాలు పుచ్చుకొని దేశము తనవైపునేవున్నదని ప్రకటించుటకు సంచారము బయలుదేరెను. ఈ సంచార సందర్భములో నల్లజెండాలు ప్రదర్శించి తమ వ్యతిరేకతను తెలుపవలసినదిగా కాంగ్రెసు ప్రముఖులగు మోతేనారాయణరావు, ఆత్మకూరి గోవిందాచార్యులు మొదలగు ప్రముఖులు పత్రికలలో ప్రకటించారు.

లోగడ జిల్లా కాంగ్రెసు అధ్యక్షులగు బ్రహ్మయ్యగారిని 1930 ఫిబ్రవరి ఒకటవ తేదీన జిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా మరల ఎన్నుకొన్నారు. ఆ సభలోనే ఫిబ్రవరి ఎనిమిదవ తేదీన బందరు వచ్చు గవర్నరుగారికి నల్లజండాలను ప్రదర్శించ వలసినదిగా తీర్మానము చేసారు.

అనుకొన్నట్లుగానే ఆ రోజున జిల్లా కాంగ్రెసు ఆధ్వర్యము క్రింద పెద్ద పూరేగింపుబయలుదేరింది. ముఖ్యులుగావున్న 11 మందిని అరెస్టు చేశారు. మరి 20 మందిని డిటెన్షన్‌చేసి తరువాత విడిచి పెట్టారు.

ఇందులో ఘంటసాల గ్రామస్తులే అధికము. ప్రథమముద్దాయి గొట్టిపాటి బ్రహ్మయ్యగారు.

డిటెయిన్ చేయబడిన వారిలో మన వెంకటసుబ్బయ్య, యీ వెంకట్రామయ్య, తుమ్మల వెంకట్రామయ్య, వేమూరి వెంకట్రామయ్య, అరవపల్లి వెంకటాద్రి ఉన్నారు.

## జాతీయ పతాకము

జాతీయ పతాక జాతీయతకు చిహ్నము. అది జాతీయ గౌరవ ప్రతిష్టలకు ప్రబల కారణం.

ఘంటసాల శ్రీ జలధీశ్వరాలయం ముందు ప్రప్రథమంగా జాతీయ పతాకం 1930 సంవత్సరమున ప్రతిష్ఠింపబడినది. పెద్ద ఎత్తయిన సరుకు బాదుకు ఈ పతాకకట్టబడుట వలన రెపరెపలాడుచు కన్నుల పండువుగా నుండేది. ఆనాడు జాతీయ పతాకు ప్రతిష్ఠంచుట యనగా బ్రిటీష్ గవర్నమెంటుపై తిరగుబాటన్నమాట. ఈ పతాకమును గూర్చి అనేక పోరాటములు జరిగినవి. అందులో నాగపూరు జండా సత్యాగ్రహము ప్రసిద్ధమైనది.

పోలీసులు ఈ గ్రామ మధ్యగల జెండాను తీసివేయుటకు చాలకాలం పట్టింది. తుదకు 1932-1-16 న ఒక యూరపియన్ సార్జంటు రిజర్వుదళమును వెంటదీసుకొని చల్లపల్లిస్టేషను ఇన్స్పెక్టరు నీలి వెకటేశ్వర్రావుతో వచ్చి నాల్గుబజార్లలోను రిజర్వుబలగమును నిలిపి ఒక పోలీసు గొడ్డలితో పతాక స్తంభాన్ని నరకబోయేసరికి మళయాళ స్వామి శిష్యుడు, తాడేపల్లి ఆశ్రమవాసి, కాంగ్రెసు అభిమాని శ్రీసాయం వరదదాసు దానిని కాపాడుటకు స్తంభమును కావలించుకొనిరి. అంతట పోలీసులాయనపై తీవ్రమైన లాఠీఛార్జీ గావించి తరువాత స్తంభమును నరికిరి.

దీనిని సహించక 1932 - 1-26 వ జండాను వూరేగింపుజేసి గ్రామ పెంటరులోని గంటలమ్మచింతకు శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, శ్రీ త్రిపురనేని రాధాకృష్ణయ్యగార్లు తిరిగి జండా ప్రతిష్ఠగావించు సందర్భముననను పోలీసులు వీరిరువురను తీవ్రముగా కొట్టిరి.

## ఉప్పు సత్యాగ్రహములో

గాంధీ మహాత్ముడు బ్రిటిషు ప్రభుత్వమువారి ఆక్రమ చర్యల నరికట్టి స్వాతంత్ర్యము సంపాదించటానికి అనేక శాంతి సమరాలు సాగించాడు. అందులో ఉప్పుసత్యాగ్రహమునకగ్రస్థానము. గాంధీ ఏప్రియల్ 5 వ తారీఖున (1930) దండి గ్రామముచేరి ఏప్రియల్ 6 వ తేదీని ఉప్పుసత్యాగ్రహమారంభించాడు.

తరువాత ఇతరులు చేయవచ్చని ఒక ప్రకటన గావించాడు. త్రివర్ణపతాకనుగొని శాంతి సైనికులొక జట్టుగా బయలుదేరి హిందూ దేశములోని అన్ని రాష్ట్రములలోని గ్రామాదులకు శాంతి సమర సందేశముల గొనిపోతూ సముద్రప్రాంతములకేగి ఉప్పు తయారొనర్చి శాసనోల్లంఘనము గావించిరి.

తూర్పు కృష్ణాజిల్లాలో ముఖ్యమైన గ్రామము లన్నిటా కాంగ్రెసు సభ్యుల నధికముగా చేర్చిరి. అట్లే ఈ గ్రామంలోకూడా చేర్పించుట జరిగినది. ఘంటసాల వాలంటీర్లు చుట్టుపట్ల గ్రామాదులయందు కాంగ్రెసు ప్రచారము చేసి బందరు శిబిరము కరిగిరి.

ఆ శిబిరము అఖిల భారత చరఖా సంఘ ఆంధ్రాశాఖావరణములో ఏర్పాటు గావించిరి. పురాణం సూరిశాస్త్రిగారు వాలంటీరుగా చేరుటయేగాక శిబిరము ప్రక్కనున్న తమ దివ్య భవనమును వాలంటీర్ల భోజన, విశ్రాంతిమందిరముగా నొసంగిరి. ఒకవారం దినములు సత్యాగ్రహులకు నేత పరిశ్రమ, కారాగృహ ధరమ్మలు బోధింపబడినవి.

తరువాత ఘంటశాల వాలంటీర్లగు కిసాను వెంకటసుబ్బయ్య, దోనేపూడి సీతారామయ్య, యీ రచయిత, వేమూరి వెంకటరత్నం, ఈ వెంకట్రామయ్య, బోయపాటి వెంకటకృష్ణయ్య, ఘంటసాల జలరాం మున్నగువారు గోనుగుంట్ల వెంకట సుబ్రహ్మణ్యం గుప్త గారి నాయకత్వాన దివిసీమ అంతా ప్రచారముజేసి, చల్లపల్లి ఎస్టేటు గ్రామమైన కోసూరు గ్రామంలో తాటిగెలలను నరికి పూరేగుచుండగా 1930 మేలో చల్లపల్లి పోలీసు సబ్ ఇన్స్పెక్టరు అరెస్టు జేసి కేసు పెట్టగా వీరందరకు ఒక్కొక్కరికి 9 మాసములు కఠిన శిక్షవిధించిరి. వీరి నందరిని ప్రథమంలో రాజమండ్రి సెంట్రల్ జైలుకు పుంపుట జరిగింది. అచ్చటినుండి మన వెంకట సుబ్బయ్యగారిని బళ్ళారి సెంట్రల్ జైలుకు పంపిరి. అచ్చటకూడి ఆయన తన సేవా ధర్మములను నెరవేర్చెను. అచ్చటి రాజకీయ ఖైదీల ఇండ్లకు ఉత్తరములు వ్రాయడం, వారికి వచ్చే ఉత్తరాలు అందుకొని అందరికీ బట్వాడా చేయడం ఆయన పనిగా ఉండేది. జబ్బుపడ్డ వారిని ఆసుపత్రిలో చేర్చి, వారికి మందూ, మాకు సరిగా ఇప్పిస్తూ వారికి సహాయపడేవాడు, తల్లాప్రగడ ప్రకాశరాయుడుగారితో కలిసి, రేషను అది సరిగా తీసుకొని రాజకీయ ఖైదీల ఆహార సౌకర్యాలు చూచేవాడు.

5-8-43 సం.న మళ్ళీ వెంకట సుబ్బయ్యగారిని అరెస్టుచేసి 16 వ తేదీనే విడుదల గావించిరి.

1944 వ్యక్తి సత్యాగ్రహ సందర్భములో అండర్‌గ్రౌండులో వుండి విజయవాడలోని ఆంధ్రరత్న భవనముపై దాడిచేయించారు. బందరులో రాజకీయ సభన జరిపించాడు. సైక్లోస్టయిల్ మిషనుపై ఒక పత్రికను స్థాపించి చాలాకాలం రహస్యంగా ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ ఉండేవారు.

ఈ పత్రికను, అనుమానించటానికి అవకాశంలేని బంటు పల్లి కోటయ్య అనే హరిజనుని ద్వారా ఈ తాలూకాలో ఆయన సంకేతంద్వారా అందచేస్తూ, మళ్ళా భోగట్టు తెప్పించుకుంటూ వుండేవాడు.

## సరస్వతమ్మగారి అరెస్టు

వందేమాతరోద్యమంలోనూ, అసహాయోద్యమంలోను పురుషులేపాల్గొన్నారు. ఈ సారి సత్యాగ్రహోద్యమ విశేషమేమన అసంఖ్యాహంగా, బాలురు, స్త్రీలు పికెంటింగు జేసి ఉద్యమ విజమయున భాగస్వాములైరి. గడపదాటి వెళ్ళని స్త్రీలు, ధైర్యసాహసములతో ముందుకువచ్చి ఈ ఉద్యమంలో ప్రవేశించుట ప్రశంసార్హము

వల్లభనేని సీతామహలక్ష్మమ్మగారితో, గొర్రెపాటి సరస్వతమ్మ, కుటుంబమ్మ, లక్ష్మీకాంతమ్మ, దోనేపూడి బాలమ్మగార్లు దివితాలూకాలో అనేక గ్రామాల్లో కాంగ్రెసు ప్రచార మొనర్చిరి. అనంతరం ఈ గ్రామంలోని కల్లు దుకాణంవద్ద పికెటింగు ప్రారంభించారు. కరపత్రాలుపంచిరి. పోలీసువారు వీరినరెస్టు గావించను పేక్షాభావము వహించిరి. చివరకు 1933- 3-29 న వీరినల్గురను అరెస్టు గావించి, లక్ష్మయ్యగారి కుమార్తెయను నభిమానమును ఆనాటి డిప్యూటీ కలెక్టరుగారు బాలమ్మగారిని మాత్రం విడిచిపెట్టి మిగతా ముప్పురకు 3 మాసములు కారాగావాస శిక్షవిధించి నూజవీడు సబ్‌జైలుకు బంపిరి.

## పి.సి.సి సభ్యత్వము

ఆచార్యరంగా ఆంగ్ల దేశాని కరిగిన సమయంలో ఆయన అభిమానులు, ఆయనను ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షునిగా గావించుటకు కృషియొనర్చిరి. బెజవాడలో 1946 మే 16 వ తారీఖున ఎన్నికలు జరిగినవి. రంగాగారి ప్రత్యర్థి పళ్లందాజు. రాజు గారికి 68 ఓట్లున్నా రంగాగారికి 105 ఓట్లున్నా వచ్చుటవలన రంగాగారు అధ్యక్షులైరి.

1939 లో ఆచార్యరంగా సంజీవరెడ్డిగార్లకు చీరాలలో పోటీ జరిగినది. దీనిలోను రంగాగారే విజయము గాంచారు.

1951 సంవత్సరములో రంగాగారు, సంజీవరెడ్డిగారు పోటీ చేయదలచారు. ఈ ఎన్నికలలో సంజీవరెడ్డి తరపున కళా వెంకట్రావుగారు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆంధ్రదేశమంతా తిరిగి కృషి యొనర్చిరి.

చల్లపల్లి ఫిర్కాకు, సంజీవ రెడ్డి తరపున గొట్టిపాటి బ్రహ్మయ్య గారున్నూ, ఆచార్యరంగాగారి తరపున వెంకట సుబ్బయ్యగారికి మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. బ్రహ్మయ్యగారి తరపున రమణయ్య నాయుడు, వడ్లమూడి కుటుంబరావుగార్లు అండగా నిల్చిరి.

వెంకట సుబ్బయ్య గారి తరపున చల్లపల్లి రాజా, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, మొవ్వ పంచాయతీ ప్రెసిడెంటు కనకంగార్లు కృషి గావించిరి. 8 ఓట్ల మెజారిటీతో బ్రహ్మయ్యగారు గెల్చారు.

## భీమ నదీ ఛానల్ పై డ్రావ్

కృష్ణా ఆనకట్ట 1855 సంవత్సరంలో నిర్మాణంజరిగినా ఘంటశాల రైతులకు సంబంధించిన బోళ్ళపాడు, చిట్టూరు మొదలగు గ్రామాలు వీరంకిలాకు వద్ద పుట్టిన భీమనదీ ఛానల్ క్రింద 1897 సం॥లో సాగునకు వచ్చినవి.

అప్పటికంటె సాగు ఇటీవల రెట్టింపు అయింది. నాటి కాలువలు ఈ నాటికాలువల మాదిరిగా ప్రక్కలు త్రవ్వి కట్టలు నిర్మిచకుండా మయపు భాగం త్రవ్విపోశారు కట్టలు. ఆయకట్లు పెరిగినా కాలుమళ్ళా రీమోడలు చెయ్యలేదు. కోసూరుసమీపాన పెదముత్తేవి రైతులు ఒక డ్రావ్ నూతనంగా కట్టిస్తున్నందున ఘంటశాల రైతులైనవారికి ఇబ్బందికల్గింది.

ఇదిగాక దాలిపర్రు, లంకపల్లి రైతులు దిగువనున్నందున కాలువ లోతుచేసి, దిగత్రవ్వకు పోవటం మూలంగా (అనగా కాలువత్రవ్వు కంట్రాక్టు రైతులు స్వయంగా తీసుకొని ఇంకా కొంత గ్రామ ఉమ్మడిసొమ్ము జతచేర్చి ) బోళ్ళపాడు, చిట్టూరు జిరాయితీ దార్లయిన ఘంటశాల రైతులకు ఇబ్బంది కలుగసాగెను. ఆవిధంగా పైసాగు చేస్తున్న రైతులవల్లనూ, దిగువ రైతులవల్లనూ వచ్చిన ఇబ్బంది మాపుటకు P.W.D వారితో కరస్పాండెన్సుచేసి రమణమ్మ చెరువు వద్ద దిగువను గ్రామస్తుల సాయంతో 1947 సం॥లో ఒక డ్రావు కట్టించి వెంకట సుబ్బయ్యగారు రైతులకు తోడ్పాటు గావించిరి.

## దివి తాలూకా రైతు సంఘము

1930 సం॥లో గుంటూరులో ఆంధ్ర మహాసభ, ఆంధ్ర రాజకీయ సభలతో పాటు రైతుసభకూడా జరిగింది. శ్రీ రంగాగారి ఆధ్వర్యమున రైతు కాంగ్రెస్ సంఘాలను గ్రామ తాలూకా జిల్లాలలో ఏర్పాటు గావింపనిర్ణయము జరిగింది.

దానిని పురస్కరించుకొని 1930 సం॥ దివి తాలూకా రైతు కాంగ్రెసు సంఘం ఏర్పడింది. దానికి ప్రధమ అధ్యక్షులు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు.

1931 - 32 సం॥లో రీసెటిల్మెంటు ఆందోళన రంగాగారి నాయకత్వమున, దండు నారాయణరాజు, మొసలికంటి తిరుమలరావు, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, బ్రహ్మయ్యగార్లు పాల్గొని ఉద్యమవ్యాప్తికి తోడ్పడిరి.

1932 సం॥ జనవరి 15వ తారీఖున దివితాలూకా రైతుసంఘానికి అధ్యక్షులుగా శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు ఎన్నుకోబడిరి. 'తదాది' ఆయన గ్రామ గ్రామాన తిరిగి రైతు సంఘాలను ఏర్పాటు గావించి రైతలలో చైతన్యము కల్గించిరి.

1937 సం॥లో చిన్నకారుపెట్టి చినకళ్ళేపల్లిలో జరిగిన రైతు సభకు శ్రీవెంకట సుబ్బయ్యగారు ప్రత్యేకకృషియొనర్చిరి. ఈ సంవత్సరము నందే చరిత్రాత్మకమయిన ఒక రైతు యాత్ర జరిగింది. ఇది 1937 సం॥ జూలై 3వ తేదీన ఉత్తర విశాఖజిల్లా ఇచ్ఛాపురములో, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి ఆధ్వర్యమున ఆరంభమైంది. ఈ యాత్ర రంగాగారే ఆరంభించారు. యీ యాత్రాదళంవారు ఉభయవిశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా , గుంటూరు, నెల్లూరు జిల్లాలలోనూ, చెంగల్పట్టు జిల్లాలో రెండు తాలూకాలలోను మొత్తం 1512 మైళ్ళు కాలినడకనూ 542 మైళ్ళుబస్సులలోనూ ప్రయాణంచేసి 27-3-38 వ తేదీని మద్రాసుచేరుకున్నారు. ఈ సందర్భంలో వీరు 520 గ్రామాలు దర్శించారు. 25 వేలమంది ప్రజలసంతకములుగల 800 అర్జీలు వీటితో బాటు స్థానిక ఇబ్బందులను గూర్చి రైతులు ఇచ్చుకున్న మరి 300 అర్జీలు తెచ్చారు. 506 గ్రామాల్లో సభలు గావించారు.

ఈ యాత్రాదళం వస్తున్నసంగతి గ్రహించి వెంకటసుబ్బయ్య గారి నాయకత్వమున, చల్లపల్లి ఫిర్కా, దివి సీమ గ్రామాలంతటా సంచారము చేసి స్థానిక అవుసరాలతో అర్జీలు తీసుకుని కాజఫిర్కాకు సంబంధించిన అర్జీలు సూరపనేని వీరయ్యగారి ద్వారా తీసుకొని ఈ దళము వారికిచ్చారు. ఈ యాత్రాదళంవారు, మద్రాసు ప్రధాని రాజాజికి రైతుల కనీస కోర్కెల ప్రణాళికను సమర్పించారు. యీ యాత్రలవల్ల రైతులలో సంఘీభావము, కార్యాచరణ శక్తివృద్ధియై ఎంతయో ప్రభోదం కల్గింది.

1938 సం॥లో సోషలిస్టులు ప్రతి గ్రామాన ప్రత్యేక సంఘాలను ఏర్పాటుచేసి, ఎన్నికలకు నిలబడ్డారు దానిలో కాకర్ల చంద్రశేఖరరావు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు. (దివి తాలూకా రైతు సంఘానికి) 1937 సం॥ వెంకటసుబ్బయ్యగారు ఖర్చుపెట్టిన రు. 300 ఖర్చు పద్దుకూడా ఆమోదింపబడినది. కాని చంద్రంగారు ఈ సంఘాన్ని మీ చేతుల్లో పెట్టుకోవటానికి ఇలా రాశాడు గాని దీన్ని మేము ఆమోదించమన్నాడు. ఆమోదించకపోతే నేనే పెట్టుకుంటానన్నాడు వెంకట సుబ్బయ్యగారు.

ఈ మినిటుబుక్కును సభాప్రారంభంకాక పూర్వమే సూచిన పరుచూరి రాఘవయ్యగారు ఏమిటండీ చంద్రంగారూ మీరలా డబాయిస్తారు. ఆ లెఖ్ఖలు ఆ సంవత్సరమే ఆమోదింపబడినట్లు మీ సంతకమున్నది చూడండి అన్నాడు. అంతట ఆయనచూసి, సరేనన్నాడు తరువాత చంద్రంవర్గంవారు, ఆ సొమ్మును వెంకటసుబ్బయ్య గారికి యిచ్చిరి.

## జమీందారీ ఉద్యమాలలో

ఘంటశాలలో విప్లవతత్వము కాంగ్రెసు ఉద్యమం ప్రజల్లో వ్యాపించని రోజుల్లో సహాయనిరాకరణోద్యమానికి పూర్వమేవుండేది. జమిందారులు, రైతులకు మధ్యగల లావాదేవీలలో జమీందారులు వలన రైతులు అనేకబాధలకు గురియౌతూవుండేవారు. భూముల్లో ఇళ్ళుకట్టరాదని, తాళ్ళశిస్తులని, ఇంకా అనేక మామూళ్ళు అని అనేక రూపాలుగా ఉంటూ వుండేవి ఆ బాధలు, రాజకీయోద్యమాలు అవతరించని రోజుల్లో పత్రికలు లేని రోజుల్లో స్థానికంగా అనేకమంది మహాపురుషులు సామాన్య రైతాంగము తరపున తామే ఉద్యమ స్వరూపులుగా నిలిచి, ప్రజానాయకత్వమువహించి, ప్రజల ఇబ్బందులను బాపలుటకు అనేక కష్టనష్టములను అచంచల ధైర్యంతో ఎదుర్కొన్నారు. అట్టి కోవకు చెందినవారిలో చల్లపల్లి ఎస్టేటు రైతు నాయకుడు గొర్రెపాటి బాలకృష్ణమ్మ గారున్నూ (1844 - 1906) నూజివీడు ఎస్టేటు ప్రజల తరపున కడియాల చంద్రయ్యగారున్నూ ముఖ్యులు. బాలకృష్ణయ్య ఈ ఘంటసాల గ్రామ నివాసి.

ఐశ్వర్యవంతులైన జమీందారు చూపే ప్రలోభాలకు సామాన్యులైన రైతు నాయకులు అప్పుడప్పుడు జమీందారులకు లోబడి రైతులవైపు నుండి తిరిగిపోయి జమీందాలరు పక్షంవహించినట్టయితే ఆ స్థానాన్ని మరియొక రైతుపెద్ద ఆక్రమించి జమీందారులు రైతులకుచేయు అన్యాయాలను ఎదుర్కొంటూ వుండేవారు. చల్లపల్లి ఎస్టేటు చరిత్రలోనే ఇటువంటి ఘటలను ఎన్నింటినో చూపవచ్చును. ఆచార్యరంగా ఆదిలో జమీందారీ రైతు ఉద్యమాన్ని ఆరంభించి జమీందారీ విధానం నశించాలని నినాదమిచ్చినప్పుడు అపహసించింది లోకం. ఆయన అనేక కష్టనష్టాలకుపాల్పడి, తీవ్రమైన ఆందోళన సృష్టించాడు. ఆరువాత ఆ ఉద్యమానికి కాంగ్రెసు చేయూత నిచ్చింది.

1937 సం॥ ఎన్నికలలో భారత దేశమంతా, అభివృద్ధి నిరోధకులగు ఈ జమీందారలు కాంగ్రెసుతో పోటీకి తలపడిరి. జమీందార్లు రైతాంగమునను పెట్టిన తీవ్ర బాధలన్నింటినీ ఎదుర్కొని రైతాంగము కాంగ్రెసుకే ఓటు చేసింది. దాని ఫలితమే జమీందారీ రద్దు చట్టము.

ఆంధ్రదేశంలో ఈ జమీందారీ ఉద్యమంమునగాల, వెంకట గిరి ఎస్టేటు రైతుల బాధలతో శ్రీరంగాగారి నాయకత్వమున, నెల్లూరి వెంకట్రామానాయుడు, శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ గార్ల అండదండలతో ఆరంభమై, ఆంధ్ర దేశమంతటా అభివృద్ధిగాంచి, భారతదేశమంతటా వ్యాపించి, అనేక చరిత్ర ప్రసిద్ధమైన రైతు పోరాటములను సాగించి రైతువీరుల త్యాగాగ్నిచే దీప్తివహించి జమీందారీ రద్దుకు చరమ గీతము పాడింది.

ఈ ఉద్యమారంభకులలో గొట్టిపాటి బ్రహ్మయ్య, వేమవరపు రామదాసు, విశ్వనాధ దాసు, కటికినేని సోదరులు ఇంకనూ అనేక త్యాగుల త్యాగము హవిస్సుగా గొని రూపురేఖలు సంతరించుకొన్నది.

ఇక మన వెంకట సుబ్బయ్యగారు విజయవాడలో కృష్ణాజిల్లా జమీన్ రైతు సభ జరిపించారు. జిల్లా తాలూకాకాలో జమీన్‌రైతు పోరాటాలలో 1934 సం. నుంచి సాయపడ్డారు. 27-3-1934 లో సూళ్ళూరుపేట జమీందారీ రైతు మహాసభకు అధ్యక్షత వహించారు.

చల్లపల్లి ఎస్టేటులో, యాదర, ఓడపాలెం, పెదకళ్ళేపల్లి, లంకల రైతాంగ పోరాటాలకు అండదండగా నిలిచాడు.

మంగళారపు అడవి, సాముదాయక భూమియని దానిని ఎవరూ కొనగూడదని ప్రచారం చేశాడు.

ఈస్టుబ్యాంకు కెనాల్ క్రిందపడిన రైతు భూమి తమదేననీ, కంపెన్‌సేషన్ (ప్రతిఫలం) తమకు రావలెనని జమీందారు ప్రయత్నాలను నిరోధించి రైతులకే ఇవ్వాలని పోరాడి ఆవిధంగా ఇప్పించాడు.

చల్లపల్లి ఎస్టేటులో నూతనంగా అయిన పల్లపుసాగుకు యకరానికి 1-00 అదనంగా ఇవ్వాలని చేసిన జమీందారు ప్రయత్నానికి ఆందోళనచేసి జయముగాంచాడు.

1938లో ప్రకాశంగారు రివిన్యూ మంత్రిగానుండగా ఆకమిటీ ముందు సాక్ష్య మిప్పించుటకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం ఒక కమిటీని ఏర్పాటుచేసింది. రెబ్బాప్రగడ మందేశ్వరశర్మగారు అధ్యక్షులు. దానికి కార్యదర్శి వెంకటసుబ్బయ్యగారు.

నెల్లూరి వెంకట్రామానాయుడు, బద్దేపూడి నారాయణరెడ్డి, నాగినేని వెంకయ్య, మొదలైనవారితో కలసి యీయన రాత్రిందిములూ నిర్విరామంగా కృషియొనర్చి ప్రజాసేవయే జీవితలక్ష్యముగా జన్మసాఫల్యముగా ఎంచిననాడు వెంకటసుబ్బయ్యగారు.

శ్రీయుత గొట్టిపాటి బ్రహ్మయ్యగారు తమస్వీయచరిత్రయగు " నాజీవన నౌక " లో ఇలా వ్రాశారు.

కిసాన్ వెంకటసుబ్బయ్యగారు.

బందరులో చదువుకుంటున్న కాలంనుంచి సుబ్బయ్యగారు నేను సన్నిహిత సంబంధం కలవారము. నేను నాల్గవఫారం చదువుచుండగా యీయన ఒకటవ ఫారం చదువుతుండేవాడు. విద్యార్థిదశలో మాకు నాయకుడని ఇదివరకు వ్రాసిన కే.శే. వెంకటేశ్వర్లుగారు యీయన పెదతండ్రి కుమారుడే. ఆయన అజమాయిషీలోనే యీ వెంకటసుబ్బయ్యగకూడ బ్రహ్మమందిరంలో మాతో వుండేవారు.

చదువులుమానిని తరువాత ఘంటశాలలో మేము ఒకే రాజకీయ కుటుంబంలోని వారిగా అన్ని వ్యవహారాలను పరస్పరం సంప్రదింపులతో వ్యవహరించుకొనేవారము.

చురుకు చొరవను పురస్కరించుకొని నాది మొదటి స్థానం. రెండ స్థానం పండిత వెంకటసుబ్బయ్యగారిది.

మా కంటే వయస్సులో చిన్నవాడైన యీ వెంకటసుబ్బయ్య దోనేపూడి సీతారామ్య, గొర్రెపాటి సరసింహం వరుసక్రమంలో వుండేవారు.

మా వూరిలో శ్రీ సుబ్రహ్మణ్యం స్వామివారు వుండుటచే వెంకట సుబ్బయ్యలు హెచ్చు.

గొర్రెపాటి వారు ఆ దేవునికి ధర్మకర్తలగుటచే గొర్రెపాటి వారిలో మరీ హెచ్చు. మొదటి రోజులలో ఒకరిని ఎర్ర వెంకట సుబ్బయ్య రెండవ వారిని నల్ల వెంకట సుబ్బయ్య అనేవారు. వీరు సర్వత్రా ప్రతిష్ఠపొందిన తరువాత నొకరు పండిత వెంకటసుబ్బయ్యగాను, మరొకరు కిసాన్ వెంకట సుబ్బయ్యగాను అన్వర్థ నామధేయులైనారు. గ్రామ రాజకీలయాలలోను, స్వరాజ్యసంరంభంలోను, మేమందరం సహచరులం. జిల్లానుంచి రాష్ట్రం వరకు యే కార్యక్రమాలలోను మేము పాల్గొని ప్రతిష్ఠ నార్జింకుకొన్నా, మా సమిష్ఠి కృషి ఫలితమే !

1929 లో మహాత్మాజీ ఖద్దరు ఉద్యమ సంచారములో మావూరు వచ్చినప్పుడు, కాంగ్రెసు స్వచ్ఛంద సైనికులకు ఈయన సేనాదిపతిగా వ్యవహరించారు. ప్రజాసమూహము నంతటిని క్రమశిక్షణలో యుంచుట చూచి " ఇది మన జాతీయ సేనా " అని ప్రశంసించారు.

1930 లో ఉప్పు సత్యాగ్రహానికి పూర్వం మా ఊరిలో నరసింహ దేవర సత్యనారాయణగారి అధ్యక్షత క్రింద జరిగిన కృష్ణాజిల్లా సహకార సభకు నేను ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా యుండగా యీయన వాలంటీర్ సేనాధ్యక్షుడుగా యున్నారు.

స్వరాజ్య సంరంభంలో కారాగార క్లేశముల ననుభవించిన సైనికుడీయన. ఈయన భార్య శ్రీమతి సర్వసతమ్మగారును, కల్లుదుకాణాల పికిటింగ్ వగైరా కార్యక్రమాలలో పాల్గొని శ్రీకృష్ణజన్మస్థాన మలంకరించారు. మహాత్ముని ఖద్దరు సంచారములో ఈమె తన మెడలోని బంగారు గొలుసును మహాత్ముని కిచ్చారు. ఆమె చాల ఉదార స్వభావము కల మహిళామణి.

రైతు ఉద్యమ మహా నాయకుడైన ఆచార్యరంగాగారు అఖిల భారత రైతు సంఘాధ్యక్షుడైన తరువాత ఆయన స్థానే నేరు రాష్ట్ర సంఘాధ్యక్షుడైనాను. నా తరువాత కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారు. ఆయన తరువాత యీ వెంకట సుబ్బయ్యగారు చిరకాలం ఆంధ్ర రాష్ట్ర కిసాన్ సంఘాధ్యక్షునిగా సమర్థతతో ఆ సంస్థ కార్యకలాపాలను నిర్వహించారు. ఆచార్యా రంగాగారి ప్రేమకు ప్రశంశకు పాత్రులైన కొలదిమంది ప్రథమ శ్రేణి శిష్యులతో ఈయనకు ప్రముఖ స్థానం కలదు.

రైతు సమస్యలలోను జమీందారీ ఉద్యమంలోను ఈయన ప్రథమ శ్రేణిలో యుండి పోరాడిన ధీరుడు.

ప్రకాశం పంతులుగారు రెవెన్యూ మంత్రిగా యుండగా జమీందారీ రద్దుకై ఒక రిపోర్టు వ్రాయుటకు అప్పటి స్పీకరు సాంబమూర్తిగారు ఒక కమిటీ ఏర్పాటుచేసి దాని కధ్యక్షుడుగా ప్రకాశం పంతులుగారిని నియమించారు. ఆ కమిటీ ముందు సాక్ష్యమిపించుటకు గాను, వ్యక్తుల నిర్ణయించి, వివరముల నందజేయుటకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం తరుపున మేము, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మగారి ఆధ్వర్యమున ఒక కమిటీ నియమించాము. శ్రీ శర్మగారికి సహాయకులుగా శ్రీ వెంకట సుబ్బయ్య ఆహర్నిశలు శ్రమచేసి తగినంతగా సాక్ష్య సామాగ్రిని సేకరించి, తన కర్తవ్యాన్ని ప్రశంశా పాత్రంగా నిర్వహించారు.

1950 లో కాకాని వెంకటంరత్నంగారు కృష్ణాజిల్లా బోర్డు అధ్యక్షుడైనపుడు వీరు ఉపాధ్యక్షులుగా స్థానిక సంస్థలద్వారా ప్రజాసేవ చేశారు.

ఆచార్యరంగాగారు 1952 లో కృషికార్‌లోక్ పార్టీ స్థాపించినపుడు దాని కుపాధ్యక్షుడుగాను, తరువాత ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ ప్రథమ అధ్యక్షుడుగాను, నేటికీ ఆంధ్రప్రదేశ స్వతంత్రపార్టీలో ప్రథమ శ్రేణి నాయకుడుగా వ్యవహరిస్తున్నాడు.

కర్షక ఉద్యమంలో ఆచార్యరంగాగారికి అండదండలుగా వున్న ప్రధాన సహచరులు గౌతు లచ్చన్నగారి తరువాత స్థానం వెంకటసుబ్బయ్య గారి దంటే అతిశయోక్తి కానేరదు. శ్రీ రంగాగారి కృషీకార్ లోక్‌పార్టీ ఏర్పడేవరకు జిల్లా రాష్ట్ర రాజకీయాలలో మేము కలిసి మెలసి సంప్రదించుకొనే వారం.

ఆనాటినుంచి మా దారులు వేరై, వేరు వేరు రంగాలలో వ్యవహరిస్తున్నా, పరస్పరం గౌరవ మర్యాదలకు భంగం లేకుండా ప్రేమ భావంతో ఉన్నందులకు సంతోషం.

## జిల్లా బోర్డులో

కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికలు 1936 లో వచ్చాయి. ఈ బోర్డు ఎప్పుడూ కాంగ్రెసు పరం కాలేదు. పశ్చిమ కృష్ణా, తూర్పు కృష్ణా అంటూ, కాంగ్రెసు కమిటీలు రెండు జిల్లాలుగా ఏర్పడినవి. పశ్చిమ కృష్ణాకు కాళేశ్వరరావు గారు నాయకులు. ఆయన బెజవాడకు చెయిర్మన్‌గాను, శాసన సభ్యులుగాను ఉండటమే చూచుకున్నాడుగాని, జిల్లా బోర్డు వ్యవహారములలో ఏమీ జోక్యం కలిగించుకొనే వాడు గాడు.

పట్టాభిగారు తూర్పు కృష్ణాజిల్లా నాయకులు. ఆయన నో ఛేంజరు. జిల్లాబోర్డు శాసన సభలు ఆయనకు పట్టేవిగావు. అందుచేత కృష్ణా జిల్లాబోర్డు కాంగ్రెసుబోర్డు కాజాలక పోయింది.

ఇంతేగాక జమీందార్లకు, జస్టిసుపార్టీకి ఇది పట్టుకొమ్మ. వారలకు ఇవంటే చాలా అభిమానం. కొంతకాలం మీర్జాపురం రాజా, మరి కొంతకాలం చల్లపల్లి రాజా ప్రెసిడెంట్లుగా వున్నారు. మీర్జాపూరును కాపులు బలపరిస్తే చల్లపల్లిని కమ్మవారు బలపర్చారు. అసలు విషయమిది.

కృష్ణాజిల్లా బోర్డుకు చల్లపల్లి రాజా అధ్యక్షుడుగా నుండగా 23-11-1936 సంవత్సరములో ఎన్నికలువచ్చినవి. చల్లపల్లి ఫిర్కాకు రాజాగారికి వ్యతిరేకంగా వెంకట సుబ్బయ్యగారు నిలిచారు. ఆయన వాలంటీరు సంచి వేసుకుని మద్యపాన నిషేధంలో గొప్ప కృషిజేసి అనేక లాఠీ చార్జీలు తిని జైలు కేగిని గొర్రెపాటి నరసింహంగారిని వెంట నిడుకొని ఫిర్కా అంతా తిరిగారు. తానే గెలుస్తానని వెంకట సుబ్బయ్యగారు చెపుతూ వుండేవారు. నరసింహంగారు మాత్రం తప్పకుండా రాజాగారే గెలుస్తారని చెపుతుండేవాడు. గొట్టిపాటి బ్రహ్మయ్య, యీ రచయిత, శరణు రామస్వామి చౌదరి మరికొందరు ఈ ఫిర్కాలో ప్రచార మొనర్చిరి . ఘంటసాలలో కూడా పార్టీ లేర్పడినవి. ఈ ఘంటశాలలో పార్టీలు ఏర్పడటం కొంత బలహీనత. చివరకు రాజాగారే గెల్చారు. వెంకట సుబ్బయ్యగారు ఓడినందుకు విచారించ నవుసరంలేదు. కొన్ని ఫిర్కాలలో అసలు కాంగ్రెసు అభ్యర్థులే పోటీచేయలేదు. కాంగ్రెసు అభ్యర్థులలో ముగ్గురే గెల్చారు. పెదర్ల వెంకటసుబ్బయ్య, బారిష్టర్ తుర్లపాటి వెంకటేశ్వరరావు, వేముల కూర్మయ్యగార్లు, కాపులకు వచ్చిన సీట్లు రెండే. దానిని బట్టి చల్లపల్లి రాజా బలం అంచనా వేయవచ్చు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెసు అపజయం గాంచి జస్టిసుపార్టీ విజయము గాంచింది. దీన్ని గురించి శ్రీముట్నూరి కృష్ణారావుగారు కృష్ణా ప్రతికలో ఇలా చిత్రించారు.

" జస్టిసు " విజయము

యావద్దేశమును దిగ్భ్రమ చెందించగల మహా దృశ్యమిది! విదాత సైతము కల్పించజాలని అపూర్వ సృష్టి వైచిత్ర్యమిది. యోగారూఢులై లోక విస్మృతినొందిన తాపసోత్తములను గూడ ధ్యానభంగ మొనర్చగల ప్రపంచ సంఘటన యిది ! హిట్లరు వంటి సర్వాధికారియు సాహసింపనేరని రాక్షస కృత్యమిది! రవవి యస్తమింపని అఖండ బ్రిటిషు సామ్రాజ్యమును శాసించుచున్న శ్వేత ద్వీప వాసులును విశ్వసింపనొల్లని దిగ్విజయమిది, ' ఆశ్యర్యము ', అని గగనచరులగు గంధర్వ కింపురుషులగూడ విస్మయ గీతములను బాడుచున్నారు. బొబ్బిలి మహారాజునకు మాజోహరులు ! ........... బొబ్బిలి మంత్రి పరమభక్తుడు. తమ ఇలవేల్పగు గోపాలస్వామినిదర్శించుటకై బందరు ఏతెంచినాడు. స్వామివారి శఠగోప మహిమచే వానిని బట్టిన శని వదలినది. భక్తుడు కేవలము భగవానుడై వెలసి భక్త కోటికి దర్శన మొసగినాడు. ఇరు ప్రక్కల చల్లపల్లి మీర్జాపుర సంస్థానాధీశ్వరులు, ఛత్రచామరములను బట్టి బొబ్బిలి స్వామిని ఊరేగించిరి. స్వామికృతార్థుడయ్యెను. కృష్ణామండలమును పుణ్యతీర్థమయ్యెనను, ........ హిందువులు, మహ్మదీయులు, క్రైస్తవవులు సకల జాతులు, సమస్త కులములు, జస్టిసు ఆలయమున బొబ్బిలి వారి సమ్ముఖమున, చల్లపల్లి, మీర్జాపురాధీశ్వరులు అర్చకులై కొలువు దీర్చియుండ వారి పవిత్ర హస్తము నుండి నైవేద్యములగైకొని, పునీతులైరి. మండల వాసులలో నిక తగవులులేవు, సంశయములు లేవు. కాంగ్రెసు స్పర్శ అణుమాత్రమైనను నిలవకుండ జేయబడినది. కొంతకాలం ఈ మండలము కాంగ్రెసు వారి అశోకవనమున బంధింపబడినంద మాత్రమున దాని పవిత్రతను శంకించెదరా? ఆనాడు సీతామహాదేవి అగ్నిపరీక్షకు నిలచి తన పాతివ్రత్య తేజమును బ్రకాశింప జేసికొనినట్లు, నేడు, ఈ మండలము జిల్లాబోరడ్డు యెన్నికలనెడు అగ్ని పరీక్షకు బాత్రమై, తన రాజభక్తి నిష్కళంకమైదని లోకమునకు వెల్లడిపరుచుకొనినది.

ఇంకను తార్కాణము కావలెనా ? ఒక ఘంటశాల గ్రామము యొక్క నిదర్శనము చాలును, ' జస్టిసు యొక్క అఖండ విజయ సందేశమును ద్వీప ద్వీపాంతరములలో, యుగయుగాంతరముల వరకు, స్వర్గవాణివలె బ్రతిధ్వనింపజేయుటకు, ఘంటశాల వెనుక బౌద్ధుల పవిత్ర ఆరామము. బుద్ధ విరాగు లోకనాడు, మహా నిర్వాణపదవి కొరకు తపస్సొరించిన మహాక్షేత్రమిది. అట్టి దివ్య తీర్థము జస్టిసు దేవీ శాపముచే, కాంగ్రెసు నిలయమయ్యెను. నాన్ కో ఆపరేషన్ రోజులలో ఖాళీ ఓట్ల పెట్టెను బంపిన దుష్ట గ్రామమది. పోలీసు లాఠీలకైననూ వెరువకు కాంగ్రెసు జెండాను నిలువబెట్టిన ద్రోహపు జనపదమిది. రైతు హక్కులను మిషతో, లోకైక రంజకుడగు చల్లపల్లి జమీందారునిపై కత్తికట్టి, దావాలపై దావాలలో కూటపు గెలుపులను, స్వార్థములను బెంచుకొనిన ఊరది. గాంధీ యను మాయా మహాత్ముని దుర్బోధలకు, చెవియొగ్గి కుమారులనే గాక ఎప్పుడునూ సూర్యరశ్మి నెరుగని లేతపడుచులను సైతము, నిర్దయగ జైళ్ళలోనికి గూలద్రోసిన మహాపాతకు ఘోటక ప్రాంత మది.

కాంగ్రెసు వారి దొంగ నిధులకు దోసిళ్ళ కొలది ధనమును, దోచియిచ్చిన వెర్రిబాగుల ఊరది. అట్టి గ్రామముగూడ నేడు రాహుగ్రస్తమయ్యు, గ్రహణాంతరమును నిండు వెలుగుతో ప్రకాశించు జాబిల్లి పగది. చల్లపల్లి సంస్థానాధీశ్వరుని చల్లని చూడ్కులకు బాత్రమై, శాపవిమోచనమును బడయగలిగినది. ఆనాడు ఒక్క ఓటు పడకుండా పంపిన ఖాళీ పెట్టెలలో నేడు ఒక్క ఓటు బీరు బోకుండ మూడువేల మూడువందల ఓట్లను నించి " జస్టిసు " దేవికి నివేదించి, ఘంటశాలవారు, తాము వెనుకు యొనర్చిన రాజద్రోహమునకు బ్రాయశ్చిత్త మొనర్చుకొనిరి. ఈ ప్రాయశ్చిత్త విధి ఒక్క ఘంటశాలనే కాక కృష్ణామండలము యొక్క కుసంస్కారములను, దుర్వాసనలను, బూర్తిగ హరించి వైచినది. బొబ్బిలిస్వామి వారొక మారు గుండేరుదాటి, ఈ ఘంటశాల మహాజనులకు, తమ ద్వి సాక్షాత్కారమొసగి, వారిని తరతలరముల ప్రభుభక్తులనుగ తరింపజేసెదరుగాక !

ఇకమీదనైనను కాంగ్రెసు ఉత్సుకలు ఒక పర్యాయమాత్మ పరీక్ష చేసికొని తమ దౌర్బల్యమును గుర్తించుకొనదరు గాక ! మీ యపజయములకు, బయటి నెపముల నెన్నకుడు. జమీందారుల అర్థబలమే, జస్టిసు విజయమునకు గారణమని భ్రమింపకుడు. మీ యంతరంగ దౌర్బల్యమే, మీ యపజయమునకు ప్రధాన కారణమనుట నిశ్చయము. మీ త్యాగసేవలను మితిమీరి ప్రశంసించుకొనుట చేతనే, మీ పతనము సంఘటించినదీ, బ్రహ్మయ్య, సుబ్బయ్య, వెంకట సుబ్బయ్య, సీతా మహాలక్ష్మమ్మగార్ల త్యాగము, వారి బంధుజనమునే, స్వసంఘమునే, ఆకర్షించలేనప్పుడు, వాని విలువ యెక్కడ ! మీ స్వదేశదీక్ష, నేతపనివాండ్రను సైతము, వశపరచుకోలేనప్పుడు, వారమ్ముడు పోయిరది, వారిని నిందించిన లాభమేమి ? పట్టాభి సీతారామ్యగారి దేశసేవ బందరు పట్టణ వాసులను గూడ గదల్చలేనప్పుడు, వారి జీవితము వ్యర్థము."యతోధర్మస్తతోజయ ః" అను ఆర్యోక్తిని విశ్వసించియే కదా, మీరు స్వాతంత్ర్యసమరమునకు దుమికినది. ఒక మీకు అపజయము వాటిల్లుటకు గారణమేమి ? ఈ కారణము బయటలేదు. మీ హృదయ దౌర్బల్యమే మీ పతన హేతువు. మీ గ్రామస్తులను బ్రజ్వలింపచేయగల్గునంతటి స్వాతంత్ర్య జ్వాలమీలో తీండ్రించుటలేదు. ప్రజాశక్తిని, కాంగ్రెసు నందున్ముఖము చేయగలిగినంత త్యాగబలము, మీ యందు కానరాదు. గ్రామకక్షలను బారద్రోలి జాతీయ భావమును, బెంపొందించగల చిత్తశుద్ధి మీలో మృగ్యము. జన సామాన్యమును ప్రబోధించి సత్పథమున పెట్టగల దయారసము మీయందు వ్యక్తమగుట లేదు. మీ మీటింగులు కేవలము వట్టి కాలక్షేపములు. మీ జండాలు వట్టి గుడ్డపీలకు, మీ ప్రచారము శుష్కంకంఠశోషలు, కాంగ్రెసు మీయందు మూర్తీభవించి యున్న యెడల మీ కిట్టి దుర్గతి వాటిల్లి యుండెడిదికాదు. మీలో తగిన ఆత్మప్రతిభయున్నచో, జమీందారులచేత సహితము కాంగ్రెసు రథమును లాగునట్లు గావించగలిగెడిది ...................... ఇప్పుడైననూ, ఆవేశము నణచుకొని, పరనిందలను గట్టిపెట్టి, నిశ్చలదృష్టితో, ఆత్మపరీక్షను కావించుకొని, చిత్త సంస్కారము నొందెదరుగాక యని కాంగ్రెసు వారికి వినయ విధేయతలతో విన్నవించుకొనుచున్నాము.

1936 నవంబరు 28

కృష్ణా ప్రతిక,

కాంగ్రెసు లేదు ; మీర్జాపూరు కాంగ్రెసు, చల్లపల్లి కాంగ్రెసు వున్నదన్నారు చల్లపల్లి రాజాగారు గుడ్లవల్లేరులో.

1936 లో జరిగిన ఎన్నికలలో చల్లపల్లి వారిని ఓడించుటకు మీర్జాపురం వారితో మంతనాలు జరిపినారు. అవి ఫలించలేదు.

కాంగ్రెసునాయకులు తమ త్యాగసాహసాలతో పోరాటుటకు ప్రయత్నించక, డిప్లమసి ఉపయోగించారు. డిప్లమసీలో జస్టిసువారు అధికులగుటచే కాంగ్రెసువారు ఓడిపోయారు. కాళేశ్వరరావు, పట్టాభిగార్లు పతనమయ్యారు. అందుచేత కృష్ణాపత్రిక, అలా వ్రాసింది.

తిరిగి 1940 సం॥ లో ఎన్నికలోచ్చాయి. ఆంధ్ర రాష్ట్రంలో జిల్లా బోర్డులన్నీ కాంగ్రెసు పరమైనవి. కృష్ణాజిలాల్ల బోర్డు ఎన్నికలు 1940 సం॥ జనవరిలో జరుగనున్నవి. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు పట్టాభి. సెక్రటరీ గొట్టిపాటి బ్రహ్మయ్యగార్లకు జిల్లాబోర్డునుస్వాధీన పరచుకోవలేననే ఆలోచనకలిగింది. అంతటవారు జిల్లాబోర్డు అధ్యక్షులైన చల్లపల్లి రాజతో మంతనాలు జరిపారు. రాజాగారు ‘ మీరు శుద్ధమైన కాంగ్రెసు వాదులను కేండిడేట్లుగానుంచితేనాకేమీ అభ్యంతరంలేదు. రమణయ్యానాయుడు మనుష్యులకు కాంగ్రెస్ ముద్రలేస్తే నేనంగీకరించన’నన్నాడు. బ్రహ్మయ్యగారు కృష్ణారావుగారితో సంప్రదించి, చల్లాపల్లి రాజాగారికి 18 సీట్లు ఇచ్చి వారంతా కాంగ్రెసులో చేరేటట్లున్నూ, రాజాగారు మానుకునేలాగున్నూ ఏర్పాటుగావించిరి. కాని పట్టాభిగారికి ఇది ఇష్టంలేకపోయింది. రమణయ్యానాయుడు సాయంతో చల్లపల్లిని వోడించి కాంగ్రెసు ముద్ర (గెల్చినట్లు) వేయించుకోవాలి తలంపు కల్గింది బ్రహ్మయ్య, సూరయ్యగార్లు మేము ఎన్నికల్లో నిలబడమన్నారు చల్లపల్లికి వ్యతిరేకంగా. పట్టాభిగారి ప్రోత్సాహంతో వెంకటసుబ్బయ్యగారు నిలబడ్డారు. ఈదఫాకూడా రాజాగారే గెల్చాడు. ఆయన గెలవడమే గాదు ఆయన పార్టీకి తూర్పుకృష్ణాలోనే 17 సీట్లు వచ్చినవి కాంగ్రెసు, రమణయ్యానాయుడు కలిసి పనిచేసినా.

ప్రకాశంగారు ఎన్నికల అనంతరం బందురు వచ్చి, జిల్లాబోర్డు అధ్యక్ష ఎన్నికలు జరిపారు. జయంతిపురం రాజాగారు ఎన్నికయ్యారు. అంతట ఆరాత్రి రమణయ్యానాయుడుగారు వచ్చి, కోటపల్లి లక్ష్మయ్య నాయుడుగారిని మీరు తిరిగి ప్రెసిడెంటుగా ఎన్నుకోనట్లయితే నేనూ చల్లపల్లి రాజా కలసి జయంతిపురం రాజాపై విశ్వాసరాహిత్యతీర్మానంపెట్టి ఓడిస్తామని బెదిరించాడు. దానితో ప్రకాశంగారు కృష్ణా జిల్లాబోర్డు కాంగ్రెసుబోర్డు అని అనిపించితే చాలుననది రమణయ్యానాయుడు మాట మన్నించాడు.

1948 సం॥లో రంగాగారు తిరిగి ఆంధ్ర రాష్ట్రీయ కాంగ్రెసు అధ్యక్షులైరి. 1949 సంవత్సరములో జిల్లాబోర్డు ఎన్నికలు వచ్చాయి. కృష్ణాజిల్లాబోర్డు అభ్యర్థులను రంగాగారు పెట్టారు. కాంగ్రెసు అభ్యర్థులే జయంగాంచారు కాకాని వెంకటరత్నంగారు ప్రెసిడెంటుగను వెంకట సుబ్బయ్యగారు వైస్ ప్రెసిడెంటగను ఎన్నికయ్యారు. రిజర్వుడు స్థానమునకు చల్లపల్లి ఫిర్కాలో తాళ్ళూరి జీయ్యరుదాసుగారు, వెంకట సుబ్బయ్యగారితో బాటు జిల్లాబోర్డు సభ్యులుగా ఎన్నికయిరి.

విద్యాధికులకంటె సామాన్యులయిన పాములపాటి వెంకటకృష్ణయ్య, మాగంటి సీతారామదాసు, కాకాని వెంకటరత్నంగార్లే బాగా పరిపాలన గావించారు. ఈ ముగ్గురుకూడ హైస్కూళ్ళ నధికంగా స్థాపించి, విద్యాభివృద్ధికి తోడ్పడిరి.

మన వెంకట సుబ్బయ్యగారికి, ఆరోగ్యము, వైద్యం, చెక్ పవర్ (ఎలిమెంటరీ టీచర్లకు) ఇవ్వబడినవి. ఆయన టీచర్లు ఎవరూ అనవసర వ్యయ ప్రయాసలబడి బోర్డు ఆఫీసుకు రానక్కలేదనీ, పనివున్న తెలపుకోవలసిందని, ఆర్డరు పంపారు ఇంతేగాక జిల్లాబోర్డు ఎలిమెంటరీ టీచర్సందరికి ప్రతినెలా జీతాలు 3వ తేదీకే ముట్టేటట్లు ఏర్పాటుచేశాడు. తరువాతనే జిల్లాబోర్డు గుమాస్తాలకు తప్పనిసరిగ సకాలంలో జీతాలు ముట్టుతూ ఉండేవి. ఈయన ప్రైమరీ స్కూళ్ళు విజిట్ చేసినప్పుడు ఉపాధ్యాయులపై తమ పెత్తనం చెలాయించక, వారికి తగు విధంగా సలహాలనిస్తూ సక్రమ పద్ధతిని సేవా మార్గం బోధించేవారు.

**మనకిసాన్ వెంకట సుబ్బయ్య**

కృష్ణాజిల్లా బోర్డు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నంగారికిని, ఉపాధ్యక్షులు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారికిని దివితాలూకా లక్ష్మీపురం గ్రామస్తులు " పశువుల సంత " ప్రారంభోత్సవ సమయమున సాదరముగా సమర్పించిన

## సన్మాన పత్రము

మహాశయులారా !

సామాన్య రైతు కుటుంబములో జన్మించి నిరంతర దేశసేవానిరతివల్లను, అసాధారణ ప్రతిభా విశేషం చేతను, ఆంధ్ర రాజకీయ రంగంలో, ప్రముఖ స్థానమలంకరించిన మీ ఇర్వురకును ఈశుభసమయమున స్వాగతమిచ్చే అవకాశం లభించినందుకు సంతసించుచున్నాము నేడిది యొక కుగ్రామంగా కన్పడినా యెంతో చారిత్రక ప్రసిద్ధిగల గడ్డ యిది యని విన్నవించుటకు గర్విస్తున్నాము. యిచట లభించిన ప్రాచీన శాసనాలు నేటికీ అట నట దృగ్గోచరమయ్యే ప్రాచీన వైభవ శిధిలాలు ఆంధ్ర సామ్రాజ్యం వెలుగొందిన దినాల్లో ఈ ప్రాంతమెంత ఔన్నత్యాన్ననుభవించినదీ వెల్లడిచేస్తూ వుంటాయి. స్వరాష్ట్రం రానున్న ఈ తరుణంలో తిరిగి ఈ ప్రాంతం పారిశ్రామికంగా, మహోన్నతస్థితినందుకొనే చిహ్నాలు కన్పడటం, శుభావహం.

అధ్యక్షోపాధ్యక్షులారా !

దేశ స్వాతంత్ర్య సమరాంగణంలో, అగ్రశ్రేణిలో నిల్చి, అసమాన త్యాగ శౌర్యాలు ప్రదర్శించి, వినుతిగాంచిన మీరు రాజ్యాంగ నిర్వహణలో గూడ సిద్ధహస్తులనే విఖ్యాతి గడించటం ప్రశంసించతగ్గది. మీ యీ నాలుగేండ్ల పరిపాలన, దేశము నాలుగు మూలల, మీ కీర్తిని విస్తరింప చేసినది. జిల్లాలో అన్ని ప్రాంతాలలోను ఉన్నత విద్యావ్యాప్తికి ఉత్తమ బీజాలు వెదజల్లారు. వైద్య సౌకర్యాలు వృద్ధి చేశారు. మీ కీర్తిప్రతిష్టలకు శాశ్వత స్మృతి చిహ్నాలుగా ఉండదగిన బ్రిడ్జీలు, రోడ్లు, భవనాలు ఎన్నో ఎన్ని తావులనో నిర్మించారు. కర్షకుల కష్ట నివారణకై ఆహోరాత్రులు శ్రమించి కృతకృత్యులయ్యారు. రైతుల పాలిటి కల్ప లతలై వారికెంతో మేలు చేకూర్చారు. యదార్థంగా, ఆంధ్రరైతులోకం మీకు చాలా ఋణపడి యున్నది. జిల్లాబోర్డు యజమాన్యాన ప్రప్రధమంగా, పశువుల సంత నిచ్చట నెలకొల్పి మా యీ ప్రాంతానికంతటికి మహోపకారం చేసిన మీ యిర్వురకును మా హృదయపూర్వకమైన ధన్యవాదాలు అర్పిస్తున్నాము.

నవ్యాంధ్ర రాజ్యంలో అర్హపదవులనంది, ఇతోధిక సేచేయుటకై భగవానుడు మీకు పూర్ణాయురారోగ్యములు ప్రసాదించుగాక యని, యర్థిస్తున్నాము.

లక్ష్మీపురం, ఇట్లు
17-6-53. లక్ష్మీపుర గ్రామ పౌరులు.

ఆదర్శ సేవాతపస్వులు

## గొర్రెపాటి ద్వయం

వారు వ్యక్తులు, మహా సంస్థలు !

ఆచార్య రంగాజీ అభిమతి

అదొక వేకువ ఝాము. కలవరింతతో లేచితిని. భారతీదేవిగా రేమిటేమిటంటూ, దగ్గర కొచ్చిరి, " గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారేదో రైతుల గురించి ..... " అంటూ మేల్కొంటిని. అప్పుడే తలుపు తట్టుచుండి రెవ్వరో, తిరిగి విచ్చి, నవ్వుతూ, ఆశ్చర్యమందుతూ శ్రీ గొర్రెపాటి వారొచ్చినారని నాకు చెప్పిరి.

చిత్రం

లక్ష్మీపురం పశువుల సంత ప్రారంభోత్సవము.

ఎంతటి తమాషా! అనుకొంటిమి మేమంతా. ఆ క్రితపు వారంలో దివితాలూకా రైతుల బాధల గురించి పత్రికలలో చదువు చుంటిని గదా ! అప్పుడు దివితాలూకా రైతు మహాసభకు అధ్యక్షత వహింపవలసిదని ఆ 1931 లో శ్రీ గొర్రెపాటి నన్నడుగుటకై వచ్చినారు.

వారు, నేను, గొట్టిపాటి బ్రహ్మయ్య, బలరామకృష్ణయ్యగార్లు 1928 -29 సంవత్సరములలో రీసెటిమెంట్ ఆర్థిక విచారణ సందర్భమందు స్నేహితులమైతిమి. ఆనాడొక మానసికాందోళన నాకు ! ఆరునెలలు డామా జైలులో మరొక ఆరునెలలు అమరావతి జైలులో అజ్ఞాతవాస మొనర్చిన పిదప తంజావూరు జైలునకు నన్ను బదిలీ చేస్తూ వుండిరి. ఎటులో ఒక మిత్రుని ద్వారా తంతి నిప్పించిరి, భారతీదేవి, తమ్ములు లక్ష్మీనారాయణ ప్రభృతులకు, బెజవాడలో కలుసుకొనిరి చిట్టిగారి సతీమణి, కుమార్తె, గొర్రెపాటి మరికొందరు. చీరాలలో మా తల్లి మంగమ్మగారు, భారతీదేవి, లక్ష్మీనారాయణ వగైరాలు. నెల్లూరు పోవువరకు చర్చలే ! ఎవ్వరితోడనా ! గొర్రెపాటితో ! ఎటుల రైతు కాంగ్రెసును బలపరచుటయా యని ? ఆంధ్ర రాష్ట్రరైతు కాంగ్రెసు అధ్యక్షు లైరివారు. ఆనాడు ఆ పదవిని అంగీకరించుట అంటే డెటిన్యూగా పోవుటకు ఆహ్వానము పొందుటే! అంతేకాదు, కమ్యూనిస్టులు అఖిల భారత సంఘాన్ని తికమకచేసి, రైతాంగం పేర సామ్రాజ్య పెత్తనాన్ని బలపరుస్తూవున్న దినములలో, జాతీయ స్వాతంత్ర్య సమరాన్ని బలపరుస్తూవుంటే రైతు కాంగ్రెసు కార్యభారమునను తలపైనిడుకొని 1940 నుండి 1943 వరకు యొన్నో యిడుమలనందిన శ్రీదేవి, లక్ష్మీనారాయణ 'ఎవ్వరా అంతటి దుర్భరమగు భారమును మోయగల వార'ని వెదకి గొర్రెపాటి నొప్పించుకొనిరి. అంతటి వీరుడు ఆ దినమున తిరిగి నాకు కన్పించెను. ఉత్సాహం కల్గించెను.

ఆ తంజావూరు జైల్లో నుండగా, ఒకనాడు శ్రీబ్రహ్మయ్య వచ్చి, మన గొర్రెపాటి అల్లుడొక వుత్తరం వ్రాసినాడన్నారు. 'గొర్రెపాటికి అల్లుడు కూడనా ?' అని నవ్వితి. ' కాదు. మరో గొర్రెపాటి, ఎర్రనివారు. మీరెరుగుదురు. ఆయనకూడ జైలుకు పోయిన వారే. ఓహో ఆ బక్కపలుచని చిరునవ్వుతో వుండెడివారా' అంటిని. ఆయనే. ఐతేవారు పండితులైనారు గదూ ? ఆశ్చర్యము ? స్వయం కృషితో పండితలై , చరిత్రకారులై గ్రంథకర్తలైనవారు ........... మన ఆంధ్రులలో ఎందరో సాంఘిక సేవకులుగలరు. వారిలో గణనీయులీ సంతత సుహృదయులు పండిత గొర్రెపాటి. అల్లుడో చక్కటి యువకుడు. చూస్తే దివి తాలూకావారి స్ఫుర ద్రూపము, అనుభవించడానికి మామగారి నవ్వుల ముఖారవిందము. దేశికవితామండలి స్థాపించినాడు. దానికి తోడుగా మా చిన్నబిడ్డ శకుంతల కృషిచేస్తున్నది. పుసత్తకాలు అందించేవారు కావలనే? పండి గొర్రెపాటి తయారైనారు - ఇదియ శనివారపు సుబ్బారావు, చెరుకువాడ ఆంధ్రులకు నేర్పిన స్వయం సహాయపు ఆర్థిక స్వతంగ్ర విధానము ! అదియ ఆదర్శప్రాయపు జీవితము !! వ్రాసిరి జమీన్ రైతు సమస్యలపై మంచి పుస్తకము. నేనింకను జైలులోనుండగానే చేరినది. తద్వారా నాకందిన అదృష్టపు ఏకలవ్యులలో ఈ పెద్దగూడా నొకడని తెలసుసుకొని ఆనందమందితిని.

రైతు గొర్రెపాటి ఆ 1928 - 29 లో నేను నాటిన రైతు సేవ మొక్కను పెంచి గొప్ప ఉద్యమంగా జమీందారీ పద్ధతిపై పురికొల్ప రైతాంగమును రక్షించి, సేవించుకుంటూ వస్తూన్నందు వల్ల , పండిత గొర్రెపాటి యింత చక్కటి గ్రంధమును మా అందరి ఉద్యమాన్ని బలపరచుటకై వ్రాయుట తటస్థించినది గదా ! ఎన్ని ఉపన్యాసాలు ఒక్క పుస్తకముతో సమానము ! ప్రచారబలములో ! ఎన్ని సభ లొక్క ఉద్గంధముతో సరియగ సేవ చేయగల్గు ! వచ్చినది రాష్ట్ర కాంగ్రెసుపై ప్రజల కొచ్చినది పెత్తనము అంటూ, ఉత్సాహపడుచుండిరి ఎందరో స్నేహితులు. 1946 నుండి సంతసమే ! ప్రజల కందుచున్నప్పుడే కదా కాంగ్రెసు సాధారణ ప్రజా సేవకులకు ప్రోత్సాహము కల్గి, ప్రజాసేవాభిలాష యినుమడింప జేయుట ! ఐనప్పటికి, ఎంత తర్వరితముగా, ఉత్సాహవంతముగా కాంగ్రెసు ప్రజల మధ్యకు చేరుకుంటూ వుంటుందో, అంత పట్టుదలతో ఎవ్వరి కొరకై కాంగ్రెసు ఎటుల ప్రజా సమూహముల మధ్యకు రావలెనో , ఆ రైతు, కూలీ, కళాకారులు బుద్ధి జీవుల రక్షించుకటై, అభివృద్ధి పరచుటకై, నిర్మింపబడుచున్న వర్గ సంస్థలను పెంచుకుంటూ ఉండాలి. ఆ వర్గ సంస్థలద్వారా శ్రామిక జీవల మధ్య రాజకీయ చైతన్యమును పెంపొందించాలి. వారికి సర్వతోముఖమైన విజ్ఞానభివృద్ధి కల్గించటమేగాక, రాజకీయార్థిక నాయకత్వమును బొంది, బాధ్యతలనినుమడించుశక్తి,

ఉత్సాహము, పట్టుదల కల్గించిననే కాంగ్రెసు వారందరి మధ్యకు వచ్చి, వారికి చెందినందువల్ల కాంగ్రెసునకు, దేశానికి లాభం కల్గును. అంతట, ఈనాడు అత్యవసర మగుచున్న నిర్మాణాత్మకమగు సాంఘిక విప్లవము సాధింపవీలగును.

ఐతే అందరి దృష్టి కాంగ్రెసు యందున్న పదవులపైననే వుంటున్నప్పుడు, ఆ మెరుగుడు పూవుల ధోరణిలో పడకుండా యెవ్వరుండగలరు ? ధీర మానవులే గదా ! నిశ్చలమైన విప్లవతత్వ ప్రపూరితులే గదా ! ఎన్నో సంవత్సరాలనుండి ప్రజాసేవ కాంగ్రెసు ద్వారా చేస్తున్న ఉత్తమ సేవకులే ఏవేవో తమకు అందదగిన కాంగ్రెసు బాధ్యతల నెత్తిపై పెట్టుకుందమని వచ్చిరి, వస్తున్నారు. ఎంత హెచ్చుగా ఎంతమందిట్లు ఉత్సాహపడితే అంత మంచిది.

ఐనప్పటికి, అలాంటి ప్రజలందరి దృష్టిలో వుండగల్గ బాధ్యతా నిర్వహణకై ఉబలాటపడుట కంటే అత్యుత్తమ మార్గము కాంగ్రెసును బలపరుచు జీవనాధారమగు కాంగ్రెసు బలమును ప్రజలకు అందించగల్గు వర్గ సంస్థలందు ఏకాగ్రులై కృషిచేయు వారింకను ఆదర్శప్రాయులు, ఆదర ప్రాయులు. అట్టి వారెందరో ఆంధ్రదేశ మందునూ తదితర రాష్ట్రాలలోనూ వందలాదిగా వున్నారు. అదే కాంగ్రెసుకు ప్రాణప్రదము. అట్టి వారినే 22-12-49 లో వార్ధాలో సమావేశమైన సర్వోదయ సంఘమందు కలుసుకొని ఆనంద మందితిని. వారిలో మన సర్దారు శాస్త్రి, హరిసర్వోత్తమరావు, పాతూరి, కనకమ్మ, నరసింహ దేవర, యెర్నేని, గొగ్గిపాటి ద్వయం ప్రథమ శ్రేణికి చెందినవారు.

ఎందరెందరో కాంగ్రెసు ద్వారా అందదగు మర్యాదలకే త్వరపడుచున్నారు. క్రిందటి మూడు సంవత్సరాలలో, ఒకరైన కాంగ్రెసు పేరు ప్రతిష్టలను ఏ ఒక్కరిని గాని, కొంతగానైన అందజేయవలయునని సలహానైన యివ్వక, రైతు ఉద్యమాన్ని రాష్ట్రరైతు కాంగ్రెసుద్వారా ఒక్కరు వైజ్ఞానిక ప్రచారము ద్వారా మరొక్కరు సేవచేస్తున్న యీ భవ్యచరితులపై అఖిలాంధ్ర యువజనులు తమ వీరపూజను లగ్నమొనర్చుకొనుట యుక్తము.

ఈ వెంకట సుబ్బయ్య ద్వయం, బ్రహ్మయ్య మరెందరో ఆదర్శ ప్రాయులైన సాంఘిక సేవకులు వొనాడు బౌద్ధులస్థూప నిర్మాణమున కర్తత బొందియుండిన, విదేశ వ్యాపారపుశోభలనందుకొన్న ఘంటసాల గ్రామ వాస్తవ్యులే. బస్తీల నాగరికత గురించి వ్రాసిరి పురాతన గ్రీసు వేదాంతులు, రాజనీతి శాస్త్ర విశారదులు. లండను ప్రాభవమును గురించి వ్రాసుకొనిరి హెచ్. జి.వెల్సు, ఆర్నాడ్డు బెన్నెటు. కాని గ్రామలసాంఘిక, రాజకీయ జీవితమును గురించి గ్రామీణులలో ప్రజాసేవయం దారితేరిన వారిగురించి వ్రాయ బూనుకొన్న కవీశ్వరులు , పండితులు బహు అరుదు. ఐతే ఈ ప్రచారకార్యము అత్యవసరం. గ్రామీణ మగు మన దేశంలో ఆ పనికి బూనుకొన్నారు పండిత గొర్రెపాటి. ఘంటసాల చరిత్ర రచించిరి, వారి గొట్టిపాటి జీవిత చరిత్రను తీర్చిదిద్దిరి. ఎంతటి నిర్మాణకార్యము !

అందరు శాసనసభలు, మంత్రి మండలి, జిల్లాబోర్డుపై పెత్తనాలకే గాక కాంగ్రెసు సంఘాల పెత్తనము కొరకే పట్టుదలవహించుచున్న యీదినాలలో స్వంతధనము, శ్రమ, శ్రద్ధ అంతయు నెంతగానో వినియోగించుచున్నారు, విసుగు విరామము లేకుండ రైతు గొర్రెపాటి. రైతు కాంగ్రెసు అధ్యక్షులై ఆంధ్ర దేశమందంతటా అందిన ప్రజాసేవకులందరిచే వివిధ రైతు సమితుల నిర్మిచుకొంటూ, నిల్పుకొంటూ !! ఈ సేవా విధాన మందెంత భాధకలదో ఆశాబంగములు కల్గుచున్నవో, అయనకే ఎరుక !! అన్నిటికి ఓర్చు కొంటున్నారు, తననిర్మాణ కార్యక్రమాన్ని, అభివృద్ధిమార్గాన సాగించు చున్నారు.

ఆహార సమస్య నెదుర్కొనుటకై " ఆహార సలహ సంఘాలు " నిర్మాణ మందెంతో కృషిచేసిరి. రైతాంగానికి న్యాయమగుధాన్యపు ధరల సంపాదించుటకై కష్టించుచునేయున్నారు. ఆ సందర్భములోనే ఉత్పత్తిదారుల సభలను లక్ష్మీనారాయణగారి సహాయముతో నడుపుచున్నారు. ఆ 1936 - 39 కాంగ్రెసు మంత్రిమండలి యీ మధ్యవుండిన ప్రకాశం మంత్రి వర్గము, ఇప్పుడొచ్చిన రెడ్డి - రాజు మంత్రిమండలి వారితో సహకరిస్తూ, ఆందోళనచేస్తూ, జమీందారీ సమస్య నెదుర్కొంటూ, జమీందారీ పెత్తన రద్దుకై కృషిచేసిరి. రామానాయుడు, నాగినేని వెంకయ్య, మందేశ్వరశర్మ ప్రభృతుల సాయంతో వ్యవసాయ కూలీలకు ప్రత్యేక

కాంగ్రెసును నిర్మించుటయు, వ్యవసాయ సంస్కరణ విచారణ కమిటీకి, రైతు కూలీ సమగ్ర నివేదిక నంద చేయుటలో, అధిక ఆహారోత్పత్తికై కృషిచేయుటలో, రైతులకు ఎరువులు, ఇనుము వగైలరాలు కంట్రోలు ధరల కందాలని పట్టుదల జూపులో వారి కృషి అమోఘము.

రైతాంగ ప్రజలకు పాట, పద్యములు అవసరం. రైతాంగోద్యమమునకు రాజకీయాశయాలు కలవు. వాటిని ప్రజాసామన్యమునకు సులభముగా అందజేయుటకు గీతము లెంతేని ఉపయుక్తము. కనుకనే "రైతు భజనావళి" ని నూతన లక్షణాలతో ప్రకటించుచున్నారు రైతు గొర్రెపాటి.

ఇద్దరూ కార్యకర్తలు కారు, చురుకైన ప్రచారకులును కారు. ఐతే వారి యందు మూర్తిభవించియున్న పట్టుదల, కార్యశూరత, సేవాపరతంత్ర ఆదర్శప్రాయమైనవి. రైతు సమస్యలను గురించి రైతు గొర్రెపాటి మాట్లాడుతున్నారా, వారి అనుభవము, ఆసక్తి, ఆవేశములే చాలు సభికులందరి హృదయముల మనముల నాకర్షించుటకు. పండిత గొర్రెపాటి తన పాండిత్య పరిశోధనల గురించి, నెమ్మదిగా చిరునవ్వుతో మాట్లాడుతూవుంటే విజ్ఞానులైన వారికి వారి ఆలోచనలు తెలుకోవాలనే కుతూహలం కల్గుతూనే వుంటుంది.

ఇద్దరూ స్నేహ పాత్రులు. తోడి సేవకుల యెడల ఆదరాభిమానములు కల్గివారు, హెచ్చు మందిని ప్రేమించాలనే వారితత్వము ప్రయత్నము. ఈ సుగుణాలు మన ఆంధ్రులు ఎంతగానో పెంచుకోవాలి. వీరినుండి పెంచుకొనదగు. ఎందరు ఆంధ్రనాయకులు, సేవకులు, ప్రచారకుల గురించి ఎంత ఆదరణతో పండిత వెంకట సుబ్బయ్య వ్రాస్తున్నారో, చూచిరో అంతటి విశాల హృదయం మన మందరం సంపాదించుకోదగును కదా !! తన ముందు పెరిగిన, తనతో వస్తూన్న కాంగ్రెసు సేవకు లెంతెంత పదవుల కెదుగుచున్నారో వారందరికి సుహృదయతతో, ఉత్సాహంతో చేయందించుచూ తిరిగి వారి ఆజ్ఞల శిరసావహించుచూ, తాను, గ్రహించుకొన్న రైతాంగ సేవా ధర్మమును పాలించుచున్న రైతు వెంకట సుబ్బయ్య యొక్క యుదారత సేవాసక్తి సోదర సేవకుల ప్రేమించు హృదయము మనమంతా సంపాదించుకొన ప్రయత్నించుట దేశానికే శుభము.

రైతాంగోద్యమము దిన దినాభివృద్ధి చెందాలంటే, రైతులైన వారే బుద్ధిజీవులై పాండితిగల్గి కలకాలము నిల్చియుండు కావ్యములు, చరిత్రలు, గీతములు, గేయములు, రచించుట బుద్ధి జీవల లోకమందు రైతాంగముపై ప్రేమాభిమానములు పెంచుచుండుట అత్యవసరము. కవిబ్రహ్మ వెంకట నరసయ్య, కవి కోకి రామిరెడ్డి, శెట్టిపల్లి అకాలంగా తరలివెళ్ళిరి. అదృష్టవశాత్తు అభినవతిక్కన జోసఫ్, కన్నెగంటి , చిరంజీవి, జాషువా ప్రభృతులు రైతుకూలీ లోకమునకు తమ దివ్య లేఖినుల రచనల ద్వారా బలం, కళాకాంతి' కల్గించుచున్నారు. వారి తరగతికి చెందినవారు పండిత వెంకటసుబ్బయ్య. ఇట్టి రైతాంగ కూలీ జన కవీంద్రుల, కవి పండితులు విస్తారం కావాలి. శ్రీనాథుడే తన లేఖినిని పల్నాటి వీర చరిత్రకు అందించకుంటే పల్నాటి వీరుల దివ్య సందేశము మనకు అందెడిదా ? కవి బ్రహ్మ దానినొక నూతన ప్రాణమును కల్గించగల్గెడివాడా?

( వాహిని 16 జూలై 1950)

## పార్లమెంటు అభ్యర్థిత్వం

1951 సంవత్సరంలో ఆచార్యరంగాగారు, కాంగ్రెసును వీడి, కృషీకార్ లోక్‌పార్టీ స్థాపించారు. 1952 సం॥లో శాసన నిర్మాణ సభలకు పార్లమెంటుకు కూడా ఎన్నికలు సమీపించినవి. అప్పుడు బందరు పార్లమెంటు నియోజకవర్గమునకు లోక్ పార్టీ తరపున వెంకట సుబ్బయ్యగారిని అభ్యర్థిగా నియమించింది. కాంగ్రెసు రమణయ్యనాయుడును పెట్టింది. కమ్యూనిస్టులు సనకా బుచ్చికోటయ్యను తమ అభ్యర్థిగా పార్లమెంటుకు నిలబెట్టారు. బుచ్చికోటయ్యగారు పార్లమెంటు మెంబరుగా ఎన్నికఅయిరి.

## కుటుంబ జీవితము

మధ్య వయస్సునందే అప్పయ్యగారి భార్య మరణించినా, ఏకపుత్రుడు వినా, అన్య సంతానం లేకపోయినా, తిరిగా ఆయన వివాహమాడలేదు ఆయన తల్లి రంగమ్మగారు పునర్వివాహమొనర్చుకొమ్మని ఎంతపోరినా, ఆయన వినలేదరు. ఆయె ఈయనకు కాచిపోస్తూ 13-12-1915 సం.లో ఇహ లోక యాత్ర చాలించెను.

తరువాత అప్పయ్యగారి విధవ తోబుట్టువు కాంతమ్మపై ఆయన కుటంబ భారముపడెను. మాతృహీనుడైన చిన్నబిడ్డ వెంకటసుబ్బయ్యను ఆమె చాలా, గారాబంగా పెంచింది.

వెంకట సుబ్బయ్యగారు యుకత్త వయస్కులైరి. తండ్రిగారికి తనయుని వివాహ విషయమైన ఆలోచన వచ్చెను.

ఘంటశాల గ్రామంలోని, గణ్యమైన కుటుంబాలలో వేమూరి వెంకన్నగారి కుటుంబము ప్రధానమైనది. ఈయనను నల్ల వెంకన్న గారనేవారు. అప్పటి కాలంలో, కులవృత్తిని వదలి అన్యవృత్తిని చేపట్టటం అనే విషయం చాలా అరుదు. అందునా ఘంటశాలకు 40 నలువదిమైళ్ళ దూరానవున్న బెజవాడకు ఏవిధమైన ప్రయాణ సౌకర్యాలులేని రోజుల్లో చేరి వ్యాపారం ప్రారంభించటమనేది చాలా అసామాన్య విషయం. ఈయనకు 5 గురు కుమాళ్లు : వెంకటరత్నం, సుబ్బయ్య, బ్రహ్మయ్య, నాగయ్య, వెంకట్రామయ్యగార్లు. వీరిలో బ్రహ్మయ్య, నాగయ్యగార్లు ఇద్దరూ, మినహా మరి ముగ్గురూ తమ తండ్రిగారివలే బెజవాడలో వ్యాపారము లొనర్చిరి. వీరిలో రెండో ఆయన సుబ్బయ్యగారు. ఆయనకు మగబిడ్డలు లేరు. నల్గురాడుబిడ్డలు. వీరిలో ముగ్గురి వివాహములు కాక పూర్వమే ఆయన తన పెద్ద అల్లుడు పెద్ద కుమార్తెలయిన సుబ్రహ్మణ్యం, యశోదమ్మలపై తన కుటుంబ బాధ్యతలను , వుంచి పరలోక గతులైరి.

చిత్రం

పరుచూరి అన్నపూర్ణమ్మ (వెంకటసుబ్బయ్యగారి కుమార్తె గొర్రెపాటి మహలక్షమ్మ, ఈ లక్ష్మీకాంతమ్మ, ఈ సరస్వతమ్మ (వెంకటసుబ్బయ్యగారి అర్ధాంగి) గోగినేని భారతీదేవి పిన్నమనేని సీతారామమ్మ, వేమూరి సరోజిని

ఈ పెద్ద అల్లుడైన సుబ్రహ్మణ్యంగారు బెజవాడలో తమ మామగారు చేస్తున్న వ్యాపారంలో ప్రవేశించి తమ మరదళ్ళలో ముగ్గురి వివాహములు కూడా చేశాడు.

ఈ సుబ్బయ్యగారి చిన్న కుమార్తెయైన సరస్వతమ్మగారిని. ఈ సుబ్రహ్మణ్యం దంపతులే వెంకట సుబ్బయ్యగారి కిచ్చి వివాహమును గావించిరి.

వెంకట సుబ్బయ్య దంపతులకు జన్మించిన ప్రథమ సంతతిలో నల్గురైదుగురు చిన్నతనంలోనే మరణించుటవలన, ఆ దంపతులకు చాలా దుఃఖము కల్గెను. ఈ నష్ట సంతానములో రాధ అనే పెద్ద బిడ్డ మాత్రం 8 లేక తొమ్మిది ఏండ్లు మాత్రము జీవించినది. మిగిలిన బిడ్డలు ఇంకనూ అల్ప కాలములలోనే చనిపోయిరి. వీరుగతించిన కొంత కాలమునకు ఒక ఆడుబిడ్డ , ఒక మగబిడ్డ కలిగిరి. ఆ ఆడుబిడ్డ పేరు అన్నపూర్ణ అనే వెంకట పూర్ణ రాధా విమల రుక్మిణాంబ. కుమారుని పేరు వెంకట కుటుంబరావు. ఈ వర్ధిష్ణువులే ఇప్పుడు ఆయన వంశాకురములు.

27-3-1940 సం. వెంకట సుబ్బయ్యగారి తండ్రిగారైన అప్పయ్యగారు కాలధర్మ మొందిరి. ఆయన అవసాన సమయంలో తుది రోజులందు ఆయనకు కావలసిన సమస్త ఉపచారములు సరస్వతమ్మగారే నిర్వర్తించి వెంకట సుబ్బయ్యగారు ఎచ్చటనున్నా మామగారి కెలాంటి లోపమూ జరుగనీయక ఉత్తమ గృహిణిగా తమ బాధ్యతలను రాజకీయములందువలెనే గృహజీవనము నందునూ నిర్వహించెను.

వెంకట సుబ్బయ్యగారి కుమార్తెను చిట్టూరు గ్రామస్తులు పరుచూరి వెంకటరత్నంగారి కిచ్చి . 30-5-1948 సంవత్సరములో వివాహ మొనర్చిరి. 12-5-1954 సంవత్సరంలో ఆయన తమ కుమారుడు వెంకట కుటుంబరావు వివాహం గన్నవరం తాలూకా లంకపల్లి గ్రామస్తులు వేమూరి వెంకటేశ్వర్లుగారి కుమార్తెయైన రాణి ప్రమీలతో గావించిరి. తమ జీవితంలో వ్యక్తి లాభమునకంటే ప్రధానంగా రాజకీయ, సాంఘిక రంగములలో సమాన భాగస్వాములుగా, జైలు యాత్రలందేగాక అనేక ఆర్థిక, మానసిక కష్టములనెన్నింటినో దాటి వాటిని సరకుగొనక జీవితమును పూల బాటవలెగాకుండా, సేవామార్గమున, కర్మమార్గమున, సమ భాగస్వాములుగా అటు దేశమునకు, ఇటు రైతాంగమునకు సేవ లొనర్చి తమ జీవితములను ఋజు మార్గమున నడిపిన ఈ దంపతుల దాంపత్య జీవనము ప్రశంసనీయము.

## రైతు భజనావళి

మన భాషా సాంప్రదాయాల్ని గమనిస్తే, మనది గేయ భాష అని తోస్తుంది. మన ప్రాచీన సాహిత్యమంతా పద కవితే.

పాడేవారిని, వినేవారిని తన్మయత్వం కల్గింపజేసేవి ఇవే. మన గేయాలు లయతాళబద్ధాలుగా నుండి, సంగీతంతో సన్నిహిత సంబంధం కల్గి వుంటుంది. మార్గకవిత మాదిరి గూఢాన్వయం, శబ్దాడంబరమూ లేక అందరకు అర్థమవుతుంది. అందుచేతనే ప్రజలకు ఇది పెన్నిధిగా పెరిగింది.

రైతుదండు గుంటూరులో (1933-36) నడుపుతున్నప్పుడు రైతు భజనావళి ఆవశ్యతక రంగాగారికి గోచరించింది. వేలకు వేలు ప్రజలు, మూకజీవులవలె పోయేకన్న, ఒక్కమాటనే స్మరిస్తూ ఒకే భావాన్ని మననంచేస్తూ, ఒకేసారి, ఒకేరీతి, పట్టుదలతో తమ దండు ప్రకటించుకొన గల్గునప్పుడు, ఏ కార్యానికైనా పటుత్వం కన్పడును, జయ లక్షణం బయల్పడును అని ఆయన భావించెను.

ఇంతేకాదు. ఏ ఉద్యమసిద్ధికైనా సాధారణ ప్రజల కందుబాటులో హృద్గతము కాదగు మాటలూ పాటలూ, గేయాలూ గీతాలూ అవసరము. ఈ అవసరం తీర్చుటకే రైతు భజనావళి 22-4-1934 న ప్రథమంగా ముద్రింపబడినది. దీనిలో అనేక గొప్ప గేయాలు కూర్చబడినవి. ప్రజల పాట త్యాగయ్య అని ప్రసిద్ధి జెందిన గరిమెళ్ళ (సత్యనారాయణ) గారి " అన్యాయ కాలంబు దాపురించిదిపుడు అందరమూ మేలుకోవాలండీ" అన్నది తలమానికము.

తరువాత బలయలుదేరాడు విప్లవకవి (శెట్టిపల్లి) "రైతు సత్తాదెల్ప రణభేరి మ్రోగింది. రండోయీ! రైతులూ రణరంగమునకు ..... అని ఆహ్వానిస్తూ " ఆగునా జీవాలు సాగునా లోకాలు రాజుగా మనమెంచి రైతుగొల్వకపోతే దేశాలు తలలెత్తునా ? దాస్యపున్ పాశాలు తావీడునా " అని సవాలుచేస్తూ, జయభేరి మ్రోగింది " ఓ తెలుగు రైతా, జయ గేయముల బాడసాగి రమ్మింకా" అని జయలక్ష్మి సాక్షాత్కరింప చేయసాగాడు. అటు తరువాత వచ్చాడు వల్లమాలిన ముసలాయన. ఈ దక్షిణా పథంలో జమీందారీ యుగ నిర్మాత నెల్లూరి వెంకట్రామానాయుడు మా కొద్దీ జమీందార్ల పొందు. ఈ నినాదమే భారతావని యందంతటా ప్రచారమై జమీందారీ విధానము రద్దుకు రాజబాట ఏర్పరచింది.

రైతాంగ భజనావళిలోని ఒక్కొక్కపాట పది ఉపన్యాసాల పెట్టు. ఇది దేశమంతటా అంతులేని ప్రచారము గావించింది. 30 పేజీల నుండి 125 పేజీల వరకూ పెరిగింది. బుల్లిపదాలనుండి రణభేరి వరకు పెరిగి ప్రఖ్యాతిగాంచింది. ఎన్నో ముద్రణలు పొందినది. దీని నుండి ఎందరో గేయాలను తమ ఇష్ట ప్రకారం వేరు వేరుగా అచ్చొంత్తించుకొన్నారు.

నెల్లూరి వెంకట్రామానాయుడు, న్యాపతి నారాయణమూర్తి గౌతులచ్చన్న మల్లంపాటి చెంచురామయ్య, నన్నపనేని వెంకటసుబ్బయ్య, అట్లూరి అప్పారావు. ప్రభృతుల కంఠ నినాదాలతో రైతు భజనావళి తత్త్వము ప్రకటితమైనది.

పచ్చి యినము కూడా పరవశమై ప్రవహించునట్లుగా, పాడిన అమరగాయకులు వారు. ఆ నాద బ్రహ్మలకు ఆరాధన, అర్చన చేసీ ఆంధ్రావని రుణం తీర్చుకోవాలి.

మూడవ ముద్రణనుండి 9 వ ముద్రణకు 12 మాసాల్లో పెరిగింది. ఇందులకు ఆంధ్రుల ఆదరణ, అవసరం కూడాను. రైతాంగ ప్రచారపు పెంపుకూడా రైతు సేవాదళాలేగాక కాంగ్రెసు ప్రచారకులూ నాయుకులూ కూడా రైతు భజనావళిని ఆదరించిరి, శరణుజొచ్చిరి, ఉపయోగించిరి! దీనికొక గొప్ప కారణముకలదు. రైతాంగపు అవసరాలేగాక హృదయపు ఆవేదననూ, ఆశయాలనూ, భజనావళి కొంతవరకు ప్రతిబింబించింది. ప్రజ్వలింపజేసింది. ప్రోత్సహించింది. మన ప్రజల స్వధర్మనిష్టాపరులను చేయు కవులూ రైతాంగమునకు నూతన భావజ్యోతిని ప్రసాదించు గాయకలు కార్మిక కర్షకులకు పూజనీయమైన ' నూతన భువనేశ్వరిని " ప్రతిష్టాపించు అభినవ వేదారణ్యులు.

ఆంధ్ర కవిగాయక దళాధిపతులకు అభివందనాలు. వారి ప్రతిభ రైతు భజనావళి ద్వారా

భారతీయులకేగాక, వివిధ దేశీయులకు కూడా ప్రకటించుచున్నది. భారతీయ భాషలయందు ఎంతగానో వారిచే సృజింపబడిన భజనావళికి విశ్వామిత్ర సృష్టి చేయబుచున్నది. ఈ విధంగా ఆచార్యరంగాచే తొమ్మిది ముద్రణలు పొంది అభినందింపబడిన ఈ రైతు భజనావళి ఎంతో కాలమునకు మన కిసాన్ వెంకట సుబ్బయ్య పదవ ముద్రణ వేశాడు.

ఈ రైతు భజనావళివలె ప్రచారంనొందిన గ్రంధం మన ఆంధ్ర సాహిత్యంలో లేదంటే అతిశయోక్తిలేదు. రైతాంగ విద్యాలయము

## రైతాంగ విద్యాలయము

భారతదేశంలో అనేకమంది ఋషులు యోగులు కవులుగా గాయకులు వీరు యోధులు జన్మించారు. వారిని భారతజాతి పూజించి పొగడింది. వారికి గుళ్ళు గోపురాలు కట్టింది.

గ్రంధాలు వ్రాసి దిగంతాలు వ్యాపింపజేసింది.

కాని కష్టించి తమ స్వేదబిందువులచే, గింజకు పదిగింజలు పండించి జాతా వృక్షానికి మూలవీరులైన పంటకాపుల మనసారా ప్రేమించలేకపోయింది. ఎంతసేపూ జాతీయ వృక్షపు ఫలపుష్పముల ననుభవించి, ఆనందము పొంది దానికి కారకులైన వారిని విస్మరించింది.

కట్టగుడ్డ, పొట్టకు తిండి లేని కటిక దరిద్రుడు తన జాతీయ రధాన్ని ఎలా లాగగలడు. మన ఆర్థిక సంపత్తికి, మన సకలసంపదలకు, ప్రాణము పంటచేసు అన్నమాట మన నాయకులకు గోచరముకాలేదు. మనదేశంలో నూటికి 80 మంది వ్యవసాయంవల్లనే జీవిస్తున్నారనే నిత్యసత్యాన్ని గ్రహించలేకపోయారు. మన పాడిపంట, మన కుటీర పరిశ్రమలు అభివృద్ధి పొందాలంటే, మన కర్షకుల కష్ట నష్టాలను నివారించి, వారి నభివృద్ధి సంధాకు రప్పించాలి. అందుకు వేలకొలది సేవకులు కావాలి. వారికి శిక్షణాలయములుండాలి. అందుకుగాను రైతుసేవకై తరఫీదు పొందిన యువకులుంటే గాని లాభంలేదని ఆచార్యరంగాగారి కవగతమైంది. అందుకై, ఆంధ్ర రైతాంగ విద్యాలయమును నిడుబ్రోలులో 1934 సం॥లో నెలకొల్పారు.

తదాదినుండి నిరంతరాయంగ అభివృద్ధి చెందింది ఆ విద్యాలయం. ఇందులో రైతాంగ యువకులకు, రాజకీయార్థిక విషయములు రైతాంగ దృక్పధంతో చెప్పుటయేగాక, రైతులనెలా సంఘటిత పరచాలో నేర్పారు దీనిద్వారా వర్గచైతన్యం కల్గించారు. దీని ద్వారా రైతాంగోద్యమ మెంతో బలపడింది.

ఈ విద్యాలయానికి పలువురు పెద్దలు సాయం చేశారు. దీని విజయానికి తోడ్పడిన, ప్రధముల్లో ప్రస్తుతింపదగినవారు, శనివారపు సుబ్బారావు, న్యాపతి నారాయణమూర్తి, పండితారాధ్యుల నాగేశ్వరరావుగార్లు.

ప్రతి సంవత్సరం విద్యాలయాన్ని ఒకేచోట నడిపించుటవల్ల దూరప్రాంతాలవారికి ఇబ్బంది కల్గుననే కారణంతో వేర్వేరు ప్రాంతాల్లో విద్యాలయాలు ఏర్పాటు గావింపబడినవి.

అనేక ప్రాంతాల్లో జరుగుతూ 1952 లో కృష్ణాజిల్లా చల్లపల్లిలో రంగాగారి ఆధ్వర్యం క్రింద వెంకటసుబ్బయ్య సహాయ సంపత్తితో విద్యాలయం ఘనంగా జరిగింది. 250 మంది విద్యార్థులు వచ్చారు. ఈ రచయితకూడా విద్యాలయం సందర్శించ వెళ్లగా ఆచార్యరంగాగారు నూతన వస్త్రాలతో బహూకరించారు.

ఇంతేకాదు రంగాగారు జైల్లోవుడగా మన వెంకటసుబ్బయ్య 1944లో ఘంటసాలలో వేసంగి పాఠశాల జరిపారు. దానికి సుమారు 40 మంది విద్యార్థులు వచ్చారు. మైనేని రామకోటయ్యగారు బి.ఎ. మంచివక్త. రాజకీయాలు బాగా తెలిసినవాడు. రంగాగారియందు మంచి అభిమాని. ఆయన రాజకీయాలు, ఈ రచయిత సాహిత్య ప్రసంగాలు చేశారు. ఇంకా మానికొండ సత్యనారాయణగారు చరిత్ర బోధించారు చివుకుల వెంకటేశ్వర్లు వి.ఎల్. సుందరరావుగార్లు కూడా ఉపన్యాసకులుగా వుండిరి. ఒక నెలరోజులు పాఠశాల జరిగింది.

## రైతాంగ జీవగఱ్ఱ శ్రీ గొర్రెపాటి

" ఆంధ్ర రైతాంగ సేవలో తల నెరిసినవ్యక్తి శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు. జమీన్ దారి రద్దు చట్టం సమయంలో వారి కృషి చెప్పకోదగింది. నిరాడంబరత్వం, కార్యదీక్ష, నిజాయితీ ఆయనలో మూర్తీభవించి వుంటాయి. అలాంటి ఆదర్శ రైతుసేవకుని ఆచార్యరంగా ఈ వ్యాసంద్వారా జమీన్ రైతు

పాఠకులకు పరిచయం చేస్తున్నారు. సాహిత్యగోష్ఠిద్వారా పరిచితులైన పండిత శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు వీరుగాదని పాఠకులు గమనించవలెను." సంపాదకుడు : జమీన్ రైతు

" అదొక విచిత్రమైన రైలు ప్రయాణం. ఆ.సి. పి.లోని అమరావతీ జైలు నుండి ఈ దక్షిణాదిన గల తంజావూరు జైలునకు ఆ 1944 జనవరిలో నన్ను గొప్ప పోలీసు బందోబస్తుతో తీసుకెళ్ళుచున్న సమయం.

ఏలాగో వార్థాలో నన్ను పట్టిన ఒక జాతీయ వాది. హైదరాబాదు యిలాకా నుండి, మా కుటుంబమునకు రహస్యముగా తంతి యిచ్చిరి. చీరాల స్టేషనులో మా తల్లి మంగమ్మ గారు, తమ్ములు, భారతీదేవితో సహా వచ్చిరి. వెంకట సుబ్బయ్యగారు, అందరం ఎన్నెన్నో వ్యవహారాలపై ఎన్నెన్నో ఆలోచనలు చురుకు చురుకుగా, ఎంతెంతో ఆతురతతో నెల్లూర వరకు చేసుకొంటిమి, చెప్పుకొంటిమి మా అమ్మ నన్ను ఆశీర్వదించి వెళ్ళిరి. వారితో మా పెద్ద తమ్ములు వెంకటప్పయ్యగారు యింటికి వెళ్ళిరి. లక్ష్మీనారాయణగారు మాత్రం అఖిల భారత రైతు కాంగ్రెసు నెటుల పునరుజ్జీవింపచేస్తూ వుండిరో, ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి కాంగ్రెసును పునర్నిర్మాణము చేస్తూండగలరో వివరించిరి. ఆంధ్ర రాష్ట్ర రైతు కాంగ్రెసును తిరిగి నడుపుచుంటి మనిరి. దానికి ధనం, వర్కర్లు సంపాదించు చున్నామనిరి. ధాన్యపు ధరలు గిట్టింపుగా వుండునట్లు ఆందోళన చేస్తున్నామనిరి. దానికి తానే అధ్యక్షులుగా వుండు భారాన్ని లక్ష్మీనారాయణాది వర్కర్ల పట్టుదలపై శిరసావహిస్తున్నామనిరి వెంకట సుబ్బయ్యగారు.

నొకేనొక్క విషయంపై నేను వారి సలహాలను అంగీకరించలేక పోతిని. నిడుబ్రోలులో వుంచబడిన కిసాను ప్రెస్సును, యువజన నాయకులు కొందరి కోరికలపై బెజవాడకు మార్చుకొన కుతూహల పడిరి. అదివలదంని గ్రామంలోనే అట్టి విజ్ఞాన ప్రచారపు ప్రెస్సు నుంచట మేలంటిని.

వారందరికి సలహా యిచ్చి, వీలైనంత వరకు జైలునకు రాకుండా, రాచకీయంగా హతాశులై యుండిన రైతాంగము, తదితర ప్రజలకు ప్రోత్సాహం కల్గిస్తూ, యువజన విద్యార్థి సంఘముల నిల్పుతూ, రైతు ఉద్యమాన్ని గుడుపుచుండవలె నంటిని. ఐతే మాకందిరికి తెలుసు. అట్టి కార్యక్రమం జైలునకు పోయేకంటే ఎంతో కష్టమని ! అప్పటికి " గో భూమి" ని పోలీసులు ముట్టడించిరి, సోదాచేసిరి, మా కాగితాలెన్నో ఎత్తుకుపోయిరి. భారతీదేవి, మిగతా వారందరి జీవితం కత్తిపై సామువలె నుండెను. ఐనా అట్టి కష్టతర బాధ్యతలను శిరసావహించుటకు వెంకటసుబ్బయ్యగారు తలయొగ్గిరి.

1940 లో నన్ను రాష్ట్ర కాంగ్రెసు ప్రెసిడెంటుగా చేసుకొనిరి. దాంతో అంతదనుక రైతు వుద్యమమందు ప్రధాన బాధ్యతలవహిస్తూ, మున్ముందు రైతు వుద్యమమునే తమ ప్రధాన లక్ష్యమనిపించుతున్న వారెందరో కాంగ్రెసు కమిటీలలో మున్ముందుకు రావలెనంటూ త్రొక్కిసలాడి జొచ్చిరి.

జిల్లాబోర్డులపై వ్యామోహం జిల్లా కాంగ్రెసు పెత్తనాలపై వుత్సాహం చూపెట్టుకుంటూ, ఎప్పడెప్పటి నుంచో నాతోబాటు తాము చేస్తు వుండిన సేవా కార్యముల స్ఫురణకు తెచ్చుకుంటూ, పై పెత్తనాలకు వత్తిడిచేస్తూ వుండిరి. ఆనాటి ప్రధాన అన్యాయంగా, అకస్మాత్తుగా యితాంటివారికి బోర్డుల పాలనం చెందిపోయిననే భయన్మోదులైన సలహా ప్రకారం బోర్డు ఎన్నికల నాపివేస్తే ఫరవాలేదు. పైగా కాంగ్రెసు సేవా కార్యాలకే సౌకర్యమని నేనంటూంటే బాధపడజొచ్చి రెందరో ఆశాభంగులైన నా అనుచరులు. ఇలాంటి తాపత్రయాలకు లొంగని ప్రధాన నాయకుడొక్కడే. అతడే వెంకట సుబ్బయ్య. రాష్ట్ర రైతు కాంగ్రెసునే పెంచుకొంటూ, పోషించుకుంటూ ఎందరెందరో తమ బాధ్యతల యెడల నిండు హృదయ మివ్వక హెచ్చుకాలం కాంగ్రెసు ఎన్నికల హడావుడిలో వృథా చేసుకొంటున్నా విసుగొందక ఎన్నాళ్ళనుండో మేము నమ్ముకొని చెప్పకొని ఆచరించదలచిన రైతు సేవా మార్గమందు తానే చుక్కానిగా నిల్చియుండెను. హేమాద్రివలె కాపలా కాచుచుండెను.

మేము చెప్పుకొంటూ వుండిన మా రైతు కూలీ ప్రజారాజ్యాశయము సిద్ధించవలెనంటే రైతాంగమునకు

స్వాతంత్ర్య భారతమందు ప్రధాన హక్కు బాధ్యతలు అందాలంటే రైతాంగోద్యమం సజీవమైవుండాలని, అందుకు ప్రాతిపదిక రైతుకాంగ్రెసు, అది నిల్వాలన్నా తద్వారా రైతుకూలీ ప్రజారాజ్యం సాధ్యం కావాలన్నా రైతాంగ యువజనులు ప్రజలలో రైతాంగ తత్వము ప్రజ్వరించాలి. రైతాంగ వర్గముశాశ్వతమైనది. అభివృద్ధి దాయకమైనది. భవిష్యత్ భారత ఆర్థిక రాజకీయ జీవితమునకు జీవగర్ర యన్నమాట పరమ సత్యం.

ఈనాటికినీ యెన్నెన్నో ఆశాభంగములు కల్గుచున్నా యీ సాంఘిక ధర్మ సూత్రమును, రాజకీయ మార్గమును నిశ్చల మనస్కుడై అవలంబిస్తున్నది మన వెంకట సుబ్బయ్య.

వచ్చినవి జిల్లాబోర్డు ఎన్నికలు. అందులో మనం పాల్గొంటే లాభమంతగా మన వుద్యమానికి వుండదేమోనని భయపడిన వారిలో వారొక్కరు. తుదకు ఎవ్వరెవ్వరో ఎందరెందరో ప్రెసిడెంటు వైస్ ప్రెసిడెంటుగా వుండాలని ఎంతెంతో తాపత్రయపడుతూ వుంటే, ఏ మాత్రం చలించని వారు. ఒక్కనాడు కూడా తన కొక పదవి కావాలని కోరనివారు ఆయన వొక్కరే.

నాకే తాపత్రయం కల్గి తన్ను వైస్ ప్రెసిడెంటుగానైనా చేయాలను కొంటుంటే అంతదనుక నామాటను సుగ్రీవాజ్ఞగా పరిగణించెదమని చెప్పుకొంటున్న వారెందలరో వెను వెనుకగా బలహీనత కలిగిస్తుంటే, తానుగా నావద్దకు పలుమారులువచ్చి ' ఎందుకండీ యీ ప్రయత్నము" ని కోరుకొనుచుండిరి. తనకంటే ప్రజాసేవా ధర్మానుష్ఠానమందు ఎంతో పసివారే పై పెత్తనాలకు ఎగబ్రాకి బడాయి చేస్తుంటే తాను కినిసెనా ! తుదకెట్లనో నా బలవంతంపై తాను వైస్ ప్రెసిడెంటుగా వచ్చిరి. మెప్పువడసిరి.

ఎవ్వరీ వెంకటసుబ్బయ్య ? గొప్ప విద్యావంతులు కాదు - మన పండిత వెంకటసుబ్బయ్యగారివలె కల్గిన వారునూకాదు, సాధారణ రైతు. స్వయంగా కాయకష్టంచేసి కాయలుగాచిన హస్తములతోటే కలం రైతు సేవకై పట్టిన పసిమిగల పండినరైతు.

ఐతే అదృష్టవంతులే. ఎందరో భార్యల వలెగాక వారి మహాలక్ష్మి ఖచ్చితంగా రైతు వుద్యమాభిమాని, వారిసేవా వ్రతానికి మహలక్ష్మి వలెనే వ్యవహరించ బూను కొన్నారు. ఎంత ఖర్చుపెట్టుచుందిరి. వ్యవసాయమును వోరగన్నుతో చూస్తూన్నందువల్ల ఎంత నష్టం ! ఇంతకూ ఆయనకు అందుచున్న ప్రాపంచపు పదవులేమున్నవి. అంకెలువేస్తూ తంత్రాగమే జీవితాదర్శములాగా రాచకీయాంధకారమునను ప్రచారం చేస్తున్న వారి వరవళ్ళు చూచి, భర్తపై శీతకన్నెప్పుడూ పొందలేదు. కనుకనే వెంకటసుబ్బయ్య 1943 నుండి యిప్పటివరకు ఆం॥ రా॥రై॥ కాంగ్రెసు అధ్యక్షులుగా నుండగల్గిరి.

ఆమెకూడా తన స్వయం కృషిద్వారా రాజకీయ ధర్మలు అవగాహన మొనర్చుకున్నారు. జిల్లా రాష్ట్ర మహిళాసభలు జరిపించినారు. కరపత్రముద్వారా రైతాంగ స్త్రీలు రైతు వుద్యమాభిమానం కల్గించు చున్నారు. అమావశీ రాత్రుళ్ళు కూడా ప్రొద్దుపొడుపు నక్షత్ర మండలి ఎటు కాంతి వంత మొనర్చునో అటుల తన వుత్సాహ, వుల్లాస కాంతి పుంజముల ద్వారా రైతు వుద్యమానికొక శక్తి గల్గిస్తున్నారు.

చూచితిరా మీ రీ వెంకటసుబ్బయ్యను ! ఆ 1933 లో నావలెనే, ఆ బందరులో, ఆ ఎండా కాలంలో, ఆ పండువంటి ఖద్దరు వుత్తర్యంపు తళ్కులలో చూచినట్లయితే ఆ నిండుయౌవనంపు. నిండు రక్తంపు, నవ్వు నవ్వులతో ముందు ముందుకువస్తున్న యువక రైతు సేవకుని, మీరునూ నావలెనే వీరిని సంపాదించుకొందాం రైతు వుద్యమానికి అని కోరు కొందురు. అప్పటికి వోమారు జైలునకు పోయివచ్చిరి. మరో పర్యాయమునకు తయారగుచున్నారు.

ఆయనతోపాటు తలమలపాకువలె మెరుస్తున్న మరో వెంకటసుబ్బయ్యగారునూ ఆనాడు దొరికిరి. ఆయనప్పటికకి కింకా పండితుడుగా వెలయలేదు. కాని ఆ విజ్ఞాన కాంతు చివురులు మొలకెత్తుచుండినవి. నిత్య వెన్నెలలు గ్రక్కు ఆయన చల్లని దృక్కులు వారి గురించిన మురిపెంపు ముచ్చటలు మరో మారు చెప్పుకుందాంలెండి.

వో రాత్రి మా నాన్న తాతలు పుట్టిపెరిగి యుండిన పురాతనపుటింట్లో నిద్రపోతూ, వేకువన కలవరిస్తూ మేల్కొంటినట! దివితాలూకా గొర్రెపాటి రైతుసభలంటూ పల్కుచుంటినట. ఇంతలోనే మా తలపు నెవ్వరో తట్టుచుండిరట. భారతీదేవి వెళ్ళి తల్పు తీస్తురుగదా ఆ దీపకాంతిలో కన్పడినదెవ్వరు ? మన వెంకటసుబ్బయ్య

గారే ! అంతకంటే గొప్ప తమాషా యేముంది ?

అలాగా హత్తుకుపోయినవి మా హృదయాలు. ఆనాటి నుండి అంకిత మైరి వెంకట సుబ్బయ్యగారు రైతు వుద్యమం నాయకత్వమునకు !!

రాష్ట్ర ప్రభుత్వపు ధాన్యల కమిటీలో మూడు సంవత్సరాలుగా సభ్యులుగా వుండిరి. వారి నిష్కర్షమగు ధోరణి, వ్యవసాయ ఖర్చుల గురించి వారిచ్చు ఖచ్చితమగు నిరభ్యంతరమగు అనుభవపూర్యక మైన సంజాయిషి , సలహాలు ప్రభుత్వోద్యోగులకు వూపిరి సలుపనివ్వలేదు.

అంతర్జాతీయ లేబరు ఆఫీసు వారికి పంపుటకై వ్యవసాయ కూలీలకు కనీసపు సౌకర్యము లెట్టివి యేర్పరచడం యీ కూర్పు దేశాలలో సాధ్యమె తెల్పుటకై భారత ప్రభుత్యము 1949లో సభజరిపిరి. దానికి ఆంధ్ర రైతాంగుము తరపున శ్రీ వెంకట సుబ్బయ్యగారిని ప్రతినిధులుగా పిల్చిరి ప్రభుత్వము. ఆ సమయాన వారు నాకొసంగిని తోడ్పాటు గమనార్హమైనది.

కంట్రోళ్ళవల్ల రైతాంగమునకు కల్గిన కష్టములు వారికి అనుభవైక వేద్యము కనుకనే రైతుల ధాన్యాలకు సక్రమమగు ధరలు చెల్లించక తప్పదనే 15 సంవత్సరాల మా ఆందోళనకు యీ అన్యాయపు కంట్రోళ్ళ వ్యతిరేకోద్యమమును వెంకట సుబ్బయ్యగారు తదేక దీక్షతో నడిపిరి.

అసలాయన జమీందారీ రైతు కనుక " మా కొద్దీ జమీదారీ పొందు " అనే శ్రీ రామానాయుడి ఉద్యమమందు 1931 నుండి వుత్సాహులై కృషి చేసిరి. దివితాలూకాలో ప్రతి గ్రామమందు రైతు సంఘమును 1933 - 36 సంవత్సరాలలోనే స్థాపించిరి.

తన స్వ సంఘీయులైన చల్లపల్లి జమీందారు వ్యక్తిగతంగా బహుమంచి వారైనను, జమీందారీ పాలనాన్నే యెదిరించు మా బోంట్లతో చేతులు కలిపి వెంకట సుబ్బయ్యగారు రైతు సేవ చేయుచుండిరి.

ఆ 1948 - 51 సంవత్సరాలలో దివి తాలూకా యంతటా కమ్యూనిస్టుల దౌర్జన్యాలు తదితర ప్రాంతాలకంటే హెచ్చుగా చెలరేగుచుండడమే గాక, జమీందారీ వ్యతిరేకోద్యమమును "డాలు" గా వుపయోగించుకుంటూ, రాజ్యాంగాన్నే కమ్యూనిస్టులు చేపట్టుకొన జూచుచున్న రోజులవి ! అప్పుడే వెంకటసుబ్బయ్యగారు యిటు నిజము రైతు ఉద్యమ వ్యవహారాల బలపరుస్తూ, అటు సేవా దళాల నేర్పరుస్తూ, గ్రామ రక్షణ దళాల నిర్మించుతూ, మన హనుమద్దప్పారావుగారలకు కుడిభుజంగా నిలబడిరి. ఇటులనే కమ్యూనిస్టు వ్యతిరేకోద్యమమును సాగించిన కొందరు పెత్తందారులు గ్రామ కక్షలవల్ల వారు - వీరిపై కేసులు పెట్టజూచిరట. వీరు మాత్రం ధర్మమార్గాన్నే నడచిరి. పరీక్షా సమయం వచ్చినప్పుడల్లా తదేక దీక్షతో తనకున్న పరిమిత శక్తిని రైతు వుద్యమమునందే కేంద్రీకరిస్తూ వుండు యీ దీక్షాపరుని సలహా పొందుచుండట నాకు తృప్తి. కనుకనే ఆ 1944 సంవత్సరమందు మహాత్మునితో నేను రెండు దినాల పాటు సాగించిన చర్చల ఫలితాల ననుసరించి, ఆ డిసెంబరులో రైతు వుద్యమమును రాజకీయాలనుండి తొలగింపవలయునని తీర్మానించవలసియుండెను. మహాత్ములు రైతు కూలీ ప్రజా రాజ్యాశయాన్నంగీకరించిరి అప్పుడే వెంకటసుబ్బయ్యగారు మహాత్ముని సమ్ముఖమున నిల్చిరి. మా అందరి ఆలోచన తన అనుభవాన్ని జోడించిరి. తత్ఫలితం చరిత్రాత్మకమగు మా వొడంబడిక. అటులే కాంగ్రెసు సంఘాల ఎన్నికలలో పెరుగుచున్న అవినీతి, పట్టాభి - కళాయుగపు ధర్మచ్యుతి , అబద్ధమగు రాజకీయ దౌర్భాగ్య జీవితమును జూచి రోసి, బయటకు పోదామన్న వారిలో ప్రధములు మన గొర్రెపాటి !!

జనరల్ ఎన్నికలు జరిగిన పిమ్మట కమ్యూనిస్టుల బలగాల జూచి, వారి నియంతృత్వ ధోరణి నెదిరించుటకై కాంగ్రెసును తిరిగి బలపరుచుదామన్న మమ్ముల హృదయ పూర్వకంగా అనుసరించినదీ వారే!

వారి కార్యదీక్షకు, కార్యనిర్వహక శక్తికి చల్లపల్లిలో 1952 లో 250 విద్యార్థులతో జరిగిన రైతాంగ విద్యాలయమే సాక్షి.

ఇంతటి మాంధాత రైతు వుద్యమానికి దొరికి నందులకు భారత రైతాంగము అదృష్టవంతులు. వారు కుడిభుజమని చెప్పుకోగల్గుచున్నందులకు మా దంపతులం అదృష్టులం. ఆంధ్రులలో యింతటి కార్యదీక్షాపరులున్నందులకు గర్వపడుదాం !

జమీన్ రైతు 3-7-53.

## రైతు నాయకుడు రంగాజీ

మహాపురుషుల జీవితాలు మనకు మార్గదర్శకములు. వారి జన్మదినోత్సవ సందర్భాలలో వారి జీవితాశయాలను, లక్ష్యాలను స్మరణకు దెచ్చుకొని ఆచరించుటకు దీక్ష వూనుటయే మన కర్తవ్యం.

నా 11 వ సంవత్సరములో నేను బందరు నోబులు కాలేజీ విద్యార్థిగా నున్నప్పుడు నా సోదరుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లుగారి నాయకత్వానా జాతీయోద్యమ బీజాలు నా హృదయంలో నాటుకొన్నవి. బ్రహ్మ సమాజంలో శ్రీ ముట్నూరి కృష్ణారావుగారి శిష్యులంతా నుండెడి వారుము. బాలరమైనప్పటికీ, అప్పటికే ఆంగ్లేయ ప్రభుత్వపట్ల వ్యతిరేకత నాలో వుండేది. కాంగ్రెసు సంస్థద్వారా జాతీయ నాయకులు చేయుచున్నకృషికి సంతోషిస్తూ వుండేవాడను. వయస్సు గడిచేకొద్దీ విద్యకు స్వస్తిచెప్పి కాంగ్రెసులో చేరి పనిచేయాలనే ఆసక్తి పెరిగింది. 1916 సంవత్సరం నుండి కాంగ్రెసు అభిమానం యేర్పడి గ్రామాలలో పనిచేస్తూ, జాతీయోద్యమాన్ని బలపరుస్తూ, వుండేవాణ్ని. గాంధీజీ నాయకత్వాన సాగించబడిన శాసనోల్లంఘ నోద్యమములలో మా దంపతులం కారాగారము కేగితిమి. గాంధీజీ ఆదేశన్ననుసరించి యువకులు, యువతులు ప్రభుత్వ నిర్బంధ విధానమును లెక్కచేయక వేలకు వేలుగా జైలుకు వెళ్ళటం జరిగింది. కాంగ్రెసు వర్గసంస్థల నిర్మించి, గ్రామసీమలలో తగినంత కృషి చేయనందున గాంధీజీ వుద్యమానికి రావలసినంత ఊపురాలేదని జైలులోనున్న నాకు తోచింది. ఆనాటికి కాంగ్రెసు పట్టణవాసులైన నాయకుల చేతిలోనే వుండేది. నేను జైలు నుండి బయటపడిన వెంటనే పల్లె ప్రజానీకంలో పనిచేయాలని అందులో ముఖ్యంగా హెచ్చు సంఖ్యాకులైన రైతు కూలీల సంఘాలేర్పచి, తద్వారా కాంగ్రెసును బలపరచాలని నిశ్చయించితిని. విడుదల అనంతరం కామినేని వెంకటప్పయ్య, మరి కొందరు మిత్రల సహాయంతో కృష్ణాజిల్లా జమీన్ రైతు సంఘాన్ని విజయవాడలో మహాసభ జరిపి, యేర్పాటు చేసితిని. ఈ రైతు ఉద్యమముద్వారా ఆచార్యరంగా గారితో సన్నిహితతత్వ మేర్పడినది. అప్పటినుండి రైతు రంగంలో ఆచార్య రంగాజీ నా గురువు. ఆనాటికి రైతులకు ప్రత్యేక సంఘాలుండాలనే ఆందోళన లేవదీసింది రంగాజీ యే.

జమీన్ రైతు బాధా నివారణకు, వారిలో సంఘశక్తిని పెంపొందిపజేసి, వారి హక్కులను కాపాడు కొనుటకు 1929 వ సంవత్సరం ఆగస్టు 14 వ తేదీన ఆచార్య రంగా, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ, నెల్లూరు వెంకట్రామానాయుడుగార్లు, కటికినేని సోదరులు, తదితర రైతు నాయకులతో రాష్ట్ర జమీన్ రైతు సంఘము ఏర్పడెను. దీనికి అధీన సంఘాలు జమీందారీ ఏరియాలన్నిచోట్ల ఏర్పాటు గావింపబడెను. 1931 సంవత్సరం జనవరిలో వెంకటగిరి జమీందారీ రైతు మహాసభలో జమీందరీ పెత్తనం పోవాలనే ఆచార్య రంగాగారి నినాదం దేశంలోని రైతాంగానికి యువకులకు ఎంతో ప్రోత్సాహం కల్గించింది. 1933 వ సంవత్సరం ఏలూరులో రెండవ రాష్ట్ర జమీన్ రైతు మహాసభ ఆచార్యుని అధ్యక్షతన జరిగి జమీన్ రైతుల కనీసపు కొర్కెల ప్రణాళిక తయారుచేయుబడెను. రంగాజీ నాకత్వాన వివిధ జమీన్ దారీ ఏరియాలలో కనీసపు కొర్కెలకై ఆందోళన

జరిగెను. కొన్ని జమీన్‌లో రైతాంగ పోరాటములు జరిగి, వాటిలో పెక్కుమంది రైతులు ఆహుతికావటం జరిగింది. ఈ విప్లవ పోరాటాలతో విప్లవం బలపడసాగింది. ఈ విప్లవపూరిత రైతాంగ పోరాటాలపట్ల అప్పటి కాంగ్రెసు పెద్దలు విముఖతతో, గాంధీగారి దృష్టికి ఈ విషయాలు గొనివచ్చి, రంగాజీపట్ల బేదభావం కలిగించాలని చూశారు. కాని విఫలులయ్యారు. అప్పటినుండి గాంధీగారికి, రంగాగారికి అభివృద్ధి దాయక విప్లవ నాయకత్వంపై లక్ష్యమేర్పడింది.

జమీన్ రైతు ప్రతిక

ఆనాడు జమీన్‌దారీ పెత్తనం క్రింద బ్రిటిష్ ప్రభుత్వం సైతం లోబడి పోతూంటే జమీందార్లకు వ్యతిరేకంగా గ్రామాలలో సంఘాలు పెట్టి ఆందోళన సాగించటానికే భయంగా వుండేది. నా బోంట్లు ప్రచారానికి వెళ్లినపుడు ఆహార, సభా సౌకర్యాలు కలుగజేయటానికి గూడ ప్రజలు జమీందార్లకు జడిసి ముందుకొచ్చేవారు కాదు. మాకు సౌకర్యాలు కల్గించినవారు జమీందార్లవల్ల అనేక బాధలకు లోనయ్యేవారు. సభలు పెట్టుకొంటే జమీందారి మనుష్యులు టంకులు వాయించేవారు. రైతు నాయకులు గ్రామాలకొస్తే జమీందారీ సి.ఐ.డి.లు వెంట వుండేవారు. మాతో సి.ఐ.డి లున్న రోజున మాకు భోజనం లేదు. ఇట్టి మర్యాదలు బొబ్బిలి ఎస్టేటులో రంగాగారికి కూడా జరిగాయి. ఇట్టి స్థితిలో జమీందార్లకు జడిసి, ఏ పత్రిక రైతు సంఘాలు పంపించే వార్తలు, వ్యాసాలు ప్రచురించేవికావు. ఆనాటికి ఆంధ్ర దినపత్రిక, కృష్ణా వారపత్రిక లుండిగూడ రైతాంగానికి సహాయపడజాలకపోయాయి. అట్టి పరిస్థితులలో ఆచార్యుని సలహా ననుసరించి 1930 సంవత్సరంలో నెల్లూరు వెంకట్రామానాయుడుగారు సంపాదకులుగా నెల్లూరునుండి " జమీన్ రైతు " పత్రిక ప్రారంభమయ్యెను . సంపాదకుడు వెంకట్రామానాయుడుగారి వ్యాసాలు, గీతాలు చరిత్రప్రసిద్ధిగాంచి రాష్ట్రంలో నలుమూలలా రైతువుద్యమ వ్యాప్తికి తోడ్పడెను. రైతు నాయకులు పత్రికా ప్రోత్సాహంతో నిర్భయంగా సంఘాలద్వారా, పోరాటాలద్వారా ప్రతి జమీన్‌లోను జమీందారు అన్యాయాలను యెదుర్కొని, యెనలేని సాహసాన్ని ప్రదర్శించి, ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు వుద్యమాన్ని ఆదర్శంగా పెంపొందిచారు. ఆనాటి కాంగ్రెసు ద్వారా తీర్మానింపబడని " జమీందారీ విధానం రద్దు కావాలనే నినాదం ముందుగా ఈ రైతు ఉద్యమంతో ప్రారంభమయిందని మరువకుందురు గాక.

1931 లో వెంకటగిరి జమీందారీ రైతులకు సంబంధించిన రిపోర్టున్నూ, అడవుల సత్యాగ్రహము, ఆంధ్రదేశ జమీన్ రైతుల ఆర్థిక విచారణ సంఘ నియామకం, కనీసపు కోర్కెల ప్రణాళిక, రైతు సంఘాల ఆందోళనతో రంగాజీ యాజమాన్యమున తయారుకాబడి, 1957 వ సంవత్సరం కాంగ్రెసు యెన్నికల ప్రణాళికలో జమీన్ రద్దు తీర్మానం నమోదు చేయబడింది.

## ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం

1923 వ సంవత్సరంలో ఆచార్యరంగాగారి అధ్యక్షతన గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామంలో జిల్లారైతు మహాసభ జరుపడి ఉద్యమం ప్రారంభమయింది. 1927 సం॥ వరకు జిల్లా సభలు మాత్రమే జరిగేవి. నాటికి ఒక్క కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాలకు మించి ఈ రైతు ఉద్యమం పెరగలేదు. ప్రథమ ఆంధ్రరాష్ట్ర రైతు మహాసభ శ్రీ బిక్కిన వెంకటరత్నంగారి అధ్యక్షతన 1928 సం॥లో జరిగి రాష్ట్రసంఘ మేర్పడెను. 1936 సం॥లో ఇది రిజష్టరు చేయబడినది. వెంకట్రామానాయుడు, న్యాపతి నారాయణమూర్తి, కొమ్మారెడ్డి, గొట్టిపాటి, దండు నారాయణరాజు, డాక్టరు రంగయ్య, కోటిరెడ్డి బాపీనీడు, రామదాసు పంతులు మొదలయిన ప్రముఖులు యీ సంఘములో సభ్యులుగా యుండి ఉద్యమాన్ని నడిపారు.

## రీ - సెటిల్ మెంటు ఆందోళన

ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరుజిల్లాల రీ - సెటిల్‌మెంటుకై మద్రాసు గవర్నమెంటు నిశ్చయించింది. అంతవరకున్న రేటుమీద రూపాయకు మూడు అణాల శిస్తు పెంచవలసిందని సిఫార్సు చేసింది. ధరలుతగ్గి రైతుల వ్యవసాయం గిట్టని స్థితిలో శిస్తు పెంచటం అన్యాయమని రైతుసంఘాల ఆధ్వర్యమున ఆందోళన ప్రారంబమైంది. సదరు రిపోర్టులోని అంశములను విచారించుటకు ఆరోగ్యస్వామి

మొదలియారుగారి అధ్యక్షతను రంగాగారు, మరికొందరితో కమిటీ నియమించబడి, 103 గ్రామాలలో విచారింపబడి, రైతుల హీనస్థితి, అప్పులు వివరంగా ప్రకటించబడి, వెనుకటి రేటునే తగ్గించ వలసినదిగా యీకమిటీచే సిఫార్సు చేయబడినది.

కాని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తయారుచేసిన పై రిపోర్టును బుట్టదాఖలుచేసి, అదనపు శిస్తు వసూళ్ళకు ఉత్తరువులు జారీచేసింది. ప్రభుత్వపు ఈ వైఖరిపట్ల దేశంలో ఆచార్యుని నాయకత్వాన ఆందోళన ప్రారంభమైంది. 1931 సం॥లో నవంబరు 1వ తేది " రీ - సెటిల్‌మెంటు వ్యతిరేకదినం "గా నిర్ణయించి, సభలు జరిపి అసమ్మతిని వెల్లడించిరి, ఈ ఆందోళనకు కారకుడు రంగాగారని పన్నుల నిరాకరణ నేరం క్రింద రంగాగారితో బాటు ఏడుగురిని అరెస్టు చేసింది. రైతు నాయకులను అరెస్టు చేసినందుకు ప్రజలు చేసిన ఆందోళనతో అదనపుశిస్తులు నిలిపివేయబడినవి.

## రైతాంగ విద్యాలయాలు

రైతు ఉద్యమ వ్యాప్తికై రంగాగారు ప్రతి సంవత్సరం వేసవిలో రైతాంగ విద్యాలయాలు స్థాపించి, కొన్ని వేలమంది విద్యార్థులకు రాజకీయ శిక్షణ గరుపుచుండిరి. ఈనాటి వివిధ అతివాద రాజకీయ పార్టీలో నున్నవారు చాలమంది ఆనాటి రంగాగారి రైతాంగ విద్యాలయంలో రాజకీయ పాఠాలు చదువుకొని తర్ఫీదు పొందినవారే. ఏ నాయకుడు కూడ యింతమంది రాజకీయయోధులను తయారు చేసినవారు లేరు.

## రైతు రక్షణ యాత్రలు

రంగాజీ నాయకత్వాన 1933 సం॥లో రైతు రక్షణయాత్రలు ప్రారంభమయ్యాయి. దేశంలో నలుమూలలా రంగాగారి కార్యక్రమంతో జిల్లా, తాలూకా దళాలు ఏర్పడి ప్రజలలో నవచైతన్యాన్ని రేకెత్తించి ప్రజా బాహుళ్యాన్ని కదిలించివేసింది. దీనికి తోడు రంగాజీచే ప్రకటించబడిన " రైతు భజనావళి" లోని విప్లవ పూరిత గేయాలు ప్రజలలో ఉద్యమంపట్ల ఉత్సాహాన్ని పురికొల్పాయి. ఈ విధంగా యావద్భారత దేశంలో రైతు ఉద్యమానికి ప్రధానపాత్ర వహించి, ఉద్యమాన్ని నుడుపుచున్నందుకు గాంధీజీతో బాటు ప్రజల నాకర్షించింది రంగాజీయేయని రైతాంగం గర్వపడింది.

## కాంగ్రెసులో రైతుసేవ

1923 వ సంవత్సరమునుండి రంగాగారు కాంగ్రెసులో నుంటూ అఖిలభారత కాంగ్రెసు సభ్యుడుగా జాతీయ సమస్యతోబాటు రైతు సమస్యల పట్ల అత్యధిక శ్రద్ధ వహిస్తూ, వర్గసంస్థల నిర్మాణమునకై విశేషకృషి చేసిరి. కాంగ్రెసులో నున్న కొందరు పెద్దలకు రైతు సంఘాల నిర్మాణం ఇష్టం లేకపోయింది. కాని 100 కి 80 మంది గల రైతులకు గాక కాంగ్రెసు మరెవరి కుపయోగపడుతుందని రంగాగారు వాదించేవారు. రైతాంగ కాంగ్రెసును బలపరిచి, కాంగ్రెసు ద్వారా రైతుకూలీ ప్రజారాజ్యాన్ని స్థాపించాలని వారి విశ్వాసం. 1938 సం॥ "హరిపుర" కాంగ్రెసుచే కాంగ్రెసులో ప్రత్యేక రైతు సంఘాలను ఏర్పరచుకొనే హక్కును స్థిరపరచుటకు ఆచార్యులు కృషిచేశారు. ఆనాటికి కిసాను కాంగ్రెసు సంఘం లేదు. రాష్ట్రాలవారీగా మాత్రం రైతుసంఘాలున్నాయి. అఖిలభారత రైతు ఉద్యమ నిర్మాణానికి రంగాజీతోబాటు కృషిచేసిన వారు స్వామి సహజానంద సరస్వతి, ఇందూలాల్ యాజ్ఞిక్ గార్లు. రంగాజీ అఖిలభారత రైతు ఉద్యమం సాగించాలని దీక్షతో యావద్భారత దేశం సంచారం చేశారు.

## అఖిల భారత కిసాన్ కాంగ్రెసు

భారత కిసాన్ కాంగ్రెసు ఆవశ్యకతను గూర్చి ప్రచారం చేసి 1936 సం॥ ఏప్రియల్‌లో లక్నో పట్టణంలో ప్రథమ అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ మహాసభను స్వామి సహజానంద సరస్వతిగారి అక్ష్యతతను జరిపి, అఖిలభారత కిసాన్ కాంగ్రెసు ఏర్పాటు గావింపబడెను. 1936 సం॥ డిసెంబరు 26 వ తేదీన ఫైజుపూర్‌లో రంగాగారి అధ్యక్షతను ద్వితీయ అఖిలభారత కిసాన్ కాంగ్రెసు మహాసభ జరిగింది. తదాది ఇప్పటివరకు

రంగాజీయే అధ్యక్షులుగా వుండిరి.

## ప్రపంచ రైతు ఉద్యమాలు

భారతదేశంలోనే కాక, ప్రపంచ దేశాలోగూడ రైతు ఉద్యమాలు పెంపొందించుటకు రంగాగారు నిరంతరం కృషిసాగించిరి. ఈ కృషి సందర్భంగానే వారు చాల పర్యాయాలు హేగ్, జినేవా, అట్టావా మొదలైనచోట్ల జరిగిన ప్రపంచ రైతు సభలలో భారత దేశ రైతు ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆయాచోట్ల ఈ రైతు ఉద్యమాలు నేటికి విపరీతంగా పనికివస్తూ వున్నాయి.

ఇంతేగాక రంగూన్‌లో జరిగిన అకిల బర్మాకూలీ మహాసభకు అధ్యక్షత వహించుటకు 1939 లో సతీ సమేతంగా వెళ్ళి అచ్చటి బర్మా, భారతీయ కూలీలమధ్య సమరస భావం పెంపొందించి, నెలరోజులు బర్మా అంతా సంచారం గావించి బర్మా రైతు కూలీల మన్ననలకు పాత్రులైరి.

## శాసన సభలద్వారా కృషి

1935 సం॥ నుండి నేటివరకు కేంద్ర శాసనసభలో ఆచార్యులు కర్షకాభిమానులను ఒక బృందంగా చేర్చి రైతు రక్షణ శాసనాలకు కృషి సాగిస్తూ వున్నారు. ధాన్యం ధరలు, చెరకు, నూనెగింజలు, పొగాకు ఇంకా ఇతర ఉత్పత్తి పంటల గిట్టింపు ధలకు ఎగుమతి దిగుమతి సౌకర్యాలకొరకు ప్రభుత్వ శాసనాలను చేయించటంలోను, సవరించటంలోను వాదన జరిపి కృతకృత్యులయ్యారు. కంట్రోళ్ళు వచ్చి రైతాంగాన్ని తదితర గ్రామీణ ప్రజానీకాన్ని ఎనలేని ఇక్కట్లుకు లోను చేయగా వీటి రద్దుకై దేశమంతటా సంచారం చేసి ఆందోళన జరిపి, చివరకు గాంధీజీ ఒప్పించి, కంట్రోళ్ళను రద్దు చేయించిరి. ఇంతేగాకుండా, ఉప్పు పండిచే రైతులకు రక్షణ, ఋణముల మారిటోరియం, క్షామ బాధితులుకు సహాయం, ఏజెన్సీ రైతు రక్షణ, చేతి పనులకు ప్రోత్సాహం, చేనేత పారిశ్రామికులకు రక్షణ కల్పించుటకు, ఆంధ్రరాష్ట్ర సంపాదనకు అటు శాసనసభలలోను, ఇటు బయటగూడ ఆందోళన గావించి వాటిని సంరక్షించుటకు కృషిచేసిరి. ఇంతేగాక ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రులకు అన్యాయం జరుగుతుండగా, దీన్నరికట్టుటకుగాను ప్రభుత్వంతో రాయబారాలు సాగించి, అన్యాయాన్ని అరికట్టిరి.

## రైతు ఉద్యమం - కమ్యూనిస్టులు

1940 సం॥ వరకు అన్ని గ్రూపులవారు కిసాన్ సభలో ఉండి పనిచేసిరి. 1939 గయ కిసాన్ సభలో అంగీకరించబడిన రైతుకూలీ ప్రజారాజ్యాశయం 1940 లో వలాసా సభలోకూడ అంగీకరించబడింది. కాని కమ్యూనిస్టులు రైతుకూలీరాజ్య ఆశయం బూర్జువానినాదమని, రైతులు రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రకటించుకోదారదని, కార్మిక నియంతృత్వమే ముక్తిమార్గమని రైతాంగ వ్యతిరేకనినాదం లేవదీసి విభేదాలు కల్పించారు. 1940-41 సం॥లో సోషలిస్టులు, ఫార్వర్డు బ్లాకువారు కిసాన్ సభనుండి బయటకు నెట్టివేయబడ్డారు. 1940 లో ఇ దూలాల్ యాజ్ఞిక్ అధ్యక్షతన బీహారులో జరిగిన కిసాన్ సభలో కమ్యూనిస్టులు ప్రజాయుద్ధ, పాకిస్తాన్ నినాదాలు ప్రవేశపెట్టుటచే ఆచార్యరంగా, వారి అనుచరులు నినాద సమస్యలు ఆపి, రాజీమార్గాన్నవలంజిప జేసిరి. కాని కమ్యూనిస్టులు మాత్రం తృప్తిపడలేదు. 1942 ఆగష్టు క్విట్ఇండియా తీర్మానంవల్ల కాంగ్రెసు నాయకులు, రైతు నాయకులు అందరూ జైలుకు పోయిన అదనుచూచుకుని, రాజపంథాను త్రోసిపుచ్చి, 1942 వ సం॥ సెప్టెంబరు 24 వ తేదీన బొంబాయిలో అఖిలభారత కిసాన్ కౌన్సిలు సభలు జరిపి, రంగా అనుయాయులును కూడా వదిలేసి, రైతు ఉద్యమంతో సంబంధంలేని కమ్యూనిస్టు

ప్రముఖుడైన చంద్ర రాజేశ్వరరావును సభ్యుడుగా తీసికొన్నారు. అదేగాక జాతీయోద్యమానకి భిన్నంగా, కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా తీర్మానాలు చేశారు. ఈ జాతీయ వ్యతిరేక తీర్మానాలను సహించలేక ఆంధ్ర, తమిళ, కేరళ, మైసూరు, హైదరాబాదు రాష్ట్ర కిసాన్ సభలవారు సభనుండి వైదొలగి, జాతీయోద్యమంలో లీనమైపోయారు. రైతు నాయకులని ప్రఖ్యాతి వహించిన యాజ్ఞిక్, సహజానంద, గౌతమ్ నరేంద్రదేవ్, ఆచార్యరంగా మున్నగు ప్రముఖులు ఒకరొకరుగా కిసాన్ సభను వదలారు.

## ఆంధ్రలో రైతు ఉద్యమం

ఆంధ్రలో జాతీయ నాయకులు, రైతునాయకు లందరూ జాతీయోద్యమంలో పాల్గొని జైళ్ళకేగిన సమయంలో కమ్యూనిస్టులు బయటనుండి జాతీయోద్యమానికి వ్యతిరేకంగా రైతు సభలు జరిపి. బ్రిటిష్ ప్రభుత్వమునకు యుద్ధంలో సహాయపడాలనే నినాదం లేవదీసి. యీలా చేయటంలోనే తమ పార్టీకి, రష్యాకు క్షేమముందనే అంతర్యంతో రష్యా ఏజెంట్లుగా పనిచేసి, భారత స్వాతంత్రోద్యమాన్ని దెబ్బకొట్టారు. ఇట్టి సమయంలో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ (రిజిష్టర్డు) సభ్యులలో జైళ్ళకు పోగా మిగిలినవారు నిడుబ్రోలులో సమావేశమై, కమ్యూనిస్టుల జాతీయ విద్రోహ పంధాను ఖండించి, జిల్లా, తాలూకాల సంఘాల పునర్నిర్మాణంగావించి, జాతీయోద్యమ పంధాలో కృషి చేయసాగారు. నాటినుండి నేటివరకు ఈ కృషి కొన సాగిస్తున్నారు.

## ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షత

1946 సం॥లో రంగాగారు భారత రైతు ప్రతినిధిగా విదేశాలకు వెళ్ళియుండిరి. అదే సమయంలో ఆంధ్ర కాంగ్రెసుకు ఎన్నికలు జరిగాయి. అన్ని రంగాలలో ప్రధానంగా రైతు. జాతీయోద్యమాలలో అహర్నిశం కృషి సలుపుతున్న రంగాగారి సేవ గుర్తించినందువల్లనే ఆంధ్ర కాంగ్రెసు సంఘం విదేశాలలో నున్న వీరిని తమ అధ్యక్షులుగా ఎన్నుకొంది. తదాది 1951 సం॥ ఏప్రియల్ వరకు రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులుగా నుండి, రైతు, కూలీ విద్యార్థి, యువజన, మహిళా, చేనేత కాంగ్రెసు సంఘాలు, సేవదళములు మొదలైన అనుబంధ సంస్థల నిర్మాణము గావించి జాతీయ రంగంలో అపార కృషి సాగించిరి.

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా నుండిగూడ రాష్ట్ర ప్రభుత్వం వల్లగాని, కేంద్రప్రభుత్వంవల్లగాని రైతాంగానికేమైన కష్టనష్టాలు వాటిల్లినచో, ఆయా వివాదగ్రస్త విషయాలపై ప్రభుత్వాలతో రాయబారాలు సల్పటమేగాక, ఆ ప్రభుత్వాల కెంత కంటగింపుగా నున్నను సరకుచేయక తీర్మానాలు సైతము చేసి రాష్ట్ర సంఘంచేత ఒప్పించి, ఆ సమస్యల పరిష్కారం చేయించి, రైతుల ఇక్కట్లు బాపుచుండెను. మొట్టమెదటినుండి ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం కావాలనే ముఖ్యులలో నొకరుగా నుండుటయేగాక, ఈ అధ్యక్ష కాలంలో ఆంధ్రనాయకుల మధ్య ఎన్ని విభేదాలున్నప్పటికిని వాటిని త్రోపివేసి, వారితో హృదయపూర్వకంగా సహకరించిర రాష్ట్ర సంపాదను కృషిచేసిన వారిలో రంగాజీ ప్రథములు. ఇంత సమరస భావంతో వర్తించినా, రైతు ఉద్యమ వ్యతిరేక కాంగ్రెసు వాదులు, అధికార వ్యామోహపరులు అయిన నాటి కాంగ్రెసు మంత్రివర్గీయులు ఏ విధంగానైనా రాష్ట్ర అధ్యక్షపదవి కాజేయాలనే దురుద్దేశంతో పడరాని పాట్లుపడి చేయరాని కుట్రలు సల్పి, రాష్ట్ర సంఘాన్ని రద్దుచేయించి, అక్రమంగా కాంగ్రెసు ఎన్నికలు జరిపించి, చివరకు 1951 సం॥ ఏప్రియల్ 11 వ తేదీ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవినుండి దింపిరి.

సువిశాలము, సుదృఢమునైన నాటి జాతీయ కాంగ్రెసునుండి రైతాంగానికి ఎనలేని సేవచేయుట కవకాశం కల్పించుకొన ఆశతో కాంగ్రెసు అధ్యక్షపదవిని స్వీకరించి, వచ్చిన వ్యతిరేకతనంతనూ ఎదుర్కొంటూ చివరకు అటు కేంద్రం ఇటు రాష్ట్ర రైతు వ్యతిరేక, సమరసభావ వ్యతిరేక, స్వార్థపూరిత శక్తుల కఠినమై. వారే వాటి సారధ్యము నెరపుతున్నప్పుడు, తన జీవిత పరమావధియైన రైతాంగ సేవకు అస్కారం లేనపుడు కాంగ్రెసునుండి విడిపోక తప్పలేదు.

## రైతు కూలీలకు ప్రత్యేక పార్టీ

రైతాంగానికి, కూలీలకును, కళాకారులకును పూర్తి రక్షణ కావాలంటేను, వారి సంపూర్ణ వికాసానికి కృషి చేయాలంటేను వారికొక ప్రత్యేక పార్టీవుండి, తద్వారా ఆందోళన సాగించాల్సిన అవసరముందని రంగాజీ చిరకాల వాంఛ. ప్రజాస్వామ్య విధానంలో రైతు, కూలీ, బుద్ధిజీవుల, కళాకారుల రాజ్యమే ఆరతదేశానికి శరణ్యమన్న సిద్ధాంతమును గాంధీజీ సిద్ధాంతాను గుణ్యముగా సృష్టించి దీనిపై గాంధీజీతో 1944 చివరిలోను, 1945 మొదటిలోను చర్చలు జరిపి, వారి ఆమోదమును బడసిరి. ఆ తరువాత ఒకసారి గాంధీజీ " ఈ దేశంలో ప్రజాస్వామ్యం నెలకొనాలంటే రైతురాజుగా నుండాలి. ఇది వ్యవసాయిక దేశం. ఈ దేశంలోని జనాభాలో నూటికి 80 మంది రైతులే "అని ఉద్బోదించారు. ఈ పరమ సత్యానికి రూపం కల్పించాలనేదే రంగాజీ నిత్య మనోవేదన. దానికి నేటు అదను వచ్చింది. అందుకే వారు కృషికార్ లోక్‌పార్టీని, ప్రత్యేకంగా రైతులకు కిసాన్ సమ్మేళనాన్ని 1952 ఆగస్టు మాసంలో ఢిల్లీలో ఏర్పాటు గావించిరి. ఏర్పాటు గావించిన నాలుగు నెలలకే జనరల్ ఎన్నికలు వచ్చుటచే తమ ప్రతినిధులు కొద్దిమంది మాత్రమే శాసనసభలకు ఎన్నుకోబడిరి. ఈ పార్టీశాఖ ఆంధ్రదేశమంతటా నేడు తన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, రైతుకూలీ ప్రజాసేవను అవిరళంగా కొనసాగిస్తూ వుంది. ఈ పార్టీకి ఇతర రాష్ట్రాలలో గూడ రాష్ట్రశాఖలున్నాయి.

## రంగా దంపతులకు ధన్యవాదాలు

రంగాగారి ధర్మపత్ని శ్రీమతి భారతీదేవి. ఈమె అఖిలభారత కిసాన్ సభకు అధ్యక్షత వహించిన రైతునారి. అన్ని ఉద్యమాలలో భర్తకు చేదోడుగా నుండి, వారి కృషికి వన్నె కల్పించి, రాణికెక్కిన ఆదర్శ సతీమతల్లి, రైతాంగం ఈమెను తమకు చేయూతనిచ్చే సోదరిగాను, తల్లిగాను గౌరవించి పూజించుకొంటుంది. ఇట్టి పరమసాధ్విని ధర్మపత్నిగా చేబట్టిన రంగాజీ ధన్యులు. ఈ రైతు దంపతులకు నానమోవాకములు.

విదేశాలలో ఉన్నత విద్య నభ్యసించి, నవనాగరికతలు నేర్చి, తనకొచ్చిన ఆచార్య పదవిని సైతం తృణప్రాయంగా పారజమ్మి, అహరహము రైతు, కూలీలమధ్య తిరుగుతూ, వారి సంపూర్ణాభివృద్ధికై ఏ రంగంలో ప్రవేశించినా, కృషి సల్పుతూ నేటికీ ఏనాటికీ నీ రైతుకూలీల సేవే తన జీవిత లక్ష్యంగా పెట్టుకొని తన శారీరక, మానసిక శక్తినంతా అందుకోసమే వెచ్చిస్తూ వున్న భారత రైతు ఉద్యమ నాయకులు ఆచార్య రంగాగారిని భారత రైతాంగము తమమనుగడ వున్నంతకాలం వారి లక్ష్యాన్ని సేవను పూజిస్తూ వుంటుంది.

రంగాజీ బహు గ్రంథకర్త. వారు దాదాపు 30 గ్రంథాలకు పైగా వ్రాశారు. ఇవి ప్రధానంగా మోడరన్ పెజెంటు, కిసాన్ స్పీక్స్, ది చాలెంజి ఆఫ్ వరల్డు పెజెంటరీ, ది వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్, రైతులు - కమ్యూనిస్టులు, హరిజన నాయకుడు, పాకిస్తాన్, హ్యాండ్‌లూమ్ వీవింగ్ ఇండస్ట్రీ " లేబర్ ఇన్‌సౌత్ ఇండియా ", " ఆధునిక రాజ్యాంగములు " మొదలైనవి. వివిధ రంగాలకు, వివిధాంశాలకు సంబంధించి వున్నవి. ఈ విధంగా వారు పౌరస్వత రంగంలో కూడ అనల్పనేవ సల్పిరి.

నవంబరు 7 వ తేదీ వారి జన్మదినం. అది భారత రైతాంగానికి పర్వదినం. నాడు పండుగ జేసికొంటుంది. ఉత్సవాలు జరుపుకొంటుంది. నవంబరు 7 కు వారికి 52 ఏండ్లు నిండి 53 ఏడు వస్తుంది. ఆ సందర్భంలో వారికి నా హృదయ పూర్వక మనస్సులు.

గౌరైపాటి వెంకట సుబ్బయ్య
వాహిని 7-11-52

## ధాన్యం ఉత్పత్తిదారుల సభ

ధాన్యం ఉత్పత్తిదార్ల సభలు అనేకం వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షతను జరిగినవి. వానికెల్ల ప్రధానమైంది బందరు సభ. అది 1957 అక్టోబరు 9 వ తేదీన జరిగింది.

ఈ సభకు అధికంగా రైతులు, మిల్లర్లు, బస్సు యజమానులూ హాజరయ్యారు. గొప్ప ఊరేగింపు జరిగింది. ఆచార్యరంగా, చెన్నారెడ్డి, సంగం లక్ష్మీబాయి, వెంకటసుబ్బయ్య, లచ్చన్నగార్లను నూర జతల ఎడ్లను పూన్చిన రథములపై నూరేగించిరి. షుమారు కి మైళ్ళ పర్యంతము వ్యాపించిన ఆ ఉత్సవములోని

జనం పుట్టలమ్మ చెరువు దగ్గరనుండి, రాబర్ట్సన్ పేట సెంటరువరకు అపారజన సందోహముతో వ్యాపించి యుండెను.

ఆనాటి సభలో రంగాగారికి వేములపల్లి రాఘవయ్యగారు స్వాగత పత్రం సమర్పించారు.

విశ్వపాలన కళావిద్యత్ శిఖామణి
రంగాజీయే నేటి రాఘవుండు.
పరిశుద్ధ నైతిక బలవిరాజితకీర్తి
లచ్చన్నయే నేటి లక్ష్మణుండు,
రాజకీయ జ్ఞానలబ్ధి ప్రతిష్టుడై
పరగు ఓబుల రెడ్డి భరతుడగును
ఆదర్శ రైతు సేవాధురీణుండు - చె
న్నా రెడ్డియే లక్ష్మణానుజుండు,
గీ ॥ రాష్ట్ర రైతాంగ సేవాభి - లాషదక్ష
అన్యమెఱుఁగని - నిస్వార్థ - నాయకుండు
వసుధ వేంకటసుబ్బయ్య వాయుసుతుఁడు
రామ రాజ్యంబు మనకేల రాకయుండు

వ్యవసాయమన్న పవుపోషణ, పంటను నుత్పత్తి గావించుట మాత్రమేగాదు, వర్తకము కూడా. భారత రైతు పేదరికానికి కొంతవరకు వర్తక సరళిలేకపోవటయే. అతడు తన సరకును టోకున అమ్ముతాడు. చిల్లరను కొంటాడు. ఇందువల్ల అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి.

అధికోత్పత్తి ఉద్యమం ఇది మననేలలో పుట్టిందిగాదు. గాలిలో పుట్టింది. పత్రికల్లో ప్రకటించటం - రేడియో ప్రసంగాలు, కరపత్రాలు వీటివలన ఉత్పత్తి పెరుగుతుందా ? గిట్టుబాటైన ధరలు ఇవ్వాలి అది ఇంగ్లండులోనూ, అమెరికాలోనూ జరిగింది.

ఈ సంగతి గమనించండి. రష్యాలో స్టాలిన్, జర్మనీలో హిట్లర్ అధిక సంతానవంతులకు యుద్ధావసరాలకు బహుమతులివ్వగా, ప్రజల ప్రాణాల కాపాడే పంటదారలకు మన ప్రభుత్వమిచ్చు పారితోషకము లేమి ? రైతు అవుసరాలు గుర్తించకపోవటమే. వారిని వేధించుకొని, వేటాడి, వారి పంటలను, వారి అనుమతిలేకుండా న్యాయమైనధరను ఇవ్వకుండా, తీసుకొని పోవుటయే ప్రభుత్వ పరిపాటిఅయింది. పంట పండించే వానికి ప్రోత్సాహ మెచ్చటనుండి వస్తుంది ? ప్రభుత్వం రైతుకు గిట్టు బాటగు ధరనివ్వదలచలేదు. వారి దృష్టిలో కొనుగోలు వారే ఉన్నారు. వారిది భోక్తల పక్షం - వారి దృష్టిలో రైతు లేడు. అందువల్ల ఉత్పత్తిదార్లు ఇందు విషయమై అధిక యత్నం చెయ్యాలి.

మన దేశంలో కమ్యూనిష్టులు రైతాంగానికి బద్ధవిరోధులుగా ఉన్నారు. రైతులను బూర్జువాలని, పెటీబూర్జువాలనీ, పంచ మాంగదళమని చిత్రించారు.

రంగాగారు , వినోబాజీ, నెహ్రూ , కమ్యూనిష్టులు ధోరణిలో చెప్పేధోరణిని వ్యతిరేకించాలని ఉద్బోధించారు.

కంట్రోళ్లు అవుసరంలేదని, గిట్టుబాటధరలు కావలసిని, సాముదాయక వ్యవసాయం ఆనర్థకమని, స్వేచ్ఛా వ్యాపారం కావలెనని ఆ సభలో తీర్మానములు గావింపబడెను.

ఈ సభ జయప్రదమగుటకు తోడ్పడిన ప్రముఖులు వేమూరి వెంకటరత్నంగారు. ఈయన బందరు వణిక్ ప్రముఖుడు.

## కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన

మన ప్రియతమ నాయకుడు ఆచార్యరంగా కాంస్య విగ్రహాన్ని ఆంధ్ర దేశానికి కేంద్రమగు విజయవాడలో ప్రతిష్టించిరి.

ఆ సందర్భంలో కీ॥శే గోగినేని వెంకటసుబ్బయ్య (మైకా గనుల యజమాని) మదరాసులోని ప్రసిద్ధ శిల్పి నాగప్ప చేత వారు చేయించిన కంచు విగ్రహమును విజయవాడలో ప్రతిష్ఠించుటకు శ్రీ వెంకటసుబ్బయ్య, డాక్టరు చలపతిరావు, అట్లూరి సీతారమయ్య గార్లతో నొక కమిటీ నేర్పరచిరి. ఆ మహోత్సవమునకు విగ్రహదాత వెంకటసుబ్బయ్య నాయుడుగారిని కూడా రప్పించిరి.

ఆనాడు నేల ఈనినట్లు ఆంధ్రదేశం నలుమూలలనుండి ఆ మహోత్సవంలో పాల్గొన్నారుజనం.

ఆచార్యరంగా కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవమునకు అధ్యక్షత వహించిన అంతర్జాతీయ కర్షకసమితి సెక్రటరీ డా ॥ డ్రిమిట్రోన్, ఇలా ఉద్ఘాటించారు " మొట్ట మొదటి పరిచయంలోనే రంగాజీని మా నిజమైన స్నేహితుడని ప్రపంచ కర్షకోద్యమాన్ని సాగించుటలో మా అగ్రజులని భావించాము. ఈనాడు ఆచార్యరంగా మీ ఒక్కరికే నాయకులుగారు ! ఐరోపా రైతాంగానికీ, యావత్ ప్రపంచ కర్షకజనావళికే ప్రియతమ నాయకులనీ, ఆయన సల్పుతున్న మహాయజ్ఞంలో ఆయన వెంట మేమంతా నిలబడగలమని సగర్వంగా చెప్పకుంటున్నాము".

వాహిని ఇలా వ్రాసింది - మన దేశంలో వీరులను పూజించు కోవడం, పెద్దలను గౌరవించటం, నాయకులను కీర్తించటం సాంప్రదాయంగా వస్తున్న శిష్టాచారం ....... అదే సంప్రదాయంతో అదే ప్రేమతో అదే ప్రేరణతో మానవత్వంతో నిండిన, ఆచార్యరంగా మూర్తిని ప్రతిష్ఠించుకున్నారు ఆంధ్రులు. ఆయన్ని హృదయంలో ఇదివరకే ప్రతిష్ఠించుకున్నారు ...... ఆచార్యరంగా కర్షకోద్యమానికి ఆది పురుషుడయ్యాడు. చేనేత, చేతివృత్తుల పారిశ్రామికులకు ఒక దారిజూపి గ్రామీణ ప్రజలకు ఆరాధ్య జనకుడుడయ్యాడు .... ఒక సందర్భంలో స్వర్గీయ భూలభాయి దేశాయి ఇలా అన్నాడు " రంగా గారి పేరు విజయవాడ ప్రాంగణం మొదలు ఢిల్లీ ఎర్రకోటదాకా ప్రతి ధ్వనిస్తుంది. "

ఈనాడు, ఆయన పేరు ఢీల్లీ వరకేకాదు, దేశ దేశాల మార్మోగుచున్నది. ఆయన వాణివిశ్వ రైతాంగానికి వీణానాదమైంది. ఆయన " ప్రపంచ కర్షకులారా ఏకము కండి " అని నినాదమిచ్చిన రైతాంగ సిద్ధాంత ప్రవక్త.

తమ ప్రియతమ నాయకుని ఈ విధంగా గౌరవించుకుంటున్న ఆంధ్ర ప్రజానీకాన్ని మరొకసారి హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము.

11 - 7 - 57

వాహిని

రంగాజీ కర్షక కార్మిక సేవకు కృతజ్ఞతగా ఆంధ్ర లోకం ఆయనకు అర్పించుకొన్నది 56 వేలు.

ఈ సందర్భమున వెంకటసుబ్బయ్యగారు రంగాగారి జీవిత చరిత్రను రచించారుగాన రచయితనుకూడ గౌరవించదలచాము రావలసినదిగా ఉత్తరము వ్రాయుట జరిగింది.

## కస్తూరిబా ప్రసూతి ఆసుపత్రి

గాంధీ మహాత్ముని భార్య కస్తూరీబబా ఆగాఖాన్ పేలెస్‌లో స్వర్గస్తురాలైన తరువాత ఆమె పేరుతో ఆమె పేరుతో ఆసుపత్రులను నెలకొల్పుటకు సన్నాహాలు జరిగినవి.

అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు నిధి వసూలుజేసి ఆమె పేరుతో గుడివాడ తాలూకా గురజలో ఒక హాస్పిటల్ నెలకొల్పారు.

దివి తాలూకా చల్లపల్లిలో స్త్రీల కనుకూలమైన ఆసుపత్రి ఏర్పాటు చెయ్యాలని ఒక సంఘం ఏర్పాటైనది 1942 లో.

దీనికి చల్లపల్లి రాజా గారధ్యక్షులు. శ్రీ వెంకట సుబ్బయ్యగారు సెక్రటరీగాను, శ్రీ కొర్లపాటి రాజేశ్వరరావుగారు కోశాధిపతిగానూ ఏర్పాటుయిరి. ఇదంతయూ ఆల్ ఇండియాకమిటీవారి యాజమాన్యాన జరిగింది. ఒక లక్ష రూపాయలు వసూలు చేయ సంకల్పించారు.

చల్లపల్లి దివాను, వెంకటసుబ్బయ్య వగైరాలు కొన్ని గ్రామాలు తిరిగి కొంత మొత్తము వసూలు గావించారు. నాగాయతిప్పలో శ్రీ యార్లగడ్డ చలమయ్యగారు ఘంటశాల పాలెంలోను మరి కొన్నిచోట్ల కొంత

వసూలు జేసిరి.

చల్లపల్లి లక్ష్మీపురముల మధ్య రాజాగారి స్థలమును ఈ ఆసుపత్రికి ఇప్పించుటకు వెంకట సుబ్బయ్యగారు చాలా ప్రయత్నించిరి గాని ఫలించలేదు. ఇందును గూర్చి ఆల్ ఇండియా కమిటీ వారితో చాలా కరస్పాండెన్సు కావిస్తూ వుండేవాడు.

నిమ్మగడ్డ కాపురస్తులు మాలెంపాటి వెంకట కృష్ణయ్యగారు కొంతకాలం, తూర్పు కృష్ణా కాంగ్రెసు సంఘ సభ్యులుగా వుండేవారు. ఆయనకు బిడ్డలు లేరు. ఆయన చల్లపల్లిలో వుంటూ వుండేవారు. ఆయనకు ఈయనకు మైత్రి ఏర్పడింది. కొర్లపాటి రాజేశ్వర రావుగారు ఆయన బావమరిది. ఈయనకు వెంకట సుబ్బయ్యగారికి చాలా కాలము నుండి మైత్రి. వీటినన్నింటిని పురస్కరించుకొని వెంకట కృష్ణయ్యగారు కీర్తిశేషులైన తరువాత ఆయన సతీమణి సీతారామమ్మగారు శ్రీ వెంకట సుబ్బయ్యగారి ప్రోత్సాహమును, వారి నివాస గృహము 53 శెంట్లు బిల్డింగుతో సహా షుమారు 40 వేలు ఖరీదుగలదియూ. రొఖ్ఖంగా 75 వేల 500 వందలు మొత్తం లక్షా పదునైదు వేల అయిదు వందలు భూరి విరాళమును గావించిరి. ఇది 10-9-1966 న ప్రారంభోత్సవము జరిగి దిన దినాభివృద్ధినొందుచూ స్త్రీల సేవ నొనరించుచున్నది.

ఈ ప్రసూతి ఆసుపత్రి నిర్మాణంలో శ్రీ రాజాగారివల్ల అనుకున్నంతగా సహాయము జరుగకపోయినా వెంకసుబ్బయ్యగారి స్నేహితులైన శ్రీ వెంకట కృష్ణయ్యగారి కుటుంబ సాయమున ఈ ఆసుపత్రి నిర్మాణము జరుగుట సంతోష ప్రదము.

ఆంధ్ర రైతాంగ ప్రియతమ నాయకులు, ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారికి సమర్పించు,

## సన్మానపత్రము

స్వతంత్రోద్యమ రధసారధీ !

పవిత్ర కృష్ణవేణీ జలాల పారుబడిలో సస్యశ్యామలమైన భూములకు, పచ్చని పైరులకు, సిరిసంపదలకు ఆలవాలమైన కృష్ణామండలములో గౌతమబుద్ధుని శాంతి సందేశాన్ని నేల నాలుగు చెరుగులా వ్యాపించజేసిన ప్రసిద్ధ బౌద్ధారామంలో, చరిత్ర ప్రసిద్ధిపొందిన ఒకనాటి ఆంధ్ర మహా సామ్రాజాన్యనికి టంకసాలగా పేరొందిన ఘంటశాలలో రైతు కుటుంబంలో పుట్టి మహాత్మాగాంధీజీ పిలుపునందుకొని స్వతంత్ర సమర శంఖారావాన్ని పూరించి అందు పాల్గొని కారాగార శిక్షలనుభవించి ఆంధ్ర రైతాంగానికే కీర్తిప్రతిష్టలు కల్పించిన మీ త్యాగదీక్ష కడు ప్రశంసనీయము. జమీందారీ వ్యతిరేక ఉద్యమంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటములో ఆంధ్ర దేశములోని మూరుమూలలా రైతాంగాన్ని మేలుకొల్పి, రైతు సంఘాలను స్థాపించి, రాజకీయ చైతన్యాన్ని ప్రబోధించి పటిష్టమైన ఆంధ్ర రైతాంగ ఉద్యమ నిర్మాణములో మీరు నిర్వహించిన పాత్ర అనిర్వచనీయము. ఆంధ్ర రైతుల ప్రియతము నాయకుడనైన మిమ్ములను సన్మానించుట ఆంధ్ర రైతాంగము తమ్ము తాము సన్మానించుకొనుటయే !

రైతు నాయకా !

రైతు దేశానికి వెన్నెముక, జాతికి జీవగఱ్ఱ, స్వతంత్ర భారత సౌధావనికి మూల స్థంబము. అట్టి రైతులేనిదే రాజ్యములేదని ఎలుగెత్తి చాటిన పూజ్య రంగాజీ నాయకత్వమున పరిపూర్ణ విశ్వసముతో ఆంధ్ర రైతాంగాన్ని గత నాలుగు దశాబ్దాలుగా సేవించి చరితార్ధుడవైనావు. రైతాంగ సమస్యలు మీకు కరతలాములకములు. ఆంధ్ర రైతాంగపు బాధలు మీ యాతిబాధలు. ఆంధ్ర రైతాంగము నడిపిన పోరాటాలలో మీరు లేని ఉద్యమమేలేదు. ఆంధ్ర రైతాంగ ఉద్యమమునకు మీరు గావించిన కృషి అత్యంత శ్లాఘనీయము. భారత రైతు ఉద్యమములో ఆంధ్ర రైతాంగాన్ని ప్రథమ ప్రాంగణములో నిలిపి ఆంధ్రావనికే వన్నెదెచ్చిన మీకివే మా నమోవాకములు.

ప్రజాస్వామ్య పరిరక్షకా !

స్వాతంత్ర సముపార్జనానంతరం అవిచ్చిన్నముగా సాగుతున్న కాంగ్రెసు నిరంకుశ పాలనలో

చిన్నభిన్నమైపోయిన గ్రామీణ వ్యవస్థను పునరుద్ధరించి కుటుంబాన్ని, కమతాన్ని స్వేచ్ఛను, కాపాడుటకై మహర్షి రాజాజీ స్థాపించిన స్వతంత్రోద్యమానికి మీ సేవలు పరిపూర్ణ జవసత్వాలను కలిగించినవి. ఆంధ్ర స్వతంత్రపార్టీకి ప్రథమ అధ్యక్షుడవై ఆంధ్రలో పరిపూర్ణమైన పతిపక్ష నిర్మాణానికి నాంది ప్రస్తావన గావించితివి. మీరు వెలిగించిన జ్యోతియే మాకు జీవనజ్యోతియై భావితరాలవారికి గూడ వెలుగుబాటను ప్రసాదించగలదు. పదవులకోసం ప్రలోభపడక ప్రతిష్టకోసం పెనుగులాడక ఎంచుకొన్న నాయకునితో పెంచుకొన్న విశ్వాసంతో తుదివరకు సాగించుచున్న మీ మహోద్యమము భావితరాలకే ఆదర్శము.

ఆదర్శ దంపతులరా !

పసిడికి తావివలె మీ సతీమణి సరస్వతమ్మ మీకు చేదోడు వాదోడుగా నిలిచి కారాగార క్లేశమునుగూడ ననుభవించి రైతాంగ ఉద్యమ చరిత్రకే వన్నె తెచ్చినది. ఆంధ్ర రైతాంగానికే ఆదర్శ ప్రాయులైన మీ పుణ్యదంపతులు ఆయురారోగ్యఐశ్వర్యములతో చిరకాలము వర్థిల్లి మాకు నాయకత్వము వహించి మార్గదర్శకులై వెలుగొందుదురుగాక, మీకివే మా మంగళనీరాంజనములు. మా హృదయపూర్వక కైమోడ్పులు.

మేదరమెట్ల — ఇట్లు

12-10-66. — ఆహ్వాన సంఘము

ఆంధ్ర ప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మహాసభలు

## రైతు సర్దార్
## శ్రీ గొర్రెపాటి సన్మాన సభా విశేషాలు

ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మాజీ అధ్యక్షులు ప్రముఖ రైతు నాయకులు శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి సన్మానసభ ఒంగోలు తాలూకా మేదరమెట్లలో అక్టోబరు 12 వ తేదీన రంగాజీ సమక్షంలో సర్దార్ గౌతు లచ్చన్నగారి అధ్యక్షతన అతివైభవంగా జరిగినది.

సన్మాన సంఘాధ్యక్షులు శ్రీ నాగినేని వెంకయ్యగారు సన్మానపత్రం సమర్పించారు. శ్రీ వెగిగళ్ళ వెంకటసుబ్బయ్యగారు - శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారికి, శ్రీ రాజగోపాల నాయుడుగారికి, హరిజన నాయకుడు శ్రీ సిద్దయ్య మూర్తిగారికి నూతన వస్త్రాలు బహుకరించారు. వివిధ సంస్థల తరపున వ్యక్తులు శ్రీ వెంకట సుబ్బయ్యగారిని పుష్పమాలలతో సత్కరించారు.

సన్మాన సభాస్థలిలో ఆసీనులైన నాయకులు శ్రీయుతులు చల్లగుళ్ళ నాగభూషణం. వల్లూరి వీరయ్య, మువ్వా చంద్రశేఖరరావు (న్యాయవాది), కొరిసేపాడు సమితి అధ్యక్షులు గోరింట్ల రాఘవయ్య, కందిమళ్ళ బుచ్చయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, గుళ్ళపల్లి గోపాలకృష్ణమూర్తి, భూపతిరాయుడు గార్లను శ్రీయుత రామమూర్తి ప్రజలకు పరిచయం చేశారు.

పూజ్య రంగాజీ శ్రీ వెంకటసుబ్బయ్యగారి రైతు భక్తినీ, సేవనూ కొనియాడుతూ వారిని ' రైతు సర్దార్' బిరుదుతో సత్కరించి కౌగలించుకున్నారు.

ఈ సందర్భంలో ప్రసంగించిన వక్తల సూక్తులు.

' శ్రీ వెంకట సుబ్బయ్యగారి అడుగుజాడలే మనకు శరణ్యం '

- శ్రీ రాజగోపాలనాయుడు.

' వెంకట సుబ్బయ్యగారు స్థిరచిత్తులు, సత్శీలురు రంగాజీ శిష్యులలో అగ్రగణ్యులు '

- శ్రీ పసుపులేటి కోటేశ్వరరావు.

' ఆదర్శమూర్తి మన గొర్రెపాటి '

- శ్రీ లచ్చన్న.

' ఈ దినం ఆంధ్ర రైతాంగానికే పర్వదినం. శ్రీ వెంకట సుబ్బయ్యగారి చరిత్రయే రైతు ఉద్యమ చరిత్ర'

- శ్రీ సుంకర సత్యనారాయణ

పూజ్యులైన శ్రీ వెంకటసుబ్బయ్యగారికి ఆయురారోగ్యాలు ప్రసాదించమని ఏడుకొండలవాడిని

వేడుకొంటున్నాను.

- శ్రీ సిద్దయ్యమూర్తి

' రైతుపిత రైతు భక్తి రైతులెంకయగు మన వెంకటసుబ్బయ్యగారిని సన్మానించుకోడం రైతు ధర్మాన్ని సన్మానించుకోవడమే'

- శ్రీగాదిరెడ్డి హనుమంతరావు.

' నా కిప్పుడెంతో సంతోషం, గర్వం, తృప్తి కలిగాయి'

- శ్రీ రంగా

తనకు జరిగిన సన్మానానికి శ్రీ వెంకట సుబ్బయ్యగారు సమాధానం జెప్పి కృతజ్ఞత వెల్లడించారు.

ఆహ్వాన సంఘ ఉపాధ్యక్షులు శ్రీ రావి అంకమ్మ చౌదరి వందన సమర్పణ చేశారు.

మేదర మెట్లలో జరుగబోవుచున్న ఆంధ్రరాష్ట్ర రైతుసమ్మేళన సందర్భములో 6-10-66న రంగాగారికి, వెంకటసుబ్బయ్యగారిలా వ్రాశారు. " ఆహ్వాన సంఘాధ్యక్షులు నాగినేని వెంకయ్యగారు, గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారికి సన్మానము " అంటూ ప్రకటించిరి. నా సన్మానమువలదని వ్రాసితిని అయినా ప్రకటించిరేమి ? మీరు మేదరమెట్ల సభలకు దయచేసి సభలను జయప్రదము చేయించ ప్రార్థితులు.

దానిని పురస్కరించుకొని రంగాగారిలా వ్రాస్తున్నారు. మేము సన్మానపత్రాన్ని వారికి అర్పించితిమి. మేమందరము మా ప్రేమాభిమానములను వారి కర్పించితిమికూడ పోతే వారి ధోరణి అలాంటిది.

అయితే తెనాలిలో జరిగిన బ్రహ్మాండమగు ఆంధ్రరాష్ట్ర రైతు సభలోకూడా వారికి తెలియకుండానే సన్మానము చేసుకోగలిగితిమి.

## రాష్ట్ర రైతు నాయకులం

శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు కిసాన్ సమ్మేళన్ మహాసభలకు తెనాలి విచ్చేసిన సందర్భమున ఆహ్వాన సంఘం సమర్పించిన

## స్వాగత సుమాంజలి

రైతు నాయకాగ్రణీ !

రంగాజీ రైతుగాన మధురీ రసా స్వాదనతో నలుబది ఏండ్లగా మీరు చేస్తున్న శ్రామిక సేవకు ఇదేమా కైమోడ్పు. సమున్నత పర్వత శిఖరాలనుండి ధరాతలంపైకి దుమికే శ్రామిక ఘర్మధారల వర్ణింపనెవరికి శక్యము. అట్లే మీ రైతు భక్తి సుధారసధారను మాత్రము వర్ణింప మాటలలో సాధ్యమా ! రైతులో అనుక్షణము దైవత్వాన్ని పరిపూర్ణ మానవత్వాన్ని సందర్శించగల శ్రామిక తత్త్వవేత్తపు మీకిదే మా స్వాగత సుమాంజలి.

నిస్వార్థసేవా పరాయణా !

ఆచార్యుని నాయకత్వములో అనేక పోరాటములు నడిపి కష్టించి ఆర్జించిన రైతు స్వేచ్ఛ 17 వ రాజ్యాంగ సవరణ పేరుతో ప్రభుత్వ గద్దలు తన్నుకుపోతూవుంటే నాడు మీరు పడినబాధ, అవేదన - అందుకు మీరు సాగించిన కృషి జగత్ప్రసిద్ధము. కిసాన్ సమ్మేళనం పేరు వినిపిస్తే వెంటనే మీ రూపం మా మనోఫలకాలపై తళుక్కుమంటుంది. అదే మీకూ రైతుకువున్న అనుబంధం. మీకూ ఉద్యమానికీ వున్న సంబంధం.

రైతు బాంధవా !

రైతు కూలీ ప్రజారాజ్య స్థాపనకై రంగాజీ సాగిస్తున్న పోరాటములో మీరు సర్వ సైన్యాధ్యక్షులై నిస్పృహ చెందక నేటికి మీరు సాగిస్తూన్న పోరాటం చూస్తూంటే మీ రెంతటి సుదృఢ చిత్తులో, ఎంతటి

కృషికారులో, ఎంతటి స్వతంత్ర పిపాసులో అర్థమవుతూంది. మీరులేని రైతు వుద్యమమేలేదు. రాష్ట్ర స్వతంత్ర పార్టీకి ప్రప్రథమ అధ్యక్షులై ఉద్యమ పెంపుదలకు మీరు నాటిన బీజమే " వివిధఫల భరానతశాఖ శిఖాతరు వరమై " నేడు రాజిల్లుచున్నది. మీరీ సభలకు వస్తే రాష్ట్ర రైతాంగమే కదిలివచ్చినట్లున్నది. రైతు లోకానికి, రైతాంగ ఉద్యమ నిర్మాత రంగాజీకీ అండగా పదికాలాలపాటు మీరు వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

తెనాలి ఇట్లు
10-2-68 ఆహ్వాన సంఘము
కిసాన్ సమ్మేళన్ మహాసభలు

చిత్రం
గురువు శిష్యుని సన్మానించుట

## గుణగణాలు

మన వెంకట సుబ్బయ్య గారిది అధికంగా రైతు సవభావము. ఈనాటి రైతాంగము కాదు; పూర్వకాలపు రైతాంగానిది.

ఆయనలో మనకు అధికంగా కపపడేది ఆయన పెదతండ్రి వెంకయ్యాగారి స్వభావములు. ఆయన పట్టుపట్టేవాడు కాదు. పట్టేవిడిచేవాడు కాదు. ఆయహార విహారాలలో ఆయనకు ఎబ్బెరెకము ఉండేది కాదు. ఆయన చరిత్ర చదివిన వారికి విదతము కాగలదు. మన రంగాగార కూడ మన వెంకటసుబ్బయ్య యొక్క పట్టుదలను గురించి వ్రాసే ఉన్నారు. పూర్వకాలపు వారిలో విశ్వాసము అధికము. నమ్మితే నెరనమ్మటమే. ఈయనలోను అంతే.

ఈ గణాలు కలవారు ఇంకొకరు మా గ్రామములో మా అందరకు మిత్రుడైన దోనేపూడి సీతారామ్యగారొకరు. ఆయన ఎవరు చెప్పినా వినడు. లాభనష్టాలను గణించడు. చావు బ్రతుకులకు వెరవడు.

మన వెంకట సుబ్బయ్యకు పాశ్చాత్య నాగరికత మోజు తక్కువ. ఇంటా బయటా ఒకటే డ్రస్సు, సభలకు వెళ్ళినా పరాయి ప్రాంతములకు వెళ్ళిన అంతే. ఇళ్లల్లో కరెంటు, రేడియోలు పెట్టడం ఆయన కిష్టంలేదు. ఎందకు కివన్ని మన రైతాంగానికి అనవసరము అని ఆయన అభిప్రాయము. కరెంటు మన వ్యవసాయ అవసరాల కుపయోగించుకోవాలి గాని ఇతరత్రా పెట్టరాదని అనేవాడు. అయితే ఆయన ఇంట్లో కరెంటు ఉందే అని అనవచ్చును. ఆయన లేని సమయంలో ఆయనర కుమారుడు పెట్టించాడు ఆయన చాలా పొదుపరి. మెతుకు పోతే బ్రతుకు పోతుందనే పూర్వకాలపు మాదిరి. ఈనాటి ఆడవాళ్ళు దుబారా ఖర్చుచేస్తారని ఆయన అభిప్రాయము. "భారతీదేవి ఎలా కొద్ది కొద్దిగా వర్ధన చేస్తూంటుందో ఆ మాదిరి వర్ధన చేయాలి. ఒక్క సారే వర్ధించరాదు. అది మార్యాదకు మర్యాద ; పొదుపరి తనానికి పొదుపరి తనము " అని అంటూండేవాడు.

పూర్వకాలపు ఆడవాళ్ళు ఎన్నోపనులు చేసేవారు. ఈకాలపు వారికి పని మనుషులు. మన కమ్మవారి ఆస్థిపాస్థులు పురుషులవలన నిలవలేదు. స్త్రీలవలన నిలిచినవి వారెంతో పొదుపరులు కాబట్టే.

ఆయన ఏ కాగితాన్ని పారేసేవాడు కాదు. ప్రతి దానిని జాగర్తగా దాచేవాడు.

ఒకసారి ఢిల్లీ అరగిన చెప్పుల జత తొడుక్కుని వెళ్ళాడు. వారు, వీరు అడిగితే మన జాతి ఇలాగే ఉండాలి అన్నాడు.

తన ధర్మాన్ని తాను నెరవేర్చాలి అనేదే ఆయన భావన. అందుకు ప్రతిఫలాపేక్ష ఆయనకు లేనేలేదు.

రేపటిపని ఇవాళే చేయాలనేవాడు. కార్యక్రమమంతా ఉత్తరాల ద్వారా జరిగితే ఎంత బాగుండును.

చివరదశలో ఆ వారం వాహిని ఎలా నడపడం అనేదే ఆయన ఆలోచన.

ఆయన స్వతంత్ర పార్టీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు లెక్కలు సరిగా లేవని ఒక పెద్ద మనిషి ఆక్షేపించగా రంగాగారు ఆడిట్ చేయించాడు. ఆడిట్ రిపోర్టు ఆ పెద్ద మనిషికి చూపించాడు. ఆపెద్ద మనిషి అయ్యో

నాదే పొరపాటని మాటసామెత కయినా అనలేదు. ఇలా ఉంటవి ఆరోపణలు.

తన కార్యక్రమమంతా ఒక పుస్తకంమీద వ్రాసుకొనేవాడు.

ఆయన సేవావ్రతుడు. ఇతరులచేత చేయించుకొనేవాడు కాదు. ప్రతి పని స్వంతముగా చేసుకొనేవాడు.

అవసరమును బట్టి ఆ పని చేయమని ఎవరికయిన పురమాయిస్తే ఆయన చేయకపోతే విసిరి కసిరేవాడు కాదు. తానే చేసుకోనేవాడు.

గాంధీజీ తరువాత ఆచార్యరంగాగారే ఆయనకు నచ్చిన వ్యక్తి, సజ్జనుడు గురువు.

రంగాగారు రాముడైతే తాను హనుమంతునిగా భావించుకొనేవాడు.

ఆయన కోపము నీటిమీద గీత వంటిది.

ఆయనలో ఏ మాత్రము కోపముకనుపించినా రంగాగారి మాట ఎత్తేసరికి ఎగిరిపోయేది.

ఆయన కారము తక్కువ తినేవాడు. కూరలు ఎక్కువ తినేవాడు. మనము అధికముగా అన్నలో కూరలు కలుపకుంటాం. ఆయన కూరలలో అన్నం కలుపు కుంటాడు. సవాశేరు వంకాయలు కూరైతేగాని ఆయనకు సరిపోయేది కాదు. ఆయన పశువుల దొడ్డిలో అధికంగా కూరకాయలు కాయించేవాడు. ప్రతిరోజు ఏదో కూర కాయలు మూటవేసుకొని వస్తూండేవాడు. మొదట్లో మంచి ఆహార పుష్టి కలవాడు. నేతిగిన్నెనిండా నెయ్యి ఉంటేగాని పూరుకునేవాడు కాదు. మంచినీళ్ళు త్రాగటానికి గ్లాసు చాలేదికాదు మరచెంబు కావాలి.

క్రమంగా ఆయన ఆహారము స్వభావము కూడా చాలా మారింది. విజయవాడ వచ్చిన తరువాత స్వయంగా వుండుకోవడం, ఒక్క దోసకాయ పచ్చడి చేసుకోవడం అంతతోనే సరిపుచ్చు కోవడం.

ఆయనకు, జబ్బు చేయడం, తరువాత ఆయన భార్య విజయవాడ రావడం, ఆయనకు తగిన వంటకాలు చేసిపెట్టడం, ఆయనను కంటికి రెప్పవలె కాపాడడం అందరకు తెలిసినదే.

రంగాగారివలె ఆయర రాయలసీమభాషనేవాడేవాడు ఆయన వలె స్త్రీలను ప్రశంసించడం, తన భార్యను, భారతీదేవిని ఎలా భావించేవారో అది మాత్రము ఈయనకు అలవడలేదు.

మన దేశంలో దేవతలు, దానవులేగాని మానవులు కనపడరిని డా ॥ రామలింగారెడ్డిగారు ఒకసారి అన్నాడు. ఇది వాస్తవమయిన మాట. మనమంతా పురాణ పురుషులం. మన పురాణాలలో దేవదానవలు తప్పితే మరొకరు లేరుగదా! అలాగే మనము ఎత్తితే మనిషిన స్వర్గాని కెత్తుతాం. లేకపోతే పాతాళానికి తొక్కుతాం. మనిషిని మనిషిగా చూచే అలవాట్లు మనకు ఇంక అలవడంలేదు.

మానవుడంటే గుణదోష సహితుడు. ఈ సంగతి మనము గుర్తించాలి. దీనికి రామలింగారెడ్డిగారి ఉదాహరణే ఇస్తాను.

మద్రాసు గోఖలే హాలులో ఒకరు రామలింగారెడ్డిగారిని గురించి చెప్పతూ ఈయన సచ్ఛీలుడు, బ్రహ్మచారి అన్నాడు. అటు తరువాత రామలింగారెడ్డిగారు ఉపన్యసిస్తూ మా మిత్రుడు నన్ను గురించి పలికిన పలుకులు అభిమాన పూర్వకమైనవే. నేను బ్రహ్మచారినికాదు. అవివాహితుడును. నేను ఋజువర్తనుడను కాదు, నా ముఖమే తార్కరణము. ఆయన ముఖము ఒక పార్శ్వము నల్లగా ఉండేది.

ఈ మాదిరిగా స్తోత్ర ప్రియాలకు, అసత్య వాక్కులకు ఎంత దూరంగా వుంటే అంత మంచిది.

మన వెంకట సుబ్బయ్యకు, ఎంత ఆరోగ్యముగా ఉందామనుకున్న శైత్యభారము అధికంగా వుండేది. అందువల్లనయితేనేమి మరే కారణమయితేనేమి ప్రకృతి ఆహారం కొంతకాలం సేవించాడు. పండ్లు, ఫలములుకాదు నానబెట్టి మొలకెత్తిని గింజలు.

ఈనాటి నాగరికత, అనవసర వస్తువులను అవసరంగా భావించడమనేదే ఆయన భావం. అందువల్ల కోర్కెలు సాధ్యమయినంత వరకు తగ్గించుకొనడమే ఆయన స్వభావము.

స్వేచ్ఛా దారిద్ర్యములో ఉన్న ఆనందము అక్రమ సంపాదన చేసేవాడికేమి తెలుస్తుంది ?

ఒక ఆఫీసురు సైకిలుమీద వెళ్తున్నాడు. ఏమండి మీరు సైకిలు మీద వెళ్తున్నా రేమిటి కారు మీద వెళ్ళక అన్నాడు. " నేను గడ్డితినే మనిషినికాదండి. గడ్డితింటే గాని కార్లు ఇతర ఆడంబరాలు రావు."

Simplyfy yourself అనే థోరో ఆదర్శమే ఆయన ఆదర్శము. ఇవన్నీ పుస్తకాలు చదివి ఆయన నేర్చుకుందా కాదు కొందరు పుస్తకాలు చదువుతారు వాళ్లు పుస్తకాలపురుగులే. వారికేదీ అంటదు. అందుచేతనే అన్నాడు వివేకానందస్వామి ‘ పుస్తకాలనుబట్టి ఎవరిని ఆలోచించ వద్దని ’ గ్రంథాలు చదివి ఎంతమంది బాగుపడ్డారు ? కొంత ప్రయోజనం లేకపోలేదు, అయినా చదివినందువలనే సచ్ఛీలుడు కాలేడు.

అసలు ధర్మమంటే తెలియని వాడు ఎవరు? ధర్మము తెలియక పోవడం కాదు మన లోపము. ఆచరించ పోవటమే. ఆయన షడ్రుకుడు దోనేపూడి సుబ్రమహ్మణ్యంగారు తనతో కలసి వ్యాపారం చేయడానికి కోరగా ఆయన నిరాకరించారు.

ఏం ? వెంకటసుబ్బయ్య బెజవాడ వెళ్ళకపోయావా ? కూర్చుని సంపాదించవచ్చు అంటే అసత్యాలు మనము ఆడలేము. అక్రమ సంపాదన మనకిష్టము లేదు అన్నాడు. మిత్రునితో.

ఆయనకు మంచి కార్యకర్తను చూస్తే చాలాసంతోషము కలిగేది.

తనకు తగిన వేషం వేసుకోవాలనే అనేవాడు. డాబు, దర్పం ఆయను పనికిరావు.

వాహినిలో ఆయన తీసుకునేది ప్రయాణ ఖర్చులే. ఇంటినుండి బియ్యం పగయిరాలు తెప్పించుకుంటూ నెలకు 200 రూపాయలు రొఖ్ఖం కూడ తెప్పించుకొనేవాడు. ఈ మాదిరిగా సేవాధర్మము గల వానిని మీ రెక్కడయినా చూచూరా ?

## జీవత సూత్రం

ఒక వ్యక్తిని గురించి తెలిసిందంతా చెప్పటం జీవిత చరిత్ర కాదు.

ఆయన చేసిన కార్యాకలాపాలన్నీ వ్రాసుకుపోవటం ఆయన్ను గురించి చెప్పటం కాదు.

" Telling you what I have done, is not telling you what I am "

మానవుని స్వభావాన్ని , ప్రవర్తనను నిర్ణయించే ప్రధాన శక్తిని, జీవిత సూత్రమంటారు. లోకమాన్యుని జీవిత సిద్ధాంతం “ శఠం ప్రతి శాఠ్యం ”. మన పటేలుగారిదీ అంతే.

ప్రకాశం సాంబమూర్తి దర్శి చంచయ్యగార్లది యుద్ధవీరం. భయ మెరుగనియోధులు. వారు త్యాగులు, సాహస విక్రమార్కులు.

వీరుశలింగం గారిది ధర్మవీరం. ఆయన కలాన్ని ఖడ్గంగా ఉపయోగించిన సాహిత్య శస్త్రుడు. ధర్మాన్ని అక్రమాన్ని చీల్చి చెండాడిన చండ భాస్కరుడు.

మహర్షి వెంకటరత్నంగారిది దయావీరం. ఆయన శరశ్చంద్రుడు.

పట్టాభిగారిది ఆర్థిక దృక్పధం.

ముట్నూరి కృష్ణారావు గారిది రసదృష్టి. ఆయన పత్రిక, ఆయన ముగ్ధమోహన వేషం గాంచిన వారికి వేరే చెప్పవలసిన పనిలేదు.

నాగేశ్వరరావుగారిది సమన్వయ దృష్టి. ఆచార్యరంగాగారు కర్షకోద్యమ నిర్మాత.

దారీతెన్ను లేని రైతాంగానికి దారిజూపిన మహాభాగుడు మన రంగాజీ. మట్టి ముద్దలనుండి మహామాన్వితులను సృష్టించిన ఆచార్యుడాయన.

గంగా ప్రవాహం లాంటి వాగ్ధోరణితో శ్రోతలను మంత్రముగ్ధులను చేయగల మహవక్త ఆయన.

పరులు దూషణ భూషణలను, ఆరోపణలను ఆరాధనలు, స్వీయకష్ట సుఖాలను, ప్రభుత్వమువారి లాలనలను, బెదిరంపులను గమనింపక, పట్టినపట్టు విడువక మేరునగధీరుడై మెలగువాడు.

ఆయన ప్రచండ ప్రచారకుడు, అసమాన ఆందోళనాకారుడు, నిరుపమాన నిర్మాణ నిపుణుడు, నిరంతర సంచారి. గొప్ప పార్లమెంటేరియన్.

సాహసము ఆయన సొమ్ము, త్యాగము ఆయన విశిష్టత, ప్రజాసేవా తత్పరత ఆయన ఆశయము.

తాను పలికేదే పరమ సత్యం. తాను సలిపేదే ఆచరణ యోగ్యం అనే ఆత్మ విశ్వాసం కలవాడు. ధర్మదుందుభి ఆయన వాక్కులలో ప్రకటితమగును. ఉద్యమాలకు ఉరవడి, ప్రోత్సాహము ఒక్కుమ్మడిని

కల్గించుటలో ఆయన నిధి.

రైతు అన్నదాత, అతడు చెమటోడ్చి రక్తము కార్చి, భూమి నుండి అన్నాన్ని వెలికి తీస్తున్నాడు. ఇతరుల కింత పెడుతున్నాడు. అతడే లోకానికి జీవగర్ర, వెన్నెముక యని ఆయన విశ్వాసము. ఆర్యుడనగా కర్షకుడు అనగా పూజ్యుడు, గౌరవార్హుడు.

ఈ మహా సత్యాన్ని భారత రాజకీయాలలో ప్రప్రధమంగా ప్రజల దృష్టికి తెచ్చింది ఆయనే, రైతు ప్రాధాన్యాన్ని పేర్కొంటూ కర్షక వృత్తి కేవలలం ఒక వృత్తికాదని అదొక జీవన విధానమని ప్రవచించిన కిసానోద్యమ నిర్మాత ఆయన.

ఆయన ఆలోచించినా,మట్లాడినా, వ్రాసినా రైతును గురించే. ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో కర్షకభ్యుదయము వివవస్తుంది.

అందుచేతనే, నాగపూరు కాంగ్రెసులో నెహ్రూ సమిష్టి వ్యవసాయ తీర్మానం, సహకార వ్యవసాయ ప్రణాళికా నినాదం, ప్రబలినప్పుడు, అది అనర్ధదాయకమని ఎలుగెత్తి చాటి, నిరోధించాడు.

గాలి నీరు వంటిదే భూమియని వినోబాభావే ప్రచారముచేస్తూ భూమి ఒకరి సొత్తుగా నుండరాదన్నప్పుడు దాన్ని ఖండించింది ఆయనే.

"రెడ్ ఇంటర్నేషనల్"కు ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ కర్షక వ్యవస్థను "గ్రీన్ ఇంటర్నేసనల్" స్థాపించింది ఆ మహామహుడే.

కంట్రోళ్ళు పోవాలనీ, రైతులకు గిట్టుబాటగు ధరలు కావలనీ, పల్లెలకు పట్టణాలకు మధ్య తారతమ్య ముండరాదనీ, భారతావనిలో ఈ మాటకు రాజకీయ విలువ గలుగజేసినది రంగాజీయే.

రైతు కూలీ ప్రజా రాజ్యమనే నినాద సమ్మోహనాస్త్ర ప్రచారం చేసిన ప్రముఖు డాయనే.

అధికారం లేకనే అధికారులతో, రైతుల పక్షాన పోరాడుతూ, దేశనాయకులలో ఉన్నత స్థానమధిష్టించిన రాజకీయవేత్త ఆయనే.

ప్రపంచ పక్షాలలో ఆయనది ఉత్పత్తిదారుల పక్షం, కష్టజీవుల పాలిట ఆయన కల్పతరువు రైతుల ఆపదలన గడవం బెట్టుటలో ఆయన అందెవేసిన చేయి. వేయేల ? ఆయన కర్షక సఖుడు, సారధి, సచివుడు. గురువు, ఏమికాడు ? అధికార తృష్ణల కర్దమత్తులకు భోగ దాసిగనున్న భూదేవి దాస్యముబాప కారణ జన్ముడైన కర్షకోద్యమనిర్మాత మన రంగాజీ !

ఇక మన వెంకటసుబ్బయ్య జీవితసూత్రం చెప్పుకుందాము. ఇంటా బయటా, కారాగృహములో, కార్యకలాపాల్లో, ఆయన దంతా సేవావ్రతము. జిల్లాబోర్డు ఉపాధ్యక్షుడుగా ఉండి కూడా ఆయన అధికారం చెలాయించలేదు. సేవా వ్రతమునే బోధించాడు. ఆయన సేవా తపస్వి.

ఆచార్యరంగాగారు, ఆయనను గురించి వ్రాసిందికూడా గమనార్హము " జిల్లాబోర్డులపై వ్యామోహం, జిల్లా కాంగ్రెసు సంఘాల పెత్తనాలపై ఉత్సాహం చూపెట్టుకుంటూ, ఎప్పటెప్పటి నుంచో, నాతో పాటు తాము చేస్తూవుండిన సేవా కార్యముల స్పురణకు తెచ్చుకుంటూ, పై పెత్తనాలకు వత్తిడి తెస్తూవుండరి. ఆనిటి ప్రధాని అన్యాయంగా , ఆకస్మాత్తుగా ఇలాంటివారికి బోర్డుల పాలన చెందిపోవుననే భయోన్మాదులైనవారి, సలహాప్రకారం, బోర్డు ఎన్నికల నాపివేస్తే ఫరవాలేదరు. పైగా కాంగ్రెసు సేవా కార్యాలకే సౌకర్యమని నేనంటూ వుంటే, బాధపడ జొచ్చిరెందరో, ఆశాభంగులైన నా అనుచరులు. ఇలాంటి తాపత్రయాలకు లొగని ప్రధాన నాయకుడొక్కడే. అతడే వెంకట సుబ్బయ్య. రాష్ట్ర రైతు కాంగ్రెసునే పెంచుకుంటూ, పోషించుకుంటూ, ఎందరెందరో తమ బాధ్యతన ఎడల నాడు హృదయ మివ్వక హెచ్చుకాలం, కాంగ్రెసు ఎన్నికల హడావుడిలో వృధా చేసుకుంటున్నా, విసుగొందక, ఎన్నాళ్ళనుండో, మేము నమ్ముకొని, చెప్పుకొని, ఆచరించదలచిన రైతుసేవా మార్గమందు తానే చుక్కానిగా నిల్చి యుండెను. హిమాద్రివలే కాపలాకాయు చుండెను.

.... వారియందు మూర్తిభవించిన పట్టుదల, కార్యశూరత, సేవా పరతంత్రత ఆదర్శప్రాయమైనది.

" ఇంతటి మాంధాత రైతు ఉద్యమానికి దొరికినందుకు భారత రైతాంగాము అదృష్టవంతులు. వారు కుడి భుజమని చెప్పుకోగల్గుచున్నందులకు మా దంపతులం అదృష్టవంతులం."

**మనకిసాన్ వెంకట సుబ్బయ్య**

(జమీన్‌రైతు 3-7-1953)

జమీన్ రైతు పత్రికా సంపాదకుడు నెల్లూరు వెంకట్రామానాయుడు గారి మరణానికి మన వెంకట సుబ్బయ్యగారు పంపిన

## సంతాప సానుభూతులు

నాయుడుగారి అస్తమయవార్త వినేసరికి నా మనస్సుకు అవేదన, విచారం కలిగింది. నాయుడుగారితో నాకు గత 30 సంవత్సరాలుగా " జమీన్ రైతు ఉద్యమం " ద్వారా పరిచయమున్నది. నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వ అండగల జమీందారీల రద్దుకై ఆంధ్ర రాష్ట్రంలో సాగించిన అనేక పోరాటాలు తలచుకుంటే, నాయుడుగారి వంటి వ్యక్తి మన కెవ్వరు కనిపించరు. జమీందార్లుంటే హడలుగావున్న ఆ రోజులలో రైతుల రక్షణకై " జమీన్ రైతు " పత్రిక స్థాపించి నాబోంట్ల సహకారంతో ఏటికి ఎదురీతగా ధైర్యంతో జమీందార్లు, వారి ఏజంట్లు ఎన్ని బాధలు పెట్టినా, అవమానపరిచినా, నష్టపరచినా సాహసంతో అన్నీ సహించి, పత్రికద్వారా జమీన్ రైతు ఉద్యమానికి ఎంతో బలాన్ని చేకూర్చి జమీందారీ నిరంకుశత్వానికి బలిఅవుతున్న రైతులకు ప్రాణదాతగా నిలిచి నిరాడంబరత్వం, నిస్స్వార్థ దృష్టితో తమ జీవితాన్ని , సేవాధర్మాన్ని నిర్వర్తించిన ఆదర్శ వ్యక్తి నాయుడుగారు. ఆంగ్లబాషలో పరిచయము లేకపోయినా, ఆంగ్లంలో పండితులకంటే ఎంతో మిన్నయైన భాషాజ్ఞానం, రచనాశక్తి, హాస్య ప్రసంగాలు, ధీరత్వంతో కూడిన ఉపన్యాసాలు " మా కొద్దీ జమీందార్ల పొందు" "చిలుక" మొదలగు పాటలు వారి జీవితాన్ని మన హృదయాల్లో మరపుకాకుండా నిలుపు తవిడదా ! అనేక మంది ప్రముఖ వ్యక్తులు కాల గర్భములో కలసిపోతున్నారు. రైతు ఉద్యమానికి కుడిభుజముగా నిలిచియుండటయేగాక, తమ జీవితసర్వస్వం ఉద్యమానికే అర్పణచేసిన వ్యక్తి మన నాయుడుగారు. రంగాజీతో ప్రారంభమైన 1928 వెంకటగిరి ఉద్యమం తలుచుకుంటే, ఆనాటి యువకులకు ధీరత్వం, నాయకత్వం, ప్రభోదం, " జమీన్ రైతు ప్రతిక ద్వారా నాయుడు గారు అందిచనవే కదా ! జమీందార్లను , ఇనాందార్లను గడగడలాడించి రైతులకు బలం కలిగించారు. ఆనాటి రైతాంగ ప్రేమపాత్రుడు, ఆదర్శ ప్రజాసేవకుడు ధీరుడు అయిన మన నాయుడుగారిని మరచిపోజాలము. వారి పట్టుదల, గుణగుణాలు చిరస్మరణీయంగా ప్రజానీకములో నిలిచిపోవుటకు వారిజీవిత చరిత్రకు జ్ఞాపక చిహ్నము ఏర్పాటుచేయట వారి సహచరులమైన మనందరీ యొక్కయు, పవిత్ర కర్తవ్యం. చిరకాలం మిత్రడు మనలకు వదలి పోయినందులకు ఎంతో దుఃఖపడుతూ వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్థిస్తూ విచారసాగరంలో మునిగియున్న వారి కుటుంబానికి నాసానుభూతి తెలియజేస్తున్నాను.

( జమీన్ రైతు 13-2-1959)

శ్రీయుతులు చలపల్లి రాజాగారి షష్టిపూర్తికి ఆశ్సీసులు పంపుతూ మన వెంకటసుబ్బయ్యగారు ఇలా వ్రాసారు.

శ్రీయుతులు యార్లగడ్డ శివరామప్రసాదు గారు, షష్టిపూర్తి మహోత్సవం జరుపుకుంటున్నందుకు ఈ సందర్భంగా తమ స్వగ్రామైన చల్లపల్లి గ్రామంలో కాలేజీ నిర్మాణం చేయుటకు పూనుకున్నందకు సంతోషపడుచున్నాను. ఇలాంటి శాశ్వత అభివృద్ధి కార్యాలు తాలూకా ప్రజానీకానికి తమ బిడ్డలు కాలేజీ అభ్యసించి అభివృద్ధి పొందుటకు ఎంతో ఉపయోగపడును.

శ్రీ రాజాగారు పరిపాలనా భాద్యత స్వీకరించినప్పటి నుండి వారి ఆర్ధికస్తోమతు హెచ్చుగా రాజకీయాలకే ఉపయోగించిరి. చల్లపల్లి గ్రామంలో ప్రజలకు సంబందించిన సౌకర్యాలు ఏర్పడవలసినవి ఇంకా కలవు. వాటిని శ్రీ రాజాగారు దృష్టిలో ఉంచుకుని పూర్తి చేయాలని నా కోరిక. వారి షష్టి పూర్తి సందర్భంగా కాలేజీ ఏర్పడుటకు శ్రద్ధ వహించిన షష్టిపూర్తి మహోత్సవ సంఘం వారు ప్రశంసనీయులు.

ఇలాంటి ప్రజోపయోగకరమైన ధర్మకార్యాలు పూర్తి చేయటకు భగవానుడు శ్రీ రాజగారికి పూర్ణయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుచున్నాను.

26-10-66 షష్ఠి పూర్తి సంచిక "55" వ పుట దీనిలో మన కిసాన్ వెంకటసుబ్బయ్య హృదయం

వెల్లడికాగలదు.

## కిసాన్ వెంకటసుబ్బయ్యగారి అన్తమయం

శోకసంతప్త ప్రజానీకం తుది వీడ్కోలుతో ఘంటశాలలో ప్రియతమ నాయకుని అంతిమయాత్ర:

గత కొలది నెలలుగా మూత్రపిండ సంభందమైన వ్యాధితో బాధపడుతున్న శ్రీ వెంకట సుబ్బయ్యగారు రెండు నెలల నుంచి గుంటూరు గవర్నమెంటు జనరల్ హాస్పటల్‌లో చికిత్సపొందుతున్నారు. ఈ రెండు నెలల్లో రెండు, మూడు ఆపరేషన్‌లు జరిగాయి. అయిన పూర్తి స్వస్థత చిక్కలేదు. త్వరలో పునరారోగ్యవంతులు కాగలరని ఆశించగా, ఇంత ఆకస్మత్తుగా ఈ నెల 10 వ తేదీ సాయంత్రం గం॥ 4-05 నిమిషాలకు కనుమూసారు. ఇటీవలెనే వారిని ఆచార్య రంగాజీ, సర్దారు లచ్చన్న, పీ. రాజగోపాలనాయుడు, హెచ్. ఆర్. శాయోజీ రావు మున్నగు నాయకులే గాక , అసాంఖ్యకంగా బంధుమిత్రులు , అభిమానులు హాస్పటల్‌కి వెళ్ళి సందర్శించారు. వారి ఆర్యోగాన్ని ఆశించారు. అయితే విధి వేరుగా ఉంది.

10 వ తేది రాత్రి శ్రీ వెంకట సుబ్బయ్యగారి భౌతిక కాయాన్ని వారీ సతీమణి సరస్వతమ్మగారు, కుమారుడు కుటుంబరావు గారు స్వగ్రామమైన ఘంటశాలకు తీసుకొనిరాగా, గ్రామమంతా ఈ హఠాత్సంఘటనకు శోకసంతప్తమైపోయింది. తెల్లవారేసరికి ఈ మహానాయుకుని మరణ వార్తను పత్రికలు , రేడియో మోసుకొనిరావడంతో నాయకులు, అభిమానులు , బంధుమిత్రులు విచారసాగరంలో మునిగిపోయారు. శ్రీ వెంకటసుబ్బయ్యగారి అంతిమ దర్శనం సాద్యంకాగలదని భావించిన వారంతా చిన్నకారులలో , బస్సులలో, హుటాహుటిన ఘంటశాలకు వచ్చేసారు.

తెల్లవారుతూనే శ్రీ వెంకటసుబ్బయ్యగారి అంతిమయాత్ర వారి స్వగ్రామం నుంచి ఆరంభమైంది. శోకవివశ్య ప్రజానీకం కదలివచ్చింది. ఘంటశాల గ్రామం యావత్తు విచార సాగరంలో మునిగిపోయింది. పాఠశాలలు, వ్యాపారకేంద్రాలు మూతపడి మూగపోయినాయి.

కిసాన్ నాయకుని ప్రజలు తుదిసారి దర్శనానికై అనువుగా వారి భౌతిక కాయాన్ని ట్రాక్టరకు అమర్చిన ట్రయిలరుపై ఏర్పాటు చేయబడినది. వందల పూలమాలలు వారి భౌతిక కాయాన్ని కప్పివేసాయి. పూలవాన కురిసింది. గడప గడపదగ్గర కన్నీరు జలజలరాలే శోకవదనాలు ప్రత్యక్షమైనాయి. మహిళామణులు భాష్పాంజలితో పాటు, పూష్పంజలి ఘంటించి నీరాంజనాలను సమర్పించి శోకవివశలై మ్రాన్పడిపోయారు. రాశులు రాశులు కొబ్బరికాయలు భక్తి పురస్కారమైపోయాయి. గ్రామమే కాక హరిజనవాడలు యావత్తు ఇల్లిల్లూ భక్తి శ్రద్దలతో కదలివచ్చింది.

నూటికి నూరు పాళ్ళు రైతునాయకులుగా, ప్రజానాయకులుగా శ్రీ వెంకట సుబ్బయ్యగారు సర్వజన హృదయాలలో ఒక విధమైన వెలితిని, లోటును, విచారాన్ని ముంచెత్తివేసినారు. అట్టి మహనీయుడు భౌతిక జీవితాన్ని చాలించిన ప్రజాహృదయాలలో మృత్యుంజయుడుగా చిరంజీవిత్వాన్ని సమార్జించుకున్నారు.

దహన సంస్కారం ద్వారా వారి భౌతిక కాయం అదృశ్యమైపోయిన , సర్వజనహృదయాలలో వారి దివ్యస్మృతి కనులముందు వారి గంభీర విగ్రహం అనుక్షణం సాక్షాత్కరిస్తుంది. కన్నులు చెమ్మగిలచేస్తున్నవి.

శ్రీ వెంకటసుబ్బయ్యగారి ఆత్మకు శాంతి కులుగుగాక !

వాహిని

కర్షక శ్రేయోభిలాషి , కిసాన్ వెంకటసుబ్బయ్యగారి మరణానికి

## ఆచార్య రంగాజీ సంతాప సందేశం

ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు కాలధర్మం చేందారన్న వార్త నాకు చాలా విచారాన్ని కలిగించింది. ఆయన కిసాన్ గొర్రెపాటిగా ప్రసిద్దులు. ఆంధ్ర రైతాంగం అభిమాన్ని చూరగొన్నారు.

ఈయన 20 సంవత్సరాలకు పైబడి ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులు. యుద్ధకాలపు కంట్రోల్స్‌కు, నెహ్రూ సాగించిన కంట్రోల్స్ - లైసెన్సుల రాజ్యానికి, భూమి శిస్తులను పెంపొందించుకుంటూ

పోతూ ఉండడానికి వ్యతిరేకంగా ఆయన రైతాంగపు ఉద్యమాలు నడిపారు. అనేక కిసాన్ సత్యాగ్రహాల వీరుడాయన. ఆ పోరాటలలో సర్దార్ లచ్చన్నకు పూర్తి సహాయాన్ని అందజేశారు.

1944-45 లో మహాత్మాగాంధీతో నేను సాగించిన సుదీర్ఘసమాలోచనలలో ఆయన నా వెంట వున్నారు. ఆదర్శ కిసాన్ రాజ్యాన్ని గురించి మహాత్మాజీ సందేశాన్ని ఆయన భారత్ కిసాన్‌లకు అందజేసారు. ఆ ఆదర్శాన్ని 1952 లోను, 1957 లోను సార్వత్రిక ఎన్నికలలో కృషీకార్ లోక్‌పార్టీ, మజ్దూర్ ప్రజారాజ్య పేరుమీద మేము చేసిన ప్రచారానికి ఆయన సహాయపడ్డారు.

నెహ్రూజీ సహకార సేద్యం ప్రచారాన్ని ప్రారంభించి, రైతాంగానికి సొంత కమతాలతో స్వయంవృత్తి కొనసాగించే అవకాశాలు లేకుండా చేయాలన్న ధోరణికి వచ్చినప్పుడు, అందుకు నిరసనగా మేము కాంగ్రెసును విడిచిపెట్టాము. అప్పుడే స్వతంత్రపార్టీకి తొలి అధ్యక్షులుగా ఆయనను మేమంతా ఆహ్వానించాము.

డెల్టా రైతులకు కొల్లేరు. బుడమేరు ముంపుబాధలు తొలగించి రక్షణ కలిగించాలని మేము పోరాటాలు సాగించనప్పుడు తుంగభద్ర, నందికొండ ప్రాజెక్టులకు ఆమోదించి, ఆ ప్రాంతాల్లో ఇరిగేషన్ వనరులు పెంపొందింప జేయాలని కృష్ణా, గోదావరి బ్యారేజులను నిర్మించి, వనరులు దెబ్బతిన్నప్పుడు, తుఫానులువచ్చి కరువు కాటకాలు వచ్చి గ్రామీణులు కష్టనష్టాలు అనుభవించినప్పుడు, రెమిషన్‌లు ఇవ్వాలని మేము ఆందోళన చేసినప్పుడు , కిసాన్ గొర్రెపాటి మా అండను నిలిచేవారు. చక్కని సలహాలు ఇచ్చేవారు. చురుకైన మార్గదర్శకులుగా వుండి కిసాన్ కార్యకర్తలు చేసేకృషికి చేదోడు వాదోడుగా వుండేవారు.

రాజ్యాంగానికి ప్రధాని నెహ్రూ తలపెట్టిన 17 వ సవరణకు వ్యతిరేకంగా ఆంధ్ర రైతాంగాన్ని ఆయన ముందుకు నడిపారు. రైతుల భూమి హక్కుల రక్షణకు గాను సాగిస్తున్న ప్రాథమిక స్వత్వాల ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. గత 35 సంవత్సరాలుగా ఆంధ్రలో హరిజనుల, వెనసుకబడిన వర్గాల, గ్రామీణుల శ్రేయస్సుకు ప్రారంభమైన ప్రతి ప్రజా ఉద్యమంలోను ఆయన అగ్రగామిగా నిలబడి కృషిచేశారు.

శ్రీ వెంకట సుబ్బయ్యగారు బౌద్ధక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఘంటశాల (కృష్ణాజిల్లా) లో జన్మించారు. ఆంధ్ర కాంగ్రెసు మాజీ అధ్యక్షులు, శాసన మండలి మాజీ అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగార్లకు ఆయన బాల్యమిత్రుడు, సత్యాగ్రహోద్యమాల సహచరుడు.

ఆయన జాతీయ స్వాతంత్ర్యానికి, ప్రభుత్వంనుంచి, వర్తకుల నుంచి రైతుల స్వాతంత్ర్యానికి పోరాడారు. అన్ని కిసాన్ ఉద్యమాలలోను గత 40 సంవత్సరాలుగా ఆయన నా కుడిభుజంగా వున్నారు. వడ్లు, గోధుమలు, చెరుకునకు కనీసపు ధరలు నిర్ణయం కావాలని మేము సాగించిన ఉద్యమాల ఫలితంగా స్వతంత్ర ప్రభుత్వం ఆవిధానాలను అనుసరించినందుకు ఆయన ఎంతగానో సంతోషించారు. గ్రామీణ పరపతి సంఘములు, కేంద్ర సమాచార బ్యాంకులలో కిసాన్ నాయకులు ప్రముఖపాత్ర వహించాలని ఆయన ప్రోత్సహించేవారు. కృష్ణాజిల్లాబోర్డు ఉపాధ్యక్షులుగా వున్నప్పుడు గ్రామీన ఆరోగ్య సౌకర్యాలు, విద్యావంతులు మెరుగుపరచడానికి శ్రద్ధ చూపారు.

గ్రామీణులు, బస్తీప్రజలు సమానస్థాయిలో పరిగణించబడాలనేది ఆయన ప్రగాఢవాంఛ. రైతాంగంనుంచి కార్యకర్తలను తయారుచేయడానికి ఆయన పెక్కుసార్లు రైతాంగ విద్యాలయాలను కూడా నిర్వహించారు.

అలాంటి శ్రీ వెంకటసుబ్బయ్యగారు 10-12-70 న కాలధర్మం చెందడంతో ఆంధ్ర ప్రజాజీవితానికి వెలితి ఏర్పడింది. ఆంధ్రరైతాంగం వారి సంఘముల ఉత్తమనాయకుని, ఉదాత్తమైన శ్రేయోభిలాషిని కోల్పోయాయి.

ప్రియమైన సోదరి సరస్వతమ్మగారూ .......

చి ॥ అమ్మాయి అన్నపూర్ణ, చి ॥ బాబూ !

11 వ తేది పేపరుచూచుటతోడనే మన గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు మనకికి శాశ్వతంగా లేరనుకొని హృదయం బ్రద్దలైపోయినది. మనసు మనసులో లేదు. ఎంతగానో దుఃఖించాను.

7 వ తేదీ విజయవాడ పెండ్లికి వెళ్ళి తిగిరి వస్తూ వారిని చూద్దామనుకొంటిని. వారంతటి బాధలో

యుండి యున్నప్పుడు యెవరెవవరో నా కారులో యున్నారు. వారందరితోటి వచ్చి వారిని చీకాకు పర్చుట యిష్టంలేక నూర్పిళ్ళు పూర్తిచేసుకొన్న వెంటనే గుంటూరువెళ్ళి వారిని చూచి రావచ్చునను కొంటిని. ఈ విధంగా అనుకొంటూ వుండగానే హఠాత్తుగా ఈ హృదయ విదారకమైన వార్తను వినవలసి వచ్చినది. అబ్బా! యెట్లా సహించేది. యెప్పుడు ఆయనగారిని కలుసుకొన్నాగాని నాకు ప్రత్యేకంగా సన్నిహితులు, ప్రియపాత్రులు. నాకు వీరు పెద్దన్నగా భావించేదానను.

శ్రీ రంగాజీ గొర్రెపాటని చూచి ఢిల్లీ వెళ్ళిన తదుపరి వారి బాధను కండ్లారా చూచినందున వారికి పెద్దగా దుఃఖము వచ్చినదని అయినా యెట్లాగో ఆపుకున్నానని వ్రాసిరి. రంగాజీకి కుడిభుజంగా వుండి, ఇన్ని సంవత్సరాలు యేలాంటి స్వార్ధం యెరుగక నిస్వార్ధంగా రైతు కూలి ప్రజాసేవకు గంభీరంగా తన జీవితాన్ని అంకితం చేసి ఎన్ని కష్టాలు యెదురొచ్చినా గానీ చలించక ఆనాటి నుండి ఈనాటి వరకు గొర్రెపాటి శ్రీ రంగాజీతో సగభాగంగా ఉండి, ఆయన ఆలోచనలు, రచనలు, సేవతో దేశసేవారాధకులై రైతు ఉద్యమానికి వారి జీవితం అంకితమైంది.

మీరు వారితోపాటు అన్ని విధాల కష్టాల కోర్చిరి. మీ కుటుంబానికి వారిద్వారా కలుగవలసిన లాభం కలిగి సుఖసౌఖ్యములు చేకూర్చలేక పోయినా వారితో బాటు కారాగా శిక్షను అనుభవించితిరి. వారికి తగిన సహధర్మచారిణి యనిపించుకొని భర్తకు అన్ని విధాల ప్రోత్సాహము కల్గించుచుండి కుటుంబాన్ని పెంచుకొస్తిరి. మీతో బాటు ఈనాడు రైతులోకం మేము దుఃఖించుచున్నాము.

భగవంతుడు మీ కుటుంబమునకు దుఃఖోపశమనము కల్గించి వారి పవిత్ర ఆత్మకు శాంతి కల్గుగాక!

ఇట్లు

గో ॥ భారతీదేవి.

చిత్రం

ప్రఖ్యాత సినీ గాయకుడు శ్రీ ఘంటశాల వెంకటేశ్వరరావుకు ఘంటసాలలో సన్మానము జరిగినప్పుడు తీసిన ఫోటో : శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, అప్పటి రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ యార్లగడ్డ శివరామప్రసాద్, శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగార్లను ఈ ఫోటోలో చూడవచ్చును.

## ఏమని చెప్పను ?

- జి. వెంకట సుబ్బయ్య

ఏమని చెప్పను ? మా వెంకట సుబ్బయ్యగారు గొప్పవాడనా ! నిస్వార్ధపరుడనా ? రైతు సర్దార్ అనా! అజాత శత్రువనా ! ఆత్మీయుడనా !

మా అబ్బాయి కృష్ణ వచ్చి “ నాన్నగారూ విన్నారా దుర్వార్త ” అన్నాడు ఏమిటన్నా “ వెంకట సుబ్బయ్యగారు చనిపోయారు. పేపరులో మీరు చూడ లేదా?” అన్నాడు. ఆయన మరణ వార్త ఆ పసి హృదయాన్ని కూడా కలిచివేసింది. వెంటనే పేపరులో ఆయన అంత్యక్రియలు ఆ రోజునే ఘంటశాలో జరుగుతవని చదివి వెళ్ళాను. పుష్పమాలలతో అలంకరించి, హారతులర్పిస్తూ కొబ్బరికాయలు ఇంటింటా కొడుతుండగా వూరేగింపుతో వస్తున్న ఆయన మృతదేహాన్ని చూచి కన్నీరు ఆగలేదు, కాళ్ళు ఆడలేదు.

ఆయన తన కుడి భుజముగా వున్నందుకు, భారత రైతు ఉద్యమనేత ఆచార్యరంగా గారే గర్వపడుతున్నారు.

నిస్వార్ధపరుడుగా ఆయన జీవితాన్ని ఎరుగని వారు లేరు. ఎంతో కొంత ఎప్పుడూ ప్రజాసేవ చేయవలెననే దృష్టితో తన జీవితాన్ని గడిపారు. జైలులోకూడా తన తోటి వారికి పోస్టల్ సర్వీసుచేసి పరులకు సేవచేస్తున్నాననే తృప్తి చెందేవాడు.

రైతు లోకానికి ఆయనచేసిన సేవ అపారము. రైతులకొరకు ఎవరినైన, ఎందరినైన ఎదుర్కొనటానికి వెనుకాడేవాడు కాదు. మంగళాపురం అడవి విషయములో జమీందారుతో రైతుల తరపున పోరాటం సల్పాడు. ఈస్టు బ్యాంకు కెనాల్ విషయములో అవిరళ కృషి సల్పాడు రైతుల కొరకు.

ఘంటసాలలో రైతాంగ విద్యాలయాన్నినడిపి యువకులను తయారుచేశారు, రంగాగారు జైలులో వుండగా. 1952 లో చల్లపల్లిలో నడిపిన రాజకీయ పాఠశాల వెంకటసుబ్బయ్యగారి కార్యదక్షతకు నిదర్శనం ఈ పాఠశాలలో రాష్ట్ర నలుమూలలనుండి 250 నుండి విద్యార్థులు వచ్చి శిక్షణ పొందారు.

బ్రిటీషు ప్రభుత్వపురోజులలో ప్రభుత్వానికివ్యతిరేకంగా రైతు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ రహస్యంగా ఒక సైక్లోస్టైయిల్ మిషను మీద పేపరునడిపి వుద్యమాన్ని పెంచారు. తన తండ్రికితాను ఒక్కడయినట్లు యీ ప్రాంతంలో ఒంటిరిగా నిలిచి వుద్యమాన్ని వూరూరా వ్యాపింపజేశారు, రైతు లోకాన్ని మేల్కొల్పారు.

రైతు భజనావళి రెండుసార్లు ప్రచురించారు. "వాహిని" నిర్వహణలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. గుండేరు మురుగు విషయములో ఆయన కృషి ఎరుగని వారులేరు.

ఆంధ్రప్రదేశ్ వివాహబంధ సమాచార సంఘమునను పెట్టి నేటి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలకు సహాయపడ్డారు.

ఆయన కాంగ్రెసులో వున్నా, కృషికార్ లోక్ పార్టీలో ఉన్నా స్వతంత్ర పార్టీలో ఉన్నా ధ్యేయం ఒక్కటే. రైతు క్షేమమే ఆయన క్షేమంగా భావించారు. హనుమంతుని హృదయంలో శ్రీరామచంద్రుడు, సీత వున్నట్లుగా ఆయన హృదయములో రంగాగారు, రైతులు వుండేవారు.

వీటన్నిటికి మించింది ఆయనలోని ఆత్మీయత, అదే మనలను ఆయనను మరవకుండా చేసింది - చేస్తున్నది కూడా !

వాహిని

22-1-71.

## రైతు జనోద్ధారకుడు

- శ్రీమతి గొర్రెపాటి మహలక్ష్మమ్మ

పూజ్య శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు. కిసాన్ వెంకట సుబ్బయ్యగారుగా పేరు బొంది తమకు జ్ఞానము తెలిసినప్పటి నుంచియు, రైతు సేవయే పరమావధిగా నెంచి, వార్ధక్యములో గూడ రైతుల కష్టసుఖాలను గుర్తించి శక్తికొలది వారి నుద్ధరించ పాటుబడిన ధీశాలి. స్వార్ధహితుడు. మానవసేవయే మాధవసేవగా భావించిన మహా మనీషి. మాటలలో గాక క్రియలలో దేశాన్ని ప్రేమించిన కార్యశూరుడు.

రైతు జనోద్ధారక చక్రవర్తి యగు ఆచార్య రంగాగారికి అత్యంత ప్రియతముడు. ముఖ్యాతి ముఖ్యుడు. శత్రువునైనా సరే యెదుట బడినప్పుడు పలుకరించి వారి కుశల సమాచారం తెలుసుకుని సంతోషపడే ప్రేమైకమూర్తి. తోటి వారిని తనవలెనే భావించి ప్రేమించే దయాశీలుడు.

తన మాట వినిపించుకోకపోయినా, బిడ్డలకు తల్లిదండ్రులు హితము చెప్పునట్లు రైతులకు నచ్చజెప్పి, అనేక రైతు వుద్యమాలను నడిపించిన దిట్ట. స్వంత లాభానికి ఆశించక, పిత్రార్జితంకూడ ఖర్చు బెట్టుకుని, రైతు సేవ ప్రధాన మనుకొని బాటుబడిన త్యాగనిరతుడు.

వ్యక్తి సత్యాగ్రహానికి ముందు, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘానికి అధ్యక్షులుగా ఆయన అపారమైన సేవ చేశారు. వ్యక్తి సత్యాగ్రహంలో తాను బైటవుండి రైతు సంఘాలను చాకచక్యంగా నడిపించారు. కాని మన నాయకులందరూ జైళ్ళలో వుండిపోయినందు వలన, కమ్యూనిష్టుల బలం యెక్కువై, రైతు సంఘాలను ఆక్రమించారు. ఆచార్యరంగాగారు జైలునుంచి విడుదలై వచ్చిన తర్వాత తిరిగి వెంకట సుబ్బయ్యగారు రైతు కాంగ్రెసు సంఘానికి అధ్యక్షులుగా సేవ చేశారు.

కాంగ్రెసు వారిలో స్వార్ధం బలిసిపోయి, వర్గ విభేదాలతో సంచరించడం రంగాజీ సహించలేక

కాంగ్రెసు నుంచి విడిపోయినప్పుడు ఆంధ్ర రాష్ట్ర కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులుగా వెంకటసుబ్బయ్యగారు రంగాగారి బాసటన నిలబడ్డారు.

కృష్ణాజిల్లా బోర్డు ఉపాధ్యక్షులుగాను, ఆంధ్రరాష్ట్ర స్వతంత్రపార్టీ అధ్యక్షులుగాను ఆయన నిస్వార్థమైన సేవ చేశారు. నిద్రాహారాలు ఆయన కంత ముఖ్యంకాదు. ఏయింట్లో తాముంటే ఆ ఇంటియిల్లాలితో "అమ్మా, మమ్మల్ని గురించి యెక్కువగా వంటకాలు చేయకండి, వున్న వాటినే మాకు పెట్టండి " అని యెంతో సరళంగా చేప్పేవారు.

రాజకీయోద్యమంలో దేశ సేవాభిలాషతో మహాత్మాగాంధీ నాయకత్వాన శ్రీకృష్ణ జన్మస్థానమలంకరించిన ప్రతిభావంతుడాయన. ఆయన అర్ధాంగి సరస్వతమ్మగారు ఆయనకు తగిన ఇల్లాలు. భర్తననుసరించి, దేశసేవలలో పాల్గొని జైలుకుపోయి వచ్చిన వీరవనిత సరస్వతమ్మ. వారి యేకైక పుత్రిక యేకైక పుత్రుడుగూడ క్షమాగుణ నిధులు. ఆ తల్లిదండ్రులకు తగిన బిడ్డలు.

ఆ మహనీయుడు మనకిక లేడు. మన రైతులోకం యిబ్బందులను ఆలకించి, వారి కోసం నడుంకట్టి నిలబడే ధీమంతుడు మనకు దూరమైపోయాడు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి కలుగజేయు గాక !

## సంతాప సభ

ఆంధ్ర ప్రదేశ్ కిసాన్ సమ్మేళనం గౌరవాధ్యక్షులు స్వర్గీయ శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి సంతాపసభలో ఘంటశాల గ్రామ స్వతంత్రపార్టీ వారు సమర్పించుకొన్న

## అశ్రుతర్పణము

### (గేయం)

జోహారు రైతాంగనేతా !
జోహారు కర్షక భ్రాతా !
జోహారు నిఖిలాంధ్ర గేహాభి నుతకీర్తి !
జోహారు జోహారు కిసాన్ గొర్రెపాటి ॥ జో॥

1. నీ హారగిరిక్రిందు - నీ సమున్నతిముందు
నీరధిని దలపించు - నీదు గాంభీర్యమ్ము
నీ హృదయమెన్న నవ - నీత సంకాశమ్ము
సౌహార్ధభావమది - సార్వజనికమ్ము ॥ జో ॥

2. రైతు కూలీ ప్రజా - రాజ్యసంస్థాపన
లక్ష్యసాధనకు జీవిత - మర్పణము జేసి
రైతు బాంధవుడు రం - గాజీ ప్రశంసలో
నీతికి ప్రతీకగా - నిలిచిపోయితి నీవు ॥ జో ॥

3. పుట్టి పెరిగిన యూర - పూనీజయత గన్న
యట్టి ధన్యాత్ముడ న - దృష్టశాలిని నీవు ॥ జో ॥

4. మిత్రులము నీ కశ్రు - తర్పణము గావించి
హృదయ భారము నివా - రించుకొన్నాము
మిత్రులము నీ కంచు - మేము చెప్పటెగాని
శత్రులెవ్వ రజాత - శత్రునకు నీకు

5. మమునెల్ల విడనాడి - మమత లే పోనాడి
శ్రమజీవులను నిరా - శా నిస్పృహలముంచి
అమరలోకాన మా - యభిమాన నేత !

అమరుడై వెలసితివి - అందుకో జోత !

శా ॥ రంగావంటి మహా మనీషికి బహిః - ప్రాణంబుగా భ్రాతగా
అంగాంగీకృత భావనా పటిమతో - నైక్యంబు పాటించి యే
రంగంబందును భేద భావమణు మాత్రంబేని రానీని మీ
సాంగత్యంబె ప్రజా హితైషులకు ది - వ్యాదర్శమై యొప్పుతన్ !

ఆ॥వె॥ నీవు లేని వెలితి - నిండించుకొన మాకు
తరముగా దికెన్ని - తరములకును
గగనవీధి వెల్గు - ఘనదివ్య తారక
రాలిపోయె కాళ - రాత్రివేళ

ఉ ॥ అర్ధశతాబ్ద జీవితము - అంకితమయ్యెను దేశసేవకే
స్వార్థము లేకయే యిటు - ప్రజాహిత కార్య భరమ్ము నింతగా
మూర్ధమునన్ ధరించిన స -మున్నతుడీవు పరాత్పరుండు మా
ప్రార్థన లాలకించి భవ - దాత్మకు శాంతి యొసంగుగావవుతన్.

ఇట్లు

19-12-1970 గ్రామ స్వతంత్రపార్టీ

ఘంటశాల ఘంటశాల.

## స్వర్గీయ
## శ్రీ గౌౖరెపాటి వెంకట సుబ్బయ్య

జననం : ది 15-6-1903 నిర్యాణం : ది 10-12-1970

"దేశంలో రైతు ఉద్యమం, వ్యవసాయ కార్మికుఉద్యమం వున్న చోటల్లా స్వర్గీయ గౌౖరెపాటి వెంకటసుబ్బయ్య ఆత్మ ప్రతిబింబిస్తూనే వుంది. ఆయన వంటి రైతు సేవకుల కృషివల్లనే ఈనాడు రైతులు పండించిన ధాన్యానికి కనీసధర నిర్ణయించబడింది. వ్యవసాయ కార్మికులకు గూడ కనీస వేతనాలు నిర్ణయించబడ్డాయి. అయినా, సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం ఆరాట పడుతున్న కాంగ్రెసు మంత్రులు మాత్రం యింతవరకు వాటిని అమలు చేయలేదు" అని డిసెంబరు 19 వ తేదీన కృష్ణాజిల్లా ఘంటసాలలో స్వర్గీయ గౌౖరెపాటి వెంకటసుబ్బయ్య సంతాప సభలో మాట్లాడుతూ స్వతంత్ర పార్టీనాయకుల ఆచార్యరంగా అన్నారు. వారింకా యిలా అన్నారు.

" ఇది కేవలం ఘంటసాల సభకాదు. ఆంధ్ర దేశంలోని రైతాంగం తరపున జరుగుతున్న సభ. రైతులకు ప్రభుత్వ చట్టాల ద్వారా నష్టం కలిగినప్పుడు, కాంగ్రెసులోని రైతులు అందుకు వ్యతిరేకంగా పోరాడగలిగివుంటే, వారి పరిస్థితి ఈనాడు యింత అన్యాయంగా వుండేదికాదు భూమిమీద మనకు ఆస్తిహక్కు వుండాలా, ఆక్కరలేదా అన్నది ఈనాటి సమస్య. శ్రీ నాథ్ పాయ్ బిల్లు అదే. రష్యాలోనే ఈనాడు రైతుకు రెండు యెకరాలు వుండవచ్చునన్నారు. రైతుల వద్దనుంచి భూములు స్వాధీనం చేసుకున్న చైనా మినహా మిగతాదేశాలన్నీ భూములను రైతులకుస్వాధీనం చేశాయి. పంజాబ్‌లో ముఖ్యమంత్రి శ్రీ బాదల్ అమలు చేస్తున్న కార్యక్రమం రైతు కూలీ ప్రజారాజ్య కార్యక్రమం. అందువలన, కేవలం తమ మంత్రి పదవులకోసం రైతుల భూస్వామ్యాన్ని ధ్వంసం చేయడం, వ్యవసాయకార్మికుల భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్మూలించడం మొదలైన కార్యక్రమాన్ని వ్యతిరేంచమన్నారు శ్రీ గౌౖరెపాటి.

" వాహిని " పత్రికను గౌౖరెపాటి దీక్షతో నిర్వహించారు. ఒక్క ' వాహిని ' పత్రికనేగాదు, రైతును రక్షించాలని కృషిచేస్తున్న వారపత్రిక లన్నిటినీ నిర్వహించాలి పోషించాలి.

" ప్రజల్లో - ముఖ్యంగా - రైతులలో తమ్ము తాము రక్షించుకునే ప్రయత్నం కనిపించడంలేదు.

అయినా ఒక్క రైతులే అనుకుంటే చాలదు. కార్మికులు, బుద్ధిజీవులు, కళాకారులు అందరూ - కలసిన ప్రజారాజ్యం కావాలి. అది వస్తోంది, దారిలో వుంది. కాని పోగొట్టుకుంటామేమోనని భయం. ఇటువంటి ప్రజారాజ్యం రష్యాలో కూడలేదు.

" గౌరైపాటి నేను చెప్పనది లేదు. మంత్రి పదవుల జ్వరం బయలుదేరింది దేశంలో. ఆనాడు మద్రాసులో, కర్నూలులో, ఢిల్లీలో, బాపూజీ వున్నప్పుడు. సర్దార్‌పటేల్ వున్నప్పుడు, పండిట్ నెహ్రూ పూర్తి అధికారంలో వున్న రోజుల్లోనే మంత్రిపదవి వద్దన్నాను. ఇక గౌరైపాటిమాత్రం యేంకావాలని కోరుకుంటాడు?

అఖిల భారతస్థాయిలో సిద్ధాంతాన్ని నమ్ముకుని మంత్రిపదవిని విసర్జించింది లచ్చన్న ఒక్కడే. అలాగే జిల్లాబోర్డు వుపాధ్యక్షులుగా వున్న వెంకటసుబ్బయ్య మరేపదవినీ కోరుకోలేదు.

కంట్రోళ్ళు వుండాలన్నాడు నెహ్రూ, రైతులు తమధాన్యాన్ని అమ్ముకోలేని పరిస్థితి వచ్చింది. వారిని బానిసలుగా చేసే విధానం అమలుచేస్తుంటే, గౌరైపాటి సలహాతో కంట్రోళ్ళు తొలిగితే తప్ప మంత్రిపదవి వద్దనుకున్నాను. అందువలన గౌరైపాటికూడ పదవులకు దూరంగా వుండిపోయారు."

సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ అధ్యక్షులు సర్దార్ గౌతులచ్చన్న గద్గద స్వరంతో యిలామాట్లాడారు.

" బాపూజీ ప్రారంభించిన వుద్యమంలో సతీసమేతంగా పాల్గొని కృష్ణాజిల్లా ఘంటసాలను యావద్భారత దేశంలో ఒక పేరు ప్రతిష్టగల గ్రామంగా రూపొందించిన వెంకటసుబ్బయ్యగారు 50 సం॥ల ప్రజాసేవను ముగించి మనల్ని విడిచి వెళ్ళిపోయారు. రైతు కూలీ ఉద్యమాన్ని యెవరు యెన్ని మార్గాల, ప్రక్క మార్గాల మరలించినా, ఆయన యే మాత్రం చలించకుండా నిండుకుండలా సహచరుల పరస్పర సంఘర్షణలను సరిదిద్దుకుంటూ వుద్యమాన్ని నడుపుకొచ్చారు.

వెంకట సుబ్బయ్య గురించి రాష్ట్ర వ్యాప్తంగా యింతమంది ఎందుకు ఆందోళన చెందుతున్నారో గుర్తిస్తే. ఆయన జీవిత సార్ధకత అర్ధమౌతుంది. కేవలం కన్నీళ్ళు వదలడం సంతాపం కాదు. ఆయన అనుసరించిన విధానంపట్ల, ఆయన నమ్మిన సిద్ధాంతంపట్ల, మనం ప్రదర్శించే వైఖరితో మన సంతాప స్వరూపం ప్రకటిత మౌతుంది.

వెంకట సుబ్బయ్యలేని లోటు తీర్చటానికి ఈ సభ ఉపయోగపడాలి. ఆయన లేని లోటును తీర్చలేని మాట నిజమే. నూటికి నూరుపాళ్ళు వెంకట సుబ్బయ్యలాంటి ప్రజాసేవకుణ్ని మనం సృష్టించుకోలేకు పోయినా, ఆయన అడుగు జాడలలో నడిచే యువతరాన్ని తయారు చేసుకోగలిగితే, ఆయన ఆత్మ శాంతిస్తుంది. ఆంధ్రజాతి భవిష్యత్ రూపురేఖలు దిద్దగల కార్యకర్తలను మనం తయారు జేసుకోవాలి. 1972 వ సంవత్సరం ప్రజలకు భవిష్యత్తు వుందా లేక శాశ్వితంగా బానిసలై పోతారా అనేది తేల్చి వేస్తుందని నా నమ్మకం."

సంస్థా కాంగ్రెసు నాయకులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య గారు మాట్లాడుతూ వెంకట సుబ్బయ్యగారి పేరిట ఒక హాస్పిటల్ నిర్మించాలనీ, ఆయన శిలావిగ్రహాన్ని స్థాపించాలనీ, సూచించారు.

ఆయన యింకా యిలా అన్నారు : " శ్రీ గౌరైపాటి క్రమశిక్షణతో మెలిగిన సైనికుడు. స్వాతంత్ర్య సమరంలో భార్యతో సహా కారాగార శిక్షలనుభవించిన త్యాగధనుడు. అనుకున్నది సాధించేవరకు నిద్రపోని భల్లూకపు పట్టు ఆయనది ఆయన లచ్చన్న రంగాగారికి రెండు భుజాలు. ఆ ధన్యజీవి మన కికలేడు."

శ్రీమతి భారతీదేవి రంగా మాట్లాడుతూ రైతు పెద్ద అయిన శ్రీ వెంకట సుబ్బయ్యను తమ అన్నగా భావించామన్నారు. రంగా గారి జీవితంతో పెనవేసుకొని 40 సంవత్సరాలపాటు ఆయన రైతు ఉద్యమంలో నిమగ్నులై. కలవరింపులో గూడ రైతు క్షేమమే కాంక్షించే వారన్నారు. " మరచి పోలేని వ్యక్తి శ్రీ గౌరైపాటి" అన్నారామె.

"నీతి నిజాయితీగల నాయకులు కరువైన ఈ రోజులలో శ్రీ గౌరైపాటి వంటి ఉత్తమోత్తమ ప్రజాసేవకుని కోల్పోవడం మన దురదృష్టం. రైతు లోకపు దౌర్భాగ్యం. నిస్పృహ, నైరాశ్యం యెరుగని ధీరోధాత్తుడు. గంభీర హృదయుడు శ్రీ గౌరైపాటి " అన్నారు శ్రీమతి భారతీదేవిరంగా.

" ప్రకృతివలెనే సంఘంకూడా నిత్య పరిణామసీలమైనది అయితే ప్రకృతిలో జరిగే పరిణామము

మాత్రం స్వాభావికంగా దానంతట అదే జరిగిపోతుంది. శీల సంపన్నులైన త్యాగుల కర్మశీలత వల్లనే సంఘానికి కావలసిన అవుసర పరిణామములు ప్రాప్తించును, అట్లు కానినాడు సంఘం జడప్రాయమవుతుంది.

సంఘానికి సజీవ పురోగమనం కల్గించటానికి వలయు ప్రేరణ శక్తిని వుత్సాహాన్ని దీప్తిని కల్గించేవారే వీరులు. వీరారాధన సంఘానికి, అవుసరమూ, కర్తవ్యమూ కూడా.

ఆయుధోపజీవులు మాత్రమే వీరులు కాదు. విద్యావీరులు, ధర్మవీరులు, కర్మవీరులు, వైజ్ఞానికులు వీరంతాకూడా, ఈ కోవకే చెందుతారు. సంఘముయొక్క బహుముఖ వికాసానికి, సభ్యతా సంస్కృతుల ప్రాభవానికి, వీరందరి అవుసరం, తప్పనిసరి గనుక వీరందరూ కూడా సంఘానికి వందనీయులే అవుతారు.

షుమారు అర్ధ శతాబ్దము కాలము, ప్రజాసేవలో, ఆదర్శ జీవితం గడిపిన, మన వెంకట సుబ్బయ్యగారు రైతుగా జీవితం ప్రారంభించి, స్వతంత్రయోదుడుగా, సిద్ధాంత ప్రచారకుడుగా, రాష్ట్ర రైతాంగ వుద్యమనేతగా, పరిణతినందిన దీక్షాయుతుడు. 68 సంవత్సరముల ప్రాయంవరకు తన అర్ధ ప్రాణాలతో ప్రజా వుద్యమాలకు అంకితమైన తత్పరుడు.

గాంధీ యుగానికి పూర్వం, రాజకీయరంగం మేధావంతులకు, విద్యాధికులకు మాత్రం, పరిమితమై యుండేది. వారందరూ పట్టణాలకు చెందినవారు. గాంధీజీ రాకతో, రాజకీయ రంగము విస్తృతమై, పల్లెలకు గూడా వ్యాప్తిచెందింది. మేధావంతులు వెనుకబడ్డారు. త్యాగము, దీక్ష, కష్ట సహిష్ణుత వుండవలసిన ఈ రంగములో ఇది సహజంగా జరుగుతుంది.

గాంధీజీ పిలుపువిని, మండల మండలమునుండి, పల్లెపల్లెనుండి, స్వతంత్ర శాంతి సంగ్రామమునకు వెంకట సుబ్బయ్యగారి లాంటి శాంతి సైనికులు బయలుదేరారు. త్యాగాలు చేశారు. బాధలు పొందారు. లక్ష్యసిద్ధిని చెందారు. కొందరు మధ్యలో తెరమరుగైనారు. కొందరు తాము మాత్రమే త్యాగాలు చేశారు. కొందరు నాటికి నేటికి ఆ మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. ఈ చివరి కోవకు చెందుతారు మన వెంకటసుబ్బయ్యగారు.

స్వతంత్ర సిద్ధితో, ఆయన సేవారంగమునకు దూరం కాలేదు. విరామం లేని సాంఘిక సేవయే, ఆయన లక్ష్యం ఈ పల్లెటూరి రైతు బిడ్డ గ్రామీణవృత్తుల రక్షణకు, తన నాయకునకు కుడిభుజముగా, తన అంతిమశ్వాసవరకు, అంతో, యింతో, కృషిచేస్తూనేవున్నాడు. పల్లెట్ళున్నా, గ్రామీణ వృత్తులున్నా, ఆయనకు ప్రాణతుల్యమైన అభిమానం. అందువల్లనే ఆయన అనుచరులు సహచరులు ఎక్కువగా పల్లెటి గ్రామాల వృత్తులవారే. బస్తీస్నేహాలు, పరిచయాలు, చాలా తక్కువ, వెంకటసుబ్బయ్యగారికి.

విద్యాబలంతోగాని, మేధాబలంతోగాని, ఆయన రాష్ట్రనాయకుడు కాలేదు, నిజాయితీ, మంచితనము, ఆయనకు రెండు నేత్రములవంటివి. వీటికి ఆయన దీక్షా, దక్షతలు, తోడుకాగా, రాష్ట్రంలో ఒక బలమైన వుద్యమ నిర్మాతగా రాణించాడు. ఎన్నో ఆర్థిక కష్టాలు, యాతిబాధలు, యెదురైనా, వాటిని లెక్కజేయక ఆయన దృష్టిని సుదూరగమ్యంవైపునకే సారిస్తూవుండేవాడు. అంతటి ఆత్మవిశ్వాసమూ, బలమైన దీక్షా కొరవడినాడు ఏ వ్యక్తిగాని, ఏ వుద్యమంలోగాని, చివరంటా నిలువలేడు. వెంకటసుబ్బయ్య గారికి మాత్రం మడమ వెనుకకు త్రిప్పటం తెలియదు. నిరాశా నిస్పృహలు ఆయన శబ్దకోశంలో లేవు. రాజకీయాలు లేని సూటిమాటలు - సూటిబాట ఇదే ఆయన స్థూలస్వరూపము.

చిన్నవారినీ, పెద్దవారినీ, ఒక్కలాగే, ఆదర గౌరవాలతో పల్కరించటం, గ్రామంలోని సంకుచిత వాతావరణానికి అజాతశత్రువులాగా దూరంగా వుండటం, ఆయన సమన్వయబుద్ధికి, స్థిత ప్రజతకూ, ముఖ్యలోణం. యీ లక్షణమే ఆయనకు గ్రామంలో గూడా శిఖర ప్రాయమైన ఆదర గౌరవాలను కల్గించింది.

నేడు సేవాభాము అంతరించింది. పవర్ పాలిటిక్సు ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి.వుద్యమాలు పల్చబడినాయి. కాంక్షాపూరితమై ఆదర్శమూ, గమ్యమూ, లేని ప్రయాణము చేస్తున్నది సంఘం. అలాంటి యీ సమయంలో వెంకటసుబ్బయ్యగారిలాంటి వ్యక్తి అస్తమించటం, గ్రామీణ వృత్తులవారికి రైతు లోకమునకు దుఃఖకారణము.

గుంటూరు హాస్పిటల్‌లో 10 వ తేదీ సాయంత్రమే ఆయన భౌతికయాత్ర చాలించాడు.

అయినా డిశంబరు 11 వ తేదీ మనగ్రామ చరిత్రలో ఒక విశిష్టమైన రోజు. ప్రజాహృదయాంతరాళములలో, ఆయన యందుగల ప్రేమానను రాగములు ప్రవాహరూపము ధరించి, సనాతన సాంప్రదాయాలనుకూడా, ధిక్కరించింది (భౌతిక కాయమునకు హారతులిచ్చుట)గ్రామంలో వృత్తులు వ్యాపారములు, పాఠశాలలు బంద్ అయినవి. దేవవుని వూరేగింపులాగా స్త్రీ, బాల, వృద్ధ, భేదం లేక, ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. విచారము రూపు ధరించింది. ఒకటే పూలదండలు, హారతులు, గ్రామంలోని మారుమూల పేటలవారుగూడా, ఆ యాత్రను ఆహ్వానించి, తమ ప్రేమాభిమానములను చాటుకున్నారు. " మంచివారి చావు మరణకాలంలో తెలుస్తుంది " అన్న సామెత ఆయనపట్ల ధృవమైనది. ఆయన ధన్యజీవి. సేవామార్గము తప్ప అన్యమార్గము తెలియని, ఆయనకు ప్రజలు తమ హృదయ కుసుమాలతో ప్రస్తావ మార్గము నిర్మించారు. మరణించింది ఆయన భౌతిక కాయము మాత్రమే. ఆయన కీర్తికాయుడైనాడు. నిజమైన గొప్పవారి జీవితం, మృత్యువు తురవాతనే ఆరంభమవుతుంది. వారి కథలు, గాధలూ, ప్రజలలో వున్నంతకాలం వారు అమరులుగానూ మరణంలేనివారుగానూ వుంటారు. రాజకీయ వుద్యమాలు లేని వుద్యమ స్వరూపులుగా జీవించి ప్రజాసేవ గావించిన మనగ్రామ పెద్ద కీర్తిశేషులైన గొర్రెపాటి బాలకృష్ణమ్మ గారు కూడా కీర్తికాయుడైన ఇప్పటికి మనమధ్య జీవించియేయున్నాడు గదా ? మన వెంకటసుబ్బయ్యగారుకూడా, ఆయన పంక్తిని ఆశీనుడైనాడు. ఆయన ఆత్మకు శాంతి లభించుగాక.

వేమూరి వెంకట్రామయ్య
19-12-70
ఘంటశాల

శ్రీయుతుల గొట్టిపాటి బ్రహ్మయ్య, పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య , ఎల్.వి.బి. చౌదరి, హెచ్. ఆర్. శాయోజీరావు, చల్లగుళ్ళ నాగభూషణం, కొమ్మారెడ్డి బాపయ్య చౌదరి, క్రొవ్విడి సూర్యప్రకాశరావు, నాగినేని వెంకయ్య, గాదిరెడ్డి హనుమంతరావు, వేమూరి వెంకటరామయ్య, చావ గోపాలకృష్ణమూర్తి, కోటారు వెంకటేశ్వర్లు, మండలి వెంకటస్వామి నాయుడు గారలు గూడా ప్రసంగించారు.

స్వర్గీయ కిసాన్ వెంకటసుబ్బయ్య స్మారకసభ ఘంటశాల జలధీశ్వరస్వామి ఆలయం యెదుట గాంధీజీ, కస్తూరిబా విగ్రహాల బాసటన బ్రహ్మాండంగా జరిగింది. ఒక్క ఘంటశాల ప్రజానీకమేకాక రాష్ట్రంలో పలుప్రాంతాల నుంచి స్వతంత్రపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా స్వతంత్రపార్టీ కార్యదర్శి శ్రీ బి. వెంకటేశ్వరరెడ్డి స్వాగత వచనాలు పలికారు. శ్రీ గొర్రెపాటి చంద్రశేఖరరావు వందన సమర్పణ చేశారు.

## కిసాన్ వెంకట సుబ్బయ్య:

రైతాంగానికి ఆయన చేసిన సేవలు

రైతులకు అండ ; రైతులకండ; రైతుల గుండె, తొణకని నిండుకుండ గొర్రెపాటి.

రైతు, ప్రత్యేకించి తెలుగురైతు ఎలావుంటాడని ఏవిదేశీయుడైనా ప్రశ్నిస్తే, ముందుగా గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారిని చూపెట్టవచ్చు.

వేషంలో, భాషలో, మాటలో, చేతలో, వ్రాతలో, ప్రవర్తనలో - అన్నిటా నూటికి నూరుపాళ్ళు రైతు ప్రకృతియే మూర్తీభవించిన గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి జీవితమే రైతాంగ చరిత్రగా భావిస్తున్నది.

అసేతు సీతనగపర్యంతం బాపూజీ స్వాతంత్ర్య సమర శంఖరావంతో ఉగ్రూతలూగినపుడు అని మొనలో అగ్రశ్రేణిలో, సతీసమేతంగా నిలిచిన రైతు మొనగాడు గొర్రెపాటి.

ముప్పదేళ్ళక్రితం ఒక జమీందారీ రైతు మహాసభలో శ్రీ వెంకటసుబ్బయ్యగారితో నాకు తొలిపరిచయం లభించింది. ఆనాటి నుండి మమ్మల్ని బంధించిన అనురాగ వల్లరి అత్యంత పావనమైనది.

## బహుముఖ ప్రజాసేవ

కొల్లేరు ముంపు నివారణోపాయాలనుండి. బుడమేరు మురుగు నివారణ వరకు - రాయలసీమ కరువు గాధలనుండి, కంట్రోళ్ళ సమస్యల వరకు ఈనాం రైతుబిల్లు ఆవశ్యకతనుంచి, జమీందారీ రైతుల కష్ట గాధలవరకు ; అటు హరిజనుల ఉద్ధరణ, ఇటు చేనేత వారి సముద్ధరణ, ఒక్కటేమిటి ? ఆంధ్రదేశంలో రైతులకు, వ్యవసాయ కూలీలకు, ఎన్నెన్ని బాధలుండినవో, ఉన్నవో, వాటిని తొలగించటానికి ఎన్నెన్ని మార్గాలున్నవో, ఏ ఏ పథకాలున్నవో, అన్నిటినీ ప్రకటనల రూపంలో, వ్యాసాల రూపంలో వ్రాయడమే వారిపని.

ఆంధ్రదేశంలో గత అర్ధ శతాబ్ది నుంచి జరిగిన ప్రతి రైతు ఉద్యమంతో వారికి ప్రత్యక్షమైన సంబంధం వుంది. విస్తృతమైన ఏర్పాట్లతో జరిగిన ప్రతిరైతు మహాసభలోను వారు ప్రముఖమైన పాత్రవహించారు.

దాదాపు నేడు రైతులు పొందుతున్న సౌకర్యాలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి కల్పించాలని, మహాసభలలో, ఆ రోజులలో, వెంకట సుబ్బయ్యగారీ తీర్మానాలుగా ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను కాపీచేయ్యడానికి నావంటి వారికి విసుగైన సందర్భాలు కో, కొల్లలు.

గత పదేళ్ళనుంచి ఈ తీర్మానాన్నే ప్రతీ సభలోను ప్రవేశ పెడుతున్నాం. లెక్కలేనన్ని కాపీలుతీసి ప్రతికలకు పంపుతున్నాము. శుద్ధదండుగ ఎందుకిలా వ్రాయడం ? అంటూ ఆ కాగితాలనంతా చుట్టబెడుతుండగా ఆయన అన్నమాట లివి.

## తీర్మానాలు

“ తీర్మానాలంటే ఏమిటనుకున్నావు ? స్వరాజ్యమే వచ్చిందే - ఈనాందారీ బిల్లు రాదంటావా ?

ఒక్క ఈనాందారీ రైతు సమస్య లేమిటి. మహా సభలలో ప్రవేశపెట్టిన వందలాది తీర్మానాల ఫలితాన్ని ఈనాడు రైతులు అనుభవిస్తున్నారు. ఆయన నిష్కామకర్మ నిజంగానే సాటిలేనిది.

పరిశుభ్రమైన కావిరంగు ఖద్దరు వస్త్రాలతో, రైతుల కోసం అహర్నిశలు, పరిశ్రమిస్తూ, బాపూజీ అహింసా సిద్ధాంతంపట్ల, అంచలమైన విశ్వాసాన్ని ప్రకటిస్తూ వచ్చిన గొర్రెపాటివారు నాబోటి వారికి అపర బుద్ధుడుగా, కనిపించటం భ్రమమాత్రం కాదు. అందుకే నాకు నాతోపాటు రాయలసీమలోని ఒకతరం రైతు సేవకులకు, రైతాంగ సాహిత్యవేత్తలకు, వారిపట్ల పితృభావం కల్గింది.

జబ్బులో వున్నా నడువలేని స్థితిలో వున్నా రైతులను గురించి ఆలోచిస్తూ, రైతుల అనుదిన సమస్యలకు శాశ్వతమైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ అఖండమైన పరిశ్రమ చేశారు గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు.

గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు ఇకలేరు, లేరనలేము ప్రతి రైతుగుండెలోను దాగివున్నారు. నిజంగానే ప్రతి కర్షకునిలోనూ ప్రతిబింబిస్తున్నారు.

కె. సభా.
ఆంధ్రజ్యోతి
19-12-1970

మండలి వెంకట కృష్ణారావు
ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘం
గాంధీభవన్ హైద్రాబాద్.

శ్రీ గొర్రెపాటి కుటుంబరావుగారికి నమస్కారములు. పెద్దలు, కిసాన్ నాయకులు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు పరమపదించిన వార్తపత్రికలలో చూచిచాలా విచారపడినాము. రైతులోకమునకు వారుచేసిన సేవ చిరస్మరణీయమైనది.

తమకు, తమకుటుంబమునకు మహృదయపూర్వక సానుభూతిని అందజేసుకొంటున్నాను. వారి ఆత్మకుశాంతి కలుగవలెనని భగవంతుని ప్రార్థిస్తున్నాను:

ఇట్లు
కృష్ణారావు.

**మనకిసాన్ వెంకట సుబ్బయ్య**

రైతే ప్రపంచమునకు వెన్నెముక అని గ్రహించిన నాటినుండి తన ఆత్మఅనంత వాయువులలో కలియువరకు రైతాంగ శ్రేయోభివృద్ధికై అవిరళకృషి సల్పిని నిరాడంబర త్యాగశీలి శ్రీ గొర్రెపాటి ఆత్మశాంతికి నాభాష్పాంజలి.

తెనాలి
19-12-70

ఇట్లు
యం. వి. శాస్త్రి

# రెండ భాగం

రచన :

## ఆచార్యరంగా

# రైతు కూలీ - యుగోదయం

నవభారత యుగం బ్రిటిషు ప్రభుత్వముపై 1856-58 స్వాతంత్ర్య సమరము జరిగినప్పటి నుండి ప్రారంభమైనది. 1885లో జాతీయ కాంగ్రెసు స్థాపించబడినది. బ్రిటిషు వారితోపాటు భారతీయులకు గూడ సమాన ప్రతిపత్తి, అధికారాలు, పౌరసత్వ హక్కువుల భారతదేశంలో వుండాలనే వాదం బయలుదేరి, అంతదనుక ప్రభుత్వాధి నేతల మతం రంగు జాతికే ప్రథమ స్థానం పొందుట ధర్మమే అనే తిక్కవాదమునకు నైతిక వాదమునకు నైతిక సవాలు రూపొందినది.

1906కు, స్వరాజ్యం భారతదేశానికి కావాలి, స్వరాజ్యం కోరుట, పొందుట భారతీయుల జన్మహక్కు అనే, బాల గంగాధర తికల్ ఘోషను, దాదాభాయి నౌఔజీ కలకత్తా కాంగ్రెసు సమావేశ ముందు భారతీయుల తరపున ప్రకటించిరి. 1917-20 హోమురూలు లీగు వచ్చి, అనిబిసెంటమ్మ నాయకత్వంతో భారతీయులకు స్వదేశియ పాలనం కావాలనే తత్వం ప్రబలంగా ప్రచారమైనది. 1920-23లో మహాత్మాజీ నాయకత్వం దేశానికి అబ్బినది. బ్రిటిషు పాలనం పూర్తిగా పోవాలి. స్వరాజ్యం సంపాదించుకోవాలి. అందుకై జాతీయ సేవలకు ప్రజలు ముందుకు రావాలి.

ప్రజానాయకులు జాతీయ నాయకులుగా ముందుకొస్తేనే గణనీయ మగుదురు, పుజ్యులగుదురు అనే భారతీయ ప్రజాభావం ప్రకాశితమైనది.

కనుక 1923-27 వరకు జాతీయ నాయకులు గానే, ప్రజా నాయకులు, లెక్కింపుకు వచ్చిరి. ఆ తిలక్ మహాశయుని నుండి సురేంద్రనాధు వరకు సి.ఆర్. దాసు, మోతీలాలు నుండి దేశ భక్తుని వరకు, జవహరునుండి ఆంధ్రరత్న వరకు, డాక్టరు రాయి నుండి డాక్టరు పట్టాభివరకు జాతీయ నాయకులనే ప్రజలు ప్రేమించిరి. గుర్తించిరి.

ఆదియూ సబబే, అవసరమూ. అభివృద్ధిదాయకమే. ఐతే కార్మిక, కర్షక జనాలను ప్రత్యేకంగా సేవించుటకు సమీకరించుటకు సముద్ధరించుటకు నాయకులు, యువనాయకులు సంఘనిర్మాణకులు కూడా అవసరం గదా! జాతీ ధోరణిలో, మహాత్ముని తర్ఫయతులో స్వరాజ్య సంపాదనకై కాంగ్రెసు నాయకత్వం క్రింద సేవ జేయు నాయకులు తగినంత మంది చేకూరిన తరువాతనైనా, జాతీయ రాష్ట్రీయ స్థాయిలో వివిధ శ్రామిక వర్గాను మూల్కొల్పి, సమీకరించి, సేవించు నాయకులు కావాలి. ఈ నిజమైన, అవసరమైన సాంఘీక, రాజకీయ సత్యాన్ని, అవసరాన్ని జాతీయ నాయకులు గుర్తించుటకు యిరవై సంవత్సరాలు బట్టినది.

స్వరాజ్య సంపాదనా జాతీయ పంథాను ప్రజాసేవ చేయుటలో, అంతకుముందే, వివిధ వర్గాలను రక్షించుకోవాలని బయలుదేరిన సంఘ సంస్కార వుద్యమాలు, రాజకీయ ప్రచారములు, బ్రాహ్మణేతర పార్టీలు, కాంగ్రెసునకు వ్యతిరేకముగా వ్యవహరించినవి గనుక వర్గ సంఘములు, వర్గ నాయకులు గూడ జాతీయ సేవ యందు స్వరాజోద్యమ మందు ప్రధానపాత్ర వహించగలరనే భావం కాంగ్రెసు నాయకులలో పెరుగలేదు. క్రమంగా, ఫ్యాక్టరీలలోని కూలీలు సమ్మెలు చేస్తూ, కాంగ్రెసు కార్యక్రమాలలో పాల్గొనడం ప్రారంభించున్నందు వల్ల, వారి నాయకులను, కొంతగా ఆదరించుటకు సాహసించుచుండిరి - కాంగ్రెసు నాయకులు అందునే, గాంధీజ, నెహ్రూ, బోసు, ప్రభుత్వాలే కూలీ యూనియనులను నాయకత్వము ప్రసాదించుచుండిరి. ఆ కాలములో, రైతు వుద్యమునకు ఆంధ్రలో నేను బయలుదేర దీస్తూవుంటే, బ్రహ్మణేతర ఉద్యమము నాకు దాని జస్టిసు పార్టీకి కల్గించునేమో ననే భయం, బందరు వారికి గుంటూరు, నెల్లూరు, కృష్ణా, గోదావరీ కాంగ్రెసు వారికి కల్గెను.

రైతు సంఘములుండవలెనా, వాటివల్ల జాతీయ స్వతంత్రోద్యమం బలపడునా, కాంగ్రెసుతో ఆ వర్గ సంఘాలు పోటీపడునేమో! అప్పుడు స్వరాజ్య సంరంభం కుంటుపడునేమో! అనే భయాందోళన ప్రథమంగగా ఆంధ్రజాతీయ నాయకులకు క్రమంగా సర్దారుపటేలు వరకు కల్గుతూ వచ్చెను. ఆ 1923 అక్టోబరు, నవంబరుకే అప్పికట్ల సభలో మేము రైతు పార్టీకి స్వరూపమిస్తిమి. రైతు ఎన్నిక ప్రణాళికను తయారు చేస్తిమి. గుంటూరు జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు ఒక్క కేంద్ర పార్లమెంటరీ (సెంట్రలు అసెంబ్లీ) స్థానానికి అభ్యర్థుల

నిలబెట్టితిమి. వారిలో ముగ్గురు ఎన్నికైరి. వారిలో ఒక్కరు యినాటి చంద్రమౌళిగారి తండ్రీ జాగర్ల మూడి కుప్పుస్వామి చౌదరి గారు, మరొకరు పిల్లలమఱ్ఱి ఆంజనేయులు గారు, జాతీయోద్యమ మందు నాకున్న విశ్వాసము, మహాత్ముని యెడల నేను చూపుచున్న భక్తి చూచి, మెచ్చి సర్దారు శీతారామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ రైతాంగ వుద్యమ ప్రారంభ ప్రయత్నాలకు ఆశీర్వాదయు లొసంగిరి. కాని ఆంధ్ర పెద్దల సందేహాలు మమ్ము వెన్నంటుచునే యుండెను.

అటు బ్రిటిసు వారికి రైతాంగ సేవకులపై కన్నెర్ర. ఇటు కాంగ్రెసు నాయకులకు సందేహాలు. అట్టి కష్ట సమయంలో ప్రారంభమైనది ఆంధ్ర రైతాంగోద్యమము అప్పుడే అందిన సోదర సేవకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, మాగంటి బాపినీడు, మా సోదరులు వెంటప్పయ్య లక్ష్మీనారాయణ, భారతీదేవి, ఆచంట నాగయ్య, ప్రభృతులు రైతుల నుండి, ఉన్నవ, గూడూరి రామచంద్రుడు వైజ్ఞానికుల నుండి తోడైరి. కివిరాజు రామస్వామి గారు "రైతు" పత్రికలో నా ప్రభోధములను ప్రచురించగల్గిరి.

అంతకు ముందే ఒక స్థాయికి జాతీయరంగలో ట్రేడు యూనియను వుద్యమము రాగల్గినది. దానికి నాయకులుగా కీర్తిశేషుడైన జోషి, యినాడు రాష్ట్రపతిగా అందిన గిరిగారు పైకి రాగల్గిరి. అందు గిరి గారిని వారి తండ్రి జోగయ్య అప్పటికే కాంగ్రెసు నాయకులుగా నుండిరి గనుక, జాతీయ నాయకులు, తమకు తోడుగా నుండు యువనాయకునిగా అంగీకరించిరి.

కార్మిక, కర్షకుల ప్రేమించి, సేవించి, పలుకుబడి బొంది, పైకొచ్చి పేరు ప్రతిష్ఠలు బొంది, జాతీయ నాయకులుగా పరిగణింపబడుట, మన దేశములో గాంధీయుగమందే సాధ్యమైనది.

ఫ్యాక్టరీలలోని కూలీల రక్షించుటకై ఆనాడు డాక్టరు నాయరు వాడియా, జోషి, గిరి, శివరావు, బాప్టెస్టాలు కష్టించిరి. ప్రధరయుద్ధానంతరం స్థాపించబడిన అంతర్జాతీయ లేబరు సంస్థయందు --- సంస్థ యందు ప్రముఖ స్థానము వహించి, భారతీయ కూలీల రక్షణకై దశాబ్దముల పర్యంతరం, భారత కేంద్ర అసెంబ్లీలో కూడా శ్రమించి ప్రఖ్యాతి జెందిరి. శ్రీ యన్. యమ్. జోషి, పిమ్మట శ్రీ వి. వి. గిరి, ప్రభృతులు. స్వరాజ్యావతరణ పిమ్మట ప్రధమంగా మంత్రిగా, పిమ్మట రాష్ట్రపతిగా కార్మిక నాయకులు శ్రీ గిరి ప్రఖ్యాతి జొందిరి. వారే రాష్ట్రపతి స్థానె ఉద్యోగ ప్రాప్తి కోట్ల ప్రజల కెట్లా కల్గించదగునో తెల్పుతూ, కార్మిక బంధుగా వెలసిల్ల గల్గిరి.

రైతు వుద్యమము గాంధేయ యుగమందే నూతన స్వరూపమును 1923లో బొంది, 1928 నుండి, రాష్ట్ర స్థాయికి ఆంధ్ర బీహారు లందు పెరిగి, 1934 భారతీయ వుద్యముగా పెరుగుతూ, 1936-37 లలో కార్మిక వుద్యమము వలెనే, జాతీయ స్థాయిని, రాజకీయ ప్రాముఖ్యమును చెంద గల్గినది. తన ఆందోళనలు, యాత్రలు సత్యాగ్రహోద్యముల ద్వారా.

అలా పెరుగుచున్న భారత రైతు వుద్యమమునందు పంజాబులో సర్దారు కాబులు సింగు, ఫెరుమాన్యులు, బీహారులో స్వామి సహజానదం సరస్వతి, తమినాడులో రామస్వామి రెడ్డి, తేవారు ప్రభృతులు, ప్రజాందోళనలో ప్రముఖులుగా పైకొస్తున్న దశాబ్దములందే, ఆంధ్రలో శ్రీ నెల్లూరు వెంకట్రామానాయుడు గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, శ్యామబాబు, న్యాపతి నారాయణ మూర్తులు, లక్ష్మీనారాయణ, భారతీదేవి దుక్కా సూర్యనారాయణ రెడ్డి, లచ్చన్న రైతాంగ విప్లవ శక్తి ఆరాధకులుగా, అఖిల భారత కిసాన్ సమ్మేళనమును రూపొందించుటలో నాకు ప్రబలమగు తొడు సీడలుగా అందిరి. శక్తి యుక్కులనోసంగిరి.

1931-32లో, అదనపు శిస్తుల నెదిరిస్తు, రైతు సత్యాగ్రహోద్యమును సాగించాలనే ప్రయత్నములో శ్రీ కాట్రగడ్డ మధుసూదన రావు, దండునారాయణ రాజు దు॥ జల రామకృష్ణయ్య , మన వెంకట సుబ్బయ్య మాకు అండగా వుండిరి.

జైళ్ళ నుండి బైటికి వచ్చేసరికి, అనాటి బ్రిటిషు ప్రభుత్వము ఉభయ గోదావరులు కృష్ణా జిల్లా యందు రెవిన్యూ రూపాయికి రెండు అణాలు అదనపు శిస్తు వసూలు చేయబూనినది. గుంటూరు రాయలసీమ రైతుల మీద అణా వేస్తానని బెదరించుచున్నది. దాన్నెదిరించుటకై తుంగభద్ర పాజెక్టు మురుగు వసతుల కొరకు ఆ 1934-35 సం॥ రైతు రక్షణ యాత్రలు సాగించితిమి. బందరులో జరిగిన రైతు యాత్రల విజయానికి

శ్రీ వెంకటసుబ్బయ్య ప్రత్యేక శ్రమ జేసిరి. ప్రథమ ప్రపంచయుద్ధ సమయాన కంట్రోళ్ళ నెదరించిన వృద్ధరైతు నాయకులు కానూరి వెంకట చలపతయ్యను తమ బందరు యాత్రలకు నాయకులుగా చేసుకొనిరి.

అయితే నెల్లూరు వెంక్రట్రామా నాయుడు, రె॥ మందేశ్వర శర్మ, నేను నడుపుచున్న ఆంధ్ర జమిందారీ వ్యతి రేఖోద్యములలో తామప్పటికే పెంచి, పెద్ద చేస్తున్న చల్లపల్లి జమిందారీ రైతు వుద్యమాన్ని చేర్చిరి. శ్రీ గొ॥ బ్రహ్మయ్య, పండిత వెంకటసుబ్బయ్య ప్రభృతుల నాయకత్వముతో, దివిసీమ, కృష్ణాజిల్లా జమిందారీ రైతులకు, జమిందారీ పాలనము నుండి విముక్తి కలిగించుచూ, తుది దశాబ్దపు ఆందోళనతో తానే అన్ని బాధ్యతలు, బాదలు పడి, రైతుల సేవించిరి, రక్షించిరి, క్రమంగా సూర్యనారాయణ రెడ్డి, లచ్చన్న, నాగినేని, లక్ష్మీనారాయణ, వాసుదేవరావు, ఓబుల రెడ్డి, రాజగోపాల నాయుడు, యన్ వి నాయుడు, బాలిరెడ్డి, నారాయణ రాజు, మందేశ్వర శర్మ, తిమ్మా రెడ్డి ప్రభృతులు, రాష్ట్రస్థాయిలో నాయకులుగా పెరిగిరి.

రెండవ యుద్ధానంతరం, వివిధ సత్యా గ్రహోద్యమాల పిమ్మట స్వరాజ్య సంపాదన అందుబాటులో, కనుచూపు మేరలో వుండిన ఆ 1945-47 వ సంవత్సరాలలో కమ్యూనిస్టు కాంగ్రెసు కిసాన్ సభగా సభ నుండి కిసాన్ కాంగ్రెసుగా, కాంగ్రెసు నుండి కిసాన్ సమ్మేళనగా పురి విప్పుకొని రైతు రక్షణోధ్యమము నిండు పింఛముగా ప్రభవించున్న యుగమిది!

ఆ యుగారంభమునందే జైళ్ళలో మేము, జైళ్ళ వెలుపల జైలు బాధలకు మించిన కరకు నిర్బంధములు, బ్రిటిషు వారి స్వాతంత్ర్య నిరోధ చర్యల నుండి, కంట్రోళ్ళ నుండి తమ్ము తాము రక్షించుకొంటూ, రైతాంగాన్ని కాపాడుకొంటూ, రైతు వుద్యమ సారధ్యమును ధైర్య సాహసములతో, తెంపుతో నడుపుచుండిన శ్రీమతి భారతీదేవి వారి కండగా శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య సొదరులు లక్ష్మీనారాయణ వెంకటప్పయ్య సర్దారులచ్చన్న ఆంధ్ర లోనే గాక, అఖిల భారత వుద్యమములో గూడ వారు ప్రముఖ పాత్ర వహించుచుండిరి.

ఆ 1945లో అందుకొన్న ఆంధ్రరాష్ట్ర రైతు సంస్థ, వుద్యమ నాయకత్వాన్ని, ఆ బిగువు తోటే, ఆ తెంపుననే, స్థాయి మీదే పెరుగుచున్న విశ్వాసంతో తన భుజస్కంధములపై మోసిన మహాధీరుడు సేవకుడు, నాయకుడు ఆదర్శ ప్రాయుడగు దేశారాధకుడు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య.

ఇంతటి మహత్తర ప్రజా రక్షకునికి అందిన దేమిటి?

ఔను, గాంధీజి గతించిన పిమ్మట, జవహరులాలు యుగం ప్రారంభించిన తరువాత ప్రజాసేవకుల మని ప్రకటించుకుంటూ వస్తున్న వారి మధ్యనే, ప్రజా నాయకులని గుర్తింప బడుచున్న వరాఇలో మెరుస్తూ వుండే ఆశలు, ఆరాటములు అందుచున్న అంతస్థులు పొందుచున్న పదవులు తిరిగి బ్రిటిషు వారి కాలములో కంచువలె మ్రోగిన బిరుదులను తలదన్నుచున్న మాట నిజమేనా అనిపిస్తున్నది గదూ? తలదన్ను చున్నట్లున్నదే?

అనాడో - ఆ గాంధీజి యుగమందో మరో ధోరణి, స్థాయి వుండేది?

మున్ముందు గొప్ప ప్లీడర్లు రాజాజీ, ప్రకాశం ప్రభృతులు కోటీశ్వర్లు బిర్లా, బజాజ్, కాశీనాధుని లాంటి వారు, రాష్ట్ర జాతీయ నాయకులు మోతీలాలు, సి.ఆర్. దాసు లజపత్ రాయ్, కోండాజీ ప్రభృతులే, మహాత్ముని వద్దకు చేరగల్గిరి, చూపులకు అందగల్గిరి.

క్రమంగా, పారిశ్రామిక కూలీల నాయకుడు శ్రీ గిరి, సోషలిస్టులు జయప్రకాశ్, సుసానీ, నరేంద్ర దేవులు పైకొచ్చిరి.

రైతుకు దిక్కేది? నేను ఎటులో పై వారందరి తెరలు దాటి, ఖద్దరు తదితర బాపూజీ నిర్మాణ కార్యక్రమాల పెద్దల కక్ష్యాం తరములు చుట్టి 1925-27కు గాని బాపూజి దృష్టికి రాలేకపోతిని చాంపరాన్, బార్డోలి రైతుల నడిపిన రాజన్ బాబు, సర్దారు చాలరా రైతుల స్థితిగతుల నాలోదించుటకు సతీష్‌దాస్ గుప్త బాంకరు, ప్రభృతులు చాలుగా గ్రామీణుల బీదతనాన్ని తెల్పుటకు, ఖాదీద్వారా బాధానివారణ కల్పించుటకు ఐనా 1930-35 కు ప్రాధమిక హక్కుల ప్రణాళిక, వయోజన ఓటింగు హక్కు, జమిందారీల నుండి విముక్తి రైతు జనాల సత్యాగ్రహ సమరాల అందోళనలు లేవదీస్తూవున్న మా బోంట్లు రాచకీయ జీవిత మందొక స్థానం పొందుతుంటిమిగదా 1936లో సర్దారు, నా మధ్య జరిగిన సంభాషణొక సవాలుగా పరిణమించెను. కాంగ్రెసా,

రైతాంగానూ ఎవరికి ప్రథమ స్థానం అనెను. సర్దారు రైతాంగం కొరకు కాంగ్రెసు, అంటినె నేను, ఐతే కాంగ్రెసో అన్నా రాయనా! కాంగ్రెసు కొర్కై రైతు లను పార పోస్తమా, అని అడిగితి! ఇంత మాట అన్నారా అన్నది ఆనాది ఆంధ్ర పత్రిక! అమ్మో ఎంతటి సవాలు అన్నారు పట్టాభి! అప్పుడెందరో నన్నెదిరించిరి, శ్యాము బాబు, నాయుడు, లక్ష్మీ నారాయణ, గొర్రెపాటి దాన్ని జూచి భయపడలేదు.

అదే విధంగా 1982 లోనే డాక్టరు అంబేడ్కరు మహాత్మునే యెదిరించిరి, హరిజనుల రక్షించుట వారిద్దరికి శిరోధార్యమగు ధర్మం, ఐతే హిందూమతము, సంఘము కొరకు, హరిజనులు, జనరలు నియోజక వర్గములో వుండే తీరాలని, గాంధీజీ పట్టుదల, అల్లాగైతే హరిజనులు ఎప్పటివలె అణగారి వుండవలసి వస్తుంది. కనుక అంగీకరించమనిరి అంబేడ్కరు! జాతీయ ఉద్యమ వీరులందరికి అంబేడ్కరు చూపిన ధిక్కారము, పెంచిన అడ్డంకి ఎంతో బాధ కల్గించినది. ఐనా, తుదకు అంబేడ్కరే గెల్చిరి. గాంధీజీ ఆయన ధోరణినే అంగీకరించె! అంబేడ్కరే, మన కాన్‌స్టిట్యూషనుకు, ప్రాథమిక హక్కుల నిర్ణయానికి యీ కాలపు ధర్మ శాసనుడైనాడు గదా! రైతాంగము తరపున పొరాడుచున్న మాలాంటి వారికంతటి బలం, అంతత్వరితంగా అందలేదు. ఐనా ఎదిగినాము! ఎటుల అసెంబ్లీ సభ్యత్వాలు, మంత్రిత్వాలు, అధికార ప్రాబల్యం, లక్ష్మీ ప్రసన్నం, స్వజాతి, గణ, కుటుంబ ప్రతిభల ద్వారా కాదు అలాంటి ధోరణులు, ఆవేశాలు- ఆలోచనలు, అలవాట్లు మహాత్ముని భోదలలో, నడకలలో , నీడలో జీవించాలని కుతూహల పడుచున్న మాబొంట్లకు రుచించవు. కన్పించవు, మనస్సుకు ఆనవు, గదా! మరెటుల?

మహాత్ముని దృష్టిలోకి రావడంలో ఆయన సంప్రదింపులలో భాగస్థుల మగుటలో, ఆయనే మమ్ము మా సహకారం కొర్కై ఆహ్వానించుకోనడంలో ఆదేంతో ఘనమగు సంపద, ఆదృష్టాల స్వర్గము! అందరికి ఆది అమనా! అందెనా! ఆ 1944 వరకు -24 సంవత్సరాలు భారత స్వతంత్ర్య వుద్యమంలో బాపూజీ భానుడు వెల్గుచున్న - ఆ సోపానానికి మేము అందుకొన లేక పోతిమి గదా!

నన్ను పిల్చిరి మహాత్ములు జైలు నుంచి వెలికి రమ్మని బ్రిటిషు వారిచ్చిన "ఇంటర్నుమెంటు ఆర్డరును" శిరసావహించమని ఆ 1940లో, నేను బైటికి రాను, బ్రిటిషు వారి ఆర్డరులు ఆంగీకరించవంటివి.

"వద్దు, రావద్దు. బ్రిటిషు ప్రభుత్వమునకు తలయొగ్గుట భారత రైతాంగానికి, భారతీయులకు నామోషీ' అంటూ సింహ గర్జన చేసిన వారిలో పెద్ద మన గొర్రెపాటి" తుదకు మహాత్ముడే తన సలహాను పునసరించుకొనిరి, అప్పుడు ఆంధ్ర రైతాంగం తమ ఆనందం తెల్పుటకో యన్నట్లు శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యకు ఆంధ్రరాష్ట్ర రైతు సమ్మేళనాధ్యక్షులుగా ఎన్నుకొనిరి, అందుకొన్నాము మహాత్ముని పిలుపు. ఎప్పుడు? 1944 నవంబరులో నన్ను తంజావురు జైలు నుండి వదలిరి, జబ్బు నుండి కోలుకొంటున్నా! అయినా కాంగ్రెసు, నిర్మాణ కార్యక్రమం, రైతాంగ సమస్యలు చర్చించుటకు వెను వెంటనే రమ్మన్నారు మహాత్ముడు. కాంగ్రెసు పై కమ్యూనిస్టు సాగిస్తున్న విష ప్రచారం, బ్రిటిషు వారిని బలపరిస్తూ ప్రపంచయుద్ధం ప్రజాయుద్ధం అంటూ కమ్యూనిస్టులు చేస్తున్న బహుళ దేశ ద్రోహ ఆందోళన ఆరికట్ట వలసిన సమయమది. శ్రీమతి భారతీ దేవి అఖిల భారత కిసాన్ వుద్యమ అధ్యక్షులుగా వుంటూ, కమ్యూనిస్టుల యొత్తులను, శ్రీ వెంకట సుబ్బయ్య, లక్ష్మీనారాయణ నాయుడు ప్రభృతుల సహయంతో ఎదిరిస్తున్నారప్పుడు, రైతులందరి హృదయ పూర్వక సహకారము, జాతీయ వుద్యమమునకు అవసరమని గాంధీజీ గ్రహించిరి.

ఎవ్వరితో వెళ్ళాలి? అఖిలాంధ్ర రైతుల హృదయ కుహరాలలో, విరోన్ముఖముగా ప్రజ్వలించు స్వరాజ్య సంపాదనాకాంక్ష, జాతీయ ఐక్యతాభావం ప్రతిబింబించగల వారెవ్వరు! ఎవరి సలహ నమ్మకల్గినది. నిండైనది! జాతీయోద్యమ యోధుడు గానే 1920-31లో జైలుకు వెళ్ళిన వెంకట సుబ్బయ్య తమ బందరు ప్రముఖులు, తన ఘంటసాల సోదర పెత్తందారు సందేహిస్తున్నా, నా వెంటనే, రైతాంగ రక్షణకై నిలబడియున్న. గొర్రెపాటి తగిన సారధి, సలహదారు అనుకొంటిమి అందరం, వారిని నా వెంట సేవా గ్రామునకు తీసుకు వెళ్ళితి. కలుసుకొంటిమి మహాత్ముని. చర్చించితిమి గాంధీజీతో! జాతీయ వాహిని, రైతాంగ శక్తి ఆ భారత వీరా గ్రేసకుని సమక్షమున ఐక్యము చేయగల్గితిమి. ఆ సన్ని వేశము వారిని తోడివారిలో అత్యున్నత నైతిక, రాచకీయ స్థాయికి లేపినది. వారిలో అంతర్గర్భితమగు భక్తి, శక్తి దేశారాధన, రైతు భజన సాక్షాత్కారమై చివరి

వరకు, వారిని స్వచ్ఛంద సేవలను సభో మందొక అపురూప నక్షత్రములాగా వుంచినవి. ఉంచకల్గినవి,

ఆ సేవా గ్రామంలో ఆ రెండుదినాలలో ఓమారు, మరో రెండు దినాలలో రెండోమారు మాకందిన అదృష్టపు విలువగట్టగల వారెవరు? అట్టి అదృష్టము పొందగల్గిన వారెందరు! లేక, అంతటి అదృష్ట హంశలను పొందిన వారెందరు! వర్కింగ్ కమిటీ సభ్యులెందరికో అట్టి అవకాశం దశాబ్దాలలో దొరికేనా! అప్పుడుగాని ఆ పిమ్మట గాని మంత్రులైన వారందరికీ అందేనా? రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులైన వారెందరో మహాత్ముల సమక్షమున అంత దీర్ఘముగా నిలవగలిగిరి. చర్చలో పాల్గొని వారి అభిమానాన్ని ఆకర్షించగలిగిరి. అవును, మోతీలాల్, సర్దార్, రాజేంద్రప్రసాద్, ఆచార్య నరేంద్రదేవ్, వినోభా, జైప్రకాశ్, జవహార్, సి.ఆర్.దాస్, వజివత్‌రాయ్, రాజాజి, సరోజినిదేవి, మహదేవ్ దేశాయ్ లాంటి అతి ముఖ్యులు, ఆనాటి జాతీయ నాయకులకే గదా! అంతటి సాన్నిహిత్యము, సంప్రదింపుల స్నేహభాగ్యము అందుచుండెడిది. మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, శాసనసభ్యులు, బోర్డులు, పరిషత్‌ఛైర్మన్‌లు, అధికారదేవత ఆరాధకులే పూజించదగిన వారనుకొనే, ఈనాటి రాచకీయ పూజారులు, కేటుల, ఆ 1930-44 యుగపు ఆశయాకాశమందు, జాతీయ వాతావరణంలో సామ్రాజ్య పిశాచపు విషవాయువులకు అందకుండా, రాచకీయ చంద్రమండలాల యెత్తున సేవలలో హృదయముల వల్లవింప జేసుకొను చుండిన ఆనాటి జాతీయవీరుల ధోరణి అర్థం కాకపోవచ్చు. అట్టి జాతీయవీరుల పరిధిలో అంతటి ఉన్నత స్థానమును పొంది, ఆనందించగల్గిరి. కనుకనే, మన వెంకటసుబ్బయ్య ఆ పిమ్మట 26 సంవత్సరాల పర్యంతం అదే తన్మయత్వంతో, జ్ఞాన, ధ్యాన, స్వధర్మానుష్టానముగా, రైతాంగ సేవకే అంకితమైంది.

ఆ స్థాయికి తగ్గముఖంగా కన్పడు మరేపదవికి గాని, పనికి గాని, పలుకుకు గాని, అర్రులు సాచరైరి. అందని దానికి విచారించరైరి. అందించలేదని గాని, పిలువలేదని గానితుదకు నాతో అయినా పలుకరైరి.

ధర్మపాలనమంటే వారిదే సాదృశ్యము. స్వధర్మస్థాయిని పెద్దల వరవడిలో చూచుకుని అటుల తమ్ముతాము అంతటి ఉన్నత పంథాన నిలుపుకునుట, గురువుల శిక్షణ వల్ల, పెద్దల పోత్సాహం వల్ల తమ శిష్యుల బలంతో ఏ కొందరో భగవత్‌భక్తులకు సాధ్యమనుకుందుము. మహదేవ్ దేశాయ్‌కి, ప్యార్‌లాల్‌నకు సాధ్యమైనది. తిరిగి మన జీవిత అనుభవంలో ఈ రైతు వెంకటసుబ్బయ్యకు సాధ్యమైనదని, వారు, నాకు, భారతిదేవికి, వ్రాసిన ఉత్తరాల్లో ఎటులో దొరికిన వాటినిచదువు వారికి తేటతెల్ల మగును.

వారి స్వీయచరిత్ర మరి వేరేలేదు. ఈ ఉత్తరాలలో ద్యోతకమయ్యే నైటిక స్థాయి, సేవా వ్రత ధోరణీ, కష్ట జీవుల పై గల దయ, రైతు రక్షణయందు వారికి గల గాఢమగు శ్రద్ధ, మహాత్ముని ఆశీర్వాదము, ఆమోదము బొందిన రైతూ కూలి, కళాకారుల, బుద్ధిజీవుల ప్రజారాజ్య ఆశయమందు వారికున్న ఆకుంఠిత విశ్వాసము స్వీయ చరిత్రగా వారే వ్రాసికొన్నట్లు మనకు అందుచున్నవి. చదువు వారి హృదయాలను ఉత్తేజపరుస్తున్నవిగదా! అంతటి మహోన్నత అనుభవం, అదృష్టం, ఆ మహాత్ముని సన్నిధి చేరడంలో అంతదీర్ఘంగా వారితో వుండంలో చర్చించుకోవడంలో వెంకట సుబ్బయ్య ఆనాటి దాఇన్నల్లో పొందిరి. గాంధీజీ ముఖారవిందములో, నవ్వులలో, ప్రశ్నలలో, పలుకులలో, తలపులలో చేతుల కదలికలలో ఆ పరుపుపై అనించుకొను ఆ వీపు మెడసడలింపులలో, ఛరఖాను నడుపుటలో గాంధీజ యొక్క వివిధ భంగిమలు, అనుభావాలు గొర్రె పాటి హృదయానికి హత్తుకొన్నవి. వెంకట సుబ్బయ్యను గూడా మహాత్ములు బాగా చూచిరి, వారి రైతాంగ హృదయాన్ని అందుకొనిరి, హిందీలో మాటలు, ఇంగ్లీషులో చర్చలు, ఆయన గ్రహించుకొన్నట్లు కనుగొనిరి. అచ్చమయిన గొర్రెపాటి యొక్క రైతు స్వరూపము, భూదేవితో ముచ్చటలాడగల ఆయన దార్ఢ్యత ఆంధ్రుల ముఖకవళికలు, భారతీయుల ఆత్మగౌరవము ఆయనలో మహాత్ములు చూచుకొనిరి, అట్టి నమ్మకమగు, ధార్మికమగు, బలమగు రైతుపెద్దను ఆంధ్రరాష్ట్ర రైతుసమ్మేళనానికి అధ్యక్షులుగా నిల్పుకోగలిగినందులకు నన్ను గాంధీజి అభినందించిరి. అన్ని మంచి మాటలు, అంత అప్యాయతతో తన్ను గురించి బాపూజీ చెప్పినందులకు వెంకటసుబ్బయ్య ఆత్మానందం బొందిరి, అప్పటి నుండి తుది వరకు వారు నాపై జూపిన కృతజ్ఞాతా కిరణాలు, ప్రేమ, ఆదరణలకు ప్రధాన కారణమా మహాత్ముని ఆశీర్వాదములు.

1946-51 మధ్య రాష్ట్ర కాంగ్రెసు పెత్తనం మాకందించిరి. అందులకు మహాత్ముడు ఆనందమొందిరి. వెంకటసుబ్బయ్య మాత్రం రైతు సమ్మేనమును మరువలేదు. పైపెచ్చు వెనుకబడినవారిని ముందుకు పిల్చుటకై నన్ను ప్రోత్సహించిరి. చేనేత, వ్యవసాయ కూలీ, గిరిజన, వెనుకబడిన జాతులు, చేతివృత్తులవారి సంస్థల పెత్తందారులకు రాష్ట్ర కాంగ్రెసు కమిటీలో రైతు సమ్మేనముతో సమానమగు ప్రాతినిధ్యమిచ్చునట్లు చేసిరి, వ్యవసాయకూలీ కాంగ్రెస్ సమావేశములను, రైతు సమ్మేళన సమావేశములతో బాటు జరుగునట్లు శ్రమించిరి.

వ్యవసాయకులలో, కూలీలు ఒక ప్రధాన భాగమని, రైతుకెలాగా కనీసపు ధరలు నిర్ణయింపు చేయించవలెనో, అటులే, ఆ ధరలపై ఆధారపరిచే, వ్యవసాయ కూలీలకు కనీసపు కూలీ రేట్లు ఎప్పటికప్పుడు నిర్ణయం చేయుచుండుట ప్రభుత్వ ధర్మమని నాతో బాటు విశ్వసించియుండిరి. కనుకనే అంతర్జాతీయ లేబరు కాన్ఫరెన్సు వారు పారిశ్రామిక కూలీల రక్షణతో తృప్తి చెందరాదు, వ్యవసాయకూలీల రక్షణకు కూడా పూనుకోవాలని పల్కిరి.

స్వరాజ్య సంపాదనాంతరం, శ్రీజగ్‌జీవన్‌రాంతో మేమంతా కలిసి, కృషి చేసి, పార్లమెంటు చేత, కనీసపు కూలీ బిల్లులో, వ్యవసాయ కూలీలకు కూడా రక్షణ యేర్పర్చగలిగితిమి.

యుద్ధకాలంలో బ్రిటీషు పాలకులు రైతు కూలీలపై, ధాన్యాల ధరలపై, సరఫరాలపై కంట్రోలు పెట్టిరి. దాన్ని ధైర్యముతో ఎదిరించిరి వెంకటసుబ్బయ్య, మారెన సుబ్బారావు, బెజవాడ రామచంద్రారెడ్డి, భారతీదేవి, లక్ష్మీనారాయణ ప్రభృతులు. అంతకంటే కఠినతరమైన ప్రశ్న, ప్రధాని జవహరులాలు పెత్తనం కేంద్రంలో, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులను ఎదుర్కొవజొచ్చినది. దాన్ని ఎదిరించుట యెటుల? ఎప్పుడు?

ప్రజల కవసరమైనంత తిండి పదార్థములు ఉత్పత్తికాక, ధాన్యాల కొరత కలుగుతున్నదనే భయంతో, కాంగ్రెసు మంత్రులు బ్రిటీషు వారి కంటే కఠినంగా కంట్రోళ్ళను రైతులపై వారి ధాన్యాలను నిల్వ చేసుకొనకుండా, అమ్ముకోకుండా, అమలుపరిచినప్పుడు నిరుద్యోగ బాధను, క్రొత్త పాత సందులో పాగొట్టుకొనుటకై, నెత్తి మోతల ద్వారా, బియ్యాన్ని, వడ్లను, గ్రామాల నుండి బస్తీలకు సరఫరా చేస్తూ బ్రతుకుచున్న లక్షలాది కూలీలపై కంట్రోళ్ళు పెట్టి, బంధించుచున్నప్పుడు ఆ కంట్రోళ్ళను యెదిరిస్తారా, లేదాయని కాంగ్రెసులో పెత్తనం చేస్తున్న మమ్ము ప్రశ్నించిరి వెంకటసుబ్బయ్య! మహాత్మునికి పదేపదే వ్రాసిరి. రాష్ట్ర కాంగ్రెసు ద్వారా జవహరుకు పంపిన తీర్మానాలు, రాష్ట్ర మంత్రులకు పంపిన హెచ్చరికలు నిరుపయోగమయ్యెను. అప్పుడు కంట్రోళ్ళ నిరసనదినమని, కంట్రోళ్ళ రద్దుకై అఖిల భారత సంస్థయని వెంకటసుబ్బయ్యపైకొచ్చిరి. కాంగ్రెసు అధిష్టానవర్గమందు చేరుతూ, జవహరులాలు గారితో సహకరించవలసి వున్న నేను గత్యంతరం లేక వెంకట సుబ్బయ్యతో చేరితి వ్యవసాయ మంత్రులుగా వున్న రాజేంద్రప్రసాదు ఢిల్లీ నుండి డాక్టరు రాజన్ మద్రాసు నుండి, మమ్ముల జైళ్ళకు బ్రిటిషు వారు పంపిరి. ఇప్పుడు రైతాంగ రక్షణ కొరకు కాంగ్రెసు మంత్రులు పంపితే, సంతోషముగా స్వధర్మము కొరకై వెళ్ళతామన్నారు వెంకటసుబ్బయ్య!

"అదే మా సమాధానం మి సవాలుకు" అన్నాను నేను అఖిల భారత కాంగ్రెసు కమిటి సభ్యునిగా పార్లమెంటరీ కాంగ్రెసు పార్టీమెంటరీ కాంగ్రెసు పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షునిగా వెంకటసుబ్బయ్య మాజీ ముఖ్య మంత్రి ప్రకాశం గారు రంగాను జైలుకు పంపితే గ్రామ గ్రామాలతో రంగాలు బైలుదేరుతారు. జాగ్రత్త యని గర్జించిరి. మహాత్మునికి జలార్తనాదములు వినపడినవి, తానే కంట్రోళ్ళ వ్యతిరేఖోద్యమము చేస్తావన్నారు. అప్పుడు మంత్రి రాజేంద్రప్రాసాదు కంట్రోళ్ళను రద్దుచేసుకొన్నారు. అంతటిది వెంకటసుబ్బయ్య తపోశక్తి! అప్పటినుండి అ విజయము మాకు లభించినదన్న రాజకీయ వైరుధ్యము, పోటీ ఢీల్లిలో రేగిపోయినది, ఆ నిప్పు లింకా చల్లార లేదు.

జిల్లా బోర్డుల ద్వారా కొంత అయినా నిర్మాణ కార్యములను ప్రజాసేవకులయిన వారు చేయగలరేమో నన్న ఆశ ఆనాడు మాకుండెను. కృష్ణాజిల్లాలో కాంగ్రెసునకే మెజారిటీ రావచ్చు. వచ్చి నది గూడా! ఐతే పెత్తనము అతిముఖ్య మనుకొంటూ ముదు కెగసిన వారికే అధ్యక్ష స్థానము వేరుపరచాలి గదా! పిలిస్తేనే ముందుకు రాని శ్రీ వెంకట సుబ్బయ్యను ఉపాధ్యక్షులుగా నామినేటు చేసి, ఎన్నుకోగల్గితిమి. ఆ మూడు, నాల్గు సవంత్సరాలు, ఆదర్శ పాయంగా ఉద్యోగుల నిండు సహాయంతో గ్రామీణ ప్రజల సేవ, అధికార పూర్వకంగా ఎంతవరకు,

ఆదర్శములందు మనస్సు లగ్నపరచు ప్రజాసేవకులు ఉటుల చేయగలరో, చేసి చూపించగల్గిరి మన వెంకట సుబ్బయ్య గారు.

ఎన్నో సమయములలో వారిని శాసనసభలకు చేర్చాలను కొటిమి. సాద్యము కాలేదు. రాజకీయ పెత్తనం, పదవులు అధికార పార్టీ నాయకులకే, అందులో మంత్రులకే, ఆ పైన, తగినంత ధనస్తోమత వున్న వారికే సాధ్యమని క్రిందటి 25 సంవత్సరాల అనుభవం గదా! పార్లమెంటుకు నిల్పితిమి. వోడితిమి. ఆ 1952లో రైతులపక్ష మోడినది. రాష్ట్ర అప్పరు కౌన్సిలుకు వారే, నాతో సర్దారు లచ్చన్నతో చేరి, అభ్యర్థుల నిర్ణయించుచుండిరి. తన్నుతా చెప్పుకొనునా? మేము ఇతరుల వత్తిడిని మరువగలమా! ఎవరిని మేమందరం నామినేటు చేసినా, అదే మంచిదంటూ వుండిరి వెంకటసుబ్బయ్య. అట్టిది వారి గంభీర హృదయం. స్వధర్మపాలనం, తన పెత్తనాన్ని సాగించడంలో!

గొప్పగొప్ప పరీక్షలే మమ్మెదుర్కొన్నవి. 1951లో కాంగ్రెసును వదలడమా? అయితే, రైతాంగ ప్రజల పార్టీ పెట్టుకోవాలి గదా! దాంతో నిండుగా ఐక్యము కాగలరా పెద్దలు ప్రకాశంగారు! అసలు కాంగ్రెసును ఎందుకు అప్పుడు వదులుకోవాలని కొందరమన్నాము. మరెప్పుడు రైతాంగపార్టీ పెట్టుకొను అవకాశము అన్నారు గొర్రెపాటి ప్రభృతులు. అయినా, నేను రైతాంగ ప్రజాపార్టీ ఉపాధ్యక్షులుగా ప్రకాశం గారి బలవంతం పైన అంగీకరించడం వెంకటసుబ్బయ్యకు తలగొట్టినట్లనిపించిందట. ఐనా ఓర్చుకొన్నారు. ఆ పిమ్మట, తానే మా అందరిపార్టీకి అధ్యక్షులుగా వుంటూ, తన నిరంకుశ ధోరణి చెల్లడం లేదని, సంకుచిత భావులైన కొందరు అనుయాయుల బోధలకు, వృద్ధాప్య లోపం వల్ల లోబడిపోయిన పెద్ద మరో పార్టీని యేర్పరచి మా రైతాంగ ప్రజాపార్టీ అధ్యక్షతను వదలకయే, పోటీ సాగించిరి. ఇక యీ ప్రజాహిత జీవితంలో ధర్మమెచ్చటని విసిగిరి వెంకటసుబ్బయ్య. పెద్దలు ప్రకాశం గారితో ఓర్పుపట్టక తప్పదనుకున్నాం.

1952లో ఎన్నికల ఫలితాలు అందరికీ అసంతృప్తియే కల్గించినవి. కాంగ్రెసు వారిపై కలిగిన కోపంతో, కమ్యూనిస్టులతో నైనా కలిసి ఎదురు మంత్రి వర్గం నిర్మించాలని పెద్ద ప్రకాశం పూనుకొనిరి. అలా చేయడం, ప్రజాస్వామ్యానికి, రైతాంగానికి ద్రోహమగు ననుకొంటిమి. నేను, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, లచ్చన్న, తిమ్మారెడ్డి మంత్రి వర్గంలో చేరకుండానే, రాజాజీ నాయకత్వంలో కాంగ్రెసు మంత్రివర్గ మేర్పడుటకు ఒప్పుకొంటిమి. అందుకు సాయపడితిమి. నేనుగాని, యువనాయకులు లచ్చన్న, తిమ్మారెడ్డి మంత్రులుగా పోవడం మంచిదిగాదనుకొంటిమి. వుపముఖ్యమంత్రిత్వం మాకు గొప్ప అనిపించలేదు. రాజాజీ మంత్రివర్గం, లాండు రెవెన్యూ హెచ్చించాలని ప్రయత్నించినప్పుడు తీవ్రమైన ఆందోళనను గొర్రెపాటి సాగించిరి. చిత్తూరు జిల్లా మీంజారులో రైతుసభ జరిపించిరి. రామస్వామిరెడ్డిని, విదేశాల నుండి నన్ను రప్పించిరి. ఆ ప్రతిపాదనలు ఉపసంహరింపచేయగల్గిరి.

ఆంధ్రరాష్ట్రము అవతరించినప్పుడు ముఖ్యమంత్రి ఎవరు అనే ప్రశ్న వచ్చెను. పెద్ద పార్టీయగు కాంగ్రెసు యువనాయకులే పైకి రావాలని యత్నించిరి. తమ్ము ఓడించిన ప్రజాపార్టీగాని, క్రిషికార్‌పార్టీ గాని పైకి రాకూడదనే కక్ష శ్రీజవహరులాలుకుండెను. నేనెటూ రాష్ట్ర మంత్రివర్గమునకు రాను గనుక, మనకందరకు పెద్ద అయిన ప్రకాశంగారినే ప్రధానిగా చేద్దామంటిని. ఆయనెలాగా ఎంతగా మమ్ము అనవసరంగా బాధించియుండినా, 1946లో కాంగ్రెసు వారు ప్రకాశం గారిని అధర్మంగా హింసించిరి గనుక తిరిగి వారికే పట్టము గట్టుట ధర్మమనుకున్నారు వెంకటసుబ్బయ్య. అలాగా ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా వచ్చిన పిదప, వారి మంత్రివర్గములో నేను చేరకపోయినందులకు, తృప్తిపడిరి. తిరిగి ఆ ప్రకాశం గారే అందరి బాధలకు కారణభూతులైన కళా సంజీవరెడ్డి వర్గాన్ని తన మంత్రివర్గమందు పెత్తనాన్నిచ్చి తద్వారా 1954 నవంబరులో, తన మంత్రివర్గ పతనానికి దారి తీసుకున్నందులకు విచారించిన వారిలో ఒక్కరు వెంకటసుబ్బయ్య.

కమ్యూనిస్టులు ఆంధ్రప్రభుత్వాన్నిదిగో పట్టుకోబోతున్నాము, మాకెవ్వరడ్డువారని సవాలును, తిరిగి అందుకున్నారు గొర్రెపాటి 1955లో! అందరం చేరి, సంయుక్త కాంగ్రెసు పార్టీ తరపున ఓటరులను ప్రభోదించితిమి, తాను మాత్రము అసెంబ్లీకి నిలబడలేదు. కమ్యూనిస్టుల నోడించితిమి. గోపాలరెడ్డి నాయకత్వం

క్రింద సంయుక్త కాంగ్రెసు మంత్రివర్గ మేర్పడెను. కృషికారు పార్టీ తరపున ముగ్గురు మంత్రులు ఉండాలంటిమి. ముందు యిద్దరినే చేర్చుకొంటామనిరి గోపాలరెడ్డి వల్ల కాదంటిని నేను. ఢిల్లీలో వున్న నా వద్దకు వచ్చి మాట్లాడెదమనిరి. ముగ్గురు పదవులకు మావారు తప్పనిసరియగు నాయకులున్నారు. అధ్యక్షుడు ఓబులరెడ్డి, సర్దారు, లచ్చన్న,రామారావు, వారిని ఒక్కుమ్మడిగా తీసుకోవాలి, లేకపోతే, మావారెవ్వరు మంత్రివర్గములోనికి రారంటిని. అదేసరి అన్నారు గౌర్రెపాటి! ఇంతలో, మాయిద్దరిని సంప్రతించకయే, ఏవేవో కళావారి మెలికలు పెట్టి, లచ్చన్న, రామారావులను మాత్రమే చేర్చుకొనిరి, అధ్యక్షులైన ఓబులరెడ్డి మోమోటపడి కాబోలు సమయానికి విజయవాడ వదలి గుంటూరుకు వెళ్లిరి. వారు టెలిఫోనులో నన్నడిగితే, “అది తప్పు, నాకిష్టములేదు. పోతే, ముగ్గురుపొండి, లేకుంటే బైటవుండండి” అని చెప్పితి. మనవారంతా ముందు యిద్దరు చేరండి, తరువాత మూడో , నాలుగోవారిని కూడా చేర్చవచ్చు అంటున్నారని చెప్పిరి. అలాంటి మార్పుకు ఓబులరెడ్డి వొప్పుకోవాలి లేకుంటే  బైటే వుండాలంటిని. ఢిల్లీలో ఉన్న నా మాటను విజయవాడలో మనవారు మరిచిరి. మిగతా వారిద్దరు త్వరపడి మంత్రిపదవులంగీకరించిరి.  అలా మిగిలిపోయిన వ్యవహారాన్ని దారికి తెచ్చుకోలేక, నాపైన గౌర్రెపాటిపైన కోపతాపాలు ప్రకటించుకునిరి, ఓబులురెడ్డిగారు అదంతా, అట్టి పదవులకై ఆరాటపడక, తానే పెత్తనం చేస్తున్నప్పుడు తానెట్లు అందరుముందు తాను వెనక, అనే గాంధీయ ధోరణిలో నడుచుకుంటూ వుండిరో, అటులే ఓబులరెడ్డి గంభీరంగా వుండలేకపోయిరి అని కడుబాధ చెందిరి వెంకటసుబ్బయ్య.నామాట “ఆ యిద్దరు వినలేకపోయిరి. ఈ అధ్యక్షుడు వారిని అదుపులో వుంచలేక, “తాను లేని మంత్రివర్గములోనికి వారెవ్వరూ చేరరాదు. రంగాజీ అనుమతి లిఖితపూర్వకంగా లేనిది, టెలిఫోను కల్లబొల్లి కబుర్లపై కృషికారు పార్టీ మంత్రివర్గములో చేరదు” అని అనలేకపోయిరి, పైపెచ్చు తన కన్నివిధాలా అండగాయుండిన మా యిద్దరినే దూషించుటకు సాహసించిరే” అని వెంకటసుబ్బయ్య పొందిన బాధ వర్ణింపజాలము”.

ఆ పిమ్మట సంవత్సర పర్యంతరం, బాధిత హృదయులైన లచ్చన్న, అధ్యక్షుని మర్యాద నిల్పాలనుకున్న వెంకటసుబ్బయ్య, పెంచి, పెద్దజేసుకున్న ఓబులరెడ్డికిట్టి ఆశాభంగం, అపరాధం కల్గినందువల్ల బాధచెందిన నేను, ఎంతో పట్టుదల వహించి, ఒక్క మంత్రి పదివికా మేమంతా మా తపస్సు ధారపోసుకోవడం అనుకుంటూనే కాంగ్రెసు పెద్దలను ఆరాతీస్తిమి. తుదకు జయించితిమి, ఓబుల రెడ్డిని మంత్రిగా చేర్చితిమి. ఆరుమాసాల పాటు మంత్రిగా ఓబుల రెడ్డి వచ్చి రనుకొంటిమి. ఈ పదవుల వేట యెంతటి దారుణ దైర్భాగ్యాని కల్గించెనో! ఆయనతో పాటు అందరూ కృషి కారు పార్టీ వారు 1956లో పదవుల వదలిరి. ఆవంక తిరిగి మేము చూడలేదు.

ఆ జవహరులాలు యొక్క ద్వేషాసూయలను కనుగొంటిమి. కాంగ్రెసు పెద్దలు, కళా లెవెలు లోనే వుండగల్గు చున్నారని గ్రహించిమి. వారికి పదువులేగాక మోసంగా తోడువచ్చిన వారిని పల్టీకొట్టించి, వెక్కిరించి వ్యక్తిగల దురభిమానాలను పొందుట ఎందిఇ ధోరణియని బయల్పరచుకొనిరి. ఆ పిచ్చి రాజకీయమే క్రమంగా 1970-71 దేశీయ, దైర్భాగ్యాలకు దారితీసిందని యిప్పటికి అందరికి తెలియవచ్చినది కదా!

ఇంతకూ, ఆ కాంగ్రెసు పెద్దలు, తమ పార్టీతో ఒడంబడిక చేసుకున్న సోదర పార్టీ అధ్యక్షుని పిలువక, మంత్రివర్గములో చేర్చుకోక, వారి పేరుతో పేరంటానికి పూనుకొన్న సరిక్రొత్త పెత్తందారులను మోసం చేసి, కళావారి కుట్రలకు ఎటుల లోబడి రోదురూహ్యము, అలాగా నైతిక విలువలను వారు మరచిరనే గదా వారిపై నాకు అసహ్యం కల్గినది.

ఈ సంఘటన గౌర్రెపాటి తీరని బాధ కల్గించినది.

అంతకంటే కష్ట గాధ, మేమందరం తిరిగి కాంగ్రెసులో చేరిన తరువాత, రాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శియైన శ్రీ బహ్మానందరెడ్డి రైతు సంస్థలను కాంగ్రెసు వారు బలపరచరాదంటూ సర్క్యులరు పంపడం! ఏ కృషి కారు పార్టీ సహాయం, లేకుంటే తిరిగి రాజకీయాధికారం పొందుటకు తమకు అస్కారం ఆంధ్రలో వుండదని జపహరులాలు అంతటి వారు భయపడి కాంగ్రెసు పేరుతో గాక సంయుక్త కాంగ్రెసు పేరుతో ప్రజల వద్దకు 1955 మధ్యంతర ఎన్నికలలలో వెళ్ళారో, ఆ కృషి కారు లోక్ వారిని రైతు వుద్యమమునుండి వేరు చేసి, వారికి రాజకీయ ప్రతిష్ట లేకుండా చేయాలనే కళావారి కుట్ర ఆది యని గుర్తించిరి గౌర్రెపాటి

లక్ష్మీనారాయణ! వారిద్దరు సవాలు చేసిరి, ఆనాటి కాంగ్రెసు నాయకులను అప్పుడు నన్నడిగిరి కాంగ్రెసు ప్రసిడెంటు ధేబరు తన వర్కింగు కమిటీకి తిరిగి రమ్మనమని! ఏ మొగము పెట్టుకొని తమతో చేతులు కలుపుట. ఆ కళా కుట్రనూ ప్రయోగం చేస్తున్నప్పుడు ఓబులరెడ్డిని అంతరకాలం అజ్ఞాతంలో యుంచినప్పుడు వెంకట సుబ్బయ్య, లక్ష్మీనారాయణ గారలను బహిష్కరిస్తే, రంగా కాంగ్రెసులో మరో దినం వుండగలడా యని అడిగితి, ఆ విధంగా ఆనాటికి వెంకటసుబ్బయ్య గర్జన గెల్చినది.

అట్టి మోసంపు ధోరణి, మహాత్మునిచే పోషించబడిన, కాంగ్రెసునకు కల్గుచున్న దేయని నైతిక విలువకే ప్రాధాన్యమిచ్చు వెంకట సుబ్బయ్య దుఃఖించిరి. రెండు మారులు కృషి కారు లోక్ గ్రూప్ వారిని, కళా యొక్క చాతుర్యము, జవహరులాలు మద్దతతో చిత్తు చేయగల్గితిననె వెర్రీ తృప్తి శ్రీ సంజీవ రెడ్డి పొందిరి. పూర్తిగా 1955లో తన కుట్రలు, తల్ల క్రిందైనా, 1955లో, లోలోన యునైటెడ్ కాంగ్రెసు అభ్యర్థుల నెందరినో తన ఇండిపెండెంటు అభ్యర్థుల ద్వారా ఓడించి, అటు కాంగ్రెసు ప్రసిండెటు దేబరును, యుటు లోక పార్టీ ప్రెసిడెంటు ఓబుల రెడ్డిని ధిక్కరించినా, తిరిగి తిరిగి జవహరు కృసాకటాక్షముల వల్ల, డిప్యూటి ఛీఫ్ మినిష్టరైరి శ్రీ సంజీవ రెడ్డి. అదృష్ట దేవత ఆయన్ను వరించినందు వల్ల తన్ను డిప్యూటి ఛీఫ్ మినిష్టరుగా, 1955లో కొంత ఉదార బుద్ధితో కొంత పిరికితనమువల్ల నియమించుకొన్న గోపాల రెడ్డి గారిని 1957లో ఓడించి తానే ఛీఫ్ మినిష్టరుకాగల్గిరి సంజీవరెడ్డి. కనుక, తనకిక దురెవ్వరనే ధీమాతో సంజీవ రెడ్డి గారు నిరంకుశగా తమ పార్టీలో ప్రధాన బృందమైన క్రిషి కారు వారిని మంత్రులుగా నియమించ నిరాకరించిరి. నా కెవ్వరడ్డం అనే తత్వంతో పెత్తనం చేయమొదలిడిరి. అది సహించలేక శ్రీ చెన్నా రెడ్డి, చంద్రమౌళి, లచ్చన్న, ఓబులరెడ్డి, బొమ్మ కంటి సత్యన్నారాయణ ప్రభృతులు, కాంగ్రెసును తిరగి యెదిరించి, బైటకు వచ్చి, ప్రజాస్వామికమును రక్షించుటకై మరో పార్టీని స్థాపించాలనుకొనిరి.

అప్పుడు వెంకటసుబ్బయ్య గారిని కోరిరట నా వద్ద తమ ధోరణికి బలం సంపాదించమని! ఆయన నిర్మొగమాటముగా రైతు ఉద్యమము పై క్ష సంజీవరెడ్డి బృందము దండెత్తుతున్నప్పుడు కలుగని తాపం, అధికార దుర్వినియోగం, దురహంకారం ప్రయోగించినంత మాత్రానా కల్గినదో. ఐతే తనలాంటి వరాకేల అట్టి ధోరణితో సంబంధమన్నారట! నావద్దకు వచ్చి వారి పంధాను బలపరచుటకు రానన్నారట!

తుదకు వచ్చిరి వారంత నా వద్దకు! చెప్పితి నేను! నాకున్న జగడం సంజీవ రెడ్డి గారితో గాదు, జవహరులాలు గారుఅవలంబిస్తున్న రైతాంగ వ్యతరేక ప్లానులతో, ఆయన అనుసరిస్తున్న అవినీతికరమగు గాంధేయ వ్యతిరేక రాచకీయ వ్యవహరములతో, సంజీవ రెడ్డి గారు లాంటి వారెందరో ప్రబలుంచుటకు కారణభూతులైన జవహరులాలుపై ఆధారపడ్డ పెత్తందారులందరితో. వారందరిని ఎదిరించే సమయం రాలేదు. శక్తియు చాలదు. ముస్ముందు తిరుగు బాటు అవసరం. ప్రబలం కావచ్చు. శక్తిక రావచ్చు. అంతేగాని ఒక్క సంజీవ రెడ్డి గారిపై వ్యక్తిగత విరోధము పెంచుకోవడం నైతికంగా, రాచకీయంగా విజ్ఞత కాదంటిని. సద్యోఫలితాలు అధికార ప్రాప్తి కోరుకొంటున్న వారికి మా ధోరణి నచ్చునా!

మరికొన్ని మాసాలకు, వారు మరికొందరిని చేర్చుకొని, తిరుగుబాటు చేసిరి. కాంగ్రెసును వొదలిరి. డెమోక్రాటిక్ పార్టీ పెట్టిరి. అందులో శ్రీ చెన్నారెడ్డి " తిరిగి కాంగ్రెసులో చేరుటలో బదులు కృష్ణానది బురదలో పడిపోతే మేలని" అన్నారని పత్రికలు ప్రకటించినవి, ఆ పిమ్మట వారితో అంతదనుక సోషలిస్టుగా వుండిన శ్రీ పి.వి.జి. రాజు బృందము చేరుకొని, డెమోక్రాటికు సోషలిస్టు పార్టీగా రూపొందిరి.

ఈనాటికి వారిలో ఎందరు ఎటుల రాజకీయపదవులు పొందుతూ, అవతారాలు మార్చుకొంటూ కొందరు పైకి, మరికొందకు క్రిందకి, ఆ వైకుంఫు సోపాన రా,కీయ ఆటలందు, వస్తూపోతూ వున్నారో చరిత్రకు విదితము. అప్పటి నుండి 1970 చివరి వరకు యీ కృష్ణాలో గౌరైపాటి, ఆ శ్రీకాకుళంలో లచ్చన్న, శిమ్మా జగన్నాధం, విశాఖలో రమణ, రావలనాయుడు, చిత్తూరులో పాకాల వెంట్రామనాయుడు, రాజగోపాలు, సిద్దయ్య మూర్తి, మధ్యలో జాగర్ల మూడి చంద్రమౌళి, వెంకట్రావు, బుచ్చయ్య, లక్ష్మీధనెంకుల కోటీశ్వరరావు, శివయ్య, నాగినేని, గోదావరిలో చంద్రరావు, కొమ్మారెడ్డి, బాపయ్య రైతాంగ వుద్యమాన్ని సాగిస్తూ, రైతుకూలి ప్రజారాజ్యాశయ

సిద్ధికై ఎన్నో రాచకీయ తుఫానులను ఎదుర్కొంటూ ఉండగల్గుచున్నారు. అదే వెంకట సుబ్బయ్యకు ఆస్థి, తృప్తి కల్గించు సోదర బృందం.

1959 రానే వచ్చింది. రైతులపై తన సవాలుతో నాగపూరులో కాంగ్రెసు సమావేశం జరిగింది. భారత రైతాంగము వంతను ప్రభుత్వ ప్రేరితమగు, సహకార వ్యవసాయ యంత్రములో ఆరికట్టాలని తీర్మానించిరి. అంతకుముందే 1957లోనే యోల్వాక అనే మైసూరు గ్రామంలో వినోభాజీ ప్రేరణమీద, జవహరు, జయప్రకాష్, రాజేంద్రప్రసాదు, ధేబరు, కమ్యూనిస్టు సోషలిస్టు పార్టీ ల నాయకులందరు చేరి, భూదానోద్యమాన్ని గ్రామదానోద్యమంగా పెంచి మార్చి, రైతులందరి ఆస్తిపాస్తులను గ్రామపంచాయితీలకు అర్పణ చేయడమే భారత ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి శరణ్యము అనే తీర్మానాన్ని చేసిరి. ఆ వుద్యమాన్ని ప్రభుత్వం ఆశీర్వదించాలనే ప్రయత్నం ప్రారంభం చేయాలనిరి.

అంతకు ముందొక ఎనిమిది మాసాల క్రితమే ఎంతో కష్టం మీద జవహరులాలు స్వంత సారధుల మనుకొన్న వారి వ్యతిరేక ప్రచారాన్ని తట్టుకొని, ఎటులో తిరిగి పార్లమెంటుకు నేను ఎన్నుకోబడితిని. కృష్ణ కావలి తట్టున, విజయవాడలో కాంగ్రెసు అభ్యర్థిని బలపరుస్తూ వుండిన జవహరులాలు, కృష్ణ కెనాల్ వరకు వచ్చి, సూచన ప్రాయంగా “రంగా నియోజన వర్గమిది. రంగాను ఎన్నుకోండి” అని ప్రజలనుద్దేశించి పల్కుటకు ఒప్పుకొనరైరి రంగ గెల్వానంత మాత్రాన జవహరులాలుకు వచ్చే నష్టమేమిలేదు”అన్న రాష్ట్ర కాంగ్రెసు పెత్తందారుపై ఏ చర్య కాంగ్రెసు తీసికొనలేదు. యిదంతా గమనిస్తూ ఉండిన గొర్రెపాటి, లచ్చన్న, ఓబులరెడ్డి ప్రభృతులు“గ్రామదానోద్యమాని” ఎదిరించుటకు బూనుకొన్న నన్ను బలపరచుటకు నడుము బిగించి. గొర్రెపాటి బందరులో బ్రహ్మాండమగు రైతు మహాసభ, అంతకు మించిన బహిరంగ సభ గుడివాడలో, జన్మదినోత్సవములు జరిపించిరి. అంతవరకు చెన్నారెడ్డి మాతోనే యుండిరి.

తెనాలిలో, హ్యూమనిస్టు ప్రముఖ వాస్తవతావాది శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి సభలు చేసి, నున్న పిలిచి, కో ఆపరేటివు వ్యవసాయమును ఎదిరిస్తూ మేమంతా నాగపూరు కాంగ్రెసు తీర్మానాన్ని ధిక్కరించగల్గుచున్నందులకు తమ ఆనందం ప్రకటించిరి ఇదంతా వెంకట సుబ్బయ్యకు బలమిచ్చినది.

క్రమంగా మేమందరం దోనేపూడి 1959 మే 30 కి చేరితిమి, నిప్పులొలుకు అగ్నిజ్వాలలు. ఇప్పుడు హైకోర్టు జడ్జిగా పెరిగిన, మానవతా వాది శ్రీ ఆవుల సాంబశివరావు మేము ప్రచురించిన పరుచూరి, నేను కలిసి వ్రాసిన “రైతులు - సహకార వ్యవసాయము” అనే ఆంగ్ల గ్రంధమునకు కీ. శే. జాస్తి జగన్నాధం చేసిన తెలుగు తర్జుమాను ఆవిష్కరించిరి. ఆ జూన్ నాల్గవ తేదీననె మాద్రుసులో రాజాజీ ప్రేరణపై అఖిల భారత వ్యవసాయకుల సమాఖ్యవారు శ్రీ జెజవాడ రామచంద్రారెడ్డి పిలుపుపై చేరిన సభవారు, రైతాంగ వ్యవస్థను రక్షించుటకై మానవతా హక్కులను, రాచకీయార్థిక, సాంఘిక స్వాతంత్ర్యముల రక్షించుటకై “స్వతంత్ర్య” పార్టీని స్థాపించిరి. రాజాజీ సలహా మేరకు సభవారు నన్ను అధ్యక్షునిగా వుండమనిరి, వొప్పుకింటిని. ఆ సాయంత్రమే శ్రీ పాకాల వెంకట్రామా నాయుడు, రాజగోపాలు తమ రాజీనామాలను కాంగ్రెసు అసెంబ్లీకి పార్టీకి పంపిరి. ఆ మరునాడు భారతీదేవి పిమ్మట, కృషి కారు బృందపు అసెంబ్లీ మెంబర్లందరు కాంగ్రెసును వదలిరి. రెండు నెలల పిమ్మట సర్దారు లచ్చన్న, ఓబులరెడ్డి, చెన్నారెడ&ఇడ ప్రభృతులు తమ సోషలిస్టు డెమోక్రాటికు పారర్టీని రద్దుచేసుకొని, స్వతంత్ర్యలో చేరుకొనిరి. ఆరెండు సభలు వెంకటసుబ్బయ్య కెంతో ఆనందం కల్గించినవి. తిరిగి తన సోదర సేవకులంతా ఒకే తోవకు ఒకే నాయకత్వమును ఆంగీకరిస్తూ వచ్చినందులకు, తానెంతో బలపడితినని చెప్పిరి.

మాజీ మంత్రులుగా వుండిన ముగ్గురు, మంత్రి వర్గముల తల్లక్రిందులు చేస్తూవుండిన మరో యిద్దరు, మంత్రి వర్గాల పైన మమకారం కల్గి, ఎప్పుడెప్పుడా సంజీవరెడ్డి మంత్రి వర్గాన్ని పడగొట్టాలను కొంటున్న యిద్దరు యువ రాజకీయ నాయకులలో ఎవ్వరిని రాష్ట్ర స్వతంత్ర పార్టీకి అధ్యక్షులుగా పిలుచుట! అదొక గొప్ప సమస్యగా తేలినది.

అందరికి తలలోని నాలుకలాంటి వారు, ఏ పదవికి కాంక్షించక రైతాంగ రక్షణయే జీవిత పరమావధిగా గల్గినవారు సట్టేటముంచి, మరో పడవపై కెక్క జూడని వారు. స్వచ్ఛంద స్వంత ఉద్యోగులను

రైతాంగ కళాకారులకై, అన్ని త్యాగములను చేయుచున్న వారిలో ప్రథములు శ్రీ వెంకట సుబ్బయ్య గదా! అధ్యక్షులుగా నిర్ణయించుట కంటె నూతన పార్టీకి ప్రతిష్ఠగా, మిగతా పెద్దలందరికి సమాధానంగా వుడునని అనేకులు నాతో అంగీకరించిరి.

ఐతే, వెంకటసుబ్బయ్యను అంగీకరింప చేయవద్దా! ఆయనకు యువనాయకులతో ఎవ్వరినైనా పిలువాలని వుండెను. లేదా పెద్దయగు రామచంద్రారెడ్డి గారిని పూజింపవలెనన్నారు. తుదకు ఒక్క సంవత్సరమువరకయినా ప్రథమ అధ్యక్షులుగా స్వతంత్ర వ్యుద్యోగులలో పెద్దలగు తానేవుండుట నాకు ప్రీతియని చెప్పితి. స్వరాజ్యవతరణ పిమ్మ గణన కొచ్చిన మంత్రి పదవులు, నేను అందించలేకున్నా, గాంధేయ ధోరణిలో ప్రధానమగు యీ స్థానమందైనా తన్ను ఒక్క సంవత్సరానికైనా, నిల్పుకోవాలని వున్నరంటిని.

స్వతంత్ర పార్టీలో అప్పటికి విద్యత్తుగలవారు, గొప్ప గొప్ప ఉద్యోగాలు చేసినవారు, మంత్రులుగా వున్నవారు విస్తారంగా చేరుతూ వుండిన మాసాలవ్వి, అందువల్ల, సాధారణ రైతైన తానెట్లు రాణించగలనాయనే సంకోచం కన్పరచిరి. అట్టి రైతే అధ్యక్షులుగా వుండటం నాకోరికయని చెప్పితి. అంత "సరే, మీ యిష్టం" అనిరి. మిగతా పెద్దలు, పండితులు సహృదయముతో అంగీకరించిరి.

అలాగా, రైతు సమ్మేలనాద్యక్షులు, ఆంధ్ర స్వతంత్రపార్టీ ప్రథమాధ్యక్షులు అయిరి. వారి పిమ్మట శ్రీ రామచంద్రారెడ్డి, సర్దారు లచ్చన్న అధ్యక్షులుగా వచ్చిరి, అందరు ప్రజాసేవ చేసి, రాణించిరి గదా!

1963లో, శ్రీ జవహరులాలు, తిరిగి రైతుల భరతం పట్టుటకు, పదునేడవ సవరణ బిల్లను రాజ్యాంగ చట్టముపై ప్రయోగించిరి.

1957లో గ్రామదానోద్యమము పెరుగలేకపోయినదే, 1959లో సహకార వ్యవసాయపు పెత్తుపమ్యే పోయినదే. ఇక ఈ రైతుల లొంగతీసుకొనుటకు ఎలా మార్గమంటూ ఆయన సలహారాదులు తపస్సు చేస్తూవుండిరి. తుదకెట్లో, రైతుల భూస్వామ్యములను జమిందారీలతో సమానంగా చేస్తే, చూసే ప్రజల భ్రమింప చేసి, జమిందారీ లెట్టివో, రైతు పట్టాలు అట్టివె అని చెప్పితే లాగా రూపొందిస్తే పార్లమెంటుచేత వొప్పిస్తే. జమీందారీలను ఎలాగా నామమాత్రపు నష్టపరిహారంపూ రద్దు చేసిరో అటులే రైత్వారీహక్కులను పట్టాలను రద్దు చేయవచ్చు అన్నారా సలహాదారులు.

ఐతే, తానే, రాజ్యాంగ శాసనసభలో, రైతాంగ హక్కులకు జమీందారీలపై బెట్టిన గొడ్డలిని ప్రయోగించను అన్న ఉపన్యాసం అడ్డం రాదా అన్నారట జవహరలాలు. అంబేడ్కరు ప్రత్యేక్షంగా రైతాంగ పట్టాకిచ్చిన అభయ ప్రధానం ఆ సభలోనే గదా ప్రకటించవదని ఆయనను కొందరు హెచ్చరించిరి.

విప్లవాన్నే సాధించడానికి పూనుకొన్న వీరులకి అభయ ప్రదానాలు అడ్డం రానివ్వడమా? కోట్ల ధనం ఎక్కడుండును. ఒక్క కలంపోటుతో ఓ చిన్న సవరణతో, అంతా మార్పు చేసి, సంఘపరియానికి తలవొగ్గినారు జవహరులాలు, ఆ విధంగా ప్రయోగించబడినది ఆ 17 వ సవరణ, మూడు నెలల శేషను చివరి రోజున, హెచ్చుమంది సభ్యులు తమప్రదేశాలకు వెళ్ళిన పిమ్మట, పార్లమెంటులో గప్ చిప్‌గా ప్రవేశక పెట్టిరా, దురాగతపు ఒక్క మాట యొక్క అర్థాన్ని పెంచే ఒక కలం పోటు బిల్లు. "ఎస్టేటు" అంటే ఏమిటి? ఇది వరకే, రాజ్యాంగ చట్టంలో చెప్పబడిన అర్థమేగాక, "రైత్వారీ" ఆవబడేదంతా కూడా అన్నారు.

ఆ ఒక్క మాటలో యేమున్నదిలే అనుకున్నారు దాదాపుగా అందరు.

ఎటులనో సభ్యులకు ఎన్నో కాగితాలకు తోడుగానో యీ బిల్లు యొక్క ఒకొక్క కాగితం అందినది. ఎవ్వరు దాన్ని చూచిరి. చూచిన వారికైనా యీ ఒక్క మాట బిల్లు ధ్వని, తత్వం అర్థం కాగల్గునా!

ఎటులనో నాకంట పడినది. చూచారా ఈ అన్యాయం అంటూ, వెంకటసుబ్బయ్యకు ఆ కాగితాన్ని అందించితి, చదివితిరి. ''అమ్మయ్యో! యింత అఘాయిత్యానికి ఈ ప్రభుత్వం పూనుకొన్నదా! జవహరులాలుగారు దీన్ని అంగీకరించారా! ఆయన దీన్ని చూచియుందురా!'' అంటూ ఆందోళన చెందిరి.

వెంటనే, నేనొక ప్రకటన చేసితి. ఆ 1957లో "గ్రామదాన" బాణమునెట్లు ఎదుర్కొంటిమో, 1959లో, యి సరికొత్త రైతాంగ వ్యతిరేక శక్తిని ఎదిరించాలంటిని. ప్రెస్సులో రైతుల ప్రభోదించితి. రాజాజీ తోడ్పాటును కోరితి, స్వతంత్ర పార్టీని మేల్కొల్పితి.

ఐతే, ఎలాగా ఎదిరించడం! పార్లమెంటులో చర్చలు సాగిస్తాం. కానీ ఆ పార్లమెంటు సభ్యులకు ప్రజా బాహుళ్యంలో ప్రచలితమగు ఆందోళనను కళ్లకు గట్టినట్లు చేయడం యెలాగా! అర్జీలు పంపుదామన్నారు. సభలు, యాత్రలు నడుపుదామన్నారు. జవహారునకు తానే రాజ్యాంగ సభ ద్వారా రైతులకిచ్చిన హామీలను గుర్తు చేద్దామన్నారు. రాష్ట్ర రాష్ట్రములందు ప్రచారం చేయాలన్నారు.

ఆపైన, అంతకంటే, చురుకుగా, సూటిగా, పార్లమెంటునకు రైతాంగ ఘోష వినిపించడం, కనిపించడం, ధ్యానంలోకి తెప్పించడంయెలా!

వెంకటసుబ్బయ్య సూచించిరి, "పోస్టుకార్డులు" ద్వారా, ఎందరెందరో రైతుల చేత, పార్లమెంటుకు పిటిషన్‌లు పంపుదామన్నారు. పార్లమెంటరీ రూల్సులో, పిటీషనుల ద్వారా , పార్లమెంటుకు ప్రాణం పోయుటకున్న అవకాశాన్ని అంతవరకు ఒక్కొక్కరుగా, ఏదో యొక స్థానిక అవసరమో, ఆలోచనకొరకై ఉపయోగిస్తూ వుండిరి. యిలాగా ప్రజాబాహుళ్యపు వుద్యమానికి ఉపయోగించాలనే తలంపు ఎవరికి రాలేదు. అదే మంచి ఆయుధం." ఎవరూ ఎదురుగొట్టలేని ఆయుధం అంటిని. అలాగా ఆ రెండు సంవత్సరాలలో, అఖిల భారతదేశంలో, స్వతంత్రపార్టీ లేని ప్రదేశాలలో గూడా కిసాను సమ్మేళనం పెరుగని రాష్ట్రాలలో గూడా రైతులు మేల్కొని, ఆ పోస్టుకార్డు వుద్యమంలో చేరిరి. పదుల లక్షలు కార్డులు పార్లమెంటునకు పంపిరి. కోటిమంది రైతులైనా ఆ పోస్టుకార్డు ఉద్యమమునందు పాల్గొనిరి. ఒక్కొక్క కార్డుపై పది, ఇరవై మంది దస్కత్తులు చేసిరి, దేశమందెల్లెడల రైతులు మేల్కొనిరి. తమ పట్ల పార్లమెంటులో, జవహారు ప్రభుత్వం ప్రయోగిస్తున్న అన్యాయం గురించి ఆందోళన చెందగల్గిరి. అందువల్లనే స్థానిక పార్లమెంటు సభ్యులను ఎందరెందరో రైతులు ఆరా తీసిరి. ఇంత అన్యాయానికి ఎలా పూనుకొంటారు. జవహారును ప్రధానిగా బలపరుచుకొండి. కానీ, రైతుల స్వతంత్రాన్ని, జీవనాన్ని, హక్కును రద్దు చేసే యీ బిల్లును మాత్రం బలపరచవద్దు "అనే నినాదం పార్లమెంటు సభ్యుల హృదయాలలో, ఆ పోస్టుకార్డు వుద్యమం మ్రోగించినది." దాని ఫలితమే ప్రథమ ప్రయత్నంలో గొప్ప మెజార్టీ కలిగియున్న జవహరులాలు కమ్యూనిస్టులు, సోషలిస్టులు తోడ్పాటుండిన జవహరులాలు ఓడిపోవడం. ఆ బిల్లును ప్రథమ మెట్టుకైన ఎక్కించుకొనలేకపోయిరి. సభకు వచ్చిరి మెజార్టీ సభ్యులు ఓటింసు సమయానికి సభలో లేకుండా పోయిరి. వుండిన వారిలో జవహరులాలుకే మెజారిటీ. కానీ నియమం ప్రకారం సభా సభ్యులందరిలో మెజార్టీ హాజరై ఓటు చేయాలిగదా! అలాగా లేకపోయిరి. బిల్లుపడిపోయింది. జవహరులాలు దిగ్భ్రాంతి చెందిరి! అదే పోస్టుకార్డు ఉద్యమ మహత్యము. దెబ్బతిన్న సింహంలాగా, జవహరులాలు ఆ బిల్లును తిరిగి 19వ సవరణంటూ పార్లమెంటులో మూడు మాసాల పిమ్మట ప్రవేశపెట్టిరి. తానే రోజున స్వర్గీయులగు చున్నారో, ఆ దుర్దినాన్నే దాన్ని పార్లమెంటు చేత శిరసావహింపచేసిరి. ఎంతటి దారుణము.

ఐతే, విజయం పూర్తిగా ఆయనకందలేదు. రైతులు అసలే ఓడిపోలేదు. ఆ బిల్లు, సీలింగుకుమించిన రైతులకే వర్తించునని సవరణ అంగీకరింపబడినది. అటుల అశేషమైన సన్నకారు రైతులు రక్షింపబడిరి.

అప్పటికే దాన్ని యెదిరించితిమి మేము. ఎందులకా! సీలింగును క్రమంగా తగ్గించుటకు అసెంబ్లీలకు అధికారమున్నదే, 1970 వచ్చే సరికే మేము హెచ్చరించినట్లే సీలింగులను తగ్గించుటకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొనుచున్నవి గదా! కనుక ఆ 17వ సవరణ బిల్లు రైతులు, పైవారి తరతరాల వారసులపై పడుటకు సిద్ధంగా వున్న ఉరిత్రాడే. 1971 మార్చి ఎన్నికల ఫలితంగా, సీలింగు తగ్గిస్తాము. వ్యక్తికిగాక కుటుంబాన్నంతకు బిగిస్తామంటోన్న ఈనాటి పార్లమెంటు బెదిరింపులు మా విమర్శనలను, హెచ్చరికల సత్యాన్ని ధృవపరుస్తున్నవి గదా, ఆ సత్యాన్నే ప్రకటించుచుండిరి, తుదివరకు మన వెంకటసుబ్బయ్య!

"భూముల కవుళ్ళకిచ్చి, బస్తీలలో కులికే వారి కొరకై కాదు, వారట్లు శ్రమించినది? వేలకొలది యెకరాలు పెట్టుకొనే భూస్వాముల కొరకు కాదు! స్వయంగా తమ భూములను సాగు చేసుకుని, స్వయంవృత్తిగా గల రైతుల కొరకై" కమతానికి సాగు చేయువారి రక్షణకొరకై వెంకటసుబ్బయ్య, నేను సంస్కరణలను సూచించుతునే యుంటిమి. మక్తాలు తగ్గాలని, కమతము వారికి సాగు గిట్టింపుగా ఉండాలని, పండని సంవత్సరాలలో మక్తారాయితి కావాలని పది సంవత్సరాల వరకు, మక్తాదారులకు, భూసాగువసతి నిర్ణయం కావాలని వారు కోరుచుండిరి.

1935-36లో శ్రీగిరి, దేశోద్ధారక నాగేశ్వర్‌రావు, నేను ప్రారంభించిన దక్షిణ భారత రైతులు, కూలీల సమాఖ్య ప్రకటించిన కనీసపు హక్కుల ప్రణాళికను వారు అంగీకరించిరి. ఆ ప్రణాళిక ప్రకారం, వ్యవసాయ కూలీలకు కనీసపు కూలీ, భత్యం, రవాణాసౌకర్యాలు, వృద్ధాప్యభత్యము, కమతాల రైతులకు రక్షణలు సూచించితిని. అందులకే 1934 నుండి, మేము ప్రకటిస్తూవున్న రైతుసంస్థల ప్రమాణపత్రములో "రైతు కూలీ సామరస్యముతోబాటు, రైతుల రక్షణకై కృషి చేసేదము" అని వెంకటసుబ్బయ్య వుదహరిస్తూనే యుండిరి. ఆ మధ్య 1962లో, సంజీవరెడ్డి నాయకత్వం కింద, బ్రహ్మానందరెడ్డి ఫైనాన్సు మంత్రిగా వుంటూ, భూమిశిస్తును రెండు, మూడింతలు ధాటిగా, నిర్ణయం చేసిరి. అంతకు ముందే, గోపాలరెడ్డిగారు దాదాపు రూపాయికి అర్ధరూపాయికి మించి పెంచియేయుండిరి. స్వరాజ్యము బొందినందువల్ల యిట్టి వైపరీత్యపు భూశిస్తు భారములు,రైతుల మధ్య నుండి, రైతు వుద్యమ ప్రభావము వలన, రాజకీయ పెత్తనానికి వచ్చి, మంత్రులైన వారు వేస్తూ వుండడం అందరికీ అన్యాయమని పించింది.ఈమారు సర్దారు లచ్చన్నగారు ముందంజవేసిరి. తిరుగుబాటు ప్రారంభించిరి. సుప్రీంకోర్టు వరకు ఎదరించిరి! సుప్రసిద్ధ న్యాయవాది, రైతు బిడ్డ పి.ఎ.చౌదరి వారికి తోడైరి. విజయం కోర్టులో పొందిరి. అయినా మంకుపట్టుతో, మరో శాసనం ద్వారా, అలాంటి శిస్తుభారమే తిరిగి రైతులపై ప్రభుత్వం మోపినది. రైతుసమ్మేళనం రైతు సత్యాగ్రహం సాగించిరి. దాదాపు వేయి మంది వ్యక్తిగత సత్యాగ్రహం చేసి, శాసనాన్ని ధిక్కరించి జప్తీలన లక్ష్యపరిచి, జైళ్లకు కూడా నడిచిరి. ఈ రెండు ఉద్యమాలకు మధ్య జిల్లాలో నుండి, డబ్బు వసూలు చేస్తూ, సత్యాగ్రహుల ప్రోత్సాహపరుస్తూ, "వాహిని" పత్రిక నడుపుకుంటూ వెంకటసుబ్బయ్య ఎనలేని శ్రమ చేసిరి. చైనావారి దండయాత్ర నెదిరించుటకు, దేశం పూనుకుంటే తాము ఈ ఉద్యమాలను ఆపుకొనక తప్పలేదు. అలాగని మంత్రులు మాత్రం రైతులను హింసించడం మానలేదే అని ఆయన బాధ, ఎన్ని విధాలా తాము చేయు కుట్రలు ఫలించుటలేదే, ఈ రైతాంగమును, కమ్యూనిస్టుదేశాలలోపలే నిరాయుధులుగా అస్వతంత్రులుగా, అధికారులకు దాసులుగా చేయుటకై తాము ప్రయోగించిన తంత్రాలు సఫలం కావడం లేదేయనే బాధ, ఢిల్లీలో ప్లానింగు కమీషను వారికి, ప్రభుత్వాధినేతలకు కల్గుచున్నది.

విజయవాడలో ఆంధ్రరాష్ట్రమున కంతకు గొప్పసభ 1969 నవంబరులో జరిపిరి. ప్రాథమిక హక్కులను భంగపరుచుటకు పార్లమెంటునకు అధికారం లేదు అని, సుప్రీంకోర్టు తరపున మెజారిటీ జడ్జిమెంటు-గోలక్‌నాథ్ కేసులో యిచ్చిన, మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ కె.సుబ్బారావుగారినే అధ్యక్షులుగా తెచ్చిరి. సభలు చేసుకొను, వుపన్యసించు, విమర్శించు, వ్రాయడం చదవడం లాంటి హక్కులు, పత్రిక, మతం, ప్రార్థన, నివాసము, ఉద్యోగము, విద్య స్త్రీపురుష సమాన హక్కులు, మానవులైనంత మాత్రాన సర్వసమానత్వ పౌరసత్వ హక్కుల ననుభవించు స్వాతంత్ర్యములను, శాసనబద్ధముగా అనుభవించు ప్రాథమికహక్కులు, కాన్సిస్ట్యూషనులో ఒక ప్రధాన, ఒక ప్రత్యేక ప్రకరణలో మహాత్ముని ఆశీర్వాదముతో, జవహరులాలు, సర్దారు, రాజేంద్రప్రసాదు మున్షి, రాజాజీ, డా..అంబేద్కరు మావంటి వారమెందరమో ఐక్యకంఠ్యులమై స్థిరపరిచితిమి. వాటిలో నెద్దానికైనా, ఏ అధికారి అయినా, శాసనసభయైనా అతిక్రమించితే ఏ పౌరునికైనా సుప్రీం కోర్టులో ఫిర్యాదు చేయుటకు ఎవ్వరి సంబంధము లేకుండానే తనకై తానే సుప్రీంకోర్టు కనుతెరచి, అట్టి వుల్లంఘనను చర్చించి, త్రోసిపుచ్చుటకు అధికార మిస్తిమిగదా!

ఆ ప్రాథమిక మానవతా హక్కులనే, తమ కిష్టమువచ్చినప్పుడు తలచుకొన్నరీతి, తొలగించు పార్లమెంటుకు అధికారముండాలంటారు శ్రీమతి యిందిరమ్మ, వారి అనుయాయులు, అదేమియని ప్రశ్నిస్తే, అధమం ఆస్తిహక్కులనైనా తలక్రిందులు చేయడానికి హక్కు ఉండాలన్నారు.

ఓటర్ల ధోరణి మారుతుంటే, రకరకాల వారు మెజారిటీలు పొందుతుంటే ఒక్కనాడు, ఘనాదేశపు ప్రెసిడెంటు యిన్‌క్రుమా, ఇండోనేషియా వారి ప్రెసిడెంటు సోకార్నో, ఈజిప్టు వారి ప్రెసిడెంటు నాసరు, పాకిస్తాన్ వారి ప్రెసిడెంటు ఆయుబ్, యాహ్యాఖానులాంటి వారు, ఆనాటి హిట్లరు, ముస్సోలినిలవలె, నిరంకుశులై, ప్రజల బానిసలుగా మార్చే పరిస్థితులు రాకుండుటకే పెద్దలానాడు మన పౌరసత్వపు హక్కుల మార్చు హక్కు

పార్లమెంటునకు విచ్చలవిడిగా వుండరాదన్నాము. లేకుంటే రైతులు బీదలైన వారుగూడా మారుతూ వుండే సీలింగు లెవెలుకు లోబడి ఉన్న భూమిహక్కుదారులైన రైతులు కూడా అన్యాయమైపోరా! స్వంత వుద్యోగముపోయి, బానిసలుగా మారిపోరా! అన్నారు వెంకటసుబ్బయ్య! కనుక రైతులంతా ప్రాధమిక హక్కులను రక్షించాలన్నారు.

ఆ విజయవాడ సభ తీర్మానాన్ని అమలులో, ప్రజల మధ్య ప్రచారమునకు తెచ్చుటకుగా ఢిల్లీలో అఖిలభారత ప్రాధమిక హక్కుల ఫ్రంటు నేర్పరచితిమి.

ఆ విజయవాడ సభ తీర్మానాన్ని అమలులో, ప్రజల మధ్య ప్రచారునకు తెచ్చుటకుగా ఢిల్లీలో అఖిల భారత ప్రాధమిక హక్కువ ఫ్రంటు నేర్పరచితిమి. దానికి సుబ్బారావు గారు అధ్యక్షులు. దాన్ని బలపరచుటకై తాను వృద్ధాప్యం, అనారోగ్య పీడుతులగుటచే శ్రీ జి. నాగేశ్వర రావును, పురమాయించి తిరిగి పార్లమెంటువకు. పోస్టుకార్డు వుద్యమాన్ని ప్రారంభించిరి.

ఇలాగా ప్రత్యేక యిబ్బందులు, కష్టాలు, సమస్యలు రైతాంగమును ప్రజాబాహుళ్యమును ఎదుర్కోబోచున్నప్పుడు ఎదిరించి, నిలబెట్టి, ప్రజాపీడన చేస్తున్నప్పుడెల్లా, తనకు తానుగాని, సర్దారు లచ్చన్న కల్పించుకుంటే గాని, నేను ప్రబోదం చేసినప్పుడు గాని వెంకట సుబ్బయ్య గారు అన్ని వదిద్యాలైన త్యాగములకు తెగించుచూ, తన సర్వశక్కుతను ప్రయోగించుచూ ప్రజా రక్షణోద్యమమునకు తయారగుచూ వుండిరి. క్రిందటి 30 సంవత్సరాలలో, ఏ యొక్క సమయములోగాని, తాను ప్రధాన పాత్ర వహజంచుటకు తయారుగా లేకుండుట జరుగలేదు.

అది యెండా కాలమా, వానా కాలామా, కరకు చలి కాలమా, వ్యవసాయ తొందర సమయమా అనే సమస్యే లేదు. వెంకట సుబ్బయ్య గారూ, యీ సమస్య కొరకూ యిలాంటి కార్యక్రమం నిర్ణయించు కొందామా? ఎప్పుడు ప్రారంభించుదాము? ఎలాగ నడుపుదామా? మరి మీరెట్లా మన వర్కర్లను, సంస్థలను ప్రేరేపణ చేస్తారు? ఏమి చేసిరి? ఎంతగా సహకారం వస్తున్నది. డబ్బా! వసూలు చేస్తున్నారా? చాలాదా? మరెట్లా? అనేకా ప్రశ్నలకు సమాధానం, కార్యక్రమం నిర్వహణ బాధ్యత, అన్నీ ఆయన బాధలే. భారలే!

ఒకప్పుడు తనకు చెప్పకుండానే, తన సావకాశం విచారించకుండానే యువనాయకుడు లచ్చన్న ఉద్యమారంభం చేస్తుండేవారు! నేనా ఢిల్లీ, కలకత్తా , బొంబాయిలలోనో, పాశ్చాత్య దేశాలలోనో వుంటూ, ఆందోళనా కార్యక్రమమును సూచించుతూ వుండే వాడను మాపై విసిగిరేమో! మాకు చెప్పరు.

ఆయా సేవా విధానాలను, కార్యక్రమాలను తన అపార అనుభవం జోడించి, ప్రజాసేవ చేస్తూనే వుండేవారు.

మేము హెచ్చు తగ్గులు, జయాపజయములు, వర్కర్ల సహకారం సహాయ నిరాకరణముల జూచి, మాకుండు తత్వముల ప్రకారం ఆందోళన, చిరాకు పొందుతుండే వారం. ఆయన మాత్రం, తన బాధలు తనలోనే దిగమ్రింగుతూ, మాకు తగిన సలహాలు, వోదార్పు, వుత్సాహం ప్రబోధించే వారు! అంటే, ఆయనకు కోపమే రాలేదని, ఆశాంతి పొందేవారు కాదని, ఎవ్వరిపై అరిచే వారు కారని చెప్పను. తనకు సన్నిహితులైన తన స్వంత అనుచరులు, జూనియరులూన వారి మధ్య తన బాధలకు తగినట్లు ఆయాసపడేవారేమో, కేకలు కూకలు పెట్టుకొనేవారేమో, మాపై విసుగుదల స్ఫురింపచేసికోనేవారేమే! మాకు మాత్రం నిరాశ నిస్పృహ, బాధ కలిగించే వారు కాదు.

ప్రతి సంవత్సరము, ఆంధ్ర వ్యవసాయక జీవితములో, కొన్ని ప్రదేశాలలో కరువు, లేక అనావృష్టి వల్ల పంటలు పాడగుచుండును. మరికొన్ని చోట్ల మాగాణి నీటి యొద్దడి, అప్పుడప్పుడు మురుగు ఇబ్బందులు. తెగుళ్ళవల్ల పైరులు పాడగుచుండును. నారుపోసే సమయానికి కాల్వల్ల నీరుండదు. తెగుళ్ళ నివారణకు మందులు, పైరులకు సకాలాన ఎరువుల కరువైతాయి. ధాన్యాలు అమ్ము సమయాల్లో రైసు మిల్లర్లు, అఏక ఫుడ్ కార్పోరేషన్ ధాన్యాల కొనుగోలు చేయరు. నుగాకును కంపెనీలు కొనరు. మిరప ధరలు పడిపోవును. పసుపుకు ఎగుమతులే కన్పడవు. పత్తికి తెగుళ్ళు, ధరలు వుండవు. రైల్వే వాగన్ల సప్లై నిలిచిపోవును. ఎండాకాలంలో

బోదె కాల్వలను ముగురు కాల్వలలను, పి.డబ్ల్యు. డిపార్టుమెంటు వారు త్రవ్వరు. కంట్రాక్టర్ల దోపిడీలు, రోడ్ల, కాల్వల మరమత్తులతో హెచ్చిపోవును. జిల్లా, జిల్లాల మధ్య ధాన్యాల వరాణా నరికట్టుతూ, చెక్ పోస్టులు పెట్టి, లంచాలు తీస్తారు. అదనపు పన్నులు, వివిధ నామమాత్రపు ఐచ్ఛిక ప్రభుత్వపు అప్పులు, రిమిషనులు, జాయింటు పట్టాల గజిబిజి వీటన్నిటిలో యెలకువ లెరింగిన, రెవిన్యూ ఉద్యోగుల ఒత్తిడులు, లంచాలు. కోఆపరేటివ్ లచే అప్పుల, రెవెన్యూ టక్కీనే అప్పులు, కొంగ్రొత్తగా వెలుగుచున్న బ్యాంకు అప్పులు, వాటిపై వడ్డీలు, చెల్లుబడులలో కల్లు మోసాలు - ఇట్టి వెన్నో సమస్యలు లేస్తూనే వుంటాయి. క్రొత్త పాత సందున దాన్యాల ధరలు పెరిగిపోయి, కూలీలకు యిబ్బందైపోవును. కూలీలకు నిరుద్యోగ బాధ పెరుగును. ఎండాకాలం, బీదల పూరిఆకలు అగ్ని కాహుతి అగుచుండును. కలరా, యన్ఫ్లుయంజా జ్వరములు బీదల పీడించును. ఎలిమెంటరీ స్కూళ్ళే నడవవు. బీదలకు చదువే వుండదు. వాటన్నిటినీ గమనిస్తూ రైతుల రక్షణ పత్రికలలో, కమిటీల ద్వారా హెచ్చరికలు చేస్తూవుండాలి. ప్రభుత్వ చర్యలను విమర్శించాలి. అధికార దైర్జన్యాలను ప్రతిఘటించాలి. మంత్రు నామకార్ధపు, బూటకపు ప్రకటనల నిరసించాలి. ఎప్పటికప్పుడు రైతుల కవసరమయిన రక్షణ కార్యకలాపాలను ప్రభుత్వానికి, శాసన సభ్యులకు, అధికారులకు మర్యాదకు లోటు కాకుండా తెల్పుచూ వుండాలి.

ఈ విధమైన, అనవరతమైన, విసుగు విరామం లేని నిద్రకు తావివ్వని విధాన సేవ చేస్తూ వుండాలంటే, ప్రతి జిల్లా రైతు సంస్థకు నల్గురైన ఉద్యోగులు, రాష్ట్ర సమ్మేళనానికి పదిమందైనా గుమాస్తాఉల, వరి చేత సేవా కార్యక్రమం సక్రమంగా, త్వరితంగా, సకాలంగా జరిపించుటలకు యిద్దరు జిల్లాకు, నల్గురు రాష్ట్రానికి భాద్యతల నెరింగిన పెద్దలు కావాలి. వారికి మరితర భారము లుండరాదు. వారి పోషణ భారం సంస్థదే అయి వుండాలి!

అదంతా వూహ ప్రపంచములోనే గదాయని వెంకటసుబ్బయ్య ఆకాశమునుండి నన్నడుగుతున్నారు. ఏలానా! జిల్లాకే గాదు, రాష్ట్ర సంఘానికి గూడా, యీ నలభై సంవత్సరాల రైతాంగోద్యమ జీవితం జిరిగిన తరువాత గూడా ఆ కష్టము, నష్టము, విసుగు, వోపికలను గమనించకుండా వుండిన వెంకటసుబ్బయ్య ఒక్కరే అందుచుండిరి.

తన భార్యా, బిడ్డల భారం, తల్లి తండ్రి యిచ్చిపోయిన స్వంత వ్యవసాయం భరించవలసిందే! తన ఆరోగ్య రక్షణకై భార్య శ్రీమతి సరస్వతమ్మ మాత్రమే తోడుగుచుండిరి. తన పోషణ భారం తన వ్యవసాయాదాయం, ఆస్థిపాస్తుల బాధ్యతే!

ఆలాగా మరెవ్వరికి, రైతు లెవ్వరికి తాను భారం కాలేదు. తన పోషణ మా బాధ్యతగా మాకెప్పుడు లనిపించునట్లు పొర బాటునైనా సూచనైనా చేయలేదు. తన్ను తాను, నిండుగా, హృదయ పూర్వకంగా అర్పించుకున్నారు. రైతాంగము కొరకు! వారి సేవలు అపారములు, విలువలకు అందనివి, అనుదినము ఆర్పణ చేయబడు చుండెడివి. ఎవ్వరైనా అడిగితేనే, చూస్తారంటేనే, లెక్కించుకొను వారుందురంటేనే, చూడనప్పుడు, లెక్క గొననప్పుడు, పల్కరించు వారు లేనప్పుడు, అందించిన సేవా కార్యాలకు వెన్నుచురుచు వారు గాని, తృప్తి పడువారు గాని కన్పడ్డప్పుడు, నిద్రబోవుటో, వెను వాల్చుటో, కనుమరుగుటో యెరుగని మానవా స్వరూపమున కోటికి మించి ఆంధ్రరైతు కూలీజనాలకు అందిన సేవా వ్రత స్వరూపమే ఆ వెంకటసుబ్బయ్య! ఆ దీక్షకు తగిన పుస్తకము, పద్యము, ప్రతి ఫలము ఎవ్వరు - ఏ కవి - ఏ రచయిత - ఏ సేవకుడు - ఏ భక్తుడు, రూపు రేఖలు దిద్దగలరు! బహుకష్టము. నేను కూడ తనలాంటి తపస్సునే చేస్తున్నారని వెంకటసుబ్బయ్య విశ్వసించిరి. అలాగా నలభై సంవత్సరాలు అశిధారా వ్రతముగా నన్ను అనుసరిస్తూ, బలపరుస్తూ దిద్దుతూ, తీర్చుతూ, నా చేత దీనజన సేవావ్రతమును సాగించుటలో ఆయన శృతికృత్యుడైనాడు.

మా యిద్దరిని మించిన వారు మా భార్యలు, మాకు వివిధ సమయాలలో, వేర్వేరు ఉద్యమాలలో, పరుగులిడడం, కేకలు వేయడం, పాటలు పాడుతూ, మాటలాడుతూ, సభలలో చేరుతూ ప్లాటుఫారముల మీదకై నారములు, సన్మాన వత్రములు వింటూ పూలమాలల ధరిస్తూ, పేరు పేరులతో ఆలంకరణజొందు

భాగ్యము కల్గు చుండెను. శ్రీమతి భారతీదేవికి, మా యిద్దరి అనుభవము లాంటిది. కొంత వరకు, అందినవి. కాని శ్రీ మతి సరస్వతీ దేవికి అవి అపురూపమేగదా! ఎన్నెన్ని సారులు మా కందవలసిన గౌరవాలు చేరక, మాపై అన్యాయముగా పడుచున్న నీలాపనిందలు, దూషణలు, వారి హృదయాల కెంత బాధ కలిగించెడివో! మా ఓటమిలు వారికెట్టి గాయాలైనవో మా ఆదాయములు లేకుండా, వారు కష్టించి చేర్చిన, నాల్గు కాసులను తమ గుప్పెటలను విలిచి, పుచ్చుకొని వెదజల్లుతూ, తిరిగి వచ్చేదేమో లేదని తెలసి కూడా, పదే పదే అలాగా దోసిళ్ళతో మాకు అర్పించచుండనప్పుడు ఎట్టి బాధ వారికి కల్గెనో! మేము విచారించితిమా! అయ్యో! అంటిమా!

ఎ్వరిది ఎక్కువ త్యాగము, క్షమ, ధర్మపాలనము! లెక్క ఎవ్వరు కట్టగలరు! ఆరా తేచ్చి చెప్పగలవా రెవ్వరు?

ప్రజాహితైక జీవితమందుండు వారి సతీమణులందరికి వారికే ఈ కష్టనష్టాలు, నిష్టూరాలు, బాధల సహింపు, త్యాగ నిరతిలో గల తీవ్రమగు చురకలు తెలియును. వారిలో ప్రథమ వరుసలో నాల్గు దశాబ్దాలు నిల్చి, నడచి, నేర్పగా, గౌరవ భాజనమైన సంసార బాధ్యతలను నిర్వహించిన సరస్వతమ్మ గారి గొప్పను, యోగ్యతను పుణ్య సంపదను, గ్రహించి గూరవించుకొనే భాగ్యము భారతీ దేవి పొందిరి. అందుకే ఆమె ధన్యురాలు. వారు మంత్రి గానో, శాసన సభాసభ్యుడు గానో కొన్నాళ్ళయినా ప్రజా సేవ చేయగల్గివుంటే నా బోట్లకు కొంత తృప్తి కల్గేది. ఆఖరుకు, వరా ఉద్యమము మా పార్టీ కొంత వరకయినా మంత్రి వర్గమును కట్టి, మా ప్రణాళిక ప్రకారం ప్రజాసేవ చేయగల్గిందనే తృప్తియైనా వారకి అందించ లేకపోతిమి. రాగా, పోగా, లచ్చన్న, ఓబుల రెడ&ఇడ మంత్రులుగా వున్నప్పుడు లచ్చన్న గిరిజనులను షాహుకార్ల నుంచి రక్షించుటకై కార్పోరేషను యేర్పరిచితే, కొంత తృప్తి చెందిరి. మమ్ము వీడివెళ్లి మంత్రి పదవికై ఎన్నో ఆరాట, పోరాటములందు మాకు విసుగు కల్గిస్తున్నా, అప్పుడప్పుడు మాయందరి రైతు రక్షణ ధోరణిలో తిమ్మారెడ్డి, కాకాని, సిద్ధారెడ్డి కృషి చేస్తున్నప్పుడు కొంత తృప్తి వెంకటసుబ్బయ్యకు కల్గెడిది. చివరకు ఒరిస్సాలో ప్రధానమంత్రియో, నిష్కళంక రాజ్యపాలన సాగించి, రైతురక్షణకై జయప్రదంగా సేవించిన శ్రీ సింగుదేవుని చూచుకుని, ఆనందం పొందగల్గిరి. ఆఖరుకు ఆ ఒరిస్సాలోని స్వతంత్రపార్టీ తోడ్పాటుతో భూమి శిస్తు రద్దు చేసిరని వుప్పొంగిరి. 1967 నుండి క్రమంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ఒరిస్సా వారిని చూచి, బీదరైతులపై భూమిశిస్తును రద్దు చేస్తున్న వార్తలు వారికి కొంత తృప్తి కల్గించుచుండెను. తెనాలిలో పదుల వేల ప్రజల సమ్ముఖమున అఖిలాంధ్రుల తరపున, వారికి 1968లో సన్మానము చేయుటయే మేము అందించలగల్గిన మర్యాద! అంతమాత్రానికి వారు అంతగా కృతజ్ఞత తెల్పుతూ వ్రాసిన లేఖ దొరకడం, దాన్ని యిందు చేర్చగల్గడం మా అదృష్టం.

## మానవులంతా ఒకే కుటుంబము ప్రపంచము అవిభాజ్యము

ప్రపంచ రైతుల్లారా, కళాకారులారా- ఏకం కండి. శ్రీ వెంకట సుబ్బయ్య భారత రైతాంగోద్యమము యొక్క విశాల ఆశయములు, భావధోరణులు, మానవతావాదములను, రైతాంగ విద్యాలయములో అనేక సంవత్సరములు 1934-36 మధ్య, పెద్దలలో నొక్కరుగా వుంటూ, చదువుతూ , వింటూ తానై బోధకుడుగా ఉంటూ తన ధోరణిగా గ్రహించుకొనిరి.

నన్ను ప్రథమ ప్రపంచ రైతాంగ వ్యవసాయ మహాసభకు 194లో ర్మనమని ఆహ్వానము వస్తే అత్యంతంగా సంతోషించిరి వారు. మహాత్మాగాంధి, సర్దారు, జవహరులాలు నేనట్లు ఆ సభకు వెళ్లడం మంచిదంటే గొప్ప తృప్తి చెందిరి.

మేము భారత దేశమందు నడుపుచున్న వయోజన విద్యాలయములలో (రైతాంగ పౌరసత్వ, యువజన విద్యార్థి విద్యాలయములు) చెప్పుకుంటున్న సత్యమునే, ధర్మమునే ఆ సభ యందు నిర్వచించితిని. ప్రపంచమందలి కూలీలందరు ఏకం గావలెనని, మార్క్సు మహాశయులెట్లు పల్కిరో, ఆ యాశయానికి రాచకీయ ప్రాణం శ్రీ లెనిను పోసిరో అటులో ప్రపంచ రైతాంగమంతా ఏకము కావలెనన్నాను.

ప్రపంచమంత, ధనధాన సౌభాగ్యమందుగాని, దారిద్ర్య మందు గాని, బోధన సదుపాయాల సంపత్తిలో గాని, క్షామం క్షీణత,కరువు కాటకలందు గాని కలకాలం వేరువేరుగా జీవించజాలదనియు ఎప్పటికైనా ఐక్యత బొంది, దారిద్ర్యము, దుర్భిక్షము, తిండిలేని తనం, ఆకలి మంటలను పొగొట్టకొనుటకు ప్రపంచావృతమైన, ఐక్యమైన ప్రయత్నం చేయటమే మంచిదంటిని.

కనుకనే భారతీయ ఋషీశ్వరులు "సర్వేజన సుఖినోభవంతు" అనే ధర్మాన్ని, సూత్రాన్ని ఆచరణ యోగ్యంగా చేయవలెనని ప్రబోధిస్తురంటిని. కనుక ప్రపంచ రైతాంగ వ్యవసాయక సంఘం స్థాపించితిమి - రైతు సంఘాల తరపున యునైటెడు నేషన్సు తరపున వరల్డు ఫుడ్, ఆగికల్చర్ ఆఫీసును వారేర్పరచిరి. ఈ రెండిని బలపరచడం రైతులు, కూలీల ధర్మమంటిని.

ఈ ఆలోచనలను హృదయపూర్వకంగా వెంకటసుబ్బయ్య గారు తనవిగా చేసుకొనిరి. రైతు సేవకులందరికి ప్రబోధించుచుండిరి.

ఇటు భారత ప్రభుత్వానికి జవహరులాలు నాయకత్వము వహించుచున్న దినాన్నే (1946 సెప్టెంబరు) కోపెన్ హోగులో, ప్రపంచ ఆహార సంస్థ సభ ప్రారంభం కావడం, నేనందు భారతీయ ప్రతినిధి వర్గ నాయకులలో నొక్కరుగా పాల్గోనడం జరిగినది, అప్పుడే మన రాయలసీమలో భీకరమైన కరువు తాండవమాడుచుండెను. ఆది యెంతటి కరుకు రాక్షసిగా వుండెనో, రాష్ట్ర కాంగ్రెసు తరపున ఒక కమిటీ సభ్యులుగా శ్రీ కె.వి. రామకృష్ణారెడ్డి, స్వర్గీయ వల్లభరావు తమ రిపోర్టులో వివరించిరి. ఆ రిపోర్టును ప్రపంచ సభ కందించితి త్వరిత్వరగా భారతదేశంలో కరువు బాధను తొలగించుటకై ప్రపంచ భాగ్యవంత దేశాలు తమ అదనపు ధాన్య వుత్పత్తులను త్వరితగతి పంపించాలని విజ్ఞప్తి చేసితి, సభ వారంగీకరించిరి.

భారతదేశమందో జవహరులాలు ప్రేమించిన బ్రిటిషు వారి కంట్రోళ్లు, ప్రొక్యురుమెంట్లు, నిర్బంధమగు గిట్టింపు గాని ధరల కట కటాలను అతిక్రమించ వచ్చెను. తమ సవ&ంత ప్రయోజనం, అవసరాలను తగ్గించుకొని ఆదనంగా, దాన్యాలను మార్కెటుకు తెచ్చే రైతులకు అదనమైన బోనసు యివ్వమనే మా సలహాను ధైర్యంగా అంగీకరించి, బజారుకు హెచ్చు ధాన్యాన్ని రప్పించగల్గుచుండిరి, ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశం గారు, అటుల ఆహార ధాన్యాల కరవును, ఆంధ్రయందేగాక, భారతదేశమందే ఎదిరించగల్గితిమి.

ఆ విధంగా ప్రపంచములోని వివిధ దేశాల ఆహార సమస్యకు ప్రపంచం మొత్తం మీద పరిష్కార మార్గం వున్నదని, అనుభవం రీత్యా మన రైతాంగం అర్థం చేసుకోగల్గుచున్నదని, మన రైతాంగోద్యమ ఆలోచనలకు కార్యరూపం ప్రపంచం మొత్తంమీదనే సాధించగలమని రుజువగుచున్నదనిరి వెంకటసుబ్బయ్యగారు.

1949-50 వచ్చేసరికి మహాత్ముని గర్జన వల్ల సడలింపబడిన ఆహారధాన్యాల కంట్రోళ్ళు తిరిగి భీకర రూపం పొందినవి. కరువులు వివిధ ప్రాంతాల్లో వచ్చినవి. రాజస్థాను, ఒరిస్సాలో అనేకులు, ఆహార కొరత వల్ల నిర్వీర్యులై, రోగిష్టులై, అసువుల పొగొట్టుకుంటూ వుండిరి.

అప్పుడు మేము కొందరం ప్రపంచదేశాలకు, సంస్థలకు, భారతదేశ క్షామపీడితులకు సహాయం అప్పీలు చేసితిమి. అప్పటి వ్యవసాయ మంత్రి శ్రీ మున్షీ విదేశాంగ సహాయమంత్రి శ్రీ కేస్కార్ నన్ను ప్రత్యేకంగా, వివిధ దేశాలలోని రైతు సంస్థలను ప్రభోధించమనిరి. ఇంతలో అమెరికా శాసనసభలోని కొందరు సెనేటర్లకు మన దేశపు విదేశాంగ వ్యవహారములపై కినుక కల్గెను. జవహరులాలు గారి ప్రపంచాతీత ధోరణి వాస్తవికతకు వ్యతిరేక ధోరణి అమెరికా ప్రజాస్వామ్య దేశాలలో నాయకులైన బ్రిటీషు, అమెరికా, ఫ్రాన్సు వారల గురించి ఆయన అవలంభిస్తున్న ధోరణి వారికి రుచించలేదు. ఇంత తిక్కగా ఉంటూ, ఎవరి సహాయం మాకవసరం లేదు, ఎవ్వరి అప్పులకోరం, ఎవ్వరి దయా దాక్షణ్యాలు మాకొద్దు అనే అహంకారం పూరితమగు భారత ప్రభుత్వపు విదేశాంగ పాలసీ వారికి కోపము తెచ్చెను. అందువల్ల అంత గర్వంగా ఉండే నెహ్రూ పెత్తనాన్ని బలపరుచుటకు అమెరికా పార్లమెంటు, ప్రభుత్వం, ఎందుకు సహాయం చేయాలనే మంకుపట్టు నెహ్రూ వలెనే వారును ప్రదర్శించిరి.

ప్రపంచధోరణి గల మేము జాతి యహంకారములు, సామ్రాజ్య దురహంకారములు, రెండు నష్టదాయకములేనని విశ్వసించిన మేము కొందరం, భారత పార్లమెంటు సభ్యులుగా మావలెనే విశాల దృక్పథము గల అమెరికా పార్లమెంటు (కాంగ్రెసు అందురు అచ్చట) సభ్యులకు "మీరన్నా విశ్వ మానవ సౌభ్రాతృత్వమును ప్రభోధించి క్షామ పీడితులైన కోటి భారతీయులను రక్షించుటకై యిరవై లక్షల టన్నుల ధాన్యాలను మీ పార్లమెంటు చేత గ్రాంటు చేయించండి అని ప్రభోదించితిమి. దానితో ఉగ్రుడై నారు జవహరులాలు, పార్లమెంటులో ఇట్టి ధోరణి , భిక్షాటన కూడదన్నారు. దానితో పార్టీలోని మెజారిటీ, రైతాంగ సేవకులు, దుర్భిక్షాన్ని ఎదుర్కొంటూ, తిండి గింజలు, నూకలు జావగానైనా పంచలేక దిగులు పడుతున్న పదుల వేలాది సంఘసేవకులు "యిదేమి అన్యాయం" అనిరి. కరవు నెదుర్కొవడానికి జాతీయ కోపతాపాలు వదిలి, ప్రపంచ మానవతా ధర్మ పిలుపును ఆలించి " ఏకం కండయ్యా" అనే యీ రంగా, మసానీ, మంత్రులు మున్షీ, కేస్కారుల నెదిరిస్తూ ఎందుకిట్టి అనుచిత ప్రకటన చేస్తున్నారు. తమ ప్రియతమ నాయకుడు జవహరులాలు అని ఘోషించిరి.

అప్పటి నుండి వెంకటసుబ్బయ్యకు, జవహరులాలు యొక్క ప్రపంచధోరణి యందు అవిశ్వాసం ప్రజలజొచ్చినది. ఆపైన, నేను అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ను, భారతదేశం పేరిటనే గాదు, ప్రపంచ రైతాంగ సంస్థల పేరిట, అమెరికా రైతాంగ నాయకుల ప్రేరణ మీదట 1949లో కలుసుకొన్నప్పుడు, జవహరులాలు ప్రస్ఫుటపరిచిన సంకుచిత దృష్టి, ధోరణి, మన వెంకటసుబ్బయ్యకు, తదితర సోదర భారత రైతాంగ నాయకులకు అసంతృప్తి కల్గించినది. తుదకు సర్దారు పటేలుచే "ఔరా" అనిపించినది. ప్రపంచ వ్యవహారాలలో, రాచకీయ, ఆర్థిక, వ్యవసాయ రైతాంగ, లేబరు రంగములో నెహ్రూ తప్ప మరెవ్వరు ప్రాముఖ్యము పొందగూడదా! అనుకొన్నారు.

తన ప్రభుత్వ ముద్ర బొందిన ఉద్యోగులు, మంత్రులు మాత్రమే ప్రపంచ నాయకులు, ప్రభుత్వాధినేతలను కలువవలెనా! పరిచయం పొందనర్హులా! తన అధికారం క్రింద మంత్రులుగా నున్న వారు తప్ప మిగతావారు గణనకెక్కరాదా?

ఇదెక్కడి రాచకీయ న్యాయం! ఐతే అప్పటికి బ్రిటీషు పార్లమెంటులో అపోజిషన్ నాయకులుగా ఉండిన యీడెన్ను మన ప్రభుత్వం ఎందులకు గౌరవించిరి, విందులు చేసిరి! పార్లమెంటు సభ్యుల కెరుక పరిచిరి! ఈలాగా ఆరా తీసే సరికి తన వైపరీత్య ధోరణి ననుసరించి మమ్మేమి తిరిగి అనలేక పోయిరి. కానీ, మా అందరిపై కంటగింపు, కార్పణ్యము పెంచుకుపోతూ ఉండిరి.

కనుకనే "మీరు ఆయన వద్ద మంత్రిగా నుండ నిరాకరించిరి. అప్పుడు మాకు బోధ కాలేదు. ఇప్పుడు తెలిసింది. ఈ నెహ్రూయే ప్రధానమంత్రిగా వున్నప్పుడు మన రైతు నాయకులు "అపోజిషన్లో వుండడమే ఆత్మగౌరవ ప్రదము" అని వెంకటసుబ్బయ్యగారు, ఆనాటి కింకా రైతాంగ ధోరణిలో అభిమానపూరితులైన నా సహచరులెందరో నన్ను బలపరిచిరి. వారి సోదర సానుభూతి, సహాయము, ఆనాటికి అంత బలంలో ఉన్న జవహరులాలు యొక్క నిరంకుశ, సంకుచిత ధోరణుల నెదిరిచుటకు నాకు ధైర్యము పూరించెను.

ఇట్టివెన్నో అనుభవాలు కల్గెను. మరెన్నో సమయాలలో, వెంకటసుబ్బయ్య, మిగతావారందరిని, పదవుల వేట నుండి మళ్ళించుకుంటూ నా ప్రక్క నిల్చుచుండేవారు, చేర్చుచుండేవారు.

ఆనాడట్లు మాపై సోదర పార్లమెంటేరియన్సుకు, పార్లమెంటు సభ్యులైన మేము తంతి పంపిస్తే, వారికి మానవతా ధర్మమును గుర్తు చేసినంత మాత్రాననే అంత హడావుడి చేసిన ఆ జవహరులాలుగారే ఐసెన్ హోవరు ప్రెసిడెంటు అయిన పిమ్మట భారత దేశంలో తాను తిరిగి తెచ్చిన కంట్రోళ్ళ వల్ల, వంటలు పాడవడం వల్ల, ప్రభుత్వ యంత్రాంగములో లంచగొండితనం పెరిగిపోతూ ఉన్నందువల్ల, దేశాన్ని ఎన్నో ఆహార మండలాలుగా విభజించి చెక్కుపోస్టులు పెట్టినందువల్ల, తిరిగి భోజనపదార్థాల కరవు రాబోవుచుండెను. అప్పుడు తనకు తానై , తన మంత్రులను అప్పుల కొరకే గాదు, భిక్షాటనకై అన్ని దేశాలకు పంపిరి, డబ్బులకే గాదు, బియ్యం, గోధుమలు, మైదాపిండి కొరకు! ఒక్క సంవత్సరానికే గాదు, దాదాపు పది సంవత్సరాల పర్యంతం, పది లక్షల టన్నులకే గాదు, అరవై లక్షల టన్నుల ధాన్యాల కొరకు! కొంత భిక్షంగా, కొంత అప్పుగా

వారే యిచ్చిన డబ్బుతో, మరికొంత చౌకధరలకు తెప్పించుకున్నారు. ఆ జవహరులాలే. అప్పుడేమైందో జాతీయ ఆత్మగౌరవము. "అలాగా ఆయన పెత్తనం సాగించుకొన్నారు. ఆడింది ఆట పాడింది పాటగా" అన్నారు వెంకటసుబ్బయ్య. "ఐనా మేము బ్రతికే వున్నాము, ఎన్నిమారులు తన బలాన్నంతా ప్రయోగించి మా నాయకుణ్ణి వారు పార్లమెంటు ఎన్నికల్లో ఓడించిరి. ఐనా తిరిగి గెల్పించుకున్నాం. ప్రజలు మా ప్రక్కగూడా ఉన్నారు" అని ధీమాతో పల్కిరి బెజవాడ సభలో.

మాలాంటి విశ్వవ్యాపిత రైతాంగ ధోరణి గల వారికి రైతు ఉద్యమం అలాగా ప్రపంచ ప్రతిష్ట కల్గించుచున్నదే, దాన్నెట్లు తగ్గించడం, తొలగించడం అనే  కుట్రలు నెహ్రూ అనుయాయులు చేసిరి. మా పేరిట మా ప్రబోధం ద్వారా ప్రపంచ ఆహారసంస్థకు వెళ్ళిన డాక్టర్ దేష్‌ముఖ్‌గారిని మంత్రిగా చేసుకొనిరి. వారిచేత పోటీ సంస్థను "ఫార్‌మర్స్ ఫోరమ్" పేరుతో నిర్మించిరి. దానికే ప్రభుత్వ ఆదరణ అంతా యిచ్చిరి. దానికి భారత రాష్ట్ర స్థాయిలో మంత్రులనే అధ్యక్షులుగా నియమించిరి. విదేశాలకు మన రైతు నాయకులు యువనాయకులు వెళ్ళి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకుని వచ్చుటకుగా నేను వివిధ దేశాల రైతు సంస్థలు, ప్రభుత్వాల చేత అంగీకరింపజేసిన ప్రణాళికలను ప్రభుత్వాదరణ కలిగిన "ఫోరము" కైవసము చేసిరి.

అధికారుల ప్రేరిత ఫోరమ్‌ను కూడా ప్రపంచ రైతాంగ సమాఖ్యలో సభ్యులుగా జేర్చిరి. ప్రభుత్వమునకు చెందిన సంస్థలు సభ్యత్వమునకు అర్హులు గారనే తమ నియమాన్ని అంతర్జాతీయ సంఘము సడిలించు కొనిరి, నెహ్రూగారి వత్తిడి వల్ల ఢిల్లీ లోనే 1959-1960లో ప్రభుత్వాధ్వర్యం క్రింద జరుపబడిన ఆ ప్రపంచసభలో "సహకార వ్యసాయ దోరణి" భార తేశం లాండి బడుగు, పెరుగుచున్న దేశాలకు శరణ్యమనే తీర్మనం ద్వారా 1969 డివంబరులో, స్వతంత్రపార్టీ ఏర్పడ్డ పిమ్మట తమ నాగపూరు కాంగ్రెసు తీర్మన ధోరణిని బలపరచుకొనిరి. దాంతో మరో త్యాగం సాహసం చేయు అవసరం మాకు కల్గినది. . అప్పటికే కాంగ్రెసును వదలితిమి. మేము నిర్మంచుకొన్న ఎన్నెన్నో అనుబంధ సంస్థలను వీడితిమి. వాటన్నిటిని, కాంగ్రెసు అనుయాయులు ఆక్రమించుకొనిరి. తుదకు 1946 నుండి, పెంచుకొచ్చిన ఆ ప్రపంచ రైతు సమాఖ్యను కూడా దవులు కోవలెనా? ఆ ప్రశ్నకు ఎవ్వరు సమాధానం యివ్వగలరు? శ్రీ వెంకటసుబ్బయ్య (ఆంధ్ర) దాదుభాయి అమీను (గుజరాతు) సర్దారు నాగోకి యిచ్చిరి, ఖచ్చితమైన సమాధానం "స్వతంత్ర రైతాంగమును రక్షించుటకై ఏర్పరచుకున్న యీ ప్రపంచ రైతాంగ సంస్థ యిలాగా వ్యర్థమగుచున్నది గనుక మేము దీన్ని వీడుచున్నాం" అన్నారు.

మమ్మేల యిటుల బహిష్కరిస్తారనిరి ఎందరో విదేశీయ రైతు నాయకులు. "కొన్నాళ్ళు పోయింతరువాత ఈ ప్రభుత్వ ఆతిధ్యమత్తు, యీ మంత్రుల సహవాస మత్తుపొయిం తరువాత మీకు మా ధోరణి తెలిసి వచ్చు ననిరి" వెంకటసుబ్బయ్య ప్రభృతులు. ఎన్నెన్నో మారులు విదేశాలలో అట్టి సభలలో పెత్తనం చేసివచ్చిన ఎన్.వి. నాయుడు వారినిబలపరచిరి.

ఆ 1940-50 నుండి 1967 వచ్చేసరికి ఆ సంఘము వారే సహకార వ్యవసాయం బడుగు దేవ్శాలకే గారు, ఎదుగు చున్న భారత దేశమునకు పనికిరాదు. స్వంతవృత్తి, స్వంత వుద్యోగం కావాలనుకోవడమే రైతలకు అభివృద్ధి పధకమని తీర్మానించుకోవలసి వచ్చినది. ఆనాటి భారతీయ రైతాంగ ధోరణి వారెందరో తిరిగి స్మరించుకొనిరట. అప్పుడలా మమ్ము విచి నెహ్రూ పదవుల కొరకై, ప్రపంచ రైతాంగోద్యమానికే కష్టం కల్గించి డాక్టరు దేష్‌ముఖ్ అన్ని పదవులు పొగొట్టుకొని ఆశాభంగుడై స్వర్గీయులైరి. వారి "ఫోరమ్" ఉద్యోగాలందుకోవాలను వారికి తర్ఫియతు యిచ్చే మెట్టుగానే వుండగల్గుచున్నది.

తిరిగి మమ్ము ఆ "International Federation of Agricultural Producers"కు ఆహ్వానించిరి. దానకి మేము ఆంగీకరించ జాలమైతిమి, ఏలనా? ఆ సంస్థ వేల ఎకరాల కమతాల ఖామందుల సంస్థగా మారిపోయింది. బడుగు రైతులు, సీలింగ్సు లోబడ్డ రైతుల రక్షణకే భారతీయ కిసాను ఉద్యమం, సేవ చేస్తుంది గదా!

మేమా ఆ ప్రపంచ సంస్థ ఆలాగా స్వధర్మచ్యుతి జొందుతుంటే చూస్తూ పూరుకోలేదు. మూరపు ఖండములో పోలండు, హంగరీ, యుగోస్లావియా, ఇటలీ, ఫ్రాన్సు, చెకోస్లావేకియా, జర్మనీ ఆదిగా గల యూరపు దేశాల రైతు ఉద్యమాలను, ప్రదమ, రెండో ప్రపంచ యుద్ధముల మధ్యకాలంలో, అంతర్జాతీయ రైతుల యూనియను వుండెను. వారి నాయకులే యద్ధానంతరం, రైతు పార్టీలకు మెజారిటీలు పోలండు హంగరీ దేశాలలో సంపాదించుకొని, ప్రధాన మంత్రులైరి. వారిని Copenhagen లో World Food Conferenceలో కలిసితిమి. కమ్యూనిస్టుల, సోవియటు వారి రెడ్ ఆర్మీ దౌర్జన్యాల సహాయంతో, నిర్బంధంగా, దురన్యాయంగా అధికారాన్ని ఆక్రమణ చేసుకొనిరి. అప్పుడాయా దేశాలను అచ్చటి రైతు నాయకులు వదిలి, ప్రజాస్వామ్య దేశాలకు, ఈనాడు బంగళా కాందిశీకుల వలెనే, వచ్చేసిరి. వారు తిరిగి ఇంటర్నేషనల్ పెజంటు యూనియన్ను "International Peasant Union" పునరుద్ధరించిరి.

మా సహకారం కోరిరి. మేమందు చేరితిమి. అటులో ఫిలిఫైన్సు, జపాను, తైవాను, బర్మా, మలేషియా, సిలోను, రైతు ఉద్యమాలు చేరెను. ఈ అంతర్జాతీయ రైతాంగపు యూనియను ప్రజాస్వామ్య ధర్మాలకై, రైతాంగ వ్యవస్థ రక్షణకై స్వంత ఉద్యోగ ప్రాప్తి కల్గించు రైతాంగ కళాకారుల స్వతంత్ర్యము, ప్రాథమిక హక్కుల పునరుద్ధరణకై, విప్లవధోరణిలో శ్రమించును. దానిలో చేరితిమి. ఆ సంస్థే Associate, frternal (సోదర, సౌభ్రాతృత్వస్థాయి మీద --- అంటే అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తి సమాఖ్య (F. A. O)తో సహకరిస్తూ వున్నాము.

వారు రెండు మూడు సంవత్సరాలకు ఒకమారు అంతర్జాతీయ సభలను నడుపుచుందరు. ఆట్టి సభలకే 1964లో న్యూయార్కుకు, 1956లో పారిసుకు, 1964లో వాషింగ్టన్‌కు నేను వెళ్ళితిని. నేనే ప్రారంభోపన్యాసాల నొసంగితిని.

ఈ ధోరణి అంతా వెంకటసుబ్బయ్య హృదయాని కెంతో తృప్తి, ఆనందం కల్గించినది.

కనుకనే 1954లో హంగరీ మాజీ ప్రధాన మంత్రి నాగీ గారు భారత దేశం వస్తే విజయవాడలో గొప్ప సభను వెంకటసుబ్బయ్య నడపిరి. నా కంచు విగ్రహమును ఆవిష్కరించుట కెందరో నెహ్రూ మంత్రి వర్గ ప్రముఖులనే పిలవాలని, రాష్ట్రపతినైన పిలువాలనిరట. "ఆలా కానే కాదు, విశ్వ రైతాంగ నేత లైన వారినే తన రైతాంగ నేత విగ్రహాన్ని ప్రతిష్టాపించాలని పట్టుపట్టిరి" - వెంకట సుబ్బయ్య. అందువల్లనే, బల్గేరియా రైతు నాయకులు, అంతర్జాతీయ రైతాంగ యూనియను ప్రధాన కార్యదర్శియైన, మరణశిక్షలు తనపై, తన భారపై కమ్యూనిస్టులు ప్రకటించినా జైళ్ళ నుండి తప్పించుకొన్న డాక్టరు జార్జి డిమిట్రోఫ్ గారిని వెంకటసుబ్బయ్యే పిలిపించిరి. వారు వచ్చువరకు ముహూర్తాన్ని నిర్ణయించరైరి. వారుకూడా తాను మన దేశానికొచ్చు సమయానికి, విజయవాడ ప్రాంతములో కలరా వ్యాపించివుంటే జనాను పోయి తిరిగి వచ్చి, వెంకట సుబ్బయ్య గారు నిర్ణయించుకున్న ముహూర్తానికి విజయవాడ వచ్చిరి. ఆ విగ్రహావిష్కరణోత్సవ మందు పాల్గొనిరి, విగ్రహాన్ని ఆవిష్కరించిరి.

ఇలాగా తన అంతర్జాతీయ రైతాంగ వుద్యమ ఆరాధనను, మన వెంకటసుబ్బయ్య ప్రస్ఫుట పరచిరి, తాను ప్రేమించినది ఆంధ్రభారత రైతులనే గాదు ప్రపంచమందలి రైతాంగాన్నందరిని. అలాగా ఆంధ్రయందలి అందరు రైతాంగ సేవకులు, వారి అడుగుజాడలనే, అంతటి మహోన్నత విశ్వవ్యాపిత ఆశయాల కొరకు, వుద్యమం కొరకు, ఆర్పణ చేసిరి.

కనుకనే మహాత్ముని శిష్యులతో నున్నత స్థాయికి చేరిన సేవకులలో వెంకట సుబ్బయ్యగా రున్నారని 1944లో మహాత్ముని వద్ద అందుకొన్న ఉన్నతాశయ అంతస్థులోనే వారు తుది వరకు వారి హృదయాన్ని నిల్పిరని నాకు ఆనందం. మాకు తృప్తి.

## ఆస్పిటలులో దర్శనం

గొర్రెపాటిని రెండు పర్యాయములు, గుంటూరు జనరలు ఆసుపత్రిలో కలుసుకొంటిని. ఆ రెండు సమయాల మధ్య రెండు సంవత్సరాల వ్యవధి. ప్రతి సమయాన, డయిబెటిసు ఉండెను. మూత్రకోశపు యిబ్బంది వుండెను. ప్రతి మాకు జనరలు వార్డులోనే వుండిరి. వారు చుట్టుపట్ల పది, పదిహేను మంది రోగులు వారి వారి మంచాలపై వుండిరి.

ఇలాగా జనరలు వార్డుల్లో ఎందుకుండిరో అనే కష్టము నాకు వుంటూ నేవుంది. వారే, ఏ శాసనసభ, లేక పార్లమెంటు సభ్యులైతే, స్పెషలు వార్డు అదనపు ఖర్చులున్నా. లేకపోయినా వారికి యిచ్చే వారే గదా! ఈ రోజుల్లో ఎక్కురే పరీక్షలు, మందులు అన్నీ ఉచితం గానే అందించే వారు. వారి కట్టి సౌకర్యం మేమెవ్వరం కల్గించ లేక పోతిమి.

ఐతే వారైనా అదనపు ఖర్చులు పెట్టుకోలేరా! పెట్టకోగల్గిన శక్తి ఉన్నా, వారికి జనరలు వార్డులో ఉండటమే యిష్టమట. ఇంకొన్నాళ్లకు అంతా ఐపోబోయే ముందు కూడా, నేను వెళ్ళి చూచుకొన్నప్పుడు కూఆ ప్రతి దినం ఒక్కసారైనా తన హాలులో వున్న రోగుల వద్దకు వెళ్లేవారట, వారి యోగ క్షేమాలు విచారించే వారట! సమ్మేళన సహాయకులు ఒక్కరు సరస్వతమ్మ గారిని మాత్రం తనకు సపర్యలు చేయుటకు ఒప్పుకొనిరి.

రెండోమారు జబ్బు తీవ్రరూపం దాల్చింది. తన బాధ ఓర్వలేనిదిగా ఉంది. దేహ దార్ఢ్యత చాలా క్షీణించు చున్నది. కనుక సరస్వతమ్మ తోడు కుమారుడు కుమార్తెను గుంటురూ రానిచ్చిరి.

అంత క్లుప్తంగా సాధారణ జనులలో తానొక్కరుగా వుంటూ, అంత జబ్బులో కూడా అట్టి గాంధేయ ఋషిలాగా వ్యవహరించుచున్న వారిని చూచుకొని ఎంత అభిమాన వడితినో చెప్పగలవా? ఆయన ఆదర్శమూర్తి అనుకున్నా!

వారికి తెలుసు రోగులను చూస్తూ అత్యతంతంగా లోలోన దుఃఖించుతూ బహు బాధపడే మనిషిని నేనని. అందువల్ల పదే పదే నేను తన్ను ఆసుపత్రిలో చూడరాదని బలవంతం చేశారు.

కాని యితరుల కేదేని పెద్ద జబ్బు కల్గితే, తానే ముందుగా నన్ను తయారుచేసి, వారి వద్దకు తీసుకు వెళ్ళేవారు.

అలాగా పండితే వెంకట సుబ్బయ్య గారు పక్షవాతం వచ్చి నీరసించిరని చెప్పిరి, ఎంతో విచారంతో! కొంచెం కోలుకుంటున్నారని ధైర్యం గొల్పిరి, నన్ను ఆ బాధ నుండి కొలుకొనునట్ల చేసిరి. మీరు వారిని చూస్తే వారికి మరింత బలం కల్గుననిరి. "నేను కూడా వస్తా, పొయి చూతామా" అనిరి. దగ్గిరలోనే వున్నారు, ఫరవాలేదు. మీరు చూచి ఓర్చుకో గలరనిరి. అంత యిద్దరం కలిసి వెళ్ళినాము. నా అదృష్టవశాత్తు పండితులు చిరునగువుతో, మంచంపై మెరుపువున్న దేహంతో ప్రత్యక్షమైనారు. వారి కుమార్తె, దేశిప్రచురణల నిర్మాత శివరామకృష్ణుని సతీమణి వారి సపర్యలు చేస్తున్నారు. మేము వెళ్ళి, వారి వద్ద చేరగానే వారు చిరునగవుతో "అబ్బే! ఫరవాలేదు లెండి, నయమగుచున్నది. నొప్పులు లేవు. వంకలనీ పోయినవి చేయి దారికొచ్చిందంటూ" వుండిరి ఆ పండితలు. నేనేమో ప్రార్ధన చేసుకుంటూ వుంటిని. అలాగా పండితుల దర్శనం, సేవ చేసుకొను భాగ్యం కల్గించిరి రైతు గొర్రెపాటి.

మరోమారు నివాదాల సత్యం ఆస్పత్రిలో వుండెను. తుదిరోజు లేనట, అంతకుముందే ఆయన భార్య మరణించిది. ఆయనకా దుఃఖవార్త చెప్పనేల! "చూచివద్దామా, మీకై కలవరిస్తున్నాడు పాపం" అనిరి. వెళ్ళితిమి. ఆయన్ను చూస్తిమి, ఏవో పండు ద్రాక్ష లతో సహా యిస్తిమి. ఫరవాలేదులే అని చెప్పితిమి లోలోపల యీ మాటలోల& మాకే నమ్మకం లేదని దుఃఖించు కొంటిమి. అలాగా ఆ స్వచ్ఛంద సేవకుని సేవించునట్లు చేసిరి.

అంతకుముందు, కృషికార్ లోక్ పార్టీ అభిమాని, శ్రీ అర్జునరావు - కాన్సర్ వ్యాధితో మంచమొక్కిరి, డాక్టర్ల వద్ద వారిని చేర్చి, భద్రంగా వారిని రక్షించండని అంతకుముందే చెప్పియుంటి. త్వరితగతి ఆ జబ్బు అర్జున రావును యీడ్చివేస్తూ వుండెను.

ఎచ్చట నుండో వచ్చినా, ఆ విజయవాడకు, కాలకృత్యాలైన పిమ్మట నెమ్మదిగా నన్ను జేరిరి గొ౯రెపాటి! ఎందుకింత విచారమంటిని! మన అర్జురావు యిక వుండరు అన్నారు. "డాక్టర్లు ఫరవాలేదంటిరే" అని అడిగితి! రూపో మాపోలాగా వున్నది. మిమ్ము ఒక్క మారు చూడాలంటున్నరనిరి. వెళ్ళితిమి. వారి ప్రక్కన కూర్చుని వారి ఎండిపోయిన చేతులు చూచేసరికి నాకు దుఃఖము పెల్లుబికెను. అయినా ఏదో చెపాల్పలే. అర్జున రావే నాకు సహాయపడుతూ "మిమ్ము జయప్రదం" అనీ అనినట్లే సంజ్ఞలు చేసిరి, సెలవు తీసుకొంటిమి ఏవి ప్రార్ధన? ఏమో!

ఇలాగా ఎందరినో తాను ఓదార్చేవారు, ఎందరికో సవర్యలు చేసేవారు. నాచే నాధర్మము జరిపించేవారు.

ఈ వెంకట సుబ్బయ్యను 1969 నవంబరు 30 తేదీన చూచుకున్నాం, మాట్లాడుకొన్నాం. "బాపట్లలో రాష్ట్ర మురుగు బాధ నివారణ సభలు, జన్మదిన సభలు బాగాజరిగినట్లు చదివినాను. అబ్బిన గుంటవారిపాలెంలో సభలకు వెళ్ళాలి గదా!" అంటూ "విజయవాడలో, కాటేజి కట్టించలేక పోతిమే" అన్నారు. అలా అలోచించి, "హైదరాబాదు లోనిరంగా భవనంలో కొంత భాగం అమ్మైనా సత్య నారాయణ యిచ్చిన స్థలంలో కాటేజి కట్టిద్దాం రాబోయే నవంబరుకు" అన్నారు.

" ఈ యిందిరమ్మ వైఖరి మారడం లేదే! రైతులపై తండ్రికి యీ తల్లికి యింత కార్పణ్యమేమా" అనుకుంటానన్నారు.

తన గురించి మాట్లాడుతూ ఏం ఫరవాలేదన్నారు. జబ్బులక్షణాల గురించి డాక్టరు చెప్పిన విశేష్యాలు నాకు చెప్పినారు. తాను తిరిగి విజయవాడ వెళ్ళి ఎలాగా పథ్యం చేయవలెనో వివరించిరి. వాహిన ద్వారా జన్మదిన సంచిక చేయలేకపోతినే అనుకున్నారు. మీరేమి దిగులొందక ఢిల్లీకి వెళ్ళండి అన్నారు. ఆ మందహాసము, ఆ నిండు నమసాౖము, నిండైన, బలమైన వెంకట సుబ్బయ్యవే. శిమ్మా జగన్నాధం, వీరాచారి, నాగేశ్వర రావు, లచ్చన్నా ప్రభృతులంతా నమస్కరించిరి.

డిశంబరు పదో తేదీన ప్రొద్దుట కాలకృత్యాలు ముగించుకొని, శుభ్రమైన గుడ్డలు వేసుకొన్ని ప్రక్కనున్న రోగులతో మాట్లాడరట. కొంత సేపటికి డాక్టర్లు ఆపరేషను చేస్తామన్నారట. "తయారు" అన్నారట వెంకటసుబ్బయ్య! ఆపరేషను ఎలా జరిగిందో, వారు తిరిగి మళ్ళా వెంకటసుబ్బయ్య రాలేదు, దేవడు అక్కడే అప్పుడు నవ్వుతూ ఉన్న, ఆశతో వున్న, ధైర్యధీరులుగా వున్న వెంకటసుబ్బయ్యను రెండు చేతులా అందుకొన్నారు. కౌగలించుకోన్నారు. అప్పుడు నేను లేకపోతినే అనే బాధ నాకు తీరనిదై పోయింది.

పంధోమ్మిదో తేదికి, నేను, భారతీ దేవి, నాగేశ్వరరావు, ఘంటసాలకు చేరినాము. మమ్మందరినీ గౌరవించే, నా ఆక్కుఫర్డు మిత్రులు లింగం వీరభద్రయ్య చౌదరి, వారికి ఆ బాల్య మిత్రులు, జీవిత పర్యంతం వారి సేవా వ్రతమును గౌరవించుచున్న బ్రహ్మయ్య పండిత గొ౯రెపాటి, వారినే సాక్షాత్తు నాయకునిగా గుర్తించుకొన కొమ్మారెడ్డి బాపయ్య, సర్దారు లచ్చన్న, కాపూరి వెంకయ్య వీరాచారి, నాగినేని, దస్తగిరి, వెంకటేశ్వరరెడ&ఇడ, సుంకర సత్యనారాయణ, పరుచూరి, మరెందరో చేరిరి. వారందరి మధ్య వెంకటసుబ్యయ్య వున్నట్లుండేది ఒక నిముషం, మరోనిమిషం లేరే అనిపించేది. అలాగ "కలడు, లేడు" అనే బాధలతో గూడిన భావముతో, వారిని ఆర్చించినాము, ప్రేమించినాము, మహాత్ముని చేరినాడను కొన్నాము. ఆయనే గొ౯రెపాటి.

ఘంటసాల, ఆ దివితాలూకా జనాలు గొప్ప మనసు గల వారు. అది బుద్ధుని యుగములో, రోమన్ యుగములో ప్రపంచ విశ్యాతి చెందిన ప్రదేశము. శాతవాహనుల ఆంధ్రవిష్ణువు ఏలికలో ఆ ప్రాంతము ప్రసిద్ధిజెందినది. పండిత గొ౯రెపాటి ఆ పల్లె సీమ గురించి గొప్ప గ్రంథమే ఆదర్శ ప్రాయంగా వ్రాసిరి. ఆ పురాతన మైదాన ముందు, అచ్చటి దేవాలయములచే నునీతమగుచుండగా, గొప్ప స్మారకసభ జరిపిరి. అప్పుడే చిట్టూరు మిత్రుల హృదయస్పందనముకలిగించు స్మారక గతముల విన్పించిరి. గ్రామ పెద్దలు, ఆ ప్రదేశ మందే వెంకటసుబ్బయ్య శిలావిగ్రహమును ప్రతిష్టించుకొన వలెనన్న తమ తీర్మానమును ప్రకటించిరి. దాని ఆ గ్రామవాసులై, రాష్ట్ర పెద్దతనాన్ని అందుకొన్న బ్రహ్మయ్య, పండిత వెంకటసుబ్బయ్య, మహాలక్ష్మమ్మ

పంచాయితీలోని యిరువర్గాల నాయకులు బలపరిచిరి. అలాగా మా అందరి చేతనే గాక, స్వంత గ్రామసీమ ప్రజలందరి చేత పూజింపబడుచున్న వారు మనందరి వెంకట సుబ్బయ్య గారు.

## నా గ్రంథాలు - వెంకటసుబ్బయ్య భావాలు

జైలులో ఉండగా వ్రాసిన World role of National Revolution అనే పుస్తకపు టాలోచనల సారంశమును తన రాజకీయ జీవిత ప్రారంభ దశ యొక్క సందేశముగా గ్రహించిరి వెంకటసుబ్బయ్య. ఆ రెండవ ప్రపంచ సంగ్రాను సమయంలో కమ్యూనిస్టులంతా భారత జాతీయ స్వాతంత్ర్య సమరము మితవాదులకు, సంకుచితులగు అభివృద్ధి నిరోధకుల రాజకీయమని ప్రచారం చేస్తూ ఉండిరి. వారి ప్రజాయుద్ధ నినాదాన్ని ఎదిరిస్తూ మహాత్ములు, జవహరు, సర్దారు, మేమంతా ప్రజలను అభివృద్ధిదాయకమగు భవిష్యత్కాలంలో భారతీయుల శ్రేయస్సును పెంచుదారులో జాతీయ స్వాతంత్ర్య సంరంభమును సాగిస్తున్నమని హృదయపూర్వకంగా నమ్మిరి. ఆ జాతీయ వీరులు శ్రీ వెంకటసుబ్బయ్య కాకాని వెంకటరత్నం, కనుక వారిద్దరు నన్ను ఈడుపుగుల్లునకు తీసుకెళ్ళి ఆ గ్రంథాన్ని అచ్చోత్తించుటకటు ధనమును వసూలు చేసి జాతీయోద్యమాన్ని బలపరచిరి, ఆ గ్రంథాన్ని ఆంగ్లములో పండిత గొర్రెపాటి అల్లుడు. యువకుడు, దేశికవితా గ్రంధమండలి ఆ పిమ్మట స్థాపించి, పేరు గాంచిన గ్రంథకర్తగా పెరిగిన శివరామకృష్ణని చేతనే అచ్చొత్తించి 1945 ప్రకటించిరి.

హరిజనోద్ధరణకై మహాత్ములు ప్రారంభించిన వుద్యమాన్ని బలపరుస్తూ "హరిజన నాయకుడు" అనే నవలను తెలుగులో 1931లో వ్రాసితి. సహపంక్తి భోజనాలు, వర్ణాంతర వివాహాలను బలపరుస్తూ హరిజనులకు వోటింగు హక్కువ ఆర్థిక సమానత్వము అవసరమని సూచించితి. హరిజనులు తదితరులతో బాబు మంత్రివర్గములో చేర్చాలి. వాటికి నాయకత్వము జొందాలంటిని. ఆ కథా సందర్భములో World role of National Revolution అనే పుస్తకాన్ని కూడా శ్రీ బొందలపాటి శివరామకృష్ణయ్య 1946లో ప్రచురించునట్లు, దాని ఖర్చులకు కృష్ణాజిల్లా రైతాంగము పూనుకొనునట్లు వెంకటసుబ్బయ్య. శ్రీ కాకాని కృషి చేసిరి.

"జాతీయ విప్లవ పంథా" అనే పుస్తకము Outlines of National Revolutionary అనే నా రెండవ ఆంగ్ల గ్రంథాన్ని కనువాదమును తాము నడుపుతున్న "కిసాన్ ప్రెస్"లో అచ్చోత్తించి ప్రచురించిరి. వారికి యూడ్పుగల్లు రైతులు తొడైరి.

ముస్లిములీగువారు, కమ్యూనిస్టులు దేశ విభజనను చేయాలంటున్న ఆ 1945-46లో, ఆ తత్వాన్నెదిరిస్తూనే వ్రాసిని "పాకిస్తాను" అను గ్రంథాన్ని వెంకటసుబ్బయ్య ప్రచురించిరి. "వాహిని" తరపున మున్షీ గారు సూచించిన "అఖండ భారతదేశమందు వారికంత విశ్వాసము".

ప్రపంచమందలి రైతాంగమును పారిశ్రామిక యాజమానులు కోటీశ్వరులు వారి బ్రోకరులు, కమీషన్‌దారులు, ఆఖరుకు పారిశ్రామిక కార్మికులు దోచుకుంటున్నారు. పారిశ్రామిక కూలీలకు జరుగుచున్న అన్యాయాన్ని ఆరికట్టుటకుపాశ్చాత్య సోషలిజం ప్రయోగమైతే అంతకంటే ఎన్నో రెట్లుగా దోచుకోబడుతున్న దిక్కులేని వ్యవసాయకులు, రైతులు, కూలీలు వారి సహాయకులు కళాకారులను రక్షించుటకు ప్రపంచ రైతాంగ వుద్యమం అవసరమనిరుజువు చేస్తూ నేనొక గొప్ప గ్రంధాన్ని "Credo of world Peasants" అని వ్రాసితి! ఫ్యాక్టరీ యజమానులు, రైల్వే రోడ్డు రవాణాదారులు, బాంకరులు షావుకారులు, వడ్డీ వ్యాపారులు రైతుల గొంతుల పిసుకుచున్నట్లు వ్యవహరిస్తున్నారంటిని. రైతాంగాన్ని దోచుకుంటూన్నందువల్లనే పారిశ్రామిక దేశాలు, పట్టణాలు, నాగరికతా మహత్తులు వందల అంతస్థుల సుఖాల సౌధములు నిర్మించుకుంటున్నారంటిని. వ్యవసాయ వస్తువులకు తక్కువ ధర లిచ్చి పారిశ్రామిక వస్తువులకు హెచ్చుధరలు చేసి, వ్యవసాయకుల నికరాదాయమును దోచుకుంటున్నారు. కనుక పారిశ్రామికులతో సమానమగు రక్షణలు, ధరవరలు, జీతభత్యములు ఆదాయములు. ఆర్థిక సౌకర్యములు రైతాంగమునకు అందజేయుటే యీ శతాబ్దపు ప్రత్యేక సాంఘీక న్యాయమంటిని. ఆధమం కనీసపు ధరలు, కూలీ రేట్లు పంటలభీమాలు రేట్లు పంటభీమాలు

నిరుద్యోగ నివారణ పథకాలు. గ్రామ సీమలకు పట్టణముల సౌకర్యాలు సమంగా దేశం మీద, ప్రపంచమంతటా యేర్పరచుటకే రైతుకూలీ ప్రజారాజ్యమవసరమని ఘోషించితి. జమీందారుల క్రింద, బ్రిటిషు వారి కాలంలో రైతుల కెటుల అందుచున్న ధరలు గిట్టింపు కావడం లేదో, వ్యసాయ కూలీలకు రెండుపూటలు కూడా పూర్తి భత్యం ఉండడం లేదో, నా దారిలోనే విసుగు లేకుండా లెఖ్ఖలు వేస్తూ, గిట్టింపు ధరలో అంటూ ఘోషిస్తువున్న, వెంకటసుబ్బయ్య పారిశ్రామిక వస్తువుల మీద బస్తీ ఉద్యోగుల మీద యే విధమైన కంట్రోళ్ళు పెట్టకుండా, రైతుల పంటలను నిర్బంధంగా, గిట్టింపు కాని కంట్రోలు ధరలు, ప్రొక్యూరుమెంటు ధరల ద్వారా దొచుకోవడం దున్యాయమంటున్న వెంకటసుబ్బయ్య "Credo" అను పుస్తకమును తన "వేదం"గా రైతులకొక "ధర్మన్యాయ ఆయుధంగా" గ్రహించిరి. కనుకనే శ్రీ గోగినేని ఉమామహేశ్వర రావు, జి. విశ్వనాధం, రత్తయ్య వాహిని నిర్వాహకులను తోడుజేసుకొని 500 పేజీల ఆంగ్ల గ్రంధాన్ని ఆచ్చొత్తించి ప్రకటించిరి.

రైతులు విప్లవకారులు గారు, విప్లవ వ్యతిరేకులు, వారిపై ఆధారపడి జాతీయోద్యమముగాని, శ్రామికోద్యమము గాని విజయం పొందలేదని కమ్యూనిస్టుల వాదం, అది తప్పని మాబోంట్ల విశ్వాసం, ధైర్యం, అనుభవం, జమిందారి పెత్తనాన్ని, స్వదేశ సంస్థానాధీశుల నిరంకుశత్వాన్ని, సామ్రాజ్య శృంఖాలాలని తొలగించుటకు ప్రధానశక్తి రైతులే గదా! ఈ రహసాన్ని చైనావారి మాఛ్చెతుంగ్ ఋజువు చేసిరి. ఆఖరుకు కమ్యూనిస్టులు మాత్రం, రష్యాలో 1905, 1917 విప్లవ విజయాలు రైతుల బలముతో గదా సాధించిరి! ఇలాగా ప్రపంచమందు ప్రముఖంగా జరిగిన విప్లవాలలో రైతు లెట్టి వీరోచిత విజయ పరంపరల సాధించిరో చూపుతూ "Revolutionary Peasants" అనే గ్రంధాన్ని యింగ్లీషులో వ్రాసినా! దాన్ని తెలుగులోకి తర్జుమా చేయుటకు శ్రీ విజయరాజకుమార్ ను ప్రోత్సహించిన వారిలో ప్రధములు వెంకటసుబ్బయ్య. ఆ గ్రంధము తెలుగులో ప్రచురించబడితే దాన్ని నిజామాబాద్ జిల్లా బోధన్‌లో, వుత్సాహంతో శ్రీ విజయ రాజకుమార్ ప్రచురిస్తే గొప్ప ఆనందం అనుభవంచిరి మన గొర్రెపాటి.

తుదకు కృష్ణాతీరమందే, దోనేపూడిలోనే "రైతులు -- సహకార వ్యవసాయం" అనే ఆంగ్ల పుస్తకమును తెలుగు స్వరూపము గొప్ప ఉత్సాహములో వెలువరింపబడితే, మన వుద్యమానికొక సూత్రాధారము, ధర్మబలం అందించు గ్రంధము అందింది. ఆ జవహరులాలు సవాలును బలంగా, విశ్వాసదృష్టితో ఎదిరించిగలమన్నారు వెంకటసుబ్బయ్య. ఆ గ్రంధమును శ్రద్ధతో తయారు చేసి, అందించిన పరుచూరి పిచ్చేశ్వర రావు, తమ దివిసీయవారు, తమ బంధువేనని సంతోషించిరి.

స్వతంత్ర్య వుద్యమయోధులుగా వనకు తానే తమ్మారై, రైతులేల స్వతంత్రమును కౌగలించుకోవలెనో, చ తమ స్వయంకృషితో స్వంత వుద్యోగములో అంతర్గర్భితమై యున్న స్వతంత్రమును రక్షించుకో వలెనో వివరిస్తూ తానే మరో గ్రంధాన్ని రచించిరి.

1945లో ఆదోసాయంత్రం, నెమ్మదిగా వెంకటసుబ్బయ్య వచ్చిరి. తమ పండితులు, మా యిర్వురి స్నేహితుడుల, మరో గొర్రెపాటి వెంకట సుబ్బయ్య నా జీవిత చరిత్ర వ్రాస్తానంటున్నారు. దాన్ని వ్రాయుననిచాలా అవసరమన్నారు. అప్పుడే ఎందుకండీ అని అంటిని, "లేదండి! మాలాంటి వారికి మీ ఆశయాల ప్రాధాన్యత తెలసునకుకోండి. మరెందరో కావాలి మన వుద్యమాన్ని పెంచుటకు, వారెందరో! ఎవ్వరో! ఎక్కడుందురో! ఎప్పుడు మన వుద్యమమునకు వత్తురో, ఎలాగ తెలుసుకోనడం! అలాంటి వారిని పెంచుకోవద్దా" అనిరి.

ఆ మధ్య కమ్యూనిస్టులు కూడా, తెరచాటుగా నాజీవిత చరిత్రంటూ ప్రచురించి దానజాఇలో తమ ప్రచారం చేసుకున్న సంగతి మీకు తెలియదా అంటిని. అలాంటి వారు కారు యీ సుబ్బయ్య గారు. వీరు మన వుద్యమమందున్న వారు, జమిందారి రైతు వుద్యమంలో నాకు వారెంతో తడు. మన గొట్టిపాటి బ్రహ్మయ్య గారికి కూడాకావలసిన వారేననిరి, రైతు వెంకటసుబ్బయ్య గారు. అంతగా వాదిస్తే, కాదనడం నాకు సాధ్యమా! అంత పండిత వెంకటసుబ్బయ్య గారు మేము పలుమారులు  కలుసుకొంటిమి. నా గురించిన మాటలు, విషయాలు, అనుభవాలు, పుస్తకాలు పండితునకు, రైతు వెంకట సుబ్బయ్య అందించిరి. తుదకా

పండితులు గొప్ప గ్రంథమునే రచించిరి. తామే ప్రచురించిరి. ఆదే భారత రైతాంగ వుద్యమ ప్రథమ చరిత్రగా ప్రసిద్ధిబొందినది. ఈ రైతు వెంకటసుబ్బయ్య, ఆ పండిత వెంకట సుబ్బయ్య కలిసి పెంచిన ప్రసిద్ధమగు ఆ జీవిత చరిత్ర చేసిన ప్రచారము ఎంతని చెప్పగలను. ఆ పండితులే నేనప్పుడు వ్రాసిన కొన్ని వ్యాసములను "శారదార్చన" అని రెండు చిన్న గ్రంథాలను చేర్చి ప్రచురించిరి కూడా! ఆదంతా వెంకటసుబ్బయ్య గారి చలువే!

ఓ సాయంత్రం ఒక చిన్ని గ్రామం చిన్న చెఱువు కట్టదాటి చేరి తిమా చిత్తూరుజిల్లాలో కుప్పం తాలూకాలో ఎట్లనో కొందరు చేరిరా కరణంగారి పంచలో, పెద్దలకు కబురు పెట్టగా మరో పది మంది చెరిరా 196 బై ఎలక్షను సందర్భమున. ఆ కరణం గారు తన పెట్టె తెరిచి, ఓ పుస్తకం చేరిన వారిలో నొక్కరికి నెమ్మదిగా అందించిరి. ఆ లోపల శ్రీ శేషాద్రి అయ్యంగారు ఎంతో శ్రమతో ఆ రైతులు అభ్యర్థులైనా రంగా మంచివారు. పెద్దవారు, రైతలకు రక్షకుడు. అంటూ వుంటే నేనా కొద్ది రైతులను, అట్టె చూస్తెంటే వారి కేమి నేను నచ్చినట్లు కన్పించాలా. "నేనోక మంత్రిని గాదే, మంత్రుల మనిషిని కాదే, డబ్బేమి లేని వాణ్ణే! ఎదురు నిలబడ్డ వారు, వారి జిల్లాలోని అతి ప్రముఖులగువారే, మంత్రుల కెంతో కావలసిన వారే" అనే భావాలు మిగతా వూళ్ళల్లో వారికి వలెనే వీరిని బాధిస్తున్న పనిపిస్తూవుండె! ఇక వెళ్ళిపోదామా అనిపించుతుండె నాకు.

అప్పుడొకరు లేచి ఈ పుస్తకాన్ని చూపిస్తూ "ఏమండోయి యీ గ్రంథము ఏమిటో తెలుసా! ఆ ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆ జవహరులాలును ఎదిరిస్తున్న ఆ రంగాగారి జీవిత చరిత్ర. దీని 15 సంవత్సరాలనాడే పండితులొకరు వ్రాశారు. ఈయన మహాత్మగాంధికి పరమశిష్యుడు. ఇంకేమి చెప్పాలి మీకు యీ రంగాగారి ఘనత గురించి మరి మనం వీరి ఓట్లిద్దాం" అన్నారు. అలాంటి ప్రచారం, బలం, ప్రతిష్ఠ యీ వెంకటసుబ్బయ్య ద్వయం కల్గించిరి. ఆ పుస్తకం లోని కొన్ని మాటలు చదివి వినిపించారు. పెద్ద పుస్తకాలు గొప్ప వారి మాటలను గౌరవించే ఆ గ్రామస్థులు మరెందరో గ్రామాల వారిగా శుభవార్తాలు చెప్పిరట. నన్ను బలపరచిరట, అటుల నేనా 1963 ఎన్నికలో జవహరులాలు అభ్యర్థిని ఓడించి గెలువ గల్గినాను. గదా!

1969లో, ప్రపంచయాత్ర, గాంధీజీ శతసంవత్సర వుత్సవాలలో చేసివచ్చినాను. బాపూజీ నా మధ్య 25 సంవత్సరాల పర్యంతం అప్పుడప్పుడు జరిగిన చర్యలను కొన్నింటిని స్పృశించుచూ, "Bapu Blessess" అనే ఆంగ్ల పుస్తకాన్ని వ్రాసితిని. దాన్ని బహుసుందరంగా సాహిత్యరీతులలో ప్రతిష్టాకరంగా సరిదిద్ది, ప్రచురించిరి, పండితుల, కవులు, డాక్టరు చిట్టూరి సత్యన్నారాయణ గారు. ఆ పుస్తకంలో కొన్ని తన అనుభవాలను గుర్తించితినని వెంకట సుబ్బయ్యకు చెప్పగా, వారు ఎనలేని ఆనందం పొందిరి.

క్రమంగా వెంకట సుబ్బయ్య ఆరోగ్యము క్షీణదశకు వస్తున్నది. చాలా కాలం వరకు నాకు చెప్ప సాహించరైరి. తనపై నేనెంతగా ఆధారపడుచుందునో, ఎటుల తనలాంటి వారు ఆరోగ్యంగా వుండాలని కుతూహల పడుచుందునో వారి కెరుక.

ఓనాడు, అమెరికా ప్రాంతాల నుండి తిరిగి వచ్చిన తరువాత "ఆలాగా చిక్కి రేమండి" ఆశ్చరపడుతూ బాధతో అడిగితి. వయస్సు పైబడటం లేదా అంటూ సిగ్గుతో చిరునగవుతో సమాధానమిచ్చిరి. ప్రకనే వున్న కొఠారు వెంకటేశ్వరులు "మీకు తెలియదా! స్యుగర్ కంప్లైయింటు వచ్చిందండీ" అన్నాడు. ఆయనకు బాద, నాకు కోపం వచ్చింది, "ఏమిటి ఐతే పరీక్ష ప్రశ్నించుకూ వుంటిని. ఏమి ఫరవాలేదండీ, కంట్రోలుకు వచ్చించి లెండి. ఇన్సులిన్తో పనిలేదు. డయటు సరిజేసికుంటె సరిపోతుంది" అన్నారు. "ఏమైనా భద్రంగా వుండాలి. మీరు కూడా యిలా నిస్సారులైపోతే యెలా! వారెందరో పదవుల కొరకు వెళ్ళి పోతున్నారు. మీరిలాగా అనారోగ్యమును పెరుగనిస్తే యెలాగా" అని పదే పదే భద్రం అంటూ ఢిల్లీకి వెళ్లిపాయినా!

అప్పటి నుండి నాకు నోటిసు అందిందే అని భయం వుండనే వుంది. కొన్నాళ్ళకు చిత్తూరు నాయకులు ఆ వెంకటకృష్ణయ్య, ఆ గొప్ప ధృడకాయులు గొప్ప జబ్బులో పడిపోతున్నారు. దాంతో వెంకటసుబ్బయ్య గురించి దిగులు పెరుగుచుండెను. ఒకనాడు కార్యాలయమునకు వెళ్ళితి. ఆమెట్ల నెక్కడం చుక్కల పర్వతంలాగా వుండె! ఆపైన ఆఫీసు, ప్రక్కనే దిండు ప్రక్క చుట్ట. ఆ మూల స్పిరిటు లాంపు వగైరాలున్నవి. ఇదంతా చూస్తే

"మీరిచ్చటనే మకామనిపిస్తూ వుందే" అంటి. మందహాసం చేస్తూ "మరొ అద్దె ఎందుకు లెండి అన్నారు" "అయితే స్నానమెక్కడ? వంట యెక్కడ?" వారి వెంటవుండిన నినాదాల సత్యం "యీబైట వరండాలోనే" నండి అన్నారు. "ఐతే మీరేనా వంట చేసుకోవడం అని అడిగితిని. "సరస్వతమ్మకు ఆ యిబ్బంది యెందుకూ! అన్నారు. నా గుండె గుభేలు మన్నది.

ఇది రాజకీయ నాయకుని నివాసమా! రైతు పెద్ద జీవతామా? కలిగి పెట్టి, పుట్టి పెరిగి స్వంత వుద్యోగములో ప్రసిద్ధులైన రైతునాయకునికి అందించుకో గల్గిన దౌర్భాగ్యమా? అట్టి సేవా పరతత్వ జీవితం క్లుప్తకోర్కెల అనుభవం, డబ్బునకు విషయ వాంఛలకు అతీతమైన వినోభాజీ శిష్యులలో, ఆ యోగుల ఆశ్రమ వాసులలో యే కొద్ది మందికి మాత్రమే సాధ్యమనుకొంటి.

ఒక వంక తృప్తి, మరోవంక పార్లమెంటు జీవితమందు నన్ను అందజూచుచున్న వసతులపై అసంతృప్తి కల్గినది. పోనీలే ఆయనెక్కుచున్న మెట్లను నేను కూడా నా పరిధిలో కొంతవరకు ఎక్కుచున్నాను గదా యనే తృప్తి బొందుచూ సెలవు తీసుకొంటిని ఆ రాజకీయ రైతాంగ ఋషి నుండి.

మరోనాడు - మందు వేసవిలో వారి కొరకై ఏలూరు రోడ్డులో అంజనాదేవి ఏరియాలో - దేశికవితా వారి గ్రంధాలయం ప్రక్క - పండిత గౌరైపాటి నివాసం దగ్గర కోపగించుచున్న పశ్చిమదిస సూర్యుని ఎదిరించి చూస్తున్న, చిన్న గదిలో చూచితి వారిని. అదే వారి ఆఫీసు చివరి నాల్గు సంవత్సరాలలో. ఒకే ఒక్క గది. కీటికీ తలుపు పడమటికే.. లోపల సంపాదకున కొక టేబులు, కుర్చీ అక్కౌంటెంటుకు మరోమూల. తాను మధ్యన గొడ ప్రక్క కుర్చీలో కూర్చుని, చిన్న టేబులు మీద వున్న కాగితాలను పరామర్శ చేసుకుంటున్నారు. చెమటతో వున్నారు. బనియనుతో నేమే! లోపలికి వెళ్ళి వారిని చూచితి గదా! వారిపై నాపై రైతాంగము అంతటిపై, ఎన్నరాని కోపం! ఆఖరుకు ఎలక్ట్రిక్ ఫాన్ కూడా లేదే, ఇంత దౌర్భాగ్యమా రైతు వుద్యమ పత్రిక ఆఫీసుకు, ఆ నాయకునకు అనిపించినది.

బైటకు పోదాం రండి అని పిల్చుకొని, కారులో చేరి, వెంటనే ఫానుల షాపుకు వెళ్ళి, ఫాను కొని, ఆఫీసులో పెట్టి ఆ గుమాస్తాకు తప్పక ఆ ఫాన్ను వాడాలి సుమా అని హెచ్చరించి వస్తిని. కొంత ఓదార్పు నాకు కల్గింది. నాపై కోపం కొంత తగ్గింది. అంతటితో నా భారం, భాద్యత తొలగినదా!

ఆయన మాత్రం, నాకో ఎయిరోడ్రోముకు వస్తూ నేను ఢిల్లీకి వెళ్ళేముందు, మీరంతగా భాదపడితే, యిలాగా ఖర్చులు పెట్టితే ఎలాగా అంటూ నెమ్మదిగా, నవ్వులతో నన్ను మందలించిరి.

వెంకటసుబ్బయ్య నల్లని వారని, పెద్ద బలమైన మనిషని, రైతులపై కానరాని దయగలవారని, పైకుబికే చురుకుదనంతో కూడిన కవళికలు లేనివారను కొందరు, వారినే ఒక్క, రెండో మారు చూచువారు. కాని ఆయన చిరునగవుల పలుమారులు చూచిన వారు ఆయన నిండు నవ్వుల వెన్నెలలో విహరించిన వారు, ఆ తీర్చిదిద్దిన పలు వరుసల ద్వారా ఆ నిండైన చెక్కిళ్ళ కందుచుండిన అందాల నెరిగిన వెంకటసుబ్బయ్య యెంతటి సౌందర్యమును తనలో దాచుకుంటున్నారనే వారు. అదంతా తన సొమ్మే అనుకుంటారు.

ఆయనకు స్వయంగా అందించలేక పోయిన సువార్త.

జైళ్ళలో వుండగా కొన్ని సంవత్సరాల మీద, దక్షిణ భారతదేశ చరిత్రపై విస్తారమైన పరిశోధనలను చేస్తూ వుంటిని. 1920-70 మధ్య, కాకతీయ సామ్రాజ్య పతనాంతరం ఢిల్లీ సామ్రాట్టుపై కాకతీయ నాయకులు జరిపిన స్వతంత్ర సమరం, స్వరాజ్య సంపాదనా నాయకులు జరిపిన స్వతంత్ర సమరం, స్వరాజ్య సంపాదనా సంపదనా సమరంలో, ఆంధ్ర, కర్నాట, మహారాష్ట్ర ప్రజలు, శ్రీ కాకతీయ నాయకుల ముందిదుకొని, ప్రదర్శించిన దేశభక్తి, త్యాగసాహస వీర విహారములు నన్ను ముగ్దున్ని చేసినవి. ఆ రైతాంగ దేశస్వాతంత్ర్య సమర వీరుల కథను "కాకతీ నాయకులు" అనే యింగ్లీషు గ్రంధాన్ని వ్రాస్తున్నానని వెంకట సుబ్బయ్యకు తెలియగా వారెంతో ఆనందము చెందిరి. వారి శిష్యులు శ్రీ సీతారామయ్య, ప్రభృతులు ఆ కాకతీయ వీరుల వంశము వారే - దాన్ని ప్రకటిస్తున్నారని తృప్తిజెందిరి. తుదకా పుస్తకం ప్రకటించుటకుముందే వారు స్వర్గీయులైరి. ఆ పుస్తకం ప్రకటించుటక ముందే వారు స్వర్గీయులైరి. ఆ పుస్తకాన్నే ఆ కాకతీయ వీరులకు సరిపోల్చగల తనకే గౌరైపాటికే చంద్రునికి నూలుపోగులాగా అంకితమిచ్చుకోగల్గితిని. అది నాకోక గొప్ప తృప్తి.

## వెంకటసుబ్బయ్య గారు పాల్గొన్న, రాష్ట్ర, జాతీయ స్థాయిలోని సమావేశములు, సంస్థలు

1. అఖిల భారత కిసాను మహాసభ, పళాసా 1940.
2. అఖిల భారత కిసాను మహాసభ, బహటా (బీహరు) 1942.
3. గాంధీ - రంగా చర్చలు - రైతు, కూలీ ప్రజారాజ్య ఆశయమును మహాత్ములు ఆశీర్వదించుట. కాంగ్రెసు - రైతు సమ్మేళనాల మధ్య సామరస్యము.
   రెండుసారులు, రెండు దినాల సమావేశములు. 1944 నవంబరు. అప్పుడే ప్రత్యేక వర్గ సంస్థలు యేర్పరచడం, జాతీయోద్యమానికి లాభమని బాపూజీ అంగీకరించిరి.
4. పొగాకు రైతులపై సెంట్రలు ఎక్సైజు వారి నిబంధనలను సవరణ చేయించుటకై కేంద్రప్రభుత్వం - సర్ ఆర్చిబాల్డు రోలండ్సుతో చర్చలు - 1946.
   ఫలితము ఇప్పటికీ అమలులో వుంటూన్న స్పెషలు కన్సెషన్సు - రూల్సు సవరణలు.
5. వ్యవసాయ కూలీల రక్షణకై అంతర్జాతీయ లేబరు ఆఫీసు వారు International Labour Office (I.L.O) ఢిల్లీలో సమావేశపరిచిన సభ - వ్యవసాయ కూలీల కనీసపు అవసరాలను తెల్పుచూ, వారి రక్షణోపాయముల సూచించు సభ. 1949.
6. ఆంధ్ర ప్రజా పార్టీ స్థాపన -- 1951.
7. అఖిల భారత కృషి కారు లోక్ పార్టీ ప్రథమ కన్వెక్షను ఢిల్లీ 1951.
8. ఆంధ్రరాష్ట్ర నిర్మాణము - ముఖ్య రాజధానీ నిర్ణయము కొరకై జస్టిసు వాంఛూ ముందు సాక్షమిచ్చు ప్రతినిధి బృంద సభ్యులు - మద్రాసులో.
9. "రైతు భజనావళి" పదో ముద్రణ 1952.
10. చల్లపల్లిలో - రాష్ట్ర రైతాంగ విద్యాలయ నిర్వహణ - ఆరు వారములు 1952-53.
11. ఆంధ్రరాష్ట్ర మహిలాసభకై ఘంటసాలలో సహకరించుట 1953 శ్రీమతి రామసుబ్బమ్మ, భారతీదేవి, మహలక్ష్మమ్మ, లక్ష్మీ రఘురాం గారలకు తోడ్పడుట.
12. జాతీయ కాంగ్రెసుతో, ఎన్నికల్లో, కృషి కారు లోక్ పార్టీ పొత్తు.
13. కాంగ్రెసుకు లోబడక, స్వతంత్రించి రైతు సమ్మేళనం. సాగించరాదని, ఆనాటి రాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ బహ్మానందరెడ్డి సర్క్యులరు, నోటిసుల పంపితే 1944 నవంబరులో తాము మహాత్మునితో జరిపిన చర్చలనుదహరిస్తూ, కాంగ్రెసునకు యిట్టి సర్క్యులరు పంపు నైతిక హక్కు లేదంటూ, అవసరమైతే, కాంగ్రెసును వదిలి వేసెదమంటూ గర్జించిరి - శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య ప్రభృతులు 1955.
14. భారత శిస్తుల కమీషను - డాక్టరు ముత్తయ్య అధ్యక్షులు - గొప్ప సాక్ష్య ప్రణాళిక - 1954.
    చిన్న రైతులపై భూమిశిస్తు రద్దు చేయమనిరి.
15. రైతుల పంటలకు కనీసపు ధరల నిర్ణయించాలని, శ్రీకృష్ణప్ప తదితర రాంసుభాగ్ సింగు కమిటీల ముందు సాక్ష్యం సలహాలివ్వడం 1957-60.
16. నిర్బంధముగా భూములను ఆక్రమణ చేయనిచ్చే శాసనసభ కమిటి - జస్టిసు ముల్లా అధ్యక్షులు - రైతుల భూములను నిర్బంధంగా ఆక్రమించుటకు అధిక్షేపించుటకు కోర్టులకెళ్ళుటకు రైతు హక్కు జారుడు.
    బజారు ధరలు రైతులకు చెల్లించి తీరాలి.
    రైతులకు భూమి అస్థి మాత్రమే కాదు, స్వతంత్ర వృత్తి ప్రదాయిని, స్వంత వుద్యోగ కేంద్రము అని వాదించిరి. 1968-69.
17. సెంట్రలు ఎక్సైజు బిల్లు - కమిటీ - రైతు రక్షణకై ఎన్నో సూచనలు చేసిరి 1969-70.

## సభలు

1. జమిందారీ రైతు రక్షణ సభలు.
   వెంకటగిరి 1931. ఏలూరు 1984.
   1943 వరకు నెల్లూరు వెంకట్రామానాయుడు గారి తోచేరి.
2. ఈనాందారీ రైతు రక్షణ సభలు.
   శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ గారితో చేరి 1935-1943 వరకు.
3. పులిచింతల ప్రాజెక్టు 1951, సిద్ధేశ్వర ప్రాజెక్టు 1950. నాగార్జునసాగరు ప్రాజెక్టు సభలు 1953-57 వరకు. వివిధ ప్రాంతములో జరిపించిరి.
4. మురుగు బాధా నివారణ సభలు - విజయవాడ, కైకలూరు, బందరు, రేపల్లె, బాపట్లలో ఎన్నో మారులు జరిపించిరి, 1950-69 మధ్య.
   శ్రీ కొమ్మారెడ్డి బాపయ్య, భాస్కర రావు, వెనిగళ్ళ రాజయ్య వెనిగళ్ళ వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, ఆళ్ళ నాగయ్య గారల సహకారంతో.
5. ఆంధ్రరాష్ట్ర డ్రెయినేజి మహసభ - 1970.
   బాపట్ల - విజయమునకు తోడ్పడిరి.
6. నిర్బంధ సహకార వ్యవసాయమును రైతులపై రుద్దవలెనని జవహరులాలు నెహ్రూగారు జీతీయ సరంభం ప్రారంభించెదనని శంఖారావం చేస్తే (1957-59) వెన్వెంటెనే మొండి ధైర్యంతో బందరు, గుడివాడ, విజయవాడ, తెనాలిలో రైతు సభలను సాగించిరి, రంగాజీ వెంట రైతులున్నారని ప్రకటించిరి.
7. ధాన్యఉత్పత్తి దారుల సభలు, ఆ బ్రిటిషు వారి ఆర్డినెన్సు పాలనాన్నెదిరిస్తూ, రంగాజీ సారధ్యములో నిడుబ్రోలులో 1944లోనే ఆంధ్రరాష్ట్ర సభ జరిపిరి. లక్ష్మీనారాయణకు కుడి భుజముగా నిలిచిరి.
8. ధాన్య ఉత్పత్తి దారుల సభలు 1944 నుండి 1969 వరకు జరిపిస్తూనే వుండిరి. గిట్టింపు ధరలేమే, కనీసపు ధరలేమో, వ్యవసాయ ఖర్చు లెంతో, ఎట్టివో, సోవాహరణంగా ప్రతిసభలో ప్రచురిస్తూ వుండిరి.
9. లాండు రెవిన్యూను రెండు మూడింతలుగా హెచ్చిస్తూవుంటే, వాటినెదిరిస్తూ సర్దారు లచ్చన్న సత్యగ్రహం ప్రారంభిస్తే దాన్ని సక్రమంగా బలపరుస్తూ వుండిరి. 1962-63లో.
10. ఆ అదనపు భూమిశిస్తుల నెదిరిస్తూ సుప్రీం కోర్టు వరకు జరిపించిన వ్యాజ్యములో, సర్దారు లచ్చన్న అడ్వకేటు పి.ఎ. చౌదరికి అండగా నిల్చిరి.
11. కంట్రోళ్లను రద్దు చేయాలని రంగాజీ నడిపిన వుద్యమమును (1944-50) నెత్తిమోతల ద్వారా బియ్యం సరఫరా చేసే కార్మికుల రక్షణోద్యమములను (1960-69) నడిపిరి. బలపరచిరి.
12. రాయలసీమ క్షామనివారణ (1952-53) గోదావరీ వరద పీడితుల రక్షణలో (1953-54) నాయకత్వము వహించిరి.
13. కొల్లేరులోని ప్రభుత్వ భూములు, రొంపేరు, తమ్మిలేరు భూములు, కృష్ణ, గోదావరి లంకలు, వ్యవసాయకూలీలకై సహకార సంఘాల ద్వారా, వ్యక్తులకే పట్టాల ద్వారా యిప్పించాలని ప్రభుత్వముతో రాయభారములు నడిపిరి. 1950-70 వరకు.
14. పేరుకు ఐచ్ఛిక ఋణాలంటూ నిర్భంధముగా రైతుల వద్ద ఋణాలు వసూలు చేస్తూ మధ్యవర్తులుగా ఉద్యోగులే లంచాలు పొందుచున్న సమయాలలో, ఆందోళనలెన్నో మారులు సాగించిరి. ఉద్యోగుల పట్టించిరి.
15. గ్రంధాలయ ఉద్యమంలో శ్రీ నాగినేని వెంకయ్యతో మహిళోద్యమములో శ్రీ భారతీ దేవి, వెంకటరత్నమాంబ, చుక్కమ్మ, మహలక్ష్మమ్మ గారలతో ఖద్దరుద్యమమందు శ్రీ పేరయ్య, శీతారామ

శాస్త్రి గారలతో, వయోజన విద్యోద్యమమందు శనివారపు సుబ్బారావు - చెరుకు వాడలతో సహకరించిరి.

16. రాజాజీ విజయవాడకు వచ్చినప్పుడు సన్మానసభల నిర్మాహకులు. 1959-60.

17. ఏలూరులో స్వతంత్రపార్టీ సభలను, రాజాజీ, శ్రీ కోయంబత్తూరు జి.కె. సుందరం ప్రభృతుల జేర్చి నడిపించుటలో శ్రీ కొమ్మా రెడ్డి బాపయ్య గారికి చేదోడుగా వుండిరి.

18. ఒరిస్సా రాష్ట్రమిశ్రమ మంత్రి వర్గ ముఖ్యమంత్రి, స్వతంత్ర పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ ఆర్. యన్. సింగుదేవుకు విజయవాడ, తెనాలిలో సన్మాన సభ లేర్పరిచిరి. 1968.

19. ప్రాథమిక హక్కుల సభను, విజయవాడలో జరిపించి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ సుబ్బారావు గారికి సన్మానము చేయించిరి. 1969.

20. (ఎ) "ఆచార్య రంగా జీవిత చరిత్ర" రచనాకారులగు పండిత వెంకటసుబ్బయ్య సన్మాన సభను ఘంటసాలలో 1958లో జరిపించిరి.

(బి) ఆ చరిత్రనే పద్య కావ్యముగా కావ్యముగా రచించిన శ్రీ జోసపు కవి గారిని సత్కరించిరి.

21. రంగాజీ జన్మదినోత్సవాలను జరిపిస్తూ రైతుకూలీ ప్రజారాజ్యా శయ ప్రచారమును 1947 నుండి 1970 వరకు జరిపిస్తూ వుండిరి. బందరు, విజయవాడ, గుడివాడ, నందిగామ, ఏలూరు, ఘంటసాల ఇందులకు వారి ప్రత్యేక బాధ్యతగా వుండి కేంద్రములు.

## రైతు గౌరైపాటి అందుకొని నిర్వహించిన ప్రధాన పాత్రలు

1. కృష్ణా జిల్లా బోర్డు ఉపాధ్యక్షులు 1949-52.
2. ఆంధ్రరాష్ట్ర రైతు సమ్మేళన అధ్యక్షులు 1943-63.
3. ఆంధ్రరాష్ట్ర రైతు సమ్మేళన గౌరవాధ్యక్షులు 1968-70.
4. ఆంధ్రరాష్ట్ర స్వతంత్ర పార్టీ ప్రథమ అధ్యక్షులు 1959-60.
5. రంగాజీ కంచు విగ్రహ స్థాపనా సంఘ పెద్దలు 1950-57 అట్లూరి శీతారామయ్య, డాక్టరు చలపతి రావు గార్లతో కలిసి.
6. గాంధి స్మారక నిధి సంఘ సభ్యులు.
7. రంగా ట్రస్టు సభ్యులు 1957-70
8. 'వాహినీ' పత్రిక సంపాదకులు, నిర్వాహకులు 1965-70.

## రంగా దంపతులకు అందిన లేఖలో దొరికినవి

క్రిందటి దశాబ్దాలలో వెంకటసుబ్బయ్య గారెన్నో ఉత్తరాలు నాకు, భారతీదేవికి వ్రాస్తూ ఉండిరి. ఎప్పటికప్పుడు దాచిపెట్టుకోవాలనుకున్నా అలాగా చేయనైతిని. తుదరకు వెదికితే ఇప్పుడు అందించు చున్న యీ లేఖలు మాత్రమే యిప్పటికి చేతికందినవి.

భారతీదేవికి వ్రాసిన ఉత్తరాలలోనే తన బాధలు, అనుభవాలు, ఆశలు, ఆశయాలు, కొంత స్వేచ్ఛగా తెల్పేవారు. మొత్తం మీద ఈ ఉత్తరాల ద్వరా వారి స్వీయ చరిత్ర యొక్కకొన్ని ముఖ్య లక్షణాలు ద్యోతకమగుచున్నవి. సేవా వ్రతానుష్ఠానములో వెంకట సుబ్బయ్య యెంత ఆదర్శప్రాయులో, ధర్మబుద్ధులో, యీ లేఖలు సూచించగలవనే నమ్మకంతో వీటిని ఆంధ్రులందరికీ అర్పణ చేస్తున్నాను.

**రంగాజీ విగ్రహ స్థాపనా కమిటి**

విజయవాడ

3-6-57

పూజ్యులైన భారతీదేవి గారు,

మీరు కులాసాగా వున్నారని తలుస్తాను. అమ్మాయి అన్న పూర్ణ కుమారునికి 1 తేదీన అన్నప్రాశన. పేరు కాంకట నరసింహారావు అని తాతగారి పేరు పెట్టిరి.

ఘంటసాల పంచాయితీ బోర్డు అధ్యక్షులుగా మన గొర్రెపాటి మహలక్ష్మమ్మను ఎన్నుకొన్నారు. గ్రామ పెద్దలు మహిళా సంఘం ఆమెను పూలదండలతో సన్మానించినారు.

నా ఆరోగ్యం బాగులేదు. కార్యక్రమంలో నా బాధ్యత నేను పూర్తి చేసుకున్నాను.

వ్యవసాయం తరుణం వచ్చినది. బాధపడ్తూ, మీ శ్రమ విని యోగించక తప్పదు గదా!

రైతుల గోడువిని తీర్చే దృష్టి పాలకవర్గంలో కానరాదు. మొండి, బండలాగా అణగిపోవడానికే యీ రైతాంగం పుట్టింది. ఈ జాతికి ముక్తి అనేది కనుచూపు దూరంలో లేదనిపిస్తున్నదే! విలువలేని చాకిరీతో, దోపిడి చేయబడడం ఏ ప్రభుత్వంలోనైనా తప్పదనిపిస్తుంద. శలవు.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

## కిసాన్ సమ్మేళన్

విజయవాడ

6-8-59

శ్రీమతి భారతీదేవి గారు,

నమస్కృతులు. మీరు కులాసాగా వున్నారని తలుస్తాను.

మనం తిరిగి K.L.P గానే వుండవలసి వస్తుందేమో, ఈ నెహ్రూజీ సహకార వ్యసాయపు సవాలు చూస్తే! కాని మనవారు ఒక డిసిప్లెనులో వుండుట లేదు. భవిష్యత్తును బట్టి ఆలోచన చేసుకోవలసిన భాద్యతలు సరీగా గుర్తించినట్లు లేదు.

ఏ సిద్ధాంతం మీద కమ్యూనిస్టుల నెదిరించితిమో, యిపుడు కాంగ్రెసును కూడా అదే సిద్ధాంతముకై ఎదిరించవలసి వస్తుంది. ఈ పరిస్థితులలో రైతాంగంలో మార్పు తీసుకొని రావాలి. మరల మొదటికి వస్తిమి, నిరాయుధులమై వుంటిమి. కొత్త బీళ్ళు దున్నడం మన వంతుగా వున్నది.

ఏ ప్రియులు నుండి స్వయం వృత్తుల జనాలు సెమినార్‌లు ప్రతి జిల్లాలోను, (జనవరి- ఫిబ్రవరిలో, నిడుబ్రోలులో జరిపినట్లు) పెట్టాలి. తమరు కూడా జిల్లాకోక రోజు వచ్చి ప్రబోధం గావించాలి. రాజ గోపాల నాయుడికి యీ సెమినార్లను నడుపుటకు పూనుకోవాలని వ్రాసితిని.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

## స్వతంత్ర పార్టీ

విజయవాడ

30-6-60

శ్రీ రంగాజీ గారు,

తమరు వ్రాసిన జాబు చూచితి. స్వతంత్ర పార్టీ అధ్యక్ష బాధ్యతను సంవత్సరం పర్యంతం మీ కోరిక ప్రకారం నడిపితిని. శ్రీరామ చంద్రారెడ్డి గారికా బరువులను అందించినాను.

ఆగస్టు నుండి కిసాను సమ్మేళన కార్యక్రమం తీసికొన తలచితి. శ్రీ వల్లూరి సత్యం గారి చేత రంగా ట్రస్టుకు స్థలం రిజిష్టరు చేయించుటకు విజయవాడ వస్తిని. శ్రీ రామిరెడ్డి M. L.C గా ఎన్నుకోబడడం సంతోషప్రదం.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

9-5-65

శ్రీయుతులు రంగా గారు,

ఆరో ప్రపంచ కిసాను సమ్మేళన మహాసభ శ్రీ నాగినేని వెంకయ్య గారు మేదక మెట్లలో జరుపుటకు వీలుండునని చెప్పిరి.

తెనాలి బై ఎలక్షన్సులో అపజయం కల్గింది. అయినా దిగులు చెందము. యిలాంటి సంఘటనలు తరచు వస్తూనే వుంటవి.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ఘంటసాల

14-6-65

శ్రీయుతులు రంగా గారు,

ఎలాగో ఎండాకాలం గడచినది. కాని మృగశిర గాడ్పులు వస్తున్నాయి.

నెల్లూరు (స్వతంత్ర పార్టీ, కిసాను సమ్మేళన) సభలకు రాలేక పోతిని. దీర్ఘ ప్రయాణాలకు తట్టుకోలేకున్నాను. సరస్వతమ్మ ఆరోగ్యం బాగా లేదు. పెద్దలు రాజాజీ, మీరు చేస్తున్న కృషికి ఎంతో సంతోష పడుచున్నాను. మహలక్ష్మమ్మ ఉత్తర దేశ యాత్రలో వున్నారు. పేరయ్య గారు గాంధీజి నిర్మాణ ఖద్దరు ఉద్యమ వ్యాప్తికి కృషి చేస్తూనే వున్నారు.

'వాహిని' చీఫ్ ఎడిటరుగా సుంకర సత్యనారాయణ వస్తారని వ్రాసిరి. యీ భాద్యతను నిర్వహించజాలని చెప్పిరట. మీరు జీవితమంతా ప్రజల కొరకు ధారవోస్తున్నారు. మీ ఆశయాల ప్రచారానికి పత్రిక ఏది?

దాళవా పంట ఫలితం బాగాలేదు. ఎరువుల సప్లై లేదు. పంట కాల్వరి రిపేరు లేదు. నదిలో నీరు లేదు. ప్రభుత్వ నడక ఆయోమయంగా వున్నది.

ఇట్లు

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

విజయవాడ

1-11-66

ఆచార్య రంగాజీ,

అయ్యా!

మీ 28వ తేదీ జాబు చేరినది. ఉత్తర హిందూస్థానం వారిని పిలుచుటలో, బాధలు అర్థం చేసుకొనని వారిని ఆహ్వానించడం విరమించితిమి. మీరు ఎవరిని అడుగలవలదు.

గుడివాడ, నందిగామ(జన్మదినోత్సవ) సభలు ఏర్పాట్లు జరుగుచున్నవి. నిరుత్సాహంగా ఉన్న ఈ జిల్లాలో ఈ సభల వల్ల ప్రోత్సాహం, ఊపు ఉంటుందనే కార్యకర్తల అభిమతానుసారం మీకీ శ్రమ యిస్తున్నందులకు మన్నించండి.

**మనకిసాన్ వెంకట సుబ్బయ్య**

మీరు వ్రాసిన ప్రకారం 12వ తేదీన బయలుదేరి దయ చేయండి. సభలు అనంతరం విజయవాడలో మెయిలు 8-30 గంటలకు చేరడం కష్టమవుతుంది గదా! అందువల్ల శ్రీ లచ్చన్నగారి కారులో హైదరాబాదు వెళ్ళడం సుఖంగా ఉంటుందేమో ఆలోచించండి.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

నారికంపాడు

15-2-68,

పూజ్యులు ఆచార్య రంగా గారు,

అయ్యా! వందనములు,

తెనాలి సమ్మేళన మహాసభకు, తమరు, భారతీదేవి గారు దయ చేయుట, స్వతంత్రపార్టీ ప్రధానమంత్రి శ్రీ సింగుదేవుగారి సమక్షమున, తదితర పెద్దలు, వేలాది ప్రజల సమక్షమున, నా, మీ, జీవిత ఘట్టాల జ్ఞాపకం చేయుచూ, మీరు, భారతీ దేవి గారు యిచ్చిన ఉపన్యాసములు నాకు సంభ్రమాశ్చర్యములు కలుగ జేసినవి.

నా సన్మాన విషయం అప్పటి వరకు నాకే తెలియదు. ఆశ్చర్యపడితిని. గురువులైన మీ దంపతులకు, సన్మాన సంఘం వారికి నా భక్తిపూర్వక నమోవాకములు అందజేయుచున్నాను.

సేవాధర్మము అపారమైనది. అందులో త్యాగంతో కూడిన సేవాధర్మం నిర్వహించుటలో గల బాధలు అందరు గ్రహించజాలరు. స్వార్థముతో కూడిన సేవ మాత్రమే యీ రోజులలో జరుగుతున్నది. ప్రజల భావాలు కూడా అలానే వ్యాపార తత్వంతో కూడినవై పోతున్నవి. అవకాశవాదం పెరిగినది. మన సిద్ధాంత బలం యిక ముందైనా ప్రచారంలోకి రావచ్చును. ప్రజల లోపం లేదు. కార్యకర్తలు వేలాది కావాలి. వారికి ట్రెయినింగు యివ్వాలి. విద్యాలయాలు కావాలి.

అందరం వృద్ధుల మవుతున్నాము. ప్రజల దోచుకొనుటకి ప్రభుత్వ యంత్రం ఉపయోగపడుతున్నది. రాచకీయ పార్టీలలో కూడా అలాగే జరుగుతున్నది. యీ విషయాలలో జాగ్రత్తపడవలసిన అవసరం ఎంతేని కలదు, జాగ్రత్త పడకపోతే కార్యకర్తలు నైతిక పతనం పెరిగి పార్టీలకే ముప్పు రాగలదు.

నైతికశక్తి ఉన్న నాయకుల విలువ వల్లనే బ్రతికి వున్నవి ఉద్యమాలు. క్రమశిక్షణ పెంచుకొనుటలో అఖిలభారత పార్టీ తరపున శ్రద్ధ తీసుకొనుట అత్యవసరం.

మరల నాకు గౌరవాధ్యక్షత (రాష్ట్ర రైతు సమ్మేళనానికి) నిచ్చి, సమ్మేళన బాధ్యత వదిలించ రైతిరి. వ్యక్తుల విషయం మీకు తెలియనిది గాదు, మీ బాధ నాకు తెలియకపోలేదు. గత్యంతరం లేక శిరసావహించక తప్పుట లేదు. (అధ్యక్షులుగా శ్రీ రాజగోపాల నాయకుడు (ఎం.ఎల్.సి.) ను ఎన్నుకొంటిమి)

వృద్ధాప్యంలో రాజాజీ, మీరు దేశమునకు చేస్తున్న సేవకు ధన్యవాదములు, నమస్కృతులు.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

## కిసాను సమ్మేళనం

విజయవాడ

29-12-68,

పూజనీయులు భారతీదేవి గారు,

పూజ్య రంగాజీ ఢిల్లీ నుండి వ్రాసిన జాబు చేరినది. మీ ఆరోగ్యం ఎలా ఉన్నది. వృద్ధాప్యం సమీపించిన కొలది శరీర పాటవం మారుతుంది గదా!

ఈ సంవత్సరం వ్యవసాయ పరిస్థితులు ఎలా ఉన్నవి. మాసూలు పూర్తి చేయించినారా! ఫలితం ఎలా వచ్చింది! దాల్వా యీ సంవత్సరం ఉన్నదా! పాడి, కూరగాయల సౌకర్యమో!

గత మూడు మాసాలుగా, ఫ్లూ, నెమ్మోనియా జ్వరం వచ్చి 102, 103 డిగ్రీల జ్వరం వచ్చి, 30 రోజులు బాధ పెట్టి తగ్గిపోయినది. ఇంకా బలం రాలేదు. నా కొరకు సరస్వతమ్మ ఇచటనే ఉంటున్నారు. ఆమె ఆరోగ్యం బాగా లేదు. ఆమె యిచట నాకు సహాయపడకపోతే ఉండజాలను.

గత 30 సంవత్సరాలుగా, విజయవాడ కేంద్రంగా ఎం.ఎల్.ఏ. వగైరా పదవులు వున్న వారి అండ నాకు లేకపోయినా, పూజ్య రంగాజీ రైతుకూలీ ప్రజారాజ్య ఉద్యమం సిద్ధాంతంతో ఏకీభవించే వారితో, రైతాంగంతో సంబంధం పెట్టుకుని రైతు సమ్మేళనం పార్టీ పత్రికా కార్యక్రమాలు నిర్వహిస్తూ నా స్వంత ప్రయోజనాలను త్యజించి, తదితర జిల్లాల వారి సహాయం ఉన్నా లేకపోయినా ఒక విశిష్టమైన స్థానం ఏర్పరచుకుని యింత వరకు బండి లాగితిమి.

గత చరిత్రను దృష్టిలో ఉంచుకుని, ఎచట వెలితి వచ్చునో అని అనేక ముఖ్య సమయములలో అనేక ఆర్థిక యిబ్బందులు వచ్చినా, తట్టుకొంటూ వస్తిని. ఇప్పుడు కూడా ఆ బాధతోనే ప్రజల సమీకరించే 'వాహిని' పత్రిక బాధ్యత తప్పింది గాదు.

ప్రజలకు రంగాజీ సిద్ధాంతం మీద ఉన్న భక్తి విశ్వాసాల ప్రచారం కొరకు ఒక వార పత్రికను ఆంధ్రదేశం బ్రతికించుకుని, సిద్ధాంత ప్రచారం చేసుకోవడం అవసరం గదా! శక్తి తగ్గిన కొలది ఎవరికి ఈ బాధ్యత అప్పచెప్పటమా అని రంగాజీకి జాబు వ్రాస్తూనే వున్నాను.

నా స్వంత ఖర్చులతో యిచట వుంటూ, పెట్టుబడి పెట్టుతున్నాను. న్యూసుప్రింటుకు 8 వేలు పెట్టవలిసి వచ్చినది.

ఎచటవా రచట సహకరించుట తమ కర్తవ్యంగా భావించాలి. అనేకులు సమిష్టి బాధ్యతలు గుర్తించకుండా పార్టీని ఉపయోగించుకుంటున్నారనే బాధ తప్పడం లేదు.

మీకు ఆరోగ్యం కల్గుగాక.

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

15-9-69

అయ్యా!

నేను లేనప్పుడు తమరు వచ్చి వెళ్ళినట్లు తెలిసింది.

వృద్ధాప్యంలో శారీరక మానసిక ఆర్థిక బాధలతో సుఖం లేకుండుట సహజం.

చిత్తగించవలెను.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

28-4-70.

ఆచార్య రంగాజీ!

అయ్యా!

పత్రికలలో వచ్చిన వార్త (పాట్నాలో ప్రజాస్వామ్య రక్షణ సభను ప్రారంభోపన్యాసం రంగా గారు చేస్తున్నప్పుడు, మూడు బాంబులను సభపైకి, సభావేధిక నందుకొనుటకై విసిరిరి, దుండగులెవ్వరో.) మమ్ములనందరిని యీ దుర్వార్త విన్నతోడనే పెద్ద ప్రమాదం నుండి బయట పడ్డట్లు భావించితిమి. అదృష్టవంతులమే!

భారతదేశ రాజకీయాలలో యింతవరకు అహింసామూర్తి గాంధీజి అడుగుజాడలలో వున్నామని నాయకులు, ప్రజలు ప్రచారం గావించుకొంటున్నారు. నూతనాధ్యాయం ప్రారంభమైనదని భావించవచ్చునా!

ఒకవైపు నక్సలైట్లు హింసా, దోపిడీ జిల్లాలకు ప్రాకింది. ఉత్తర భారతంలో బాంబులు, ఆయుధాలు తయారై ప్రజలను భయకంపితుల చేస్తున్నారు.

భవిష్యత్తు ఏ విధంగా మారునో? ఈ ఇందిరమ్మ ప్రభుత్వం కమ్యూనిస్టులతో పొత్తు పర్యవసానం ఎన్ని హింసా కాండలకు, హత్యలకు దారి తీయునో, భవిష్యత్తు అంధకారంగా వుంటున్నది. గొప్ప ప్రమాదం నుండి బయటపడినందులకు అదృష్టవంతులం. భగవానుని దయ వల్ల మీకు గండం తప్పినందులకు ధన్యులం.

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య.

## ఆంధ్ర కిసాన్ సమ్మేళన్

6-8-70.

ఆర్యా!

తమరు వ్రాసిన జాబు చేరినది. వాహిని చందాలు వసూళ్ళు చాలా బాధకరంగా ఉంటున్నది. ఎన్నడూ యింత డబ్బు కటువు మన రాష్ట్రంలో లేదు.

నా అనుభవాన్ని బట్టి ఎవరు బాధ్యత తీసుకొన్నా, చందాదార్ల దౌర్భాగ్యస్థితి బాగుపడనిది ఎవరికైనా కష్టమే. వారపత్రికల స్థితి పార్టీ అభిమానులపై అభిమానంపై నడుస్తున్నది. అట్టి అభిమానులే చందాలు చెల్లించలేక బాధ పెడుతున్నారు. పనిచేసి సహాయపడవలసిన వారే సహాయ నిరాకరణతో పాటు, జిల్లాకొక పత్రిక పెట్టుటలో ఆసక్తి పొందుతున్నారు.

పార్టీకార్యకర్తలు, ఎం.ఎల్.ఏ. లు సహకరించరు. పైగా ఉచితంగా పత్రిక పంపాలనే డిమాండు.

మా శ్రమ లెక్కకు రాదు. అయినా వుద్యమ సిద్ధాంతం కొరకు వున్నాను. కాన శక్తి ఉన్నంత వరకు వాహినికి, రైతులకు ఎల్లప్పుడు సహాయపడుతూ ఉండడమే గత 30 సంవత్సరాల నా కార్యక్రమములలో ఒకటి. 1952 నుండి 1962 వరకు ఉమామహేశ్వర్‌రావు గారి టైములో సమిష్టి బాధ్యతలు హెచ్చుగా గమనిస్తూ ఉండిరి. యిప్పుడు ఎవరికి వారే.

ఆర్థిక పరిస్థితులు కూడ చాలా మార్పు వచ్చింది. ప్రతి చిన్న కుటుంబం పడే భాధలు విపరీతంగా వున్నవి. నెలసరి ఆదాయంగల వారికి ఫరవాలేదు. గ్రామీణులస్థితి చెప్పనలవిగాదు.

గ్రామాలకు పోయి పూరికే తిరిగి రావలసి వస్తున్నది.యివ్వాలని మనస్సువున్నా. డబ్బు చేతికి రాక, ధన్యదులు తీసుకున్నవారు డబ్బు చేతికిరాక, ధాన్యాదులు తీసుకున్నవారు డబ్బు యివ్వక, బ్యాంకులు బకాయిలు యివ్వనందున, తిరిగి డబ్బు తెచ్చియివ్వక నాన భాధల్లో రైతాంగం ఉన్నారు,

కారుపెట్టి గ్రామాలకు పరుగెత్తినా దండుగ అనిపిస్తున్నది, నాశక్తి కొలది కృషి చేస్తున్నాను. నాశ్రమ విలువకట్టరానిదైనది,

గ్రహించితిని మిది ప్రేమ హృదయం. యీ వయస్సులో యీ భారం వేసికొంటిరే అనే బాధ మీకు ఉన్నది, శరీర, మానసిక, ఆర్థికభాధలు ఎన్నివున్నా నాలాంటి వారు మీకు మరొకరు, కావాలి కదా ఓర్పుతో యీ ప్రజలతో యీ బాధలు పడువారు,

నా ఆరోగ్యంలో నానాటికి మార్పు వస్తుంన్నది. అందువల్ల స్టార్‌వారు శ్రీ శాయోజీరావుగారు వాహిని ని తీసుకొని నడుపుకుంటే మంచిది.

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య
విజయవాడ,
16-5-70

శ్రీమతి భారతీదేవిగారు,

అమ్మా, నమస్కారములు,

ఎండకాలం ఎలావుంటున్నారు నాకు యిచట భాధగానే ఉన్నది వాహిని నిర్వహణలో,

సమిష్టి బాధ్యతతో పత్రికను పెంచుకొవాలనే తత్వం మన పార్టీ కార్యకర్తలో నశించి జిల్లాకొక పేపరు పెట్టి అందరు సష్టపడుతున్నారు

స్వంతప్రెస్సు లేనందువల్ల, ప్రెస్సువాళ్ళు పెట్టే బాధలు యింతింత కాదు, (యింతకుముందు మూడు మారులు స్వంతప్రెస్సు పెట్టుకొని నష్టాలే అనుభవించి, వాటిని అమ్మివేసుకొనిరి మనవుద్యమం వారు).

రంగాజీ పేపరు ఆగిపోయినదని అనిపించడం యిష్టం లేక వృదావ్వంలో నానాబాధలు పడుతున్నారు.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

## వివాహ సంబంధ సమాచార సంఘం

విజయవాడ.

ఈసంఘాధ్యక్షులుగా, శ్రీ వెంకటసుబ్బయ్యగారు 22-5-70 శ్రీమతి వెంకట సుబ్బయ్య గారు 22-5-70 శ్రీమతి భారతీ దేవి సహకారము కోరుతూ ఉత్తరం వ్రాసిరి.

ఈ స్వరాజ్య సంపాదనానంతరం, మధ్య తరగతిలో బీదలైన కుంటుంబాలు, తమ కుమార్తెకు వివాహ సంబంధములు యేర్పరచు కొనుటకు, ఎట&ఇట ఎన్న రాని బాధలు పడుచున్నారో వెంకట సుబ్బయ్య గారికి తెలుసును.

కట్నములను కొరవద్దని శ్రీమతి భారతీదేవి, వెంకటసుబ్బయ్య ప్రభృతులు ప్రచారం నమ్మి పోతున్నది. ఆఖరికెట్లో, తల్లిదండ్రుల భాదల తగ్గించుటకై యీ సంస్థను వెంకటసుబ్బయ్య గారే నిర్వహించిరి.

## వాహిని వారపత్రిక

స్థాపితము 1936

విజయవాడ

23-9-70

అయ్యా, వందనములు,

ఆరోగ్యంగా ఉన్నారని తలుస్తాను, నా ఆరోగ్యం గత రెండు మాసముల నుండి మారి బ్రోంకటీసుతో కొన్నాళ్ళు, యూరినరీ ట్రబుల్‌తో యిప్పటి వరకు వైద్యం చేయించుకొంటున్నాను. యీ ఏడు కొంత మొరగే.

హెచ్చుగా తిరుగుట, ప్రయాణములు తగ్గించినందు వల్ల తగ్గినట్లు కనపడుతున్నది. అలాగే 'వాహిని' కార్యక్రమం చూస్తున్నాను. అందువల్ల ప్రతి వారానికి కావలిసిన రూ. 600/- శ్రమపడక తప్పుట లేదు.

యిచట గత రెండు రోజులుగా వర్షం పడి పైర్లకు అనుకూలంగా వున్నది. ధాన్యాదులు కొనువారు లేక రైతాంగ ఆర్థిక పరిస్థితులుతారుమారు అయ్యేటట్లున్నవి.

తొలకరి పంటలు అధిక వర్షాలుతో, వేరుశనగ, పెసరపైర్లు దెబ్బతిన్నవి. 1/4 వంతు ఆదాయం కూడా రాలేదు కేరళ, మద్రాసు స్వయం పోషకమైతే ఆంధ్రలో పండు దాన్యంకు మార్కెటు ఏది? నిల్వధాన్యంతో పాటు, కొత్త ధాన్యం వస్తే కొనే వారెవరు?

ధరలు నిల్వకపోతే, రైతాంగం దెబ్బతింటారు. 12 బస్తాలు ఖరీదు వరకు ఖర్చు అయినవి.

ప్రస్తుతం యితర రాష్ట్రాలకు ఎగుమతికి పర్మిట్లు మీద, బియ్యంవాగనుకు 800/- రూపాయలు కొత్త కాంగ్రెసుకు ఎన్నికల ఫండు క్రింద యిస్తే,మిల్లర్లకు పర్మిటు యిస్తున్నారట. అందుకు జిల్లాల వారీ

ఏజంట్లు ఏర్పడి పనిచేస్తున్నారట. గత్యంతరం లేక మిల్లర్లు లోబడుతున్నారు. ఈ విషయం ఒక మిల్లుఓలన భాగస్తుడు రహస్యంగా చెప్పినాడు.

కోటి రూపాయలు ఎన్నకల నిధి కావాలట. ప్రతి డిపార్టు మెంటను నొక్కుతూ, ప్రజలను పీడించుచున్నారు. యిది ఆంధ్రలో జరుగుతున్న దోపిడి.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

జనరల్ హాస్పటలు.
M.S 19th ward
గుంటూరు
17-10-70

వందనములు. నేను 12 హాస్పటలులో ప్రవేశించితిని. యింత వరకు పరీక్షలలో ఉన్నాను. యూరి ప్రవహజంచు మార్గములో ఆవరోధాలు తొలగించ వలసి ఉండును.

గత రెడు మాసాలుగా బాధపడితిని. నిద్రపట్టుతున్నది. ఆపరేషను అవసరమా అనే విషయం తేల్చలేదు. వాహిని నవంబరు 7 ఆచార్యరంగా జన్మదిన సంచిక విషయం అందరికి జాబులు వ్రాసితిని.

సరస్వతమ్మ, కుటుంబం యిచటనే ఉన్నారు.

శెలవు
గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ఈ కార్డు అందుట తోడనే, జన్మదిన సంచిక ప్రచురణ ఆపుచేయ వలసినదని వారికి వ్రాసితిని

రంగ
గుంటూరు
25-10-70

మీ జాబు అందినది. కార్డు వ్రాసితిని. చేరి ఉంటుంది. 12వ తేదీ నుండి హాస్పిటల్లో ఉంటున్నాను. యివ్వాళ వచ్చే శుక్రవారం 20వ తేదీ ఆపరేషన్ చేయ నిర్ణయం చేసిరి. ఆపైన 15 రోజులు బెడ్ మీద ఉండాలి. వృద్ధాప్యములో యీ బాదాలు భరించ రానివే! అయినా తప్పని సరిగదా!

సరస్వతమ్మ, బిడ్డ సత్రంలో కాపురం ఉన్నారు. ఇదీ నా (స్వంత) ఆరోగ్య విషయము.

వాహిని సంచికకు నేను తిరుగ గల్గిన బాగుండెడిది. కాని మన ఆలోచనకు భంగం వచ్చినది. రాత్రి నాగేశ్రావుగారు వచ్చి మాట్లాడి వెళ్ళిరి.

ప్రముఖులకు వ్యాసాలకు, ఆశీస్సులకు వ్రాసిప తర్వాతనే హాస్పిటలులో ఎడ్మిటు అయితిని. ఆర్థిక పరిస్థిఉలు చాలా బాధగా ఉన్నవి.

40 సంవత్సరాల నుండి విజయవాడలో ఉన్నందువల్ల కాస్త పరపతితో బండి సాగుతున్నది. మంచి కాలం వస్తేనే కాని, బాకీలు వసూలు పరిచి అప్పులు 20 వేలపైన తీర్చలేమనిపిస్తావున్నది. ఒక వైపు అనారోగ్యం, అప్పుల బాధ.

పార్టీ ప్రముఖులే చందాలు కట్టకపోతే మిగతా వారినే మన గలము! 40 సంవత్సరములు రాజకీయ చరిత్రలో ఒక వారపత్రిక సజీవంగా నిల్పుకొనలేక పోతిమే అని వుంటుంది.

ఆవని గడ్డ - ప్రాథమిక హక్కుల రక్షణ సభ ప్రస్తుతం జరుగదు.

2 నెలలు వర్షం లేకుండా ప్రకృతి సహాయపడితే పంటలు దక్కుతవి. కాని మార్కెటుకు ఆందోళన తప్పదు. ఎకరాకు రూ 100/- శెస్సులతో సహా ప్రతి రైతు కట్టాలి. ఎలా కట్టడం? యిలా రైతాంగం సమస్యలు ఎదుర్కొంటున్నవి.

**మనకిసాన్ వెంకట సుబ్బయ్య**

ఉత్తర ప్రదేశ్ వలె, బీహరులో కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్షాలకు బలమిస్తే. ఉత్తర హిందూస్థానంలో యిందిరమ్మ బల ప్రయోగాలకు తల తిరుగుతుంది. ఆంధ్రలో -- బానిస ప్రవృత్తి పెరిగినది.

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

గుంటూరు

9-12-70

పూజ్యనీయులైన రంగాజీ నాన్న గారు,

మీరు వచ్చి చూచి వెళ్ళిన తరువాత నాన్న గారికి ఏమీ కులాసాగా లేదు. ఆహారము అయిష్టత. చాలా నీరసముగా ఉన్నారు.

డాక్టరు సూర్యనారాయణ, కోదండ రామయ్య గారులు చూచినారు. ఎక్కురేలో ఏమీ తప్పులేదన్నారు మందు వాడమన్నారు. కానీ ఏమి పని చేయుట లేదు. ఆహారము ఒక గ్లాసు, రెండు గ్లాసుల మజ్జిగ రసం.

అమ్మ మీకు నమస్కారములు తెలుపమన్నారు.

నమస్కారములు,

పరుచూరి అన్నపూర్ణాదేవి.